# భారతీయ తాత్విక స్రవంతి

Cat - 613

## సజీవాంశాలు నిర్జీవ ధోరణులు

దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ







181.4
దేవి.భార
72631

# భారతీయ తాత్విక స్రవంతి

## సజీవాంశాలు - నిర్జీవ ధోరణులు

దేవీప్రసాద్ చటోపాధ్యాయ

ప్రజాశక్తి బుక్‌హౌస్

181.4
దేవి - భారత

ప్రచురణ సంఖ్య : 491
ప్రచురణ : నవంబర్ 1997
కాపీలు : 2,000.

72,631

సంక్షిప్తానువాదం: తెలకపల్లి రవి

Cat-613

వెల : రు. 20-00

ACC. NO. 732

C. 7133

డి టి పి ప్రజాశక్తి
ముద్రణ
యుగంధర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,
విజయవాడ

ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్

| |
|---|
| కారల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ-520 002 ఫోన్ 432 792 |
| 1-8-52/2, శ్రీరామాకాంప్లెక్స్, చిక్కడపల్లి, హైదరాబాద్-20, ఫోన్ 760 8107 |
| 5, ఎ జి కె. కాంప్లెక్స్, గాంధీరోడ్డు, తిరుపతి-517 501 |
| బాలాజీనగర్, సుందరయ్యాభవన్, ఖమ్మం 507 001 |
| 6-2-250, విజయటాకీస్‌రోడ్డు, హన్మకొండ-506 011 |

# ఉపోద్ఘాతం

ఈనాటి మన తాత్విక అవసరాలకకోణం నుంచి మన తాత్విక సాంప్రదాయాలను విశ్లేషించడమే ఈ రచన ఉద్దేశ్యం. లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృష్టి అన్నవే ఆ అవసరాలు భారతీయ సాంప్రదాయక తత్వ శాస్త్రంలో ఇందుకు వ్యతిరేకమైన బావాలు ధోరణులను గతానికి సంబందించిన మృతావశేషాలుగా పరిగణించడం జరిగింది. అవి చారిత్రకంగా ప్రాచీన మధ్యయుగాల్లో ఇప్పుడు కూడా మన ప్రగతిని అడ్డుకుంటాయి. అదే సాంప్రదాయిక తత్వ శాస్త్రంలో మరికొన్ని భావాలు, ధోరణులు రేఖామాత్రంగానైనా లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రీయ దృష్టి కలిగి వున్నాయి. మన దృష్టిలో అవి సజీవ ప్రాధాన్యత గలిగినవి. వాటిని మనం వారసత్వంగా స్వీకరించవచ్చు. సమకాలీన పరిజ్ఞానంతో అనుభవంతో మరింత సుసంపన్నం చేయవచ్చు.

ఈనాడు మనం చాలా ఆందోళనకరమైన కాలంలో జీవిస్తున్నాం. ఇలాంటి స్థితిలో బారతీయ తాత్విక సాంప్రదాయాల విశ్లేషణ కేవలం ప్రాచీనానికి సంబంధించిన జిజ్ఞాస కోసమే కాదు. అలా చేయకపోతే మనం ఈనాడు ఎదుర్కొంటున్న కరోర రాజకీయ క్రీడలో నిస్సహాయులమైపోతాం. పచ్చి అభివృద్ధి నిరోధక శక్తులు పైన పేర్కొన్న భావాలను, దోరణులను యధేచ్ఛగా వాడుకుంటున్నారు. ఈ విషయంలో వారికి కొన్నిసార్లు నయా వలసవాదుల మద్దతు లభిస్తోంది. ఆ శక్తులే దేశ భక్తియుతమైనవిగా పెప్పుడూ పరిగణించబడుతున్నాయి. బారతీయ విజ్ఞాన స్రవంతి సారాంశం తామేనని ప్రజలను నమ్మించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు.

ఇదొక మిధ్య. దీన్ని పటాపంచలు చేయాలి. అందుకు ఒకే ఒక మార్గం వాస్తవాలను వెలికి తీయడం. ఇక్కడ నొక్కి చెప్పదలచుకున్న విషయం చాలా సులభమైంది. మన ప్రాచీనులు తమ సుదీర్ఘ సత్యాన్వేషణలో మనకులందించినవి కేవలం బూటకపు భావాలే కావు. మన తాత్వికులలో ఒక బాగం మూఢత్వాన్ని హేతురాహిత్యాన్ని వేదారాధనను, కులద్వేషాన్ని సమర్ధించేందుకు పనిచేసి వుండవచ్చు. కానీ ఈసిద్ధాంత శక్తులకు వ్యతిరేకంగా తమదైన మార్గంలో పోరాడిన వారు కూడా వున్నారు. చారిత్రకంగా ఆనాడు వారుకొన్ని పరిమితులు కలిగివుండడం అనివార్యమేననవచ్చు. వారి పాత్రను అతిగా చెప్పటం పొరపాటే అవుతుంది. అయితే వాటిని తక్కువ చేసి చూడటం కూడా పొరపాటే. అది

ఈనాటి పరిస్థితుల్లో ప్రమాదకరమైన తప్పిదం కూడా అవుతుంది. ఈనాడు మనం దేన్నైతే ఎదుర్కొని పోరాడుతున్నామో అందుకు వ్యతిరేకంగా పోరాడేందుకు మన తాత్వికులలో ఒక భాగం అమూల్యమైన సూచనలు అందచేశారు. వాటిని మనం పూర్తి ఆమోదంతో జాతీయ గర్వంతో పెంపొందించవచ్చు. భారతీయ తాత్విక సాంప్రదాయాన్ని అర్థం చేసుకోవాలంటే సాధారణ సూత్రీకరణలను అధిగమించాలి. తాత్విక దృక్పథంలో ఏది సజీవమో ఏది నిర్జీవమో విచక్షణగా విడదీయాలి.

మన తాత్విక సాంప్రదాయాల విస్తృతిని క్లిష్టతను గమనంలో పెట్టుకున్నప్పుడు దాన్ని సింహావలోకనం చేయటం ఏమీ తేలికగా, సుఖంగా జరిగే పని కాదు. తాత్వికేతర శక్తులు తాత్విక విషయాల్లో పెద్ద ఎత్తున జోక్యం చేసుకున్న దృష్ట్యా ఈ కర్తవ్యం మరింత క్లిష్టమౌతుంది. అంతేకాక మధ్యయుగ భారతంలో ఒక ప్రచారం సుదీర్ఘకాలం పాటు సాగింది. స్మృతికారులకు అంగీకారయోగ్యమైన భావాలకు పవిత్రగ్రంథాల ఆమోదం లభిస్తుందనే ప్రచారం జరిగింది. కనుక వాటి సాంఘికబాధ్యతలను విమర్శనాత్మకంగా అంచనా వేయడంలో చిక్కులు వున్నాయి. సుపరిచితమైన భావాలకు భిన్నంగా చెప్పటం ప్రజలను దిగ్భ్రాంతపరచవచ్చు. ఏమైనా ఈ చిక్కును ఎదుర్కోవటానికి నిరాకరించటం అంటేబాధ్యతల నుంచి పారిపోవటమే.

వ్యక్తిగతంగా నాకు గల పరిమితులు తెలుసుగనుక నేను కనీసం చర్చకు పనికివచ్చే ఒక చిత్తు ప్రతి తయారు చేయగలనని ఆశించాను. ఈ పుస్తకం వల్ల ఏమాత్రం చర్చ జరిగినా దానికోసం పడిన శ్రమ సార్థకమవుతుంది. ఎవరి సహాయం లేకపోతే ఈ పుస్తకం పూర్తయి వుండేది కాదో వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పటం నా ధర్మం.

**- దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ**

కలకత్తా,
31 మార్చి 1976.

# అనువాదానికి ముందుమాట

భారతీయ తత్వశాస్త్రాన్ని మార్క్సిస్టు దృష్టితో కూలంకషంగా విశ్లేషించిన మహామేధావి డాక్టర్ దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ రచించిన 650 పేజీల పుస్తకానికి ఇది సంక్షిప్తానువాదం. 1976లో పీపుల్స్ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన ఈ పుస్తకం ఇప్పటికి మూడు ముద్రణలు పొందింది. ఆంధ్రదేశంలోని అభ్యుదయ మేధావులకు సుపరిచితమైన గ్రంథమిది. ఈ పుస్తకంతో సహా తన రచనలను తెలుగులో వెలువరించడానికి డాక్టర్ ఛటోపాధ్యాయ చాలా కాలం క్రిందట ప్రజాశక్తి బుక్‌హౌస్‌కు అనుమతి ఇచ్చారు. ఆయన రచనలకు తలమానికమైన సమగ్రమైన ఈ పుస్తకాన్ని ముందుగా ఎంచుకున్నాము.

అంతటి మేధావి రచనను సంక్షిప్తపరచటం కష్టమైనపనేనని మాకు తెలుసు. ఆయన అబిమానులకు సంక్షిప్తీకరణ అంటే సంతృప్తికలగకపోవచ్చు. అయినప్పటికీ సామాన్య పాఠకులను, దరను దృష్టిలో పెట్టుకున్నప్పుడు ప్రధానాంశాలనైనా అందచేస్తే పరనశీలత హెచ్చుగా వుంటుందనే అబిప్రాయంతోనే ఇందుకు సాహసించాము. హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వ విద్యాలయంలో రీడర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అట్లూరి మురళి ఎంతో శ్రద్ధాశక్తులతో సంక్షిప్తీకరణ బాధ్యత నిర్వహించారు. ఈ సందర్భంగా మూలగ్రంథంలోని స్ఫూర్తి, సారాంశం, కొనసాగింపు దెబ్బతినలేదని, రచయిత చెప్పదలచుకున్న ముఖ్యాంశాలను మినహాయించలేదని మా విశ్వాసం.

గత 30-40 సంవత్సరాల్లోనూ తత్వశాస్త్రానికి సంబంధించి తెలుగులో చాలా గ్రంథాలు వెలువడ్డాయి. దేవీప్రసాద్ అనువాదాలతో పాటు కొందరు వామపక్ష ప్రముఖులు స్వయంగా అనేక రచనలు ప్రకటించారు. తత్వశాస్త్రం పట్ల ఆసక్తిని పెంచటానికి అవి బాగా దోహదపడ్డాయి. అయితే పరిశీలించినప్పుడు దేవీప్రసాద్ రచనల్లోని నిశితమైన వర్గదృష్టి, చాలా వాటిలో లోపించింది. భారతీయ తాత్విక సాంప్రదాయంలో సజీవ, నిర్జీవాంశాలను నిర్దిష్టంగా బేరీజు వేయాలన్నది దేవీప్రసాద్ వైఖరి. కానీ ఈ తరహా తెలుగు రచనలు చాలా వాటిలో మంచిని గుర్తించే పేరిట గతంలోని అంశాలను అతిగా పొగడటం జరిగింది. ఉపనిషత్తులు, బౌద్ధం వంటి వాటి పట్ల విమర్శనాత్మక వైఖరి గాక ఆరాధన వ్యక్తమైంది. ఈ ధోరణి ముదిరి వేదాలకు తిరిగి వెళ్ళాలని డాంగే వంటి వామపక్ష నాయకులు చెప్పే దురవస్థ దాపురించింది.

గత కొద్ది సంవత్సరాలుగా దేశంలో మతోన్మాదం ప్రమాదకరంగా చెలరేగుతున్నది. అయోధ్య విధ్వంసం తదనంతర పరిణామాలు స్వర్ణోత్సవ భారతానికి చేస్తున్న హెచ్చరికలు విస్మరించరానివి. కాషాయ కూటమి భారతీయ ప్రాచీన సంప్రదాయం ముసుగులోనే తన అకృత్యాలు అమానుష వ్యూహాలు అమలు జరుపుతున్నది. ప్రాచీన భారత తాత్విక సాంప్రదాయంలోని మంచిచెడులు విచక్షణగా తెలుసుకుంటేనే ఈ ప్రమాదాన్ని నిరోదించడం సాధ్యమౌతుంది. మతోన్మాదులు చెప్పే అంధవిశ్వాసాలు, పరస్పర ద్వేషాలే భారతీయ వారసత్వం కాదని తేలిపోతుంది.

సామాజికంగా చూసినా విజ్ఞానాభివృద్ధితోపాటు మూడత్వం కూడా విస్తరిస్తున్నది. వేదాలు, పురాణాల పేరిట అసత్యాలు, అర్ధసత్యాలు చలామణీఅవుతున్నాయి. గతంలోని మంచిని తప్పక స్వీకరించాలి. అదే రీతిలో చెడును తిరస్కరించాలి. మార్క్సిస్టు దృక్పథం అలాంటి విశ్లేషణ ఏకైక సాదనంగా వున్నది. ఆ గీటురాయితో దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ చేసిన ఈ ప్రామాణిక రచన పాఠకుల ఆదరణకు పాత్రమౌతుందని ఆశిస్తున్నాము. సంక్షిప్తీకరణలోనూ, ఆంధ్రీకరణలోనూ దొర్లిన లోటుపాట్లు మలిముద్రణలో సవరించుకోగలమని మనవి చేస్తున్నాము.

- ప్రచురణ కర్తలు.

# అగ్రశ్రేణి మార్క్సిస్టు తత్వవేత్త దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ

**భా**రతదేశంలోని మార్క్సిస్టు తత్వవేత్తలలో అగ్రగణ్యులు దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ భారతీయ తత్వశాస్త్రాన్ని మార్క్సిస్టు పద్ధతుల్లో విశ్లేషించిన వారిలో ఆయనది ప్రథమ స్థానమనడంలో ఎటువంటి సందేహం లేదు భారతీయ తాత్విక సంప్రదాయం కేవలం భావవాద సంప్రదాయమే అన్న బలమైన అభిప్రాయాలను ఆయన నిర్ణయాత్మకంగా త్రిప్పికొట్టగలిగారు అంతేకాకుండా భారతీయ తాత్విక సంప్రదాయంలో సజీవమైనది భౌతికవాద సంప్రదాయం తప్ప, భావవాద సంప్రదాయం కాదని ఆయన నిరూపించారు

దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ గొప్ప విద్యావేత్త అయినప్పటికీ ఆయన ప్రభావం విద్యా సంస్థలకే పరిమితం కాలేదు ఆయన అభ్యుదయ, కమ్యూనిస్టు ఉద్యమాలతో సంబంధం కలిగివుండేవారు 1918లో కలకత్తాలో ఒక సంప్రదాయ కుటుంబంలో దేవీప్రసాద్ జన్మించారు ఆయన తండ్రి గట్టి హిందూమతావలంబికుడు అయినప్పటికీ స్వాతంత్ర్య పోరాటాన్ని బలపరిచారు దేవీప్రసాద్ తన బాల్యంలోనే స్వాతంత్ర్యోద్యమంలోని వామపక్షవాదులతో సంబంధాలు పెట్టుకొన్నారు ఆయన అభ్యుదయ రచయితల సంఘంలో చేరారు ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు కమ్యూనిస్టు ఉద్యమంతో సంబంధం ఆయన తుది వరకు కొనసాగింది

దేవీప్రసాద్ కలకత్తా విశ్వవిద్యాలయం నుండి 1939లో బి ఎ ఆనర్స్ డిగ్రీని, 1942లో ఎం ఎ డిగ్రీని పొందారు ఆ తర్వాత ప్రొఫెసర్ ఎస్ ఎన్ దాస్‌గుప్తా పర్యవేక్షణలో ఏడాదిపాటు పరిశోధన సాగించారు అనంతరం అదే విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర అధ్యాపకునిగా వృత్తిని ఆరంభించారు ప్రముఖ బ్రిటిష్ తత్వశాస్త్రవేత్త జార్జిథాంప్సన్ వద్ద ఏడాదిపాటు గడిపారు కలకత్తాలోని సిటీ కాలేజీలో కొన్ని దశాబ్దాల పాటు ఆయన తత్వశాస్త్రాన్ని బోధించారు న్యూఢిల్లీలో స్థాపించబడిన భారత తత్వశాస్త్ర పరిశోధనామండలి సంస్థాపక సభ్యుల్లో దేవీప్రసాద్ ఒకరు 1987లో ఆయన ఆ సంస్థకు జాతీయ ఫెలోగా ఎన్నికయ్యారు దేశ, విదేశాల్లోని అనేక ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో దేవీప్రసాద్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆయనకు లభించాయి 'ప్రాచీన భారత సమాజం-శాస్త్ర విజ్ఞానం' అన్న గ్రంథానికి కలకత్తా విశ్వవిద్యాలయం డి లిట్ ప్రదానం చేసింది యు ఎస్ ఎస్ ఆర్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, మాస్కో డి ఎస్ సి ప్రదానం చేసింది 'సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు' ఆయనకు లభించింది బెర్లిన్‌లోని జర్మన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు ఆయన సభ్యునిగా ఎన్నికయ్యారు ప్రప్రథమంగా ఇటువంటి గౌరవం ఒక విదేశీయుడు పొందిన దేవీప్రసాద్

విద్యారంగంలో ఇంతటి పురస్కారాలు, గుర్తింపు పొందిన దేవీప్రసాద్ ఛటోపాధ్యాయకు అంతకు మించిన గౌరవం, ప్రాధాన్యత అభ్యుదయ వర్గాల నుండి లభించాయి ఆయన మేధోకృషి అభ్యుదయ ఉద్యమానికి ఎంతగానో దోహదపడటమే దీనికి కారణం

ఎస్ ఎన్ దాస్‌గుప్తాతోపాటు ఎస్ రాదాకృష్ణన్ వద్ద కూడా దేవీప్రసాద్ తత్వశాస్త్రాన్ని అభ్యసించారు వీరిరువురూ భావవాద తత్వవేత్తలు తత్వశాస్త్రంలో వారి అపార పాండిత్యాన్ని గౌరవిస్తూనే, వారి భావాల పట్ల దేవీప్రసాద్ ఆది నుండీ విమర్శనాత్మక వైఖరితో వుండేవారు భారతీయ తత్వశాస్త్రంలోని భౌతికవాద సంప్రదాయాల పట్ల వారిరువురి వైఖరులతోనూ దేవీప్రసాద్ విభేదించారు భారతదేశపు ప్రాచీన తత్వ శాస్త్రాన్ని మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేయడానికి జార్జి థాంప్సన్ సాహచర్యం దేవీప్రసాద్‌కు ఎంతగానో ఉపయోగపడింది దేవీప్రసాద్ రచనలో అత్యంత ప్రదానమైన లోకాయత 'ప్రాచీన భారతీయ భౌతికవాదంపై ఒక అధ్యయనం' అన్న గ్రంథంలో థాంప్సన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది భారతీయ పురాతన భౌతికవాదం గురించి ఒక మార్క్సిస్టు సమగ్రంగా రచించిన తొలిగ్రంథం 'లోకాయత' ఈ గ్రంథంలో ఆయన అనేక ఆంగ్ల, సంస్కృత, పాళి, హిందీ, బెంగాలి గ్రంధాల నుండి విస్తృతంగా ఉటంకించి విశ్లేషించారు భారతీయ ప్రాచీన సమాజం గురించి, ఆనాటి భౌతికవాద దోరణుల గురించి సమగ్ర చిత్రాన్ని అందించిన గ్రంధం లోకాయత 1959లో ఆంగ్లంలో తొలిసారి ప్రచురించబడిన ఈ గ్రంథానికి జపనీస్, హంగేరియన్, రష్యన్, హిందీ అనువాదాలు కూడా వెలువడ్డాయి

పురాతన భారతదేశంలో వర్గ పూర్వసమాజం వర్గ సమాజంగా పరివర్తన చెందే దశలో తత్వశాస్త్రం భావవాదం, భౌతికవాదం అనే రెండు విరుద్ధ శిబిరాలుగా ఎలా విడివడిందీ, మతం, శాస్త్ర విజ్ఞానం ఎలా రూపుదిద్దుకున్నదీ దేవీప్రసాద్ 'లోకాయత' గ్రంథంలో విశదీకరించారు పాలకవర్గాలయిన రాజులు, పురోహితులు ఇహ ప్రపంచాన్ని వదిలివేయాలని చెప్పే భావవాదాన్ని చేపట్టగా, ప్రజలు ఈ ప్రపంచంలో జీవించడానికి అవసరమైన భౌతికవాదాన్ని చేపట్టిన విషయాన్ని ఆయన తెలియజేశారు

భారతదేశంలో కేవలం భావవాద తాత్విక సంప్రదాయం ఒక్కటే లేదు వర్గ సమాజం ఏర్పడిన నాటినుండి భావవాదం, భౌతికవాదం రెండు విరుద్ధ సంప్రదాయాలుగా ఘర్షణ పడుతున్నాయి కానీ పాలకవర్గాలనుండి భావవాద తత్వవేత్తలకు, వారి భావాల ప్రచారానికి మాత్రమే ప్రోత్సాహం లభించింది అందువల్ల వారి భావాలు మాత్రమే గ్రంధస్థం చేయబడ్డాయి భౌతికవాద తత్వవేత్తల భావాలు ఎంతబలమైనప్పటికీ అవి ప్రచారంలోకి రాకుండా పాలకవర్గాలు అన్ని విధాలా అడ్డుకొన్నాయి భౌతికవాద భావాలు గ్రంథస్థం కాలేదు ఒకవేళ గ్రంథస్థం అయినా వాటిని పాలకవర్గాలు ధ్వంసం చేశాయి

ఈ స్థితిలో దేవీప్రసాద్ చటోపాధ్యాయ ప్రాచీన బారతదేశంలో భౌతికవాద సంప్రదాయాన్ని వెలికితీసి చెప్పడానికి ఎంతో శ్రమపడవలసి వచ్చింది భావవాద

తత్వవేత్తలు భౌతికవాదుల భావాలను ఖండించడానికి ఉటంకించిన భాగాలనే ఆయన ఆధారం చేసుకోవలసి వచ్చింది ప్రత్యర్థి ప్రస్తావనల్లో గల భౌతికవాద భావాలలో అనేక వక్రీకరణలు తప్పనిసరిగా వుంటాయి వీటన్నింటినీ ఎంతో విమర్శనాత్మకంగా పరిశీలించి అసలు విషయాన్ని బయటపెట్టడంలో దేవీప్రసాద్ ఎంతోప్రతిభ కనపరిచారు అందువల్లనే 'లోకాయత' గ్రంథంలో సుదీర్ఘమైన ఉటంకింపులు, వివరణలు, వ్యాఖ్యానాలు ఉంటాయి పైగా 'లోకాయత' చర్చకు ఒక ముసాయిదా మాత్రమే అని దేవీప్రసాద్ పరిచయంలో చెప్పారు అయితే ఇది ఆయన నమ్రతకు సూచన మాత్రమే 'లోకాయత' భారతీయ తత్వశాస్త్ర విశ్లేషణలో నిస్సందేహంగా కొత్తబాటలు వేసింది

ఆ తర్వాత రచనలలో దేవీప్రసాద్ 'లోకాయత'లో చేసిన సూత్రాలకు మెరుగులు దిద్ది మరింత పరిపుష్టం చేశారు అంతేకాకుండా మరింత సులభ గ్రాహ్యంగా కూడా ఆయన విషయాలను విశదీకరించారు 1973లో 'లోకాయత' తృతీయ ముద్రణకు ముందుమాట వ్రాస్తూ 1959లో వ్రాసిన ఈ గ్రంథంలో చెప్పిన భావాలకు సహజంగానే అనేక మార్పులు చేయవలసి వుందని, అనేక కారణాల రీత్యా ఇప్పటివరకు ఆ పని చేయలేకపోయానని తెలిపారు దీనికోసం అదనంగా మరొక గ్రంథం అవసరమవుతుందని చెప్పారు ఈ గ్రంథం తయారయిందని 'భారతీయ తత్వశాస్త్రంలో ఏది సజీవం, ఏది నిర్జీవం' అని పేరు పెట్టానని తెలిపారు

భారతదేశంలో భౌతికవాదం గురించి మరింత లోతుగా అధ్యయనం చేయడానికి పూనుకొన్నప్పుడు భావవాద సంప్రదాయాన్ని కూడా మరింత సునిశితంగా పరిశీలించవలసిన అవసరం ఏర్పడిందని ఆయన చెప్పారు భౌతికవాదాన్ని అధ్యయనం చేయడం, దాని ప్రతి సిద్ధాంతమైన భావవాదాన్ని అధ్యయనం చేయకుండా సాధ్యంకాదు క్రీస్తుపూర్వం 7 లేదా 6వ శతాబ్దంలోని ఉపనిషత్తుల నుండి క్రీస్తుశకం 17వ శతాబ్దంలోని గదాధరుని వరకు అంటే దాదాపు 2500 సంవత్సరాల భారత తత్వశాస్త్ర చరిత్ర అంతా భావవాద, భౌతికవాదాల మధ్య పోరాటమే అంతేకాకుండా భౌతికవాద సంప్రదాయం ఎల్లప్పుడూ లౌకికతత్వం, హేతువాదం శాస్త్ర దృష్టికి కట్టుబడగా, భావవాదం ప్రధానంగా మిథ్యావాదం, ఛాందసవాదాలను ప్రచారం చేసింది అందువల్ల 'ఏది సజీవం, ఏది నిర్జీవం' అన్న తన గ్రంథం మతతత్వవాదులకు వ్యతిరేకంగా జరిగే సైద్ధాంతిక పోరాటానికి దోహదపడగలదని దేవీప్రసాద్ చెప్పారు

'లోకాయత'తో పోల్చుకొన్నప్పుడు "ఏది సజీవం, ఏది నిర్జీవం" అన్న గ్రంథంలో అదనపు విషయాలుండటమే కాకుండా, శైలికూడా తత్వశాస్త్ర గ్రంథాన్ని తొలిసారిగా చదివే వారికి సైతం అర్థమయ్యేంత సులభంగా వుంటుంది ఈ గ్రంథం తొలిభాగంలో దేవీప్రసాద్ ఉపనిషత్తులు, మహాయానబౌద్ధం, శూన్యవాదం, విజ్ఞానవాదం, అద్వైత వేదాంతం మొదలైన భావవాద సిద్ధాంతాల గురించి వివరిస్తారు వారు ఎటువంటి భావాలను ప్రచారం చేశారు? ఆ భావాలకు ఆధారమేమిటి? అన్న విషయాలను తెలియజేస్తారు వీనితోపాటు ఈ భావవాద సిద్ధాంతాలు సమాజంలో ఎటువంటి

పాత్రను నిర్వహించాయి అన్నదానిని ఎంతో ప్రతిభావంతంగా వివరిస్తారు తర్వాతిభాగంలో భావవాదానికి ప్రతిసిద్ధాంతమైన భౌతికవాదం గురించి తెలియజేస్తారు భౌతికవాదులు భావవాదాన్ని ఎలా ఖండించిందీ తెలియజేస్తారు ఈ సిద్ధాంతాలలో పదార్థానికి, చైతన్యానికి మధ్య సంబంధంఎలా చెప్పబడిందీ వివరిస్తారు భౌతికవాద సిద్ధాంతాలు లౌకికతత్వం, హేతువాదం, శాస్త్రదృష్టిని ఎలా ప్రదర్శించిందీ దేవీప్రసాద్ మనకు స్పష్టం చేస్తారు

'లోకాయత', 'ఏది సజీవం, ఏది నిర్జీవం' గ్రంధాలు భారతదేశంలోని తాత్విక సంప్రదాయాలలో భౌతికవాదం గురించి, అది నిర్వహించిన పాత్రగురించి తెలుసుకోవడానికి ఉపయోగపడే అతి ముఖ్యమైన రెండు గ్రంధాలు భౌతికవాద సంప్రదాయాన్ని వెలికితీయడానికి దేవీప్రసాద్ ప్రాచీన భారతచరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు దీనితోపాటు ప్రాచీన భారతదేశంలో విజ్ఞానశాస్త్రం ఎలా ఆవిర్భవించిందీ, దీనికి ప్రతిధృవమైన మతం ఎలా రూపుదిద్దుకొన్నదీ, ఎలాంటి పాత్రను నిర్వహించిందీ ఆయన అధ్యయనం చేశారు ఈ అధ్యయనం ఫలితంగానే 'ప్రాచీన భారతదేశంలో శాస్త్రం, సమాజం' అనే గ్రంధాన్ని 1977లో వెలువరించారు

ప్రాచీన భారత సమాజంలో ఏది నిజమైన విజ్ఞానశాస్త్రం? పూర్తి సెక్యులర్ ధోరణితో వుండి, ఆదునిక జీవశాస్త్ర అవగాహనకు దారితీయగలిగిన భావాలు కలిగిన వైద్యమే ప్రాచీన భారతదేశంలో తొలి శాస్త్ర విజ్ఞానమని దేవీప్రసాద్ చెబుతారు ప్రాచీన భారతదేశంలో భావవాదులు వైద్యశాస్త్రాన్ని ఆచరించే వారిని ద్వేషించడం కనిపిస్తుంది మనుస్మృతిలోను, ఇంకా అంతకు ముందు వైద్యవృత్తిని ఆచరించే వారు 'అపరిశుద్ధులు' అని పేర్కొనబడింది మత భావాలను, భౌతికవాద భావాలను బీజప్రాయంగా కలిగివున్న 'తంత్రం' వర్గసమాజం ఆవిర్భావంతో ఒకవైపు మతంగానూ, మరొకవైపు వైద్యశాస్త్రంగానూ అభివృద్ధి చెందింది వేద బ్రాహ్మణులు మతానికి మద్దతిచ్చి, వైద్యశాస్త్రాన్ని తమ ప్రత్యర్థిగా పరిగణించారు వైద్యశాస్త్ర గ్రంధాలలో ప్రాపంచిక జీవనాన్ని ధ్రువీకరించి, చాందసభావాలను వ్యతిరేకించే విషయాలు, భౌతికవాదంతో కూడిన భావాలు పుష్కలంగా ఉంటాయి

అయితే ఆనాటి భావవాద ఛాందసులకు పాలక వర్గాల ప్రాపకం సంపూర్ణంగా వుండేది పాలక వర్గాలు ప్రజల్లో శాస్త్రభావాలు వేళ్లూనుకొనడానికి పూర్తి వ్యతిరేకం అందువల్ల పాలకవర్గాల, చాందసవాదుల దాడినుండి తమ శాస్త్రాన్ని కాపాడుకోవడానికి తమ భావాలను అనేక ఛాందసభావాలతో కలగాపులగం చేశారు ఈ చెత్తనుండి శాస్త్ర సిద్ధాంతాన్ని వెలికితీసి చెప్పడానికి దేవీప్రసాద్ విశేషమైన కృషిసల్పారు ప్రాచీన వైద్యశాస్త్ర గ్రంధాలు భావవాద సంప్రదాయంలో గాక, భౌతికవాద సంప్రదాయంలో భాగాలని తిరుగులేని విదంగా ఆయన నిరూపించారు

తన భావాలను జనరంజకంగా వివరించడానికి దేవీప్రసాద్ పలు గ్రంధాలను రచించారు 'భారతీయ తత్వశాస్త్రం సులభపరిచయం' అన్న గ్రంధం 1964లో ప్రచురించబడింది భారతదేశంలోని తొమ్మిది ప్రదాన బావవాద, బౌతికవాద, తాత్విక

సిద్ధాంతాల గురించి వివరించారు ఈ గ్రంథం చైనా, జర్మనీ, రష్యన్, హిందీ, మళయాళం, తెలుగు భాషలలోకి అనువదించబడింది 1969లో 'భారతీయ భౌతికవాదం' అన్న గ్రంథం ప్రచురించబడింది ఈ గ్రంథం మళయాళం, రష్యన్ భాషలలోకి అనువదించబడింది 1989లో ప్రాచీన 'భారతదేశంలో భౌతికవాదానికి మద్దతు'గా అన్న గ్రంథం ప్రచరించబడింది ఈ గ్రంథం ముందుమాటలో దేవీప్రసాద్ కొన్ని ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు తాను ఎంతో సన్నిహిత సంబంధం కల్గిన జర్మనీకి చెందిన భారతీయ విషయాల అధ్యయన వేత్త వాల్టెర్ రూబెన్ తన 'లోకాయత' గ్రంథాన్ని సమగ్రంగా సమీక్షించారని తెలిపారు రూబెన్ కలకత్తా వచ్చినప్పుడు తాను సాధ్యమైనంత ఎక్కువకాలం ఆయనతో గడిపానని, ఆ సందర్భంగా మాట్లాడుతూ 'లోకాయత' గురించి 'అన్ని కోణాల నుండి సమగ్రంగా వివరించిన నీవు ఆ తాత్విక సంప్రదాయాన్ని ఎందుకు అంచనా కట్టలేదని' ప్రశ్నించారని దేవీప్రసాద్ చెప్పారు ఆ ప్రశ్నకు సమాదానంగానే 'భౌతికవాదానికి మద్దతు'గా తనగ్రంధాన్ని వ్రాశానని వివరించారు అంతేకాకుండా తన గ్రంధాలు కేవలం సమర్ధించుకొనే రీతిలో వుంటాయని తనతో బాగా చనువువున్నవారు విమర్శిస్తుండేవారని, తన భావాలు నిర్ద్వంద్వంగా నిర్ధారణ అయిన తర్వాత అంత సుదీర్ఘమైన సమర్ధనలు అవసరం లేదని అంటుండేవారని, ఆ అభిప్రాయాన్ని దృష్టిలో పెట్టుకొని కూడా ఈ గ్రంథాన్ని రచించానని ఆయన తెలిపారు దేవీప్రసాద్ తన చివరికాలంలో ప్రాచీన భారతదేశంలో 'శాస్త్ర, సాంకేతిక చరిత్ర' అన్న గ్రంథంపై పనిచేశారు ఈ గ్రంథం తొలిసంపుటం 1986లో విడుదలయింది దేవీప్రసాద్ స్వయంగా పలు గ్రంథాలు రచించడమే కాకుండా, ఆయన సంపాదకత్వాన అనేక గ్రంథాలు వెలువడ్డాయి భారత తత్వశాస్త్ర చరిత్ర ప్రపంచ తత్వశాస్త్ర చరిత్ర అనే పలు సంపుటాల గ్రంథాలు వీటిలో ముఖ్యమైనవి అంతేకాకుండా పలు సెమినార్లకు ఆయన సూత్రధారిగా వ్యవహరించారు కొందరు కుహనా మార్క్సిస్టులు అద్వైతంలోనే మార్క్సుచెప్పిన గతితర్కం ఉన్నదని భారతీయ తత్వశాస్త్రానికి చెప్పిన తప్పడు భాష్యాలను త్రిప్పికొట్టడంలో ఆయన కీలకపాత్ర వహించారు

భారతీయ తత్వశాస్త్రంలో ఇంతటి విశేష కృషి జరిపి తద్వారా అభ్యుదయ ఉద్యమానికి ఎంతో సేవచేసిన దేవీప్రసాద్ 1993 మే 8వ తేదీన కన్నుమూశారు భారతదేశంలో నేడు మతోన్మాదులు చాందస భావాలను తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు ఈ తరుణంలో దేవీప్రసాద్‌లాంటి వారు మనమధ్య లేకపోవడం అభ్యుదయ ఉద్యమానికి తీరనిలోటు అయినప్పటికీ ఆయన రచనలు మతోన్మాదులకు వ్యతిరేకంగా జరిపే పోరాటంలో పదునైన ఆయుధంగా ఉపయోగపడుతూనే ఉంటాయి

**-గుడిపూడి విజయరావు.**

# I

# భారతీయ తత్వశాస్త్రంలో ప్రాథమిక వైరుధ్యం

**భా**వాల ఘర్షణద్వారా లేక సిద్ధాంత, ప్రతి సిద్ధాంతాల మధ్య చర్చద్వారా ఒక తాత్వికవైఖరికి రావడమనే పద్ధతిని భారతీయ తత్త్వశాస్త్రంలో ప్రధానంగా అనుసరించారు క్లుప్తంగా చెప్పాలంటే వైరుధ్యాలద్వారా అన్నమాట ఈ పద్ధతి ఎలా పెంపొందించబడుతుందో పరిశీలించడం ముఖ్యం ప్రాచీన భారతంలో శాస్త్రజ్ఞులు ఈ పద్ధతి అభివృద్ధికి ఎంతగానో దోహదం చేసిన దృష్ట్యా ఇలాటి పరిశీలన మరింత అవసరమవుతుంది

ఈ పద్ధతికి బీజాలు ప్రాచీనకాలపు సైద్ధాంతిక చర్చా విధానంలో చాలా స్పష్టంగా కనిపిస్తాయి మనం చూడగలిగినంత వెనక్కు చూస్తే ఇది ఉపనిషత్తుల కాలంనుండి కనిపిస్తుంది ఉపనిషత్తుల్లో దాన్ని 'వాకోవాక్య ' అని అభివర్ణించారు ఒకవిధంగా ఇది ప్రాచీన గ్రీకుల గతితర్కాన్ని పోలివుంటుంది ప్రశ్న, జవాబుల రూపంలో చర్చ సాగించే పద్ధతి ఇది మనకు తెలిసినదాన్ని బట్టి ఉపనిషత్తుల కాలంలోనే తత్వవేత్తలలో ఒక భాగం 'వాకోవాక్య' పద్ధతికి గల విలువ నామమాత్రమని గట్టిగా భావించినట్లు కనిపిస్తుంది[1] ఈ తత్త్వవేత్తలు తమ నిగూఢ జ్ఞానాన్ని కాపాడుకోవడంపైనే కేంద్రీకరించారని, ఇతరులు దానిలో తేలికగా ప్రవేశించే అవకాశం లేకుండా చేశారని ముందు ముందు మనం చూడగలుగుతాము అయితే అలాంటి వారి వైఖరి సంవాద కళను మటుమాయం చేయలేకపోయింది అలాగే తర్వాత భారతీయ తర్కమూ అభివృద్ధి చెందింది ప్రధానంగా ప్రాచీన భారతీయ వైద్యుల కృషి ఇందుకు కారణం నిజానికి భారతీయ, శాస్త్ర, వైజ్ఞానిక

---

1 వాస్తవానికి ఉపనిషత్ కాలానికి శాస్త్రంగా, లేక ఆదిమ శాస్త్రంగా పిలవదగిన ప్రతిదాన్ని ఉపనిషత్ భావవాదులు ఖండించారు వారు వాస్తవికత పట్ల తాంత్రిక-నిగూఢ వైఖరిని సమర్థించారు

అభివృద్ధిలో అగ్రగాములు వీరే అందుబాటులోవున్న వారి అతి పురాతన వైద్యగ్రంధం చరకసంహిత క్రీ శ 100సం॥ కన్నా తర్వాతది కాదు సైద్ధాంతిక పరిజ్ఞానం సానుకూలంగా అభివృద్ధి చెందడంలో భావాల ఘర్షణకు గల ప్రాధాన్యతను గురించిన మెలకువ దానిలో స్పష్టంగా కనిపిస్తుంది

## ఆచరణలో ఈ పద్ధతి

భారతీయ తత్వవేత్తలందరూ ఈ పద్ధతిపట్ల ఒకే విధమైన ఉత్సాహాన్ని కలిగివున్నారని చెప్పడం అతిశయోక్తి అవుతుంది "విమర్శనాత్మక పరీక్ష'' లేక హేతుబద్ధమైన విశ్లేషణ అన్న భావననే వ్యతిరేకించినవారూ వారిలో ఉన్నారు అందుకు బదులు పవిత్ర గ్రంధాలపట్ల విశ్వాస మార్గాన్ని అనుసరించడానికే వారు మొగ్గుచూపించారు అవి భద్రత కల్పిస్తాయని భావించారు భావ వాదుల్లో తీవ్ర శ్రేణికి చెందినవారు ఇందులో ముందున్నారు హేతువాదంపట్ల వారి వ్యతిరేకతకు భారతీయ స్మృతికారుల నుండి గొప్ప ప్రోత్సాహం లభించింది వారి ఉద్దేశ్యంలో హేతుబద్ధత అన్నది ఉపయోగం లేనిది అప్పటికే వేదాలు వెల్లడించేదాన్ని వివరించడం, విశదీకరించడం తప్ప హేతువాదానికి మరో లక్ష్యంలేదని వారి భావన అయితే తమ సిద్ధాంతానికి ప్రతిసిద్ధాంతం నుంచి ప్రమాదం ముంచుకువస్తుందని భావించినప్పుడు మాత్రం వారు హేతువాద పద్ధతిని అనుసరించడం అత్యంత ఆసక్తికరమైన విషయం గౌతముడు, వాత్స్యాయనుడు రూపొందించిన పద్ధతిని వారు ఆచరణలో విస్మరించలేకపోయారు మరోవిధంగా చెప్పాలంటే విమర్శనాత్మక పరీక్షకు వ్యతిరేకమైన వారు కూడా తమ తాత్విక రచనలలో దాన్ని పలుమార్లు అంగీకరించక తప్పలేదు దేశంలోని ప్రధాన తత్వవేత్తలందరి రచనలలోనూ ఇది కనిపిస్తుంది

సాధారణంగా చెప్పాలంటే ఒక భారతీయ తత్వవేత్త తన వ్యతిరేక భావాన్ని అంటే తన భావాన్ని అభావం చేసే భావాన్ని ఖండించడంద్వారా ముందుగా తన వాదనను ప్రతిపాదిస్తాడు భారతీయ పదజాలం ప్రకారం దీన్నే "పూర్వపక్షం" అంటారు అంటే ప్రత్యర్థి సిద్ధాంతమన్నమాట మరింత సులభంగా చెప్పాలంటే ఒకరి దృక్పధానికి వ్యతిరేకమైన సిద్ధాంతం కొద్దో, గొప్పో దాన్ని వివరంగా ఖండించడంద్వారానే ఎవరైనా తమ స్వంత సిద్ధాంతాన్ని స్థాపించగలుగుతారు ప్రత్యర్థి సిద్ధాంతాన్ని తుత్తునియలు చేయగలిగినప్పుడే తన సిద్ధాంతం విశ్వసించబడుతుందని తత్వవేత్త అర్థం చేసుకుంటాడు

తదనుగుణంగానే ఒక ఉన్నతస్థాయి తాత్విక రచనలో మొదటదాని వ్యతిరేక సిద్ధాంతానికి అనుకూలమైన వాదనలన్నీ పొందుపరచబడతాయి ఆవిధంగా ప్రతి సిద్ధాంతాన్ని సాధ్యమైనంత చక్కగా కనిపించేలా చేయడం జరుగుతుంది ఆ తర్వాత తత్వవేత్త తన స్వీయ సిద్ధాంతాన్ని ముందుకు తెస్తూ దాన్ని చీల్చిచెండాడతాడు ప్రతిసిద్ధాంతానికి ఇవ్వాల్సిన ఘనతంతా ఇచ్చిన తర్వాత దాన్ని తుత్తునియలు చేయడం అన్న ఈ పద్ధతి

తత్వవేత్త చెబుతున్న సిద్ధాంతంపట్ల పూర్తి విశ్వాసం కలిగిస్తుందనేది ఇక్కడ అభిప్రాయం పడవ నడిపేవాడి పోలికతెచ్చి ఈ పద్ధతి ప్రయోజనాన్ని సమర్థిస్తుంటారు దీన్నే "స్థూణా నిఖన న్యాయం"అంటారు అంటే నదిలో పడవమోకును కట్టేందుకుగాను ఒడ్డున గుంజను మళ్ళీ మళ్ళీ తవ్వి పాతడం అన్నమాట వాత్సాయనుడు దీన్నే ఇలా చెప్పాడు "వివిధ విధాలైన విమర్శనాత్మక పరీక్షల తర్వాతే ఒక తాత్విక చింతన మరింత నిశ్చితత్వం సంతరించుకుంటుంది " విమర్శనాత్మక పరీక్ష అనడంలో ఆయన ఉద్దేశ్యమేమిటో మనం ఇప్పటికే చూశాం సిద్ధాంతానికి, ప్రతిసిద్ధాంతానికి మధ్యగల వైరుధ్యంవల్ల ఉత్పన్నమయ్యే సందేహాలను అధిగమించే క్రమం అది ఈ క్రమంలో ఎంతగా ముందుకుసాగితే ఒకరి అభిప్రాయాలకు విలువ అంతగా పెరుగుతుంది

## సిద్ధాంతం, ప్రతిసిద్ధాంతాల చారిత్రికత

తన స్వీయ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోయేందుకై అనివార్యంగా ప్రత్యర్థి సిద్ధాంతాన్ని లేక పూర్వపక్షాన్ని ప్రస్తావించేటప్పుడు చరిత్రలో ఆ సిద్ధాంతాన్ని సమర్థించిన తాత్విక ప్రత్యర్థుల వైఖరినే వివరించడం జరుగుతుంది తప్ప ఊహాజనితమైన ప్రత్యర్థి వైఖరిని ప్రతిపాదించడం జరగదు క్లుప్తంగా చెప్పాలంటే ప్రతిసిద్ధాంతం లేక పూర్వపక్షం అన్నదానికి కూడా సిద్ధాంతానికి ఇచ్చినంత విలువా ఇవ్వబడుతుంది

ప్రతిసిద్ధాంతం రూపంలో అసలైన ప్రత్యర్థి వైఖరిని వర్ణించే సందర్భంలో ఒక తత్వవేత్త దాన్ని సాధ్యమైనంత విశదంగా ఇవ్వడానికి చాలా జాగ్రత్తపడతాడు ఆ సిద్ధాంతానికి మద్దతుగా దాని ప్రతిపాదకుడికన్నా మెరుగైన వాదనలు కూడా ఇస్తాడు ఈ ప్రతి సిద్ధాంతాన్ని చివరకు పూర్తిగా నిరాకరించడానికి దోహదం కలగాలనే దృష్టితోనే ఇదంతా జరుగుతుంది అయితే దీనివల్ల ఆ ప్రతిసిద్ధాంతపు మౌలిక చారిత్రికత ఏమాత్రం దెబ్బతినదు

మరీముఖ్యంగా భారతీయ తాత్విక కృషి పరిపక్వ దశకు చేరిన తర్వాత భారతీయ తాత్వికులు ఈ పద్ధతిని అనుసరించడం తప్పనిసరి అని భావించారు అలా చేయకపోతే తమ స్వీయ భావనలే నిలవవు ఎందుకంటే తమ భావాల ఆధిక్యతను నిరూపించుకోవడానికి తాత్విక ప్రత్యర్థులు అప్పటికే రంగంలో వుండేవారు తమ పూర్వ పక్షాన్ని అభావం చేయడంద్వారానే వారు ఎవరైనా నిలదొక్కుకోవాలి ఈవిధంగా భారతీయ తాత్వికుల పరిస్థితి అప్పటికే జటిలమైంది భావాల సంఘర్షణ పట్ల ఎవరూ ఉదాసీనంగా ఉండలేని స్థితి ఏర్పడింది

## ప్రాథమిక వైరుధ్యం

భారతీయ తత్వవేత్తలు అనుసరించిన ఈ పద్ధతిని దృష్టిలో వుంచుకొని మనం వారు వదలివెళ్ళిన అపారమైన తాత్విక సంపదను చూడవచ్చు అప్పుడు ఈ మొత్తం

విషయం మనకంత క్లిష్టంగా కనిపించదు భారతీయ తాత్విక పరిస్థితిని గురించి ఒక సమగ్ర అంచనాకు రావడానికి సిద్ధాంతరీత్యానూ, ఆచరణ రీత్యానూ ఈ పద్ధతి వివేకవంతమైనదిగా గోచరిస్తుంది ఎందుకంటే భారతీయ తత్వవేత్తలు అర్థం చేసుకున్నట్లు సిద్ధాంత, ప్రతిసిద్ధాంతాలమధ్య ఘర్షణ ద్వారానే తాత్విక కృషి పెంపొందుతుంది ఈ ప్రాథమిక లేక మౌలిక వైరుధ్యం ఏమిటనేది అర్థం చేసుకోవలసిన మొదటి విషయం

కనుక మనం చాలా సులువైన అంశంతో మొదలుపెట్టాలి ముఖ్యులైన భారతీయ తత్వవేత్తలందరినీ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ విమర్శనాత్మక పరీక్షకై ఆకర్షించిన సమస్య ఏదైనా ఉన్నదా? వారందరూ వేర్వేరు పక్షాలుగా చీలడానికి లేక భిన్నమైన పరిష్కారాలతో అటూ ఇటూ మౌలికంగా ప్రత్యర్థి శిబిరాలుగా విడిపోవడానికి దారితీసిన సమస్య ఏదైనా వుందా? అలాంటి సమస్యను పట్టుకుంటే మనం భారతీయ తత్వశాస్త్రంలోగల మౌలికవైరుధ్యాన్ని తెలుసుకోవడానికి ఆధారం లభిస్తుంది

భారతీయ తాత్విక సాహిత్యాన్ని ఒకసారి తేరిపార చూస్తే దానిలో చర్చించిన ప్రముఖ తాత్విక సమస్యలలో అలాంటి ఒక సమస్య స్పష్టంగా కనిపిస్తుంది భౌతిక ప్రపంచం లేదా ప్రకృతి వాస్తవికతకు సంబంధించినదే ఆ సమస్య దాన్ని అర్థం చేసుకోవడానికి తత్వశాస్త్రవేత్తలు ప్రయత్నించడం వల్ల ప్రయోజనం గురించిన ప్రశ్న కూడా దీనితోపాటుగానే వుంటుంది భారతదేశంలోని తత్వవేత్తలలో ముఖ్యులందరూ ఈ సమస్యపై వివాదంలో ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారు అంతేగాక భారతీయ తత్వశాస్త్రంలో ఏర్పడిన సమిష్టి వైఖరులలో అనేకం దీనికి సంబంధించినవే

అందువల్ల పాదార్థిక ప్రపంచ వాస్తవికత, దాని స్వరూప స్వభావాల పరిశోధనవల్ల ప్రయోజనం అన్న సమస్యే భారతీయ తత్వవేత్తలను రెండు శతృశిబిరాలుగా విభజించింది ఆయా దృక్పధాలను అనుసరించేవారిమధ్య ఇతర అంతర్గత విభేదాలు ఏమున్నాసరే పాదార్థిక ప్రపంచ వాస్తవికత, దాని స్వభావం నిర్మాణం గురించి పరిశోధన వల్ల కలిగే ప్రయోజనం అనే సమస్య భారతీయ తత్వవేత్తలను రెండు విరుద్ధ శిబిరాలుగా విభజించివేసింది అందువల్లనే భారతీయ తత్వశాస్త్రంలో ప్రాథమిక వైరుధ్యంకోసం మనం ఇక్కడే అన్వేషించవలసి వుంటుంది భారతీయ తాత్విక వారసత్వాన్ని క్రమపద్ధతిలో అర్థం చేసుకోవడానికి ఇదే ఒక ప్రారంభ స్థానం అవుతుంది

## భావవాదం-దాని ప్రతి సిద్ధాంతం

శుద్ధ ఆత్మ ఒక్కటే అంతిమ వాస్తవమని నిరూపించేందుకు మన తాత్వికులలో ఒక వర్గం ప్రయత్నించింది దాన్నే ఆత్మ అని, మూల చైతన్యమనీ, నాశములేనిదనీ, కేవలం బృహత్ చైతన్య సంహితమనీ రకరకాలుగా దాన్ని గురించి ప్రస్తావించారు ఈ తాత్వికులనే మనం భారతీయ భావవాదులని పిలుస్తాము వారి మధ్య కూడా అనేక తేడాలు

ఉన్నాయనేది నిస్సందేహం అయితే మొత్తంమీద వాటి ప్రాధాన్యత ద్వితీయమే వారందరినీ ఐక్యం చేసే ప్రాథమికాంశాలే మనకు ప్రధానం

తమ స్వీయ వాదనలను సమర్థించుకునేందుకై పాదార్థిక ప్రపంచం వాస్తవమన్న ప్రతి సిద్ధాంతాన్ని లేదా పూర్వపక్షాన్ని తిప్పికొట్టేందుకు వారు ప్రయత్నించడం తప్పనిసరైంది తాత్వికంగా చెప్పాలంటే పాదార్థిక ప్రపంచ నిరాకరణ లేక త్రోసివేత భావవాద దృక్పథంనుండి మాత్రమే సంభవం అది ఒక ప్రత్యేక సమస్య దాన్ని మనమిక్కడ చర్చించబోవడంలేదు ఒక సాధారణ వాస్తవాన్ని మాత్రమే గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాము శుద్ధ ఆత్మ ఒక్కటే నిజమని నిరూపించడంకోసం భారతీయ భావవాదులందరూ పాదార్థిక ప్రపంచపు వాస్తవికతను నిరాకరించడం అవసరమని భావించడం ఒక్కటే ఇక్కడ గమనించాల్సిన విషయం

ఆవిధంగా ప్రపంచం ఉనికిని నిరాకరించాల్సి రావడంవల్ల వారు ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది మామూలుగా విలువైన విజ్ఞాన సాధనాలుగా పరిగణించబడే అనుభవం, హేతువు, భౌతిక ప్రపంచానికి స్వతంత్రమైన వాస్తవికత వుందన్న విశ్వాసం ఇస్తాయి ఎందుకంటే ఎవరైనా అన్నిరకాల భౌతిక పదార్థాలను ప్రత్యక్షంగా అనుభవంలోకి తెచ్చుకోగలుగుతారు, చూస్తారు, ముట్టుకుంటారు, ఆఘ్రాణిస్తారు, ఇలా అన్నీ ప్రత్యక్షంగా అనుభవిస్తారు అదేవిధంగా హేతువు సహాయంతో వివిధ వస్తువుల ఉనికిని నిర్ధారించుకోగలుగుతారు అందువల్లనే వాటి ఉనికి ప్రత్యక్షంగా కనిపించకపోయినా అవి నిజమని నమ్మడం సాధారణంగా జరుగుతుంది ఇలాంటి సాక్ష్యాధారాలు కనిపిస్తుండగా భావవాదులు పాదార్థిక ప్రపంచ వాస్తవికతను తిరస్కరించడం ఎలా సాధ్యం?

మన అనుభవంలోకి వచ్చే వస్తువుల నిజప్రవృత్తిని అపార్థం చేసుకోవడమే ఇందుకు కారణమని తర్వాతి దశలో వచ్చిన కొంతమంది అత్యాధునికులైన భావవాదులు దీనికిచ్చిన సమాధానం మనం భౌతికవస్తుజాలాన్ని ఎప్పుడూ అనుభూతి చెందం నిజంగా అనుభూతి చెందేది మన ఇంద్రియాలు లేదా భావనలు మాత్రమే దాన్నే భారతీయ పరిభాషలో విజ్ఞానం అన్నారు అయితే భారతీయ భావవాదుల నుంచి అత్యధికంగా లభించిన విలక్షణ సమాధానం మాత్రం ఇదికాదు వారు దీనికి చాలా తేలికైన సమాధానం ఇచ్చేవారు అనుభవం, హేతుశీలతలతో చేసే నిర్ధారణలపై ఆధారపడటం మామూలుగా అనుకుంటున్నంత తేలికకాదని వారు చెప్తారు దైనందిన జీవితానికి సంబంధించిన సాధారణ వ్యవహారాల కోసం వాటిపై ఆధారపడవచ్చు కాని పూర్తిగా తాత్విక చింతనకు సంబంధించిన రంగంలో వాటిపై ఆధారపడలేము అంతిమ సత్యం అన్న దృష్టినుండి చూస్తే మామూలుగా విలువైందిగా పరిగణించబడే విజ్ఞానం ఏదీ నిలబడజాలదు మన అనుభవం, హేతుశీలత మనను అంతిమ వాస్తవికతకు సంబంధించిన విజ్ఞానం వైపు నడిపించడానికి బదులు భ్రమలుగొల్పి బూటక మార్గంవైపు నడిపిస్తాయి ఆత్మ మాత్రమే

వున్నచోట పదార్థం వున్నట్లు మనల్ని నమ్మిస్తాయి భారతీయ తత్వశాస్త్రం పొడుగునా భావవాదులు చెప్పిన ప్రధాన విషయాల్లో ఇది ఒకటి పాదార్థిక ప్రపంచంపట్ల తృణీకార దృష్టికి తోడు సాధారణ జ్ఞాన సముపార్జనా పద్ధతుల పట్ల తృణీకారం కూడా పెంపొందించబడింది

అనుభవాన్ని, హేతుశీలతను తిరస్కరించిన భారతీయ భావవాదులు అంతిమ సత్యాన్ని ఒక విధమైన నిగూఢ మానసిక స్థితిలో మాత్రమే తెలుసుకోగలమని, దీర్ఘోపాసన వల్లనే అది సిద్ధిస్తుందని సూత్రీకరించారు ఈ ధ్యానం ప్రధానోద్దేశ్యం బాహ్యావస్తువుల పట్ల ఆసక్తి వదులుకోవడమే అంతేగాక వేదాలు, శాస్త్రాలు ధ్యానానికి నిజమైన మార్గదర్శకాలని సామాన్య ప్రజలను నమ్మించేందుకు వారు ప్రయత్నించారు సత్యం వాటిలోఇప్పటికే నిక్షిప్తమై ఉన్నదని చెప్పారు

ఈ తాత్వికులు మరో సమస్య పట్లకూడా దృష్టి కేంద్రీకరించారు పాదార్థిక ప్రపంచానికి తనదైన ఉనికి లేకపోయినా ఏదో ఒక విధంగా కనిపిస్తూనే ఉన్నది దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

మనలో పాతుకుపోయిన దృష్టి లోపమే ఈ పరిస్థితికి కారణమని భారతీయ భావవాదులు సామాన్యంగా ఇచ్చే సమాధానం ఈ దృష్టిలోపంవల్లనే మనం అంతిమ సత్యాన్ని తెలుసుకోలేకపోతాం అంతేగాక దాని స్థానంలో మరేదో మన స్వీయ కల్పనను నిజమని అనుకుంటాం ఈ లోపాన్నే కొన్నిసార్లు మన చిత్త భ్రమగా అభివర్ణిస్తారు కొన్నిసార్లు పూర్తి అజ్ఞానమనీ అంటారు ఈ లోపాన్ని అధిగమించడమే అత్యున్నత మానవాదర్శమని భావించబడింది దాన్ని పూర్తిగా అధిగమించగలిగితే మోక్షం లేదా నిర్వాణం రూపంలో స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది పాదార్థిక ప్రపంచ, బూటకత్వం, చింతలనుండి విముక్తి కల్పించే స్వాతంత్ర్యమది

భారతీయ భావవాదులు చెప్పిన కొన్ని ప్రధాన సూత్రాలివి

అయితే భారతీయ తాత్వికులలో మరో వర్గం కూడా ఉన్నారు వాస్తవానికి వారి సంఖ్య చాలా ఎక్కువే పాదార్థికప్రపంచ వాస్తవికతను నిరాకరించే ధోరణికి వారు గట్టి వ్యతిరేకులు పాదార్థిక ప్రపంచం, మనలోవున్న ఏదో లోపంవల్ల కలుగుతున్న భ్రమ కాదని, ప్రాథమికంగా కళ్ళముందు కనిపిస్తున్న యథార్థమని వారు నొక్కి వక్కాణించారు స్థూలంగా చెప్పాలంటే ఈ తాత్వికులు భారతీయ భావవాద ప్రతిసిద్ధాంతానికి ప్రతినిధులు పైపై పొరలను దాటి ఈ ప్రతిసిద్ధాంతకారులలో ప్రధానమైనవారిని విమర్శనాత్మకంగా పరిశీలించవలసిన కర్తవ్యం మనపై వుంది భారతీయ తాత్విక రంగాన్ని సవ్యంగా అర్థం చేసుకోవాలంటే ఈ వ్యత్యాసాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సివుంటుంది

పాదార్థిక ప్రపంచం వాస్తవికమైందనే తమ అభిప్రాయాన్ని సమర్థించుకోవాలంటే

ఈ తత్వవేత్తలు తమ పూర్వపక్షంగా వున్న భావవాదాన్ని దాని సకల రూపాలను పరిశీలించడం తప్పనిసరి అయింది దాన్ని తిరస్కరించడం, నిరాకరించడం అవసరమైంది అందువల్లనే భారతీయ తాత్విక సారస్వతంలో భావవాదాన్ని తిరస్కరించే విస్తారమైన చర్చ కనిపిస్తుంది భావవాదులు చేపట్టిన వాదనల్లోని సాంకేతికమైన పొరపాట్లను ఎత్తిచూపించడానికే ఇది ఉద్దేశించబడింది అయితే దానిలో చాలాభాగం సారాంశంరీత్యానూ, వక్కాణింపు రీత్యానూ సానుకూల దిశలోనే వుంది ఆవిధంగా భావవాద ధోరణులను సాధారణ అనుభవాలను, హేతుశీలతను ఖండించే పద్ధతిని వ్యతిరేకిస్తూ భావవాద విమర్శకులు విజ్ఞానానికి గల మూలాధారాలను సమర్థించారు వారందరూ ఒకే స్థిరత్వంతో ఆ పని చేసివుండకపోవచ్చుగాక పాదార్థిక ప్రపంచ వాస్తవికతను ఆమోదించినంతమాత్రానే ఎవరూ తత్వవేత్తలైపోరు భావవాద వ్యతిరేకులు ప్రకృతిని గురించి, పాదార్థిక ప్రపంచ నిర్మాణాన్ని గురించి తత్వవేత్తలుగా తమవైన అభిప్రాయాలను రూపొందించుకోవాల్సివచ్చింది ఆవిధంగా ప్రకృతిని గురించి, పదార్థాన్ని గురించి ఒక సంతృప్తికరమైన సిద్ధాంతాన్ని పెంపొందించవలసిన అవసరాన్ని వారు గుర్తించారు ఈ సిద్ధాంతాలలో అత్యంత ముఖ్యమైనది అణు సిద్ధాంతం భారతీయ తాత్విక సాంప్రదాయంలో దానికిగల ప్రాధాన్యతను గురించి ఎంత చెప్పినా తక్కువే

అయితే దీంతోనే భావవాదులు మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే భారతీయ భావవాద మలి దశకు ప్రతినిధులు నిర్లిప్తంగా ఉండిపోలేదు తమ పూర్వీకులనుండి సంక్రమించిన భావాలతోనే ఆగిపోలేదు తమకు చేతనైన అన్ని పద్ధతులలోను వారు భావసంపదను పెంచుకోవడానికి ప్రయత్నంచేశారు ఇది ప్రధానంగా రెండు మార్గాలలో జరిగింది భావవాదాన్ని అభావం చేయడానికి ప్రత్యర్థులు ఏ ఏ సరికొత్త అంశాలను ముందుకు తెస్తున్నారో వాటిని వమ్ముచేయటం మొదటిది భావవాద దృక్పథాన్ని ప్రత్యక్షంగా సమర్థించుకునేందుకు నూతన అవకాశాలను అన్వేషించడం రెండవది అందుకోసం పాత వాదనలకన్నా మెరుగైన వాటిని తెచ్చి జతచేశారు భావవాదుల్లో మలి దశకు చెందినవారి ఈ అత్యుత్సాహం వల్లనే తత్వశాస్త్రంలో భావవాద దృక్పథాన్ని సమర్థించేందుకు సరికొత్త ఉమ్మడి అంశాలు చోటుచేసుకున్నాయి

వారి ప్రత్యర్థులు కూడా ఇదే పనిచేశారు ఎప్పటికప్పుడు చురుగ్గా వ్యవహరించారు భావవాదుల దాడిని తిప్పికొట్టేందుకు పటిష్టమైన పద్ధతులు అన్వేషించారు పాదార్థిక ప్రపంచ వాస్తవికతను, దాన్ని తెలుసుకోవడంలో మనకు గల సాధారణ మార్గాల చెల్లుబాటును సమర్థించడానికి మరింత మెరుగైన అంశాలను ముందుకు తెచ్చారు ఈవిధంగా భావవాదానికి దాని ప్రతిసిద్ధాంతానికి మధ్య వివాదం భారతీయ తత్వశాస్త్రంలో శతాబ్దాలపాటు కొనసాగుతూనే వచ్చింది అయితే ఈ వివాదంలో భావవాద వ్యతిరేకులందరూ అన్ని అంశాలపైనా పూర్తి ఏకాభిప్రాయం ప్రదర్శించలేదు

ఈ వివాదాన్ని భారతీయ తత్వశాస్త్రంలో మౌలిక వైరుధ్యంగా పరిగణించడానికి

గల కారణాలు తేలిగ్గానే అర్థమవుతాయి భారతీయ తత్వశాస్త్ర చరిత్రలో తత్వవేత్తలని చెప్పుకోదగినవారెవ్వరూ విస్మరించ లేని వివాదం ఇది భావవాదానికో దాని ప్రతిసిద్ధాంతానికో కట్టుబడని ప్రముఖ తత్వవేత్తలెవ్వరూ లేరు భారతీయ తత్వవేత్తకు సంబంధించినంతవరకూ భావవాదం సిద్ధాంతంగానో పూర్వపక్షంగానో ఉండితీరాలి అంతేకాక తత్వశాస్త్రంలో చర్చించబడిన అనేక సమస్యల-ముఖ్యంగా ఈనాటికి కూడా ప్రాధాన్యత నిలుపుకున్న సమస్యల మూలం ఈ వివాదంలోనే వేళ్ళూనుకున్నది అంటే జ్ఞాన స్వభావం, మూలాలు, సత్యానికి కొలబద్దలు, కలల స్వభావం, ఇంద్రియ భ్రాంతి, యాదృచ్ఛికత అర్థం, భాగాలకు మొత్తానికి గల సంబంధం వగైరా వగైరా సమస్యలన్న మాట పదార్థ స్వభావానికి సంబంధించిన ప్రాథమిక ప్రశ్నను వీటికి తోడుచేయాలి భావవాదానికి వ్యతిరేకులైనవారు దీనిలో మునిగి చాలా ముందుకు పోయి అణు సిద్ధాంతాన్ని పెంపొందించారు భావవాదుల సుదీర్ఘదాడినుండి నిరంతరం సమర్థించడంలో అది మరింత సంపన్నత్వం సంతరించుకుంది

## పాక్షిక వివాదాలు

పైన చెప్పిన దానంతటిని బట్టి భారతీయ తత్వశాస్త్రంలో చర్చించిన సమస్యలన్నీ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగాగానీ పాదార్థిక ప్రపంచ వాస్తవికతతో ముడివడివున్నవేనని భావించరాదు భావవాదం దాని ప్రతిసిద్ధాంతాల మధ్య జరిగిన వివాదంతో పెద్దగా గానీ ఏమాత్రం గానీ సంబంధంలేని పాక్షికవాదాలు కూడా అనేకం ఉన్నాయి అయితే ఇవన్నీ ద్వితీయ ప్రాధాన్యత కలిగిన సమస్యలే

ఉదాహరణకు కొన్ని సమస్యలు తీసుకుంటే సాంప్రదాయికంగా భారతీయ తాత్వికులు వాటిని ఎంతో ఉత్సాహంతో చర్చించినప్పటికీ మనకు సంబంధించినంతవరకూ అవి తాత్విక ప్రాధాన్యత లేనివే పైకి కనిపించేది ఎలావున్నా వాటి విలువ మతపరమైనదే అంతకన్నా హెచ్చు విలువ వుండేదని ఊహించడం కష్టం ఇందులో చాలా ముఖ్యమైన వాటిని కేవలం పిడివాద సమస్యలుగానే చూడాల్సివుంటుంది ఏమైనా కొన్ని మాత్రం భావవాదుల వారి ప్రత్యర్థుల రచనలలో ప్రముఖంగా కనిపిస్తాయి భారతీయ తాత్వికుడు మామూలుగా తన వాదానికి సంబంధించిన పేరుతో పిలిపించుకోవాలని కోరుకుంటాడు వేదాంతి లేక బౌద్ధుడు, జైనుడు, మీమాంసకుడు, సాంఖ్యవాది, నైయ్యాయికుడు వగైరా ఏదో ఒక పేరుతో పిలిపించుకుంటాడు ఒక ప్రత్యేక వాదాన్ని అనుసరించే తాత్వికుడుగా అతను ఇతర వాదాలను అనుసరించేవారితో ఎలాంటి ఉమ్మడి అంశాలను పంచుకోడు తనకు తాను ఒంటిగొట్టుగా గీత గీసుకుని వుండిపోతాడు

అయితే అదే సమయంలో మరో విషయం చాలా ఆసక్తి కరమైంది నిజంగా తాత్విక దృష్టి నుంచి పరిశీలిస్తే తమ వర్గం వాదానికి కూడావారు నామకార్థపు ప్రాధాన్యతకు మించి ఇవ్వరు అనేక తీవ్రమైన తాత్విక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చినప్పుడు వారు

మామూలుగా తాము అనుసరించే వాదం గీతల నుంచీ తేలికగా బయటపడతారు తమ వ్యతిరేక వాదాలకు చెందిన ఆలోచనాపరులతో తాత్విక ఐక్య సంఘటనలు నిర్మిస్తారు ఉదాహరణకు అద్వైత వేదాంతులకు తదుపరి బౌద్ధులుగా పేరుపొందిన మహాయానులతో ఎలాంటి నిమిత్తం లేదు కనీసం సంభాషణకుకూడా అవకాశం లేదు అయితే భావవాదానికి మద్దతుగా తీవ్రమైన తాత్విక సమర్థన చేసుకోవలసి వచ్చినప్పుడు అద్వైత వేదాంతులు మహాయాన బౌద్ధుల భావాలను తేలికగా ఎరువు తెచ్చుకుంటారు అదే విధంగా మహాయాన బౌద్ధులు మామూలుగా శతృశాస్త్రాలుగా భావించే ఉపనిషత్తులను నిస్సంకోచంగా ఉపయోగించుకుంటారు వేదాంత వాదులకు బౌద్ధులకు మధ్యగల తగాదాను మాత్రమే దృష్టిలో పెట్టుకొని దారి తప్పితే ఈ తాత్విక సౌహార్ధతను మనం గుర్తించలేము

భావవాద వ్యతిరేకులకు కూడా ఇది వర్తిస్తుంది జైనులు, మీమాంసకులు, న్యాయవైశేషికులు వంటి పేర్లతో పిలిపించుకోవాలని వారు చాలా ఉబలాటపడతారు ఈ తాత్వికులు భావవాద ఖండనలో మాత్రం పరస్పరం అత్యంత సన్నిహితంగా పనిచేస్తారు తమ తాత్విక స్ఫూర్తికి ఏ విధంగానూ తీవ్రమైన భంగం కలగకుండానే ఇతరుల రచనలలోని భాగాలను తెచ్చి తేలికగా కలుపుకుంటారు అంటే దీనర్థం జైనులు, మీమాంసకులు కూడా న్యాయవైశేషికుల వలే భావవాద ప్రతిసిద్ధాంతానికి ప్రతినిధులు అని కాదు అయితే ఎన్ని పిడివాదాలున్నప్పటికీ ఈ తాత్వికుల మధ్య ఎంతో సారూప్యత వున్నదని మాత్రం దీన్ని బట్టి గ్రహించాల్సి వుంటుంది

## ఇతర వివాదాలు

పాక్షిక వివాదాలను ప్రక్కన పెట్టినా ఖచ్చితమైన సైద్ధాంతిక ప్రాధాన్యత గల అనేక వివాదాలు వున్నాయి ఏమైనా వాటిలో అనేకం భావవాద పరిధిలోకి వచ్చేవి లేదా దాని ప్రతిసిద్ధాంతానికి చెందినవి మాత్రమే ఇందుకు రెండు ఉదాహరణలు చూడవచ్చు

దక్షిణ భారతానికి చెందిన బుద్ధ పాలితుడు, భవ్యుడు అనే ఇద్దరు తాత్వికుల మధ్య దీర్ఘకాలం పాటు సాగిన వివాదాన్ని గురించి మనం చదువుతాము శుద్ధ ఆత్మ ఒక్కటే వాస్తవమని, మారిపోయే వైవిధ్య భరితమైన ప్రపంచం పూర్తిగా భ్రాంతి అని వారు ఉభయులు గట్టిగా భావించినవారే కానీ దీన్ని ఎలా నిరూపించాలన్న దానిపై వారు తీవ్రంగా విభేదించారు ప్రాచీన గ్రీసులోని జెనో వలె బుద్ధ పాలితుడు ప్రపంచ వాస్తవికతకు సంబంధించిన ఏ పోకడలోనైనా అత్యంత తీవ్రమైన అస్థిమితత్వం ఉంటుందని అంటాడు అయితే భవ్యుడు 'స్వతంత్రమైన ఆధారాలు' అన్నవాటితో ఇదే విషయాన్ని మరో విధంగా నిరూపించటానికి ప్రయత్నిస్తాడు బుద్ధ పాలితుడి అనుయాయులు దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తారు దీని ప్రకారం తర్కం యొక్క చెల్లుబాటును ఆమోదించినట్టవుతుందని వారి వాదన ఖచ్చితమైన భావవాదులుగా తాము దానికి ఒప్పుకోరాదంటారు బుద్ధపాలితుడి శిష్యుడైన చంద్రకీర్తి ఈ విషయమై భవ్యుడికి వ్యతిరేకంగా పెద్ద దుమారం లేవనెత్తాడు

అతనే తమ ప్రధాన తాత్విక ప్రత్యర్థి అన్నట్లు వ్యవహరించాడు

భావవాద వ్యతిరేకులైన వారి మధ్య అంతర్గత వివాదాలకు సంబంధించి మనం ఒక ఉదాహరణ చూడవచ్చు కుండను కాల్చడంలో ఇమిడి వున్న రసాయన మార్పుపై బాగా పురోగమించిన అణువాదుల మధ్య తేడాలు తలెత్తాయి మొదట నల్లగా ఉండే కుండ ఆవంలో కాల్చినప్పుడు ఎర్రబడటం ఎలా జరుగుతుంది అణు సిద్ధాంతకారుడు దీన్ని ఎలా వివరించాలి? కుండలోని ప్రతి మట్టి కణంపైనా మంట ప్రభావం పడి అవి ఎర్రబడతాయని ఒక వర్గం వాదిస్తుంది ప్రతి అణువు ఎర్రగా మారడంతో మొత్తం కుండ ఎర్రబడిందని వీరు అంటారు కానీ మరో సిద్ధాంతం ప్రకారం మొత్తంగా కుండ ఒక నూతన గుణాన్ని సంతరించుకుంది అదే సమయంలో దానిలోని పదార్థం మొత్తం పరివర్తనాక్రమంలో ఒకే విధంగా ఉంటుంది ఈ వివాదంలో ఇమిడి వున్న శాస్త్రీయ పరమైన అంశం ఎంతైనప్పటికీ అది ఒక వివాదమే భావవాద వ్యతిరేకుల మధ్య తలెత్తిన ఈ అంతర్గత వివాదంలో వైశేషికులు, నైయ్యాయికులు మాత్రమే పాల్గొన్నారు

భారతీయ తత్వ శాస్త్రంలో మరికొన్ని అత్యున్నత స్థాయికి చెందిన వివాదాలుకూడా వున్నాయి వాటిలో కొంత మంది తాత్వికులు మాత్రమే ప్రత్యేక ఆసక్తితో పాల్గొన్నారు నిర్ధారణలు చేసే క్రమం తీరుతెన్నులకు సంబంధించి, తార్కికమైన పొరపాట్లకు, నిర్వచ నాలకు సంబంధించి ఈ వివాదాలు సాగాయి ఈ సమస్యల పట్ల ప్రాథమికంగా ఆసక్తి కలవారు నిజంగానే చాలాలోతుల్లోకి వెళ్ళారు అయితే భారతీయ తాత్వికులందరూ ఇలాంటి సమస్యల పట్ల సమానమైన ఆసక్తి ప్రదర్శించలేదు అందుకే వాటి ప్రభావం పరిమితం

ఈ వివాదాలన్నీ వున్నాయనడంలో సందేహంలేదు అయితే ఇందులో ఏవీ ప్రాచీన మధ్య భారతంలో సాగిన మౌలిక తాత్విక పోరాటానికి ప్రతీకలు కావు అందువల్లనే అలాంటి వివాదాలు వున్నప్పటికీ ఏ తాత్వికుడూ ఉదాసీనత చూపకుండా భాగం పంచుకున్నది ఇతర అనేక తాత్విక వివాదాలకు భూమిక అయినది ఏదన్నా వుందంటే అది భావవాదానికి దాని ప్రతిసిద్ధాంతానికీ మధ్య సాగిన సంఘర్షణే అది ఈనాటికీ కూడా ప్రాధాన్యత కలిగే వున్నది.

భారతీయ తత్వశాస్త్ర రచనల మొదట్లో చాలా దుర్లభంగా కనిపించినప్పటికీ ఈ విధంగా మనం పరిచయానికి సూటిగా అర్థం చేసుకోవడానికి తగిన ప్రారంభ సూత్రాలు తెలుసుకున్నాము భారతీయ తత్వవేత్తలు అర్థం చేసుకున్నట్లుగానే సిద్ధాంతం, ప్రతిసిద్ధాంతాలమధ్య ఘర్షణలు జరగకుండా తత్వశాస్త్రంలేదు ఎందుకంటే చారిత్రికంగా చెప్పాలంటే భారతీయ తత్వశాస్త్రంలో మౌలిక వైరుధ్యం భావవాదానికి దాని ప్రతిసిద్ధాంతానికి మధ్యవున్నదే ఈ వైరుధ్యాన్ని చర్చించడం ద్వారా మనం తత్వశాస్త్ర పరిచయాన్ని ముందుకు కొనిపోగలుగుతాము

భారతీయ భావవాద క్రమాన్ని ఈ విధంగా క్రోడీకరించవచ్చు ఉపనిషత్తులలో నిక్షిప్తమైన భావ ప్రవంతిలో ప్రధాన ధోరణిగా అది మొదట ప్రత్యక్షమైంది తరువాత మహాయాన బౌద్ధం అనబడే దానికి ప్రతినిధులుగా చెప్పుకున్న శూన్యవాదులు, విజ్ఞాన

వాదులు దాన్ని చేపట్టారు  మాయా వాదులుగా కూడా పిలవబడిన అద్వైత వేదాంతులు అంతిమంగా దాన్ని గట్టిపరచారు  వీరు ఖచ్చితంగా ఉపనిషత్తులనే అనుసరించేవారుగా తమను గుర్తించాలని కోరుకున్నారు  అయితే వాస్తవంలో వారు ఉపనిషత్తులలోని భావవాదానికి బాగా బలం చేకూర్చేందుకే తమ శక్తిని ధారపోశారు  అప్పటికే మహాయాన బౌద్ధం దాన్ని కొంత విస్తరింప చేసింది

మహాయాన బౌద్ధులు అద్వైత వేదాంతుల పిడివాద పోకడల వల్ల భారతీయ భావవాద క్రమం కొంత వరకు తెరమరుగైంది  సాంప్రదాయిక తాత్వికుల ఒంటెత్తువాద ధోరణులను విమర్శనాత్మకంగా దృష్టిలో వుంచుకుంటూనే మనం దానికి సంబంధించిన చరిత్రను క్రింది పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు

## భారతీయ భావవాదం - వివరణాత్మక విశ్లేషణ

ఉపనిషత్తులు

↓

యాజ్ఞవల్క్య - సనత్ కుమార - ప్రజాపతి - ఇంద్రాదులు

↓

మహాయాన

| | |
|---|---|
| మాధ్యమిక | యోగాచార |
| (శూన్యవాద) | (విజ్ఞానవాద) |
| నాగార్జున | మైత్రేయనాథ |
| ఆర్యదేవ | అసంగ |
| బుద్ధపాలిత | వసుబంధు |
| చంద్రకీర్తి | దిజ్ఞాగ |
| శాంతిదేవ | ధర్మకీర్తి |

↓

శాంత రక్షిత

కమలాశీల

↓

అద్వైత వేదాంత

గౌడపాద

శంకర

శ్రీహర్ష

సిద్ధాంతం - ఆచరణలను, వివేకాన్ని - కార్యాచరణను సంపూర్ణంగా విడగొట్టాల్సిన అవసరాన్ని భారతీయ భావవాదులు చాలా గట్టిగా గుర్తించారు అదే తమ భావవాద దృక్పధానికి తుది సమర్థన ఇందుకోసం వారు కార్యాచరణ దృష్టి నుంచి వాస్తవం అన్న ఒక సవివరమైన సిద్ధాంతాన్నే రూపొందించారు వాస్తవానికి అది బూటకపు సత్యం మాత్రమే ఈ సత్యం సత్యమే కాదని నిరూపించడానికి భావవాద వ్యతిరేకులైన వారు ఏవిధంగా కృషి చేశారో మనం తెలుసుకోవాలి కేవలం సామాన్య ప్రజలను మోసం చేసేందుకు వుద్దేశించిన మాటల గారడి అని వారు వెల్లడించారు సత్యాన్ని నిర్ధారించడానికి ఆచరణే కొలబద్ధ అనివారిలో కొందరు నొక్కిచెప్పారు భావవాదులు చెప్పిన *"సంవృత సత్యం"* లేక *"వ్యావహారిక సత్యం"* అనే సిద్ధాంతం పై విభజనను మరింత స్పష్టపరిచే ఒక మార్గం మాత్రమే

అయితే భారతదేశంలో లభించే తాత్విక సామగ్రి నుంచిఇందుకు సంబంధించిన మరికొంత సమాచారం మనకు దొరుకుతుంది సిద్ధాంతానికి ఆచరణకు మధ్య పూర్తి విభజన తీసుకు రావలసిన అవసరం కొన్ని చారిత్రక పరిస్థితుల మధ్య ముందుకొచ్చింది అదే లేకపోతే భావవాద తాత్వికతకు అంతిమ సమర్థన లభించదు సిద్ధాంతానికీ, ఆచరణకు మధ్య , బౌద్ధిక శ్రమకు భౌతిక శ్రమకు మధ్యసమాజంలో ఏర్పడుతున్న విభజనకు సైద్ధాంతిక రంగంలో ప్రతిబింబమే ఈ విభజన మరో విధంగా చెప్పాలంటే భావవాద దృక్పధం యాదృచ్ఛికంగా భారతీయ ఆలోచనాపరుల్లో కొందరి తలకెక్కలేదు భౌతిక పరిస్థితులే దాన్ని సృష్టించాయి మనకు లభించే భారతీయ తాత్విక సమాచారం ఈ పరిస్థితులను గురించిన మరిన్ని వివరాలను అందచేసేదిగా వుండటం గొప్ప విషయం

# II

# భారతీయ భావవాద మూలాధారాలు

ఉపనిషత్తులలో నిక్షిప్తమైన ఊహాగాన ధోరణి భారతీయ భావవాదానికి నిరంతరాయమైన మూలాధారంగా పేర్కొనవచ్చు శంకరుడు, ఆయన అనుయాయులు మనలను నమ్మమంటున్నట్లుగా ఉపనిషత్తులలో ఉన్న ధోరణి అదొక్కటే కాదు, అయితే ప్రబలంగా ఉన్న ధోరణి మాత్రం అదే తదుపరికాలంలో చాలా ప్రభావం చూపగల తాత్విక సిద్ధాంతంగా రూపొందడానికి కావలసిన బీజాలు దానిలోనే ఉన్నాయి ప్రధానంగా ఈ ఉపనిషత్ పాఠాల ఆధారంగా మనం భారతీయ భావవాద మూలాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి

## ఉపనిషత్తులా లేక వేదాల ముగింపులా?

ఉపనిషత్తులు వేదాల చివరిభాగాలన్న నమ్మకం సాంప్రదాయకంగా ఉన్నది "వేద" అన్న పదానికి జ్ఞానం అని అర్థం అయితే వేద ఛాందసాన్ని అనుసరించేవారు అది పైనుండి ప్రత్యక్షంగా వెల్లడైన తిరుగులేని జ్ఞానమని భావిస్తారు నిర్దిష్టంగా చూసినప్పుడు వేదమనే మాట ఆర్యులు(కులీనులు)గా తమను తాము చెప్పుకున్న ప్రజల సాహిత్య సృష్టిగా కనిపిస్తుంది సంచార పశుపోషక జాతిగా వారు ఉత్తరభారతదేశంలోకి వలసవచ్చారన్న అభిప్రాయం సాధారణంగా వున్నది వారికి రాత తెలియదుకాని బ్రహ్మాండమైన సాహిత్య ప్రతిభ ఉండేది విచిత్రమేమంటే దానితోపాటే వారికి యుద్ధ కళలో కూడా గొప్ప నైపుణ్యముండేది వారు తమ ప్రత్యేక గుర్తింపును క్రమంగా కోల్పోయి భారతదేశమంతటా ఎలా వ్యాపించారు, స్థిరపడ్డారు, అనాగరికతనుండి నాగరికతవైపు ఎలా పయనించారు అన్నది వేరే కథ వారి సైద్ధాంతిక పరిణతికి సంబంధించినంతవరకు మాత్రమే ఇక్కడ మనకు దానిపట్ల ఆసక్తి

ఈ సారస్వతంలో మొదట వెలువడిన భాగాలు పాటలు, రుక్కులు, సూక్తాలుగా వున్నాయి వాటిని కూర్చి అనేక తరాల పర్యంతం కేవలం మౌఖికంగా పరంపరగా అందజేయడం జరిగింది ఇందుకు ఆశ్చర్యకరమైన అద్భుత జ్ఞాపకశక్తి అవసరమైంది అందుకే వాటికి శ్రుతులు అన్న పేరు వచ్చింది అంటే విన్నవి అని అర్థం మనకు అవి బృహత్తరమైన సంకలనాలు(సంహితలు)గా లభ్యమయ్యాయి ఆ రూపానికి చెప్పుకోదగినంత ప్రాచీనత ఉన్నది ఈ సంకలనాలలో తొట్టతొలిది అత్యంత ప్రాథమికమైంది రుగ్వేదం సామవేదం, యజుర్వేదం, అథర్వవేదం అన్న మరో మూడుకూడా వున్నాయి

## చైతన్యానికి విముక్తి

వేద సారస్వత పరిమాణం దిగ్భ్రాంతి కలిగిస్తుంది అదంతా పూర్తి కావడానికి తప్పక వెయ్యి సంవత్సరాలకుపైగా పట్టివుంటుంది అయినా గమనించాల్సిన విషయమేమంటే ఈ అపార సారస్వతంలో అంతర్లీనంగా ఒకే విధమైన కొనసాగింపు కనిపిస్తుంది ఆవిధంగా అది తరతరాల వేదకాల ప్రజల పాదార్థిక అభివృద్ధిని అర్థం చేసుకునేందుకు అవకాశం కలిగిస్తుంది మనిషి శ్రమతో కనీస మనుగడకు అవసరమైనదానికన్నా అధికంగా ఉత్పత్తి చేసే సామర్థ్యం సంతరించుకునే దశకు వారు ఎలా ఎదిగారో బోధపడుతుంది అధిక ఉత్పత్తి సాధ్యమైన తర్వాత ఆ తెగ సభ్యుల్లో ఒక భాగం కేవలం శారీరక శ్రమపైనే ఆధారపడి బ్రతకాల్సిన అవసరం లేకుండా పోయింది తెగలోని మరో భాగం ఉత్పత్తి చేసే మిగులుపై ఆధారపడి ఊహాగానాలలో నిపుణత సాధించేందుకు కావలసిన తీరిక దానికి లభించింది తమ పూర్వీకులవలె లేదా తొలినాటి వేద కవులవలె వారి ఆలోచనలు, భావాలు భౌతికపరమైన మనుగడ సమస్యలకే పరిమితం కాలేదు ఊహాజనితమైన ఉపరితల కట్టడాన్ని నిర్మించేందుకు వారు ముందుకు సాగిపోయారు

దీనంతటివల్ల కలిగిన ప్రయోజనం నిస్సందేహంగా చాలా కీలక ప్రాధాన్యత కలిగివుంది హేతుశీలతకు గల శక్తికి లేదా చైతన్యానికి గల సృజనాత్మక పాత్రను గమనించడం, గుర్తించడం జరిగింది మనుగడకు సంబంధించిన సమస్యలనుండి చైతన్యం విముక్తి కాకపోతే సంపూర్ణమైన అర్థంలో సైద్ధాంతిక కృషి ప్రారంభంకాజాలదు ప్రాథమికమైన కోర్కెల పరిపూర్తిని ఊహించుకోవడంతోనే ఉత్తేజపడిన కవులు, రుషులు మనకు రుగ్వేదంలో కనిపిస్తారు ప్రకృతితో జరిపే పోరాట సమస్యల్లోనే వారి చైతన్యం మునిగిపోయింది తత్వచింతన చేయడానికి వారికి తీరిక చిక్కలేదు విస్తారమైన బ్రాహ్మణ సారస్వతంలో మనకు నిజంగా ఒక పనిలేని వర్గం రూపొందటం కనిపిస్తుంది అయితే అది రాజుల, వారి సైద్ధాంతిక సమర్థకుల రాజకీయాధికారాన్ని సుస్థిరపరచే పనిలో మునిగిపోయింది రాజకీయాల అన్వయంతో లేక భయంతో మనిషి అదుపు అనే పద్ధతిలో అది ఈ పని చేసింది తీరికగల వర్గపు చైతన్యం సాపేక్షంగా విముక్తి పొందినప్పటికీ అది ఈ పనిలో మునిగిపోయింది ఈ పొరాల్లో కనిపించే ఇటువంటి మేధా వాతావరణం తాత్వికులు ముందుకు రావడాన్ని ప్రోత్సహించేదికాదు బ్రాహ్మణాల్లో మనకు కనిపించే పురోహితులు

స్మశానవాటికల్లో పురాతన క్రతువుల్లో కాట్లాడుకోవడం కనిపిస్తుంది తప్ప తత్వవేత్త కనిపించడు ఉపనిషత్తుల్లోనే తాత్వికుడి రూపం తొలిగా గోచరిస్తుంది పనిలేని వర్గం తన అధికారాన్ని పూర్తిగా స్థిరపరచుకొని నిర్వికారంగా, నిశ్చలంగా ఉండగల పరిస్థితి అప్పటికిగాని సాధ్యంకాలేదు ఉపనిషత్తులలోని తొలి తాత్వికులు అపారమైన తాత్విక ప్రాధాన్యతగల సమస్యలను లేవనెత్తుతారు వాటికి సమాధానం కోసం మనస్ఫూర్తిగా కృషిచేస్తారు

ఈ ప్రగతి చాలా గొప్పదైనప్పటికీ అదేసమయంలో ఆలోచనల వికాసానికి చాలా పెద్ద అపాయం కూడా తెచ్చిపెట్టింది ఉపనిషత్ ఆదర్శ సమాజంలో మరీముఖ్యంగా శారీరక శ్రమ చేసేవారికి ఎలాంటి గౌరవం, సదుపాయాలు ఉండరాదని తలపోసినవారు ఇందుకు ముఖ్య కారకులయ్యారు ప్రకృతితో ప్రత్యక్షంగా వ్యవహరించే పరికరాలు, నైపుణ్యం నిజమైన ఉత్పత్తిదారులకు చెందుతాయి కాని వారు తెరమరుగైపోతారు వారితోపాటే పెరిగే వారి అనుభవం, అవగాహన కూడా వెనక్కుపోతాయి వీటన్నింటితో నిమిత్తంలేని తాత్విక కృషి ప్రకృతితో వ్యవహరించాలన్న స్పృహను చాలా తేలిగ్గానే పోగొట్టుకుంటుంది ఫలితమేమంటే భౌతికశాస్త్రాలపట్ల ఘోరమైన తృణీకారదృష్టి ఏర్పడుతుంది విచిత్రమైన రీతిలో తమలోకి తాము చూసుకునే చైతన్యం ఒత్తిడివల్ల ఒక భ్రాంతి ఏర్పడుతుంది విజ్ఞానమన్నది ఇంకెంతమాత్రం బాహ్యవస్తువులకు సంబంధించిన విజ్ఞానంగా వుండదు అది వ్యక్తికి సంబంధించిన విజ్ఞానమే అవుతుంది కేవలం అతిశయం లేదా శుద్ధ ఆత్మ అవుతుంది ఉపనిషత్‌కారులు దాన్ని *"ఆత్మరతిరాత్మక్రీడ"* అన్నారు తమను తాను మోహించి, తమతో తామే క్రీడించే పద్ధతి అది అత్యంత తీవ్రస్థాయి అంతరావలోకనంవల్ల మహత్వం సిద్ధిస్తుందని చెప్పబడింది స్వీయాతిశయం, ఒక మహత్తర శక్తిని గురించిన భ్రమ ఫలితమే అది ఈ అతిశయమే వాస్తవాన్ని శాసించడానికి ప్రయత్నిస్తుంది అదొక్కటే వాస్తవమని గుర్తించమంటుంది "నేనే అంతిమ వాస్తవం" అని ఉపనిషత్ భావవాది ప్రకటిస్తాడు దీని ఫలితమేమంటే తాత్వికుడు జీవిస్తున్న పాదార్థిక ప్రపంచం పట్లనే దారుణమైన తృణీకార దృష్టి ఏర్పడుతుంది

ఇదంతా మనస్తత్వ శాస్త్రవేత్తల పదజాలంలో చేస్తున్న వర్ణన అయితే మనం ఉపనిషత్ భావవాదుల మనస్తత్వాన్ని గ్రహించడానికి ప్రయత్నిస్తున్నామని కాదు వారు జీవించిన నూతన ప్రపంచం వారి నూతన ప్రాపంచిక దృక్పథాన్ని ఎలా ప్రభావితం చేసింది అని పరిశీలించడమే మనకు వారి మేధాచరిత్రపట్ల ఆసక్తి కలగడానికి కారణం వారి రాజకీయ తాత్వికత ప్రకారం ప్రకృతితో ప్రత్యక్ష సంబంధం కేవలం బలవంతాన చాకిరీ చేసే శూద్రులకు మాత్రమే సంబంధించినది వారితో సంపర్కమే మైలపరుస్తుంది ప్రకృతితో నేరుగా వ్యవహరించే దృష్టిని విడనాడినందుకు తాత్వికుడు ఎంతో గర్వపడతాడు అందుకే దాని వాస్తవికతను గుర్తించాల్సిన అవసరం అతనికి వుండదు

ఆవిధంగా ప్రకృతితో క్రియాశీల సంబంధం తెంచుకున్న తాత్వికుడి చైతన్యం కల్పనలవైపు మరలుతుంది అంతకంతకూ ఉన్నతంగా ఎదగగలనని, కేవలం ఆలోచన మాత్రమే మిగిలి ఆలోచనకు సంబంధించిన వస్తువులు అదృశ్యమయ్యే సుదూర పరిస్థితులలోకి ప్రవేశిస్తామని తలపోస్తుంది శుద్ధ హేతువుపట్ల ఆరాధనగా ఇది దారితీస్తుంది ఇక్కడ హేతువు కేవలం భ్రాంతికి రూపం మాత్రమే నిర్దిష్ట జీవితంనుండి దూరమైన చైతన్యం ఒక విధంగా అనారోగ్యకర చైతన్యమౌతుంది అది ఒక పదార్థానికి సంబంధించి చైతన్యంకాదు కేవలం ఒక పదార్థం వంటి చైతన్యం శుద్ధ చైతన్యం, కేవల చైతన్యం ప్రకృతితో చురుగ్గా కలసి పనిచేసే నిజమైన స్త్రీపురుషులు ఆ ప్రభావంతో అంతకంతకూ మెరుగుపరచుకునే చైతన్యంవంటిది కాదు ఇప్పుడు ఇక్కడ చైతన్యమన్నదాన్ని దివ్యమైన ఒక అఖండ భావంగా చూడటం జరుగుతున్నది రోజువారీ ఆలోచనలకు అందని, సాధారణ పరిభాషలో వర్ణించశక్యంగాని దినుసుగా అది పరిగణించబడుతుంది

చైతన్యాన్ని విముక్తి చేయడంవల్ల ఇలాంటి గతి పట్టడం అనివార్యం మాత్రం కాదు ఈరకమైన ఆలోచనల్లో పాలుపంచుకోనివారు కూడా ఉపనిషత్కాలపు భారతంలో ఉన్నారని మనం ముందుముందు తెలుసుకుంటాం చైతన్యం దివ్యమైనదనే కోణంనుండి గాక మరింత మెరుగైన శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలని చూసినవారుకూడా ఉన్నారు వారే భారతీయ తత్వశాస్త్రంలో శాస్త్రీయ సంప్రదాయానికి ఆద్యులు వారి చైతన్యం భావవాద సహచరులవలె శిథిల చైతన్యంగా మారిపోకుండా ఎలా పరిరక్షించబడిందనే విషయాన్ని మనం పరిశోధించాల్సివుంటుంది

ఏమైనా ఉపనిషత్ భారతంలో వారి ప్రతిష్ట క్షీణ దశ పట్టింది. ఆ యుగంలో సానుకూల శాస్త్రంగా పరిగణించదగిన ప్రతి అంశంపట్ల తృణీకార దృష్టి పెరిగిపోయింది వాస్తవ జీవితంతో పూర్తిగా తెగతెంపులు చేసుకుని జీవితాన్ని వ్యతిరేకిస్తూ దాన్ని తక్కువ చేసి చూపే తరహా తత్వవేత్తల ప్రతిష్ట నూతనంగా పెంపొందుతున్న మేధా వాతావరణంలో గొప్ప ఊపందుకుంది

యాజ్ఞవల్క్యుడు అలాంటి ఒక గొప్ప తాత్వికుడు వాస్తవమన్నది కేవలం చైతన్య సముదాయమే *(విజ్ఞాన ఘన)*నని ఆయన ప్రకటిస్తారు విజ్ఞానసాధనకు ఉపయోగించే సాధారణ జ్ఞానేంద్రియాలతో వాటిని గ్రహించలేము మామూలు భాషలో వర్ణించనూలేము "ఇది అదికాదు" "ఇది అదికాదు" (నేతి,నేతి) అని మాత్రమే మనం చెప్పగలము కలలుకంటూ కలలు రాని నిద్రలోకి జారిపోతూ వ్యక్తి క్రమక్రమంగా భౌతిక ప్రపంచ శృంఖలాలనుండి విముక్తుడౌతాడు ఆవిధంగా ఈ వాస్తవాన్ని అనుభూతి చెందుతాడు

భావవాద దృక్పథం భారతీయ తత్వచింతనను కమ్ముకున్న తీరు ఇది అయితే మనమిప్పుడు పరిశీలిస్తున్నట్లుగా ఇది తొలినాటి వేదకవుల అంచులకైనారాని విషయం ఇందుకు కారణం సాపేక్షంగా వారు అజ్ఞానులై వుండటమో, తాత్విక ఆలోచనా ప్రక్రియ

తెలియకపోవటమో కాదు  ప్రకృతితో ప్రత్యక్షమైన క్రియాశీల సంబంధం కలిగినందునే వారు అలాంటి శుద్ధ చైతన్య భ్రమలకు లోను కాలేకపోయారు

ఈవిధంగా సైద్ధాంతిక అభివృద్ధి సాధారణ చరిత్రను అర్థం చేసుకోవడానికి వేద సారస్వతం గొప్పగా ఉపయోగపడుతుంది  అంతర్లీనమైన కొనసాగింపుతో సాగిన విస్తార సారస్వతమది  దాని రూపకల్పనలో కాల్పనిక చైతన్యం వుండటమేగాక క్రమానుగతంగా శుద్ధ చైతన్య ఆరాధనగా తారాస్థాయికి చేరడంలోనూ ఇది కనిపిస్తుంది  భావవాద దృక్పథం తత్ఫలితమే

## భావవాది పాదార్థిక అవసరాలు

మనం ఇదివరకే చూసినట్లుగా ఆ యుగంలో నిగూఢ జ్ఞానానికి సహజ సిద్ధమైన అద్భుత శక్తి ఉన్నట్లు ఊహించబడింది  ఆ శక్తి ఎంత మహత్తరమయిందంటే  పశువులు, సంతానం, కీర్తి ప్రతిష్ఠలు వంటి ప్రాపంచిక విషయాలు వేటినైనా ప్రసాదించేందుకు వాగ్దానం  చేయ గలుగుతుంది  ఇంకే విధంగానూ సాధ్యంగాని విషయాలు కూడా ఆ శక్తి వల్ల సిద్ధిస్తాయి

ఉపనిషత్తుల నుంచి తరచూ ఉటంకించబడే ఒక గాథ ప్రకారం యాజ్ఞవల్క్యుడు వానప్రస్థం స్వీకరించడానికి సిద్ధమైనప్పుడు తన ఇద్దరు భార్యలు కాత్యాయిని, మైత్రేయిలకు ఆస్తి పంపకం తలపెడతాడు

*"ఆర్యా, ఇప్పుడు ఈ మొత్తం భూమండలం నాదైన సంపదతో నిండిపోతే నేను చిరస్థాయి సాధించగలనా"* అని  మైత్రేయి ప్రశ్నిస్తుంది

*"లేదు  ధనవంతుల జీవితంలాగే నీ జీవితం కూడా వుంటుంది  ఇక అమరత్వం విషయానికి కొస్తే అది సంపదల ద్వారా సిద్ధించదు"* అని యాజ్ఞవల్క్యుడు బదులు చెపుతాడు

*"అలాంటప్పుడు నాకు అమరత్వం కలిగించని దాన్ని  నేనేమి చేసుకోగలను  దాన్ని సిద్ధింపచేసే అంశమేది మహానుభావా దయచేసి నాకు సెలవివ్వండి"* అని మైత్రేయి అడుగుతుంది

దానితో ఆ తాత్వికుడు సంతృప్తుడై తన నిగూఢ జ్ఞానాన్ని భార్యకు  ఉపదేశిస్తాడు [1]

ఉపనిషత్ తత్వవేత్తల నూతన దృక్పథాన్ని తెలియజేయటం కోసం ఈ కథ ప్రాధాన్యతను తరచు ప్రస్తావించడం జరుగుతుంటుంది  అలా చేయడం సరైందే  ఆ కాలానికి సంబంధించిన నిగూఢ జ్ఞానం [2] అమరత్వం సంతరింపజేస్తుందని చెప్పే భాగాలు ఉపనిషత్తులలో ఇంకా అనేకం వున్నాయి  అయితే యాజ్ఞవల్క్యుని కథను పూర్తిగా అర్థం చేసుకోవలసి వుటుంది

ఇక్కడ అమరత్వం అనడానికి "అమృత" అనేమాట ఉపయోగించారు  ఋగ్వేదపు తొలి కవులకు ఈ మాట తెలుసుననడంలో సందేహంలేదు  అయితే *సోమరసాన్ని* [3] పానం చేయడంవల్ల కలిగే పారవశ్యాన్ని అభివర్ణించడానికి వారు ఆ పదాన్ని ఉపయోగించేవారు కానినిగూఢజ్ఞానంవల్ల అమరత్వం సాధించడం అన్నది వారికి ఏనాడూ స్ఫురించని విషయం

---

1 బ్రహ్మోపనిషత్తు     2 ఇ షోపనిషత్తు     3 ఋగ్వేదం

అలాగే ఉపనిషత్తులలో పేర్కొనబడిన అర్థంలో ఆస్తి పంపకం కూడా వారికి తెలియదు ఇందుకు కారణాలు తేలిగ్గానే గ్రహించవచ్చు యాజ్ఞవల్క్యునికున్నట్లు వారెవరికి ఆస్తులు లేవు [1]అందువల్లనే నిగూఢ జ్ఞానారాధన పెంపొందించుకొనేందుకు అవకాశం కలుగలేదు

ఈ తాత్వికుని ఆస్తి ఎక్కడ నుంచి వచ్చిందనే విషయాన్ని మనమిప్పుడు చూడాలి ఎలా వచ్చినా సరే ఆస్తి వుండటం వల్ల అతను శారీరక శ్రమ చేయవలసిన అవసరం తప్పింది లేకపోతే అతను శుద్ధ చైతన్యం పెంపొందించుకోవడంలో ఎలా నిమగ్నం కాగలడు? అందుకు తప్పనిసరిగా అవసరమైంది తీరిక భారతీయ భావవాద దృక్పథం తన చరిత్ర పొడుగునా ఆచరణ వల్ల కలిగే జ్ఞానాన్ని తృణీకార భావంతో చూడడంపైనే ఆధారపడింది యథార్థ జీవిత ప్రాథమిక బాధ్యతలనుంచి తాత్వికుడు ఏమేరకు తప్పించుకోగలిగితే ఆ మేరకు అది సాధ్యపడుతుంది క్లుప్తంగా చెప్పాలంటే అతను తీరికగల వర్గంగా బ్రతకడానికి అవకాశం వున్న మేరకు ఈ ధోరణి పెంపొందుతుంది

తొలి వేద కవులు జీవించిన భౌతిక పరిస్థితులు ఇందుకు భిన్నమైనవి అందుకే వారికి ఈ అవకాశం లేకపోయింది ప్రకృతిపై వారి అదుపు సాపేక్షంగా చూస్తే చాలా నామమాత్రమైంది అందువల్ల తమ మనుగడ కొనసాగింపుకు సంబంధించిన సమస్యలలో వారు కూరుకుపోవడం అనివార్యమైంది ప్రధానంగా సమిష్టి జీవితం ద్వారా ప్రాచీన సమాజంలో మనుగడ సమస్య పరిష్కరించబడింది ఒక తెగలో ఎంపిక చేయబడిన కొద్ది మంది కేవలం కల్పనలు అల్లడంపైనే కేంద్రీకరించడం ఆనాడు భౌతికంగా అసాధ్యమైన విషయం ఎందుకంటే అలాంటి వారి పాదార్థిక అవసరాలు అందుకోవడానికి కావలసిన అదనపు ఉత్పత్తి చేయగల స్థితికి సమాజం చేరుకోలేదు ఋగ్వేదపు తొలి భాగాలలో గుంపు సమిష్టి శ్రమను కీర్తించే అంశాలు అసంఖ్యాకంగా కానవస్తాయి

కీ॥పూ॥ 8-7 శతాబ్దాల నాటి గంగా-సింధూ మైదానంలో నూతనంగా పెంపొందిన రాజ్యాలలో పరిస్థితులు భిన్నంగా మారాయి అదే ఉపనిషత్కాలపు భారతం ప్రధానంగా కొంతవరకు ఇనుప పరికరాలు రావడంవల్ల పశు పోషణకు తోడుగా వచ్చి చేరిన వ్యవసాయం, చేతి పనుల నైపుణ్యంవల్ల ప్రకృతిపై అదుపు గణనీయంగా పెరిగింది మానవ శ్రమ కనీస మనుగడకు అవసరమైన దానికంటే చాలా ఎక్కువగా ఉత్పత్తి చేయగల శక్తి సంతరించుకొంది అయితే అదే సమయంలో శ్రమవల్ల తయారయే ఉత్పత్తులు శ్రమించిన వారికి సంక్రమించవు అలాగే వేద కాలంలో వలే తెగ సభ్యుల మధ్య పంపిణీకావు వాస్తవానికి తొలి వేద కవులకు ఈ పంపిణీ కార్యక్రమం ఎంత ముఖ్యమైనదంటే తమ పురాణ కల్పనలో వారు దీనికి దేవతా స్థానం కల్పించారు ఇందుకు సంబంధించిన దేవతలకు *భాగాదేవి, అంశాదేవి* అని పేరు

---

1 బహుమతులను కీర్తించే మాటలు చాలా కాలం తర్వాత వచ్చాయి వాటినిబట్టి తొలి వేద కాలంలో బాగా ఆస్తిపర వర్గాలున్నాయని రుజువుకాదు

పెట్టారు దీని అర్థం పంచుకోవడమే ఉపనిషత్కాలపు భారతంలో సమాజం పాలక, పాలిత వర్గాలుగా చీలిపోయింది రాజులు, కులీనులు మొదటి వర్గంగా వుంటూ, రెండో వర్గం ఉత్పత్తి చేసే అదనపు ఉత్పత్తిని కబళించేవారు

ఈ మిగులు పోగుపడటంవల్ల ఆ కాలంనాటి ప్రమాణాలతో పోలిస్తే అపారమైన సంపద సమకూరింది ఈ మిగులుపై ఆధారపడి విలాసవంతంగా జీవించే మొత్తం తీరిక వారి పరమైంది అవిధంగా శుద్ధ చైతన్యాన్ని వశపరచుకోవడంపై కేంద్రీకరించారు రాజులు రాజబంధువులనబడే వారి స్తోత్ర పారాలలో ఉండిపోయారు వారు తాత్విక ప్రవచనాలపట్ల ఎంతో ఆసక్తి కలిగి వున్నారని ఉపనిషత్తులు పేర్కొన్నాయి అయితే దీని అర్థం నిగూఢ జ్ఞానంపై వారికే గుత్యాధిపత్యం వున్నదని కాదు కులీన వర్గానికి వెలుపల కూడా కొంత మంది అసాధారణ ప్రజ్ఞావంతులు మహత్తర శక్తిని చాటుకున్నారు

యాజ్ఞవల్క్యుడు అటువంటి వ్యక్తి

తన జ్ఞానానికిగల మహత్తుతో అతను ప్రఖ్యాతుడయ్యాడు ఈ జ్ఞానం అమరత్వాన్ని కలిగిస్తుందని, చావును కూడా తప్పిస్తుందని వదంతులు ప్రబలాయి ఆ యుగంలో భాగా సంపన్నుడైన విదేహ రాజు జనకుడు తన సంపదలో గణనీయమైన భాగం యాజ్ఞవల్క్యుడికి ఇచ్చి అందుకు ప్రతిఫలంగా అతని నిగూఢ జ్ఞానాన్ని కోరుకుంటాడు మిగులును తాను నేరుగా కొల్లగొట్టకుండానే ఆ విధంగా యాజ్ఞవల్క్యుడు దానిలో కొంత భాగానికి అధిపతి అవుతాడు

యాజ్ఞవల్క్యుని అతని తాత్విక బోధనను అర్థం చేసుకోవాలంటే అతని ఆస్తిని దాని మూలాలను గురించి తెలుసుకోవడం అవసరం అది ఎక్కడ నుంచి వచ్చింది? ఉపనిషత్తులు ఈ విషయాన్ని స్పష్టంగానే చెబుతున్నాయి అతని తాత్విక ప్రవచనాల నేపథ్యం ఒకచోట ఇలా వర్ణించబడింది [1]

"విదేహ రాజు జనకుడు ఆశీనుడై వున్నాడు

యాజ్ఞ్యవల్క్యుడు అరుదెంచాడు

అతనితో రాజు ఇలా అన్నాడు *"యాజ్ఞవల్క్యా నీవు ఇక్కడ రావడానికి కారణమేమిటి? నీకు పశువులు కావాలా? లేక లోతైన చర్చ కావాలా?"*

*"నిజంగా మహారాజా నాకు ఆ రెండూ కావాలి"* అని యాజ్ఞవల్క్యుడు అన్నాడు

ఉపనిషత్తుల కాలంలో పశువులనే ప్రధాన సంపదగా ఎందుకు చూసేవారో మనమిప్పుడు తెలుసుకోవాలి భౌతిక ప్రపంచాన్ని అత్యంత తృణీకార దృష్టితో చూసే ఈ భావవాద మహా తాత్వికుడు తన ఆసక్తి కేవలం తాత్విక చర్చకే పరిమితంకాదని నిస్సంకోచంగా చెప్పాడు దానికి ప్రతిఫలం కూడా కోరాడు ఇక్కడ పశువులు-ప్రపంచంలోని అన్ని ఇతర విషయాలాగే నిజమైనవి అనడంలో సందేహంలేదు అయినా అతను వాటిని

1 బృహదారణ్యకో

విస్మరించలేకపోయాడు ఎందుకంటే అవి లేకపోతే ఈ ఆది భౌతికవాది తీరికైన జీవితాన్ని సాగించలేడు ప్రపంచ ఉనికిని నిరాకరించే తాత్విక చర్చ జరపలేడు

ఆ విధంగా ఇక్కడ యాజ్ఞవల్క్యుడు ఎదుర్కొన్న ప్రశ్నకు సైద్ధాంతిక స్థిరత్వం కంటే తీవ్రమైన ప్రాధాన్యత వున్నది యధార్థ జీవిత తాత్కాలిక సత్యానికి (వ్యవహారిక లేదా సంవృత సత్యం) అత్యున్నతమైన అది భౌతిక అర్థంలో సత్యానికి (పారమార్థిక సత్యం) మధ్య తేడాను చూపే తాత్వికపరమైన చిట్కా భారతీయ భావవాదులు ఆనాటికి ఇంకా కనుగొనలేదు పశువులు అంతిమంగా అసత్యమైనప్పటికి యధార్థ జీవితానికి మాత్రం సత్యమని యాజ్ఞవల్క్యుడు అనలేదు తదుపరి దశకు చెందిన భావవాదులతో పోల్చితే అతడు చాలా అమాయకంగా తనకు పశువులపట్ల కూడా ఆసక్తి వున్నదని అంగీకరించాడు వాటి అధి భౌతిక ప్రతిపత్తి అంతిమంగా ఏమైనా సరే తగిన పాదార్థిక వనరులు కల్పించబడకుండా సునిశితమైన చర్చలలో అతను ఏవిధంగా నిజాయితీగా పాల్గొనగలుగుతాడు? ప్రత్యక్షంగా శ్రమించి ఉత్పత్తి చేసే వారి మిగులును కొల్లగొట్టే వర్గానికి చెందినవాడు కాదు గనుక అతను రాజుచే అలా కొల్లగొట్టబడిన దానిలో కొంత భాగాన్ని తీసుకోవలసి వచ్చింది రాజు వైపునుంచి చూస్తే అతను తనకున్న భౌతిక సంపదలో కొంత కేటాయించి తనకు అమరత్వాన్ని కూడా సిద్ధింపచేసే జ్ఞానాన్ని పొందాలనుకున్నాడు ప్రతి తాత్విక చర్చ ముగింపులో రాజు అతనికి వెయ్యి ఆవులను, ఏనుగంత పెద్దదైన ఎద్దును బహూకరిస్తుంటాడు ఉపనిషత్తుల కాలానికి అది చాలా పెద్ద మొత్తమే [1]

ఉపనిషత్ భారత కాలంలో అమలులో వున్న భూమి కౌలు వ్యవస్థ ఏమైనప్పటికీ రాజులు, కులీనులు, నిగూఢ జ్ఞాన సంరక్షకులైనవారికి గ్రామాలు దానమిచ్చినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి [2] బౌద్ధుల పాలీ సాహిత్యంలో మనకిది స్పష్టంగా కనిపిస్తుంది ఉపనిషత్తుల తర్వాతికాలంనాటి సాంఘిక పరిస్థితుల గురించి అది మనకు ఒక అవగాహననిస్తుంది

*బ్రాహ్మణ గ్రామాలు లేదా అగ్రహారాలు ప్రధానంగా మగధ, కోసల ప్రాంతాలలో వుండేవి ఈ రెండు ప్రాంతాలలో బ్రాహ్మణ గ్రామాలు వుండడానికి గల కారణం అక్కడ బ్రహ్మదేయ పద్ధతి త్వరగా అభివృద్ధి చెందటమే ప్రసిద్ధులైన బ్రాహ్మణులకు భూమినిగాని, ఎస్టేట్లనుగాని దానమిచ్చే పద్ధతిని బ్రహ్మదేయ అంటారు వారి సేవలకు మరీ ముఖ్యంగా క్రతువుల నిర్వహణకు ప్రతిఫలంగా వీటిని ఇచ్చేవారు కనుమాట, ఉపసద వంటివి ప్రత్యేకించి బ్రాహ్మణగ్రామాలుగా అభివర్ధించబడ్డాయి ప సేనది, బింబిసార రాజులు కుటదంత, చంకి అనే బ్రాహ్మణులకు దానమిచ్చిన గ్రామాలను ఆవిధంగా పేర్కొన్నారు మరోవంకన చంప, ఉఖత, సాలవాటిక ప్రాంతాలు సోనదండ, పొక్కరసధి, లోహిక అనే బ్రాహ్మణులకు చెందినవైనప్పటికీ వాటిని బ్రహ్మదేయ భూములని మాత్రమే పేర్కొన్నారు ఎకనాలలో భరద్వాజ బ్రాహ్మణ రైతుకు గల భూమిని దున్నేందుకు 500 అరకలు అవసరమయ్యేవట* [3]

యాజ్ఞవల్క్యుడికి రాజబహుమతిగా గ్రామం లభించినట్లు మనకు బృహధారణ్య

1 అదే పుస్తకం 2 చాందోగ్యోపనిషత్తు 3 ఎన్ వాగ్లే "సొసైటీ ఎట్ ది టైమ్ ఆఫ్ బుద్ధ"

కోపనిషత్తులో ఎలాంటి ఆధారం కనిపించదు అయితే కొన్ని గ్రామాలలో కనీసం కొన్నివేల ఆవులను మేపుకోవడానికి అవసరమైనన్ని విస్తారమైన క్షేత్రాలను అతనికి తప్పక ఇచ్చివుండాలని భావించాల్సివుంటుంది అదే నిజమైతే ఇంతటి అపారమైన సంపదను చూసుకునేందుకుగాను అతనికి తగిన భద్రతా యంత్రాంగం కూడా అవసరమౌతుందని ఊహించాల్సి వుంటుంది

దీనితో మనం బుద్ధుడు వర్ణించిన సంపన్న బ్రాహ్మణుల దగ్గరికి వస్తాము చుట్టూ కందకాలు గల "బలీయమైన కోటలలో పెద్ద పెద్ద తలుపులతో పొడవైన కత్తులు ధరించిన కాపలాదారులతో నివసించేవారు" (1) అని ఆయన బ్రాహ్మణులను అభివర్ణించారు

పూజారి-తాత్వికుడి స్థానంలోవున్నవారి పరాన్నభుక్కు జీవన దృశ్యాన్ని పునర్నిర్మించుకోవడం ఇప్పుడు చాలా తేలిక ఈ పరాన్నభుక్కుతత్వంలోనే యధార్థ ప్రపంచ ఉనికిని తిరస్కరించే అతని భావవాదానికి పునాదులున్నాయి

ఈ కొత్తతరహా పరాన్నభుక్కులను అంటే తన కాలపు బ్రాహ్మణులను తొలి వేద కవుల ఆదర్శ నైతిక ఔన్నత్యంనుండి దిగజారిన వారుగా బుద్ధుడే పేర్కొనాల్సివచ్చింది వారిలో ఒకరిని ఆయనిలా ప్రశ్నిస్తాడు (2)

*అయితే అంబత్తా ఆ ప్రాచీన కవులు (లేక రుషులు) ఈ సూక్తాల రచయితలు ఎవరో కూర్చిన పదజాలాన్నంతా ఈనాటి బ్రాహ్మణులు మంత్రాలుగా వల్లెవేసి జపిస్తున్నారు వారితో పోల్చినపుడు నీవు రుషివా? రుషి స్థాయి పొందగలవా? ఇప్పుడు నీవేమనుకుంటున్నావు అంబదత్తా? ఉచ్ఛరించిన ఆ పాతకాలం బ్రాహ్మణులు గురువులు, రుషులు, వారి గురువులు మాట్లాడుకుంటున్నపుడు నీవు విన్నదేమిటి? ఈ ప్రాచీన కవులు నీవు పదే పదే వల్లిస్తూ ఊరేగే సూక్తాల కర్తలు మంచి పోషణతో పరిమళ ద్రవ్యాలు పూసుకుని, కేశాలు గడ్డాలు చక్కగా తీర్చిదిద్దుకుని పుష్పమాలలు, ఆభరణాలు ధరించి, శ్వేతాంబరధారులై ఈనాడు నీవు, నీగురువులు చేస్తున్నట్లు ఇంద్రియానుభూతుల్లో మునిగితేలేవారని అనుకుంటున్నావా?*

ప్రాచీన వేదకవులకు ప్రకృతిపైగల అదుపు చాలా ప్రాథమికమైందనేది వాస్తవం కాని బుద్ధుడు వారు గొప్ప రుషితుల్యులనే ఆకర్షణీయమైన చిత్రణ ఇస్తున్నాడు వాస్తవానికి వారు ఆయన చెబుతున్నంత మహర్షులేమీకాదు అదేసమయంలో బుద్ధుడు చెప్పినదాన్లో నిస్సందేహంగా సరైనదేమిటంటే వారు తమ తర్వాతివారివలె పరాన్నభుక్కు జీవితం గడపలేదు అందుకే ఉపనిషత్తు భావవాదులు చెప్పిన శుద్ధ ఆత్మ వారికి ఏవిధంగానూ తలకెక్కేదికాదు

## ప్రాచీన వైదిక అధి భౌతికవాదం

తర్వాతికాలంలో పూర్తిగా ఉపనిషత్ భావవాదంపైనే ఆధారపడి తమ వైఖరి నిర్మించుకున్న భారతీయ తాత్వికులు అద్వైతవేదాంతులు వారు చెప్పే ప్రకారం తత్వచింతన శారీరక మీమాంస లేక శారీరక తత్వశాస్త్రం శారీరక అంటే కల్మష శరీరమని (3) వారి అర్థం

1 టు రైస్ డేవిడ్స్ అంబత్త సూత్ర 2 అదేపుస్తకం

A C. No. 72,631

ఉపనిషత్ భావవాదం ప్రకారం శుద్ధ ఆత్మ లేక చైతన్యం వారికి చాలా చిరాకు కలిగించే విధంగా ఈ కల్మష శరీరంలో బంధించబడి వుంటుంది కనుక తమ చింతనకు ఆ పేరు పెట్టారు

దీనిలోని భావం గ్రీకు భావవాది ప్లాటోను గట్టిగా గుర్తు చేస్తుంది అతను శరీరాన్ని ఆత్మను బంధించే ఖైదుగా భావించి విసుగు వ్యక్తం చేస్తాడు మరణాన్ని కోరుకునేవాడే నిజమైన తాత్వికుడని కూడా అతను చెప్పాడు ప్లేటోకన్నా కొద్ది శతాబ్దాలముందే యాజ్ఞవల్క్యుడు కూడా మరణశయ్యపై వున్న మనిషిని గురించి చాలా అసూయతో వర్ణిస్తాడు చావుతో అతను కల్మష శరీరాన్నుండి ఇంద్రియాల వంచననుండి విముక్తుడవుతున్నాడని పేర్కొంటాడు

వేదకాలపు ఆలోచనల పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికిగాను ఈవిషయం తెలుసుకోవడం అవసరమౌతుంది ప్రాచీన వేదకవుల దృష్టిలో ఆహార పానీయాలతో శరీరాన్ని బలోపేతం చేసుకోవడంకన్నా మరేదీ ముఖ్యంకాదు అలాటి వారు పైన చెప్పిన తరహా తాత్విక ఆలోచనను ఏనాడూ స్వీకరించి వుండేవారు కాదు వారు ఎంతవరకు వెళ్ళారంటే ఆహారాన్ని 'పితు' అనే పేరిట తమ దేవతల్లో ఒకరుగా ప్రతిష్టించారు ఈ దేవతను వారు ప్రశంసించే పద్ధతి ప్రాచీన రీతిలో ఉన్నప్పటికీ చాలా ఆసక్తికరంగా ఆకట్టుకునేందిగా వుంటుంది ముఖ్యంగా చావును కోరుకునే పనికిరాని ఊహాగానాలనుండి వైదొలగి దీన్ని పరిశీలించినప్పుడు అది మరింతగా ఆకట్టుకుంటుంది ఆహారాన్ని సంస్తుతిస్తూ ఋగ్వేదం ఇలా పేర్కొంది

రుచికరమైన ఆహారమా, తేనెలూరే ఆహారమా నీకు మా స్వాగతం మా సంరక్షకురాలివై వుండు బలవర్ధకమైన ఆహారమా మా దగ్గరకు రా! మేము నీకు స్వాగతం చెబుతున్నాం, మా సంరక్షకురాలివై వుండు మాదగ్గరకు రా- బలవర్ధకమైన ఆహారమా- వికాసకారణమా గౌరవనీయులైన వారి మిత్రమా అజాత శత్రువూ మా దగ్గరకు రావా ఓ ఆహారమా నీ పరిమళాలు ఈసీమలగుండా వ్యాపిస్తున్నాయి ఆకాశంలో పవనాల్లా విస్తరిస్తున్నాయి ఆహారమా నిన్ను పంపిణీ చేసే ఈ మనుషులు- ఓ అతి మధురమైన ఆహారమా నిన్ను భుజించేవారు, ఆస్వాదించేవారు నీలాగే పొడుగాటి మెడలతో పెరిగిపోతున్నారు ఓ ఆహారమా శక్తిసంపన్నులైన దేవతల మేధస్సులు నీతోనే ముడిపడి వున్నాయి పర్వతాలకు సంబంధించిన సంపద నీకే సంక్రమించింది ఓ మధుర పదార్థమా మా మనవి విను మా భోజనానికి అందుబాటులోకి రా మేము సమృద్ధమైన వృక్షాలు, జలాలను అనుభవిస్తున్నాము కనుక శరీరమా నీవు లావుగా చేయాలి మేము కాచినపాలు, యవలుతో కూడిన సోమరసం తాగుతాము కనుక ఓ శరీరమా నీవు బాగా బలవాలి

చివరి వాక్యం మరీ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది "వాతాపే పివ ఇతేభవా' *శరీరమా నీవు బాగా బలవాలి* "

ఇది తాత్విక దృక్పథం కాదన్నమాట వాస్తవమే అలా వుండాలన్న దృష్టికూడా వారికి లేదు అయితే దీనిలో తాత్విక చింతన భాగం అసలు లేకుండా పోలేదు అద్వైతుల శారీరక తత్వానికి పూర్తిగా విరుద్ధమైన ఒక సైద్ధాంతిక స్ఫూర్తి దీనిలో కనిపిస్తుంది రుగ్వేదంలో ఇలాంటివి అనేకం ఉన్నాయి

ఇక్కడ ఒక ప్రశ్నను లేవనెత్తాలనిపిస్తుంది

భారతీయ తత్వశాస్త్రం మలిదశలో మరీ సూటిగా మాట్లాడిన భౌతికవాదులను లోకాయతులు లేక చార్వాకులు అని పిలిచారు వారు చెప్పే ప్రకారం శరీరానికి అతీతంగా ఆత్మ అన్నదేదీ లేదు ఇలా చెప్పినందుకు వారిని అనేకవిధాలా అవమాన పరిచారు చార్వాక అన్న పేరు పెట్టడం కూడా అందులో భాగమే చౌకరకం తాత్వికత అని చెప్పడానికే ఆ పేరు ఇచ్చారు తినడం, లేదా చప్పరించడం అని అర్థమిచ్చే 'చర్వ' నుండి ఈ మాట పుట్టింది ఎలాంటి పవిత్రమైన ఆశయాలు లేకుండా తినడం, త్రాగడమే ప్రధానంగా పెట్టుకున్న వారన్న దృష్టితో ఈ తాత్వికులను చార్వాకులని పిలిచారు

శబ్దాన్ని బట్టి ఈ పేరును ఈవిధంగా విశ్లేషించడం తమాషాగా వుండవచ్చు అయితే దాన్ని ఒప్పుకున్నప్పటికీ మనం ఒక సూటి ప్రశ్నను తప్పించుకోలేము తర్వాతికాలంలో వచ్చిన చార్వాక లేదా శారీరక వాదాల్లో తత్వచింతన ఏది తొలి వేద కవుల సైద్ధాంతిక దృష్టికి అనుగుణమైంది? దీనికి ఒకే సమాధానం ఆ కవులు ఆహారం గురించి అంత పారవశ్యం చెందడానికి ఒకే ఒక కారణం అది శరీరానికి బలం చేకూర్చడమే అలాటి ప్రాచీన కవులు చార్వాక తత్వాన్ని అర్థం చేసుకోగలుగుతారు గాని శారీరక తత్వాన్నికాదు ప్రాచీన కాలపు అధిభౌతికవాదానికి ప్రతీక వేదకాలపు ఆలోచన దీని శిథిలాలపైనే తర్వాతికాలంలో భావవాద దృక్పథం పెంపొందింది

## విజ్ఞానం కార్యాచరణల సంగమం

ఇక ఇప్పుడు చర్చించాల్సిన అంశం ఒక్కటే మిగిలింది తొలి వేదకవులకు, ఉపనిషత్ భావవాదులకు మధ్య సైద్ధాంతిక దృష్టిలో గల తేడాలకు కారణాలేమిటి?

ఉపనిషత్ తాత్వికులతో పోలిస్తే రుగ్వేద కవులు అజ్ఞానులనడంలో సందేహంలేదు వారి భావసంపద చాలా వెనకబడినదే అమూర్త దృక్పథాలను రూపొందించుకోగల శక్తి వారికి చాలా పరిమితం తమకు అర్థంకాని విషయాలలో మాత్రమే వారు దేవతలను ఊహించుకుంటారు వాస్తవికతకు, సత్యానికి సంబంధించిన ప్రశ్నలకు సాక్ష్యాలు, సమాధానాలు ఇవన్నీ వారి మేధాపరిధికి అందని విషయాలు అలాంటి ప్రశ్నలే వారికి పెద్దగా తెలియనప్పుడు జవాబులగురించి చెప్పే పనిలేదు ఉపనిషత్ తాత్వికులు వారికన్నా చాలా ముందుకుపోయారు వారి దృష్టిలో ఈ ప్రశ్నలు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నాయి ఎంత ప్రాథమిక స్థాయిలోనైనా సరే తమకున్న సాక్ష్యాలు వాదనలతో వాటికి జవాబులు చెప్పేందుకు ప్రయత్నించారు

ఇవన్నీ పైనే కనిపిస్తున్నాయి కానీ మనం లేవనెత్తే ప్రశ్నలకు అవి జవాబులు సమకూర్చవు ఇక్కడ ప్రశ్న ఆలోచనల సంపన్నత్వం గురించినది కాదు దాని దిశ ఏమిటన్నదే ప్రశ్న ఉపనిషత్ కవులతో పోలిస్తే తొలి వేదకవులలో ఇలాంటి భావసంపన్నత లేకపోవడానికి కారణాలు తేలిగ్గానే గ్రహించవచ్చు కాని విషయమేమంటే ఉపనిషత్ భావవాదులలో మనకు ఆలోచనల వికాసంతోపాటు అది తీసుకున్న ప్రమాదకరమైన మలుపు కూడా కనిపిస్తుంది విషయాలు గ్రహించడానికి తోడ్పడే ఉన్నతస్థాయి సామగ్రి పెంపొందినప్పటికీ భావవాదులు దాని ఆధారంగా విజ్ఞాన సాధనాలను ఖండించడానికే పూనుకున్నారు వారి విషయం పరిజ్ఞానం అప్పటికి సమకూరిన జ్ఞానంపట్ల -అంటే అనుభవాన్ని, హేతుశీలతను అన్వయించడంద్వారా గడించిన జ్ఞానంపట్ల శతృత్వం వహించింది జ్ఞానంపట్ల ఇటువంటి శతృత్వం ఋగ్వేద కవులలో కనిపించదు వారి అనుభవం పరిమితమైందే కావచ్చు వారి అన్వయశక్తి ఎంత తక్కువ స్థాయిలోనైనా వుండవచ్చు కాని వారు జ్ఞానాన్ని తెగనాడలేదు

క్లుప్తంగా చెప్పాలంటే వారి ఆలోచన సాధారణ గమనం భిన్నమైంది దీన్ని మనం ఎలా వర్ణించగలం? ఉపనిషత్ భావవాదుల సాధారణ ఆలోచనా ధోరణిని మనం తెలుసుకున్నాము నిగూఢ జ్ఞానం పట్ల ఆరాధన, జ్ఞానాన్ని ఆచరణనుండి వేరుచేయడం చూశాము అలాంటి ధోరణి తొలి వేద కవులలో లేదు వారి చైతన్యంలో విజ్ఞానాన్ని, ఆచరణను వేరుచేసే అంశాలేవీ వుండవు

వేద సారస్వత విలక్షణత ఏమంటే అది మనకు చాలా స్పష్టంగా కనిపిస్తుంది వేయి సంవత్సరాలు, అంతకుమించి వున్న దీర్ఘకాలంపాటు కూర్చబడిన ఈ సారస్వతంలో అంతర్లీనంగా ఒక నిరంతరాయమైన కొనసాగింపు చూస్తాము ఉపనిషత్తులు లేదా వేదాల ముగింపునుండి మనం మరింత వెనక్కు, అంటే వేద సారస్వతపు తొలి దశకు వెళ్ళవచ్చు అలా వెళ్ళినప్పుడు మనకు రేఖామాత్రంగా ఈ ధోరణి గోచరిస్తుంది ఉపనిషత్ కాలానికి గుణాత్మకంగా భిన్నమైన ప్రాచీన గత కాలపు అవశేషాలైనా అగుపిస్తాయి దానికిగల విశేష ప్రాధాన్యత ఏమంటే మొత్తం కాలం పైనా, స్పష్టమైన సారస్వత ఆకరాలపైనా ఆధారపడి మనం నిర్ధారణలకు రాగలుగుతాము. దొంతరలు లేని ప్రాచీన తెగల సమాజపు శిధిలాలపై ఉపనిషత్ సమాజం పెంపొందినట్లే ఉపనిషత్ భావవాదుల సైద్ధాంతిక దృష్టి ఒక ప్రాచీన సిద్ధాంత శిధిలాలపైనుండి ఉద్భవించినట్లు అర్థమౌతుంది దీనినే విజ్ఞానం, ఆచరణల ప్రాచీన సంగమంగా వర్ణించవచ్చు విజ్ఞానమన్నది అదృష్టవంతులైన కొద్దిమంది రహస్య ఆస్తికాదు అందువల్ల అది ప్రకృతిపట్ల ఎలాంటి తృణీకారాన్ని ప్రదర్శించదు కార్యాచరణ సందర్భంలో ప్రకృతితో మానవులకు సంబంధం ఏర్పడుతుంది తొలి వేదకాలపు అధి భౌతికవాదాన్ని అర్థం చేసుకోవడానికి కావలసిన ఆధారాలు మనకు ఇక్కడే లభిస్తాయి

# పరాన్నభుక్కుల తర్కం

మనం ఇదివరకే చూసినట్లుగా భావవాద దృక్పథం ఉపనిషత్‌కాలంలో ముందుకు వచ్చింది తీరికగల వర్గాలైన రాజులు, వారి సైద్ధాంతిక సమర్థకుల పరాన్నభుక్కు చైతన్యంనుండి అది పుట్టింది శ్రమతో, ఉత్పత్తితో వారికెలాంటి సంబంధంలేదు అదేవిధమైన పరాన్నభుక్కుతత్వం తాత్వికులను ప్రపంచపు ఉనికిని నిరాకరించే విలాసవంతమైన తత్వచింతనవైపు నడిపించింది మహాయాన బౌద్ధుల భావవాద దృక్పథంలో ఇది మనకు కనిపిస్తుంది

మహాయాన శాఖ అవిర్భావం ఒక విస్తృతమైన, క్లిష్టమైన చర్చనీయాంశమనడంలో సందేహంలేదు దానికి సంబంధించిన చాలా సమాచారం టిబెట్, చైనా, సారస్వతాలనుండి సేకరించాల్సివుంటుంది ఆ వివరాలు లేనందువల్ల ఇక్కడ మనం కొన్ని సాధారణ అంశాలకు మాత్రమే పరిమితం కాగలం మొదటి విషయం ఏమంటే మహాయాన అన్నది వాస్తవంగా బుద్ధుడు చేసిన మౌలిక బోధనలకు విరుద్ధమైంది అందుకేమనం ముందు అది బౌద్ధాన్ని గురించి క్లుప్తంగా పరిశీలించారు

మనకు బాగా తెలిసినదాన్ని బట్టి చూస్తే బుద్ధుడు శృతిమించిన అధిభౌతిక ధోరణులకు, ప్రత్యేకించి ఉపనిషత్ భావవాదానికి గట్టి వ్యతిరేకి అతని ప్రధాన బోధనలు నాలుగు మహత్తర సత్యాలను వెల్లడిస్తాయి అవి "ప్రతిదీ దుఃఖఃపూరితం దుఖాఃనికి కారణం వున్నది దానికి నివారణ వున్నది ఆ నివారణకు మార్గం వున్నది

ఆది బౌద్ధాన్ని గురించిన మొదటి ప్రశ్న సహజంగానే తొలి పవిత్ర సత్యానికి సంబంధించి వుంటుంది ప్రవక్త ప్రతిదాంట్లో ప్రతిచోటా దుఖాఃన్నే చూడటానికి కారణమేమిటి?

ఉత్తర భారతదేశం క్రూర నిరంకుశ రాజ్యాల ఆవిర్భావాన్ని చూసిన కాలమది తెగల, అర్థ తెగల సమాజాల శిథిలాలపై ఈ రాజ్యాలు ఏర్పడ్డాయి ముఖ్యంగా మగధ, కోసల చెప్పుకోదగ్గవి అలాంటి యుగంలో దురాశ, క్రూరత్వం ఉమ్మడి ఆస్తిపై స్వార్థపూరిత దోపిడీ, పన్నులు, పీడన, డబ్బు గుంజడం వగైరాలు సర్వసాధారణం ఇవన్నీ అశేష జనబాహుళ్యం జీవితాలలో అదివరకెన్నడూ కనీవిని ఎరుగని కష్టాలను తెచ్చిపెట్టాయి తెగల సమాజం నాటి స్వేచ్ఛ, సమానత్వం, సహోదరత్వం తాలూకూ స్మృతులు ఆ ప్రజల మనస్సులనుండి ఇంకా పూర్తిగా తొలగిపోలేదు వాటి పొరుగున వున్న శాక్య, వాజయిని వంటి రాజ్యాలు ఇంకా తెగల ప్రజాస్వామ్యంలోనే మనుగడ సాగిస్తున్నాయి కొత్తగా పెంపొందుతున్న రాజ్యాలకు ఇలాంటి ప్రజాస్వామ్య ఉదాహరణలు ప్రమాదకరంగా కనిపించింది ఈ ప్రజాస్వామ్యాలను అణచివేయడం, నిర్మూలించడం అన్నది కొత్తగా పెంపొందుతున్న రాజ్యశక్తుల రాజకీయ విధానంలో భాగమైంది

బుద్ధుడు స్వయంగా శాక్యుడు అందుకతను చాలా గర్వించేవాడు అయితే అతని జీవితకాలంలోనే కోసల రాజు విదూదభుడు శాక్యులపై అత్యంత కిరాతకమైన

ఊచకోత సాగించాడు వాజయిని[1]లో ఇంకా అమలులోవున్న ప్రజాస్వామ్య సూత్రాల ప్రాతిపదికనతన సంఘాన్ని లేదా సాధు సముదాయాన్ని ఏర్పాటుచేయాలని బుద్ధుడు అకాంక్షించాడు అయితే మగధరాజు అజాతశత్రుడు తాను వాజయినిని నిర్మూలిస్తానని ప్రకటించాడు దాన్ని చాలావరకు అమలు జరిపాడు కూడా గిరిజన ప్రజాస్వామ్య గత వైభవం గురించిన స్మృతులనుండి ఇంకా బయటపడని బుద్ధుడు పచ్చి దురాశతో సాగిన ఈ దుర్మార్గ దురాక్రమణకు కంపించిపోయాడు "సముద్రానికి ఇటువైపున గల మొత్తం భూమికి పాలకుడైనప్పటికీ రాజుకు తృప్తి కలగదు ఆవైపున కూడా ఆక్రమించాలనుకుంటాడు' ' అని బుద్ధుడు చెప్పాడు అయితే దీన్నిబట్టి ప్రతి దాంట్లోనూ దుఖాఃన్ని చూసే బుద్ధుడు రాజులను అందుకు అతీతులుగా మినహాయించాడా అంటే లేదు ఇదే దురాశ వారికి బెడిసికొడుతుంది వారిని కష్టాల పాలు చేస్తుంది అంటాడు కోసలరాజు ప్రసేనజిత్తుడు, మగధరాజు బింబిసారుడు బుద్ధుని బాల్యస్నేహితులు ప్రసేనజిత్తుడికి అతని కుమారుడైన విదూదబుడే ద్రోహం చేస్తాడు ఆతర్వాత అతను తన కుమారుడైన అజాతశత్రుని చేతుల్లో తిండికి లేక చచ్చిపోతాడు "రాజ్యాన్ని పాలించే యువరాజు సంపదల్లో, ఆస్థిపాస్తుల్లో సంపన్నుడు కావచ్చు ఎన్నటికీ తృప్తిలేని తమ కోర్కెల కోసం వారు తమ దురాశను ఒకరిపై మరొకరు కక్కగడతారు ఈవిధంగా అవిశ్రాంతంగా అశాశ్వత ప్రవాహంలో దురాశ, పశుకాంక్షలతో కొట్టుకుపోతుంటే భూమి మీద ఎవ్వరో శాంతిగా వుండగలుగుతారు?" అని బుద్ధుడు ప్రశ్నిస్తాడు బుద్ధునికి తెలిసినంతవరకూ అలాంటివారెవ్వరూ కనిపించలేదు మరలాంటప్పుడు ప్రతిచోటా ప్రతివారిలో అతనికి దుఖః౦ కాక మరేమి కనిపిస్తుంది?

అయితే తాను జీవిస్తున్న పరిస్థితుల్లో అతను ఒక పరిష్కారాన్ని సూచించగలడా? పరాన్నభుక్కుల భ్రమలను పంచుకునేందుకు అతను నిరాకరించాడు అందుకే ఊహాజనితమైన దేవుడికి ప్రార్థనలు, బలులు చేయమని చెప్పలేదు వాస్తవికమైన కష్టాలను వాస్తవం కాదని చెప్పే అధిభౌతిక ఎత్తుగడలకు పాల్పడలేదు అతనికి దేవునిపై నమ్మకం లేదు శుద్ధ చైతన్యం అనే అధిభౌతికవాదంపట్ల సహనం లేదు అందువల్లనే అతను దుఖః౦ అనే పరిస్థితికి విరుగుడుగా నిజమైన శక్తివంతమైన చర్యలకోసం అన్వేషించాడు ఏమైనప్పటికీ యధార్థప్రపంచంనుండి నిజమైన కష్టాలను తొలగించడం అనే ప్రశ్నలేదు ప్రవక్త అయినప్పటికీ అతను చారిత్రక అభివృద్ధి దశలను దాటవేయలేదు మానవ ఉత్పాదకశక్తిని అత్యున్నతస్థాయికి అభివృద్ధి చేసి మనిషిపై మనిషి దోపిడీని అంతమొందించే సోషలిజం మాత్రమే మానవ దుఖాఃన్ని సాధ్యమైనంత వరకు తొలగించగలుగుతుంది బుద్ధుడు ఆ వ్యవస్థలోకి ఒక్కదెబ్బతో దూకడం సాధ్యమయ్యేదికాదు అందువల్లనే బుద్ధుడు ఒక నిజమైన సమస్యకు ఒక భావాత్మకమైన పరిష్కారం మాత్రమే కనుగొనగలిగాడు వస్తుగతమైన కష్టాలకు, స్వీయాత్మకమైన విరుగుడు సూచించాడు క్లుప్తంగా చెప్పాలంటే

---

1 ఇది ఊరు పేరు కాదు ఒక సంఘం

దుఖఃమనే భావననే అధిగమించేందుకు వ్యక్తి మనస్తత్వంలో పరివర్తన రావాలన్నాడు చారిత్రకంగా అతనికి అందుబాటులో వున్నది తాత్కాలిక ఉపశమన మార్గం మాత్రమే అతనుకూడా అందుకోసమే కృషిచేయాల్సివచ్చింది తనది నూతన సిద్ధాంతం అని అతను ప్రకటించాడు మన ఈ ప్రస్తుత జీవితంలోనే ఉత్పన్నమయ్యే మనో వికారాలను అదుపుచేసుకోవాలని, హృదయాన్ని స్వాంతన పరచుకోవాలని చెప్పాడు. దీన్ని సాధించగలిగితే దు ఖం అంతరిస్తుంది. దీన్నే బుద్ధుడు నిర్వాణం అని పిలిచాడు

ఆది బౌద్ధంలో బాగా చెప్పుకోదగిన విషయం అది దాని సూటిదనమే అది ఒక మతానికి ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పడం కష్టం దానిలో ఒక మార్గాన్ని సూచించే మతపరమైన భాగం కేవలం మానవీయమైంది మనిషి తన స్వయం కృషితో నైతిక మేధాపరిణితితో విముక్తిని సాధిస్తాడు అదేవిధంగా ఆ కాలంలో బౌద్ధంలో పెద్ద పూజలు కూడా లేవని మనకు తెలుసు కుటుంబాలు కానీ, ఆస్తులుకానీ లేని దిమ్మరులు ఆ తెగలలో వుండేవారు నెలకు రెండుసార్లు సమావేశమై తమ పాపాలను బహిరంగంగా చెప్పుకునేవారు నిరాడంబరత్వం, ఉపాసన, తాత్వికచర్చ (1)లలో నిమగ్నమయ్యేవారు బాహ్యంగా కనిపించే క్రతువులు పెద్దగా వుండేవికావు మూఢత్వాన్ని రుద్దే ధోరణి ఉండేదికాదు అస్తిక, అధిభౌతిక సంవాదంలో మునిగి తేలడంపట్ల వారు పెద్ద ఉత్సాహం కనబరచేవారుకాదు నిజానికి బుద్ధుడు వీటన్నింటిని నిరుత్సాహపరిచాడు దుఖఃం దాని కారణాలు, దాన్ని నిర్మూలించే మార్గాలు అన్న వాస్తవానికి సంబంధించిన చర్చను మాత్రమే అతను ప్రోత్సహించినట్లు కనిపిస్తుంది

ఏమైనా బుద్ధుని మృతి తర్వాత కొద్ది శతాబ్దాల్లోనే అతని అనుయాయుల్లో అత్యంత నాటకీయమైన మార్పు వచ్చింది మూఢత్వాన్ని ప్రయత్న పూర్వకంగా పెంపొందించడం ఆ మార్పుల్లో ఒకటి కాలక్రమంలో అది బౌద్ధంపై ఎంతో ప్రభావం చూపి గుర్తు పట్టలేనంతగా మార్చివేసింది ఆ మతానికి ఒక కొత్త పేరు కూడా అవసరమని భావించడంలో ఆశ్చర్యంలేదు మహాయానం అన్నది అలా కనిపెట్టిన కొత్తపేరు

అపారమైన కొత్తతరహా మూఢత్వం లేకపోతే మహాయానం రూపొందగలిగేదికాదు ఒకవిధంగా అది మన ప్రధాన చర్చతో సంబంధంలేనిదే అయితే నయా బౌద్ధులు ఉపనిషత్ భావవాదంలోని ప్రధానాంశాలను తమకు అవసరమైన రీతిలో పునరుద్ధరించారు గనక మనకు దానితో అవసరం ఏర్పడుతున్నది కొంతవరకూ హేతువాద దృష్టిగల బుద్ధుడి వాస్తవికతకు అంటిపెట్టుకుంటే యధార్థ ప్రపంచాన్ని నిరాకరించే తమ భావ పరంపరను బోధించడం కష్టమని వారు అభిప్రాయపడ్డారు వారుచెప్పే తాత్విక భావవాదాన్ని స్వీకరించడానికి అంతకుముందే వున్న అస్తిక భావజాలం దానిలోని మూఢ నమ్మకాలతో సహా సరైన సారవంతమైన భూమిగా కనిపించింది

1 టి హెచ్ సైబర్ బట్స్కీ బౌద్ధంలో తర్కం

అందువల్లనే మలిదశ బౌద్ధులు తమ పునాదిపురుషుడి స్మృతులను చెరిపివేయవలసిన అవసరాన్ని గ్రహించారు ఇందుకోసం విస్తారమైన ఒక సిద్ధాంతాన్ని సృష్టించారు బుద్ధపరంపర అని దానికి పేరుపెట్టారు ఒక బుద్ధుడు కాక అనేకమంది బుద్ధులను గురించి మాట్లాడటం మొదలుపెట్టారు చారిత్రకంగా ఈ బుద్ధులు ఒకరితర్వాత ఒకరు వస్తుంటారు. బోధిసత్వులు లేదా భవిష్యత్ బుద్ధులు కూడా అందులో భాగంగా వుంటారు ఈ బుద్ధులకు పాదార్థిక ప్రపంచంతో ఎలాంటి నిమిత్తం వుండదు వారికి సంబంధించిన ప్రతిదీ ప్రకృతికి అతీతమే వారు ఆలోచించినా, మాట్లాడినా, ఏదైనా చేసినా, మనలాగా కష్టాలు పడినా ఇదంతా కోరి చేస్తున్నదే మన బలహీనతలను మనకు చూపించడం కోసమే వారలా చేస్తారు మన భౌతిక నేత్రాలకు కనిపించే ఈ రూపం వాస్తవానికి మనసుతో మాత్రమే నిర్మించబడిందని *(మనోమాయ)* వివరిస్తారు

తుషిత దేవుళ్ళ మధ్య జీవించిన ఈ మహత్తర వ్యక్తి ఈ ప్రపంచంలో కనిపించడమన్నది వాస్తవంగా నిజం కాదు బోధిసత్వుడు ప్రపంచ రీతులకు అనుగుణంగా కనిపించడం కోసమే ఆ రూపం తీసుకున్నాడు *(లోకానువర్తన)* మనుష్యులకు, దేవుళ్ళకు అతను చూపించే శరీరం దాని నిజస్వభావాన్ని ప్రాపంచిక జ్ఞానంనుండి దాచిపెట్టుకుంటుంది మరింత ముందుకువెళ్ళి ఈ శరీరం ఒక భ్రాంతి మాత్రమే అని కూడా చెప్పవచ్చు[1]

చారిత్రకమైన బుద్ధుడిని అదృశ్యం చేయడానికి ప్రయోగించిన మతపరమైన చిట్కా ఇది మహాయానానికి సంబంధించిన మిగిలిన అన్నింటిలాగే బుద్ధులు, బోధిసత్వుల సిద్ధాంతం కూడా కథారూపం తీసుకున్నది అందులో చాలా ముఖ్యమైన విషయమేమంటే *ధర్మకాయం, నిర్మాణకాయం, రూపకాయం* అనే వాటిమధ్య పాటించబడిన వ్యత్యాసం *ధర్మకాయమన్నది బుద్ధుడి ప్రాపంచిక శరీరంగా* కొన్నిసార్లు చెప్పబడింది అయితే దీనికి కొంత వివరణ ఇవ్వాలి ధర్మాత్మ గురించిన మహాయాన తత్వంలో దీనికి సమాధానం లభిస్తుంది. అంతిమ వాస్తవికత లేదా అఖండ సత్యం అని దాని అర్థం అఖండ సత్యం అన్నది మన సాధారణ విజ్ఞానానికి అందేది కాదని చెప్పబడింది అది ఉందిఅని అనుకోవడం తప్పడం తప్ప మన సాధారణ భాషలలో దానిని వర్ణించలేము మహాయానులు దీన్నే **తథత** - అని పేర్కొన్నారు వారి కోణంనుండి చెప్పాలంటే అన్ని వస్తువులు కేవలం శూన్యాలు మాత్రమే ఈ పరిస్థితుల్లో మహాయానులు *ధర్మతను శూన్యతతో* పోల్చి చూసుకుంటారు అఖండ సత్యం అన్న కోణంనుండి చూసినప్పుడు అనుభవ ప్రపంచంలో అది శూన్యతకు ప్రాతినిధ్యం వహిస్తుంది లోపరహితులైన సాధువు మాత్రమే తన అంతిమ సాక్షాత్కార దశలో లేక నిర్వాణంలో అత్యంత నిగూఢమైన ఈ అఖండత్వాన్ని గుర్తించగలుగుతాడు అఖండత్వం తప్ప మరేమీ వుండని స్థితి అది అందువల్లనే *ధర్మాత్మను* మరోవిధంగా నిర్వాణ అని పిలిచారు

---

1 వాల్గీ పాసిన్

మహాయానంలో బుద్ధుడి దృక్పధాన్ని ధర్మతతో పూర్తిగా అనువర్తింపచేయడానికి ధర్మకాయం సంకేతం అవుతుంది అయితే ఈ సిద్ధాంతమంతా సామాన్య ప్రజలకు ఒంటబట్టేది కాదు కనుక దీనికి తోడుగా చారిత్రిక బుద్ధుడి గురించిన ప్రజలో గల విశ్వాసాలను సంతృప్తి పరిచేందుకు ఏదో ఒకటి చేయాల్సివచ్చింది అతడు శాక్యులలో పుట్టాడు మానవుడి కష్టాలను తొలగించడానికి పనిచేశాడు అందువల్లనే మహాయానులు ధర్మకాయానికి సంబంధించిన తమ దృక్పధానికి నిర్మాణ కాయం అన్నది తెచ్చి జత చేశారు అఖండ సత్యం మానవ బుద్ధుడిగా తాత్కాలికంగా ధరించిన పాంచభౌతిక శరీరం లేక మాయా శరీరం అది వాస్తవంగా అది ఉనికి లేనిదైనప్పటికీ ఉనికిలో కనిపిస్తుంది అయితే ఇంద్రజాలికుడు వేదికపైన సృష్టించే మాయా ఏనుగులాంటిదే అది మరి అఖండ శక్తి ఈ భౌతిక కాయాన్ని ఎందుకు ధరించాల్సివచ్చింది ? ఈ నూతన సిద్ధాంతం ప్రకారం అఖండం లేదా ధర్మకాయం అన్నది జీవులపట్ల అంతులేని అపేక్ష కలిగివుంటుంది అందుకోసమే భౌతిక శరీరం ధరించి భూమిపై అవతరించింది జీవులన్నింటి విముక్తి కోసం పనిచేస్తుంది ఈ భౌతిక శరీరం మామూలు నేత్రాలకు కనిపిస్తున్న మేరకు రక్తమాంసాలు కలిగివుంటుంది అదే రూపకాయం అంటే బుద్ధుడి భౌతిక కాయం

పురాణాలను, ఆదిభౌతికవాదాన్ని కలగాపులగం చేయడంద్వారా మహాయానులు ఒక విషయంలో సంతృప్తి చెందారు తద్వారా వారు చారిత్రక బుద్ధుడిని నిర్మూలించడంలో కృతకృత్యులయ్యారు ఇక ఆ తర్వాత బుద్ధుడికి దేవుడిపై గల అయిష్టతను బౌద్ధంనుండి తొలగించడం వారికి కష్టం కాలేదు అఖండ సత్యం అన్న దృష్టితో చూసినప్పుడు ధర్మ కాయం వర్ణనకతీతమైనదైనప్పటికీ దైనందిన వ్యవహారాలలో మునిగితేలే సామాన్య ప్రజల అవగాహనకు అవసరమైంది కూడా దానిలో ఉన్నది ప్రపంచ విలక్షణసారమే వైరోచనుడు అమితాభుడు, తార తదితర పేర్లతో పూజింపబడుతుంది అదే ధర్మకాయం ఆవిధంగా బౌద్ధం ఒక్కసారిగా ఈశ్వర సర్వస్వ వాదంలోకి ఈశ్వరవాదంలోకిమారిపోయింది విశ్వవ్యాప్తవాదం అని ప్రొఫెసర్ అనేసాకి దీనికి నామకరణం చేశాడు

ఈవిధంగా ధర్మకాయం అన్న దృక్పదాన్ని సృష్టించడంద్వారా మహాయానులు ఒక్క మినహాయింపుతో దేవుని లక్షణాలుగా చలామణిలో వున్న వాటినన్నింటినీ జొప్పించారు అతను సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు, సర్వోన్నతుడు, సర్వ దయామయుడు వగైరా లక్షణాలు కల్పించాడు అతడు సృష్టికర్త అన్న విషయాన్ని మాత్రం నిరాకరించాడు దేవుడంటే ప్రధానంగా ప్రపంచాన్ని సృష్టించినవాడు అని చెప్పే ఇతర భారతీయ ఆస్తిక తత్వవేత్తలకు వ్యతిరేకంగా నాగార్జునుడితో మొదలుపెట్టి ప్రముఖులైన మహాయాన తాత్వికులందరూ వాదనలు చేశారు

ఇది ఉభయతారకంగా ఉపయోగపడింది. బుద్ధుడు చెప్పిన మౌలిక నాస్తికత్వానికి లాంఛనంగా వారు విధేయత అట్టిపెట్టుకోవడానికి వీలు కలిగింది ఎందుకంటే సృష్టికర్త అన్న భావాన్ని తిరస్కరించడంద్వారా వారు ఈశ్వరుడు లేదా దేవుడు అన్న ఆస్తికుల భావాన్ని పూర్తిగా నిరాకరిస్తున్నారు మరోవైపున అంతకన్నాముఖ్యమైన తాత్విక ప్రయోజనం కూడా

నెరవేరింది ప్రపంచం ప్రధానంగా మిధ్య అని తాము చేస్తున్న వాదనను సమర్థించుకోవడానికి అవకాశం లభించింది సృష్టికర్త అన్న భావాన్ని ఒకసారి ఆమోదించినట్లయితే సృష్టి వునికిని అంగీకరించినట్లవుతుంది దీన్ని తీవ్రంగా తీసుకుంటే సృష్టించబడిన ప్రపంచ యధార్థత్వాన్ని కూడా ఒప్పుకోవలసి వస్తుంది కనుక సృష్టికర్త అన్న భావనను త్రోసిపుచ్చడంద్వారా నయాబౌద్ధులు ప్రపంచం ప్రపంచసృష్టి, అన్నీ మిధ్య తప్ప మరేమీ కాదని నిరూపించగోరారు గౌడపాదుడు తర్వాత ఈ అంశాన్నే పునరుద్ఘాటించాడు దాన్నే అజాతవాదం అంటారు ప్రపంచం ఎప్పుడూ నిజంగా ఉనికిలోకి రాదని చెప్పే సిద్ధాంతమది సృష్టికర్త అన్న దృక్పథాన్ని తిరస్కరించే సాంకేతిక వాదనలవల్ల భారతీయ తత్వశాస్త్రంలో నాస్తిక సాంప్రదాయాలకు కలిగిన ప్రయోజనాలు ఎన్ని ఉన్నప్పటికీ మహాయాన బౌద్ధులు బౌద్ధంలో సర్వాతీత భగవంతుడు అన్న దృక్పధాన్ని ప్రవేశపెట్టారనే వాస్తవాన్ని మాత్రం విస్మరించరాదు

సర్వాతీత భగవంతుడిని బౌద్ధంలో ఒకసారి ప్రవేశపెట్టిన తర్వాత అన్నిరకాలైన అతీతశక్తులు, తదుపరి దేవతలు, భూతాలు, దుష్టాత్మలు వగైరాలన్నీ రావడానికి ద్వారాలు తెరిచి నట్లయింది దేశంలోని ఫ్యూడల్ వ్యవస్థనుండి అవన్నీ సంక్రమించాయి [1] మహాయాన చైత్యంలోకి ప్రవేశించితే చాలు అక్కడ బుద్ధుడి సరళమైన నాస్తికత్వంపై అనేక అంశాలు తెచ్చిరుద్దిన శిల్పాలు, చిత్రాలు కనిపిస్తాయి దీనంతటివల్ల మలి బౌద్ధుల మతాచారాలు మారిపోక తప్పలేదు దేవుడి అనుగ్రహం కోసం ప్రార్థించడం ఇతర చిన్న చిన్న దేవతలను పూజించడం, భూతాలను, క్షుద్రశక్తులను శాంతింపజేయడం కోసం క్రతువులు నడపడం వగైరాలు సర్వసాధారణమైపోయాయి మహాయానం ఆచరణలో ప్రార్థనలు, క్రతువులు, మార్మిక తతంగాలు తదితర అన్నిరకాల ఆచారాల అసాధారణ సమ్మేళనంగా మారిపోయింది క్లుప్తంగా చెప్పాలంటే బౌద్ధం సిద్ధాంతరీత్యానూ, ఆచరణ రీత్యానూ ఒక పెద్ద మూఢత్వంగా మారిపోయింది దీనంతటి రక్షణలో మహాయాన తాత్వికులు, బుద్ధుడి ఉన్నత బోధనల పేరిట ఉపనిషత్ భావవాదంలోని ప్రధానాంశాలను తిరగదోడడం సంభవించింది

అయితే ఈ తాత్వికులు కేవలం అతీత శక్తులపైనే ఆధారపడ్డారని కాదు చాలా నైపుణ్యంగల అధిభౌతికవాదులు వారిలో వుండేవారు ఉపనిషత్తులలోని విశుద్ధ భావవాదానికి వారు ఒక ఉన్నతస్థాయి తాత్విక సంక్లిష్టత చేకూర్చిపెట్టారు అయితే విషయమేమంటే అదే తాత్వికులు సరికొత్త మూఢత్వాన్ని కూడా ఎక్కువగానే విశదీకరించారు ఆవిధంగా దాని అవసరాన్ని గుర్తించారు ఎందువల్ల ఈ అవసరం కలిగింది? భావవాద దృక్పథం ఒక చేదుమాత్ర వంటిది యధార్థ జీవితంలోని కఠోరమైన ఇంగితజ్ఞానం దాన్ని గట్టిగా ప్రతిఘటిస్తుంది కనుక ప్రజలు దాన్ని అంతతేలిగ్గా స్వీకరించలేరు పొడిపొడిగా తాత్విక వాదోపవాదాలు ఎంత నైపుణ్యంగా చేసినా అవి ఇందుకు పనికిరావు తిరుగులేని ఇంగితజ్ఞానాన్ని కూడా ఛేదించగలగాలి తీవ్రమైన మూఢనమ్మకాలు మాత్రమే అందుకు

---

1 ఆర్ ఎస్ శర్మ-ప్రాచీన భారతంలో వ్యవస్థలు-రాజకీయాంశాలు

పనికివస్తాయి ఈ కోణంనుండి చూసినప్పుడు మహాయానతత్వాన్ని వ్యాప్తి చేయడానికి మహాయాన మతం అవసరమే అవుతుంది ఇక్కడ మనకు అసక్తిగల ప్రశ్న ఒక్కటే బౌద్ధం మతంగానూ, తత్వంగానూ పరివర్తన చెందడానికి కావలసినదేది? ప్రస్తుతం మనకు అందుబాటులోవున్న సమాచారం ఈ ప్రశ్నకు జవాబునిచ్చేందుకు సరిపోదు అయితే ఒక విషయం మాత్రం స్పష్టం ఆర్థికంగానూ, రాజకీయంగానూ బౌద్ధమతానికి వర్తకులు, స్థానిక పాలకులనుండి పెద్దపెద్ద రాజులనుండి కూడా మద్దతు లభించింది ఈ రాజపోషణ దానికి పెద్ద ఆకర్షణ సంతరింపజేసింది క్రమక్రమంగా అది పరాన్నభుక్కు తత్వానికి లోబడింది బుద్ధుడు తన శిష్యులకు బోధించిన కొన్ని నమ్మకాలను, ఆచారాలను త్రోసిపుచ్చే అంశాలకు లోబడిపోయింది

ఈ ప్రాపకానికి పునాదులు బహుశా బుద్ధుడి జీవితకాలంలోనే చూడగలుగుతాము ఆయన వాస్తవిక సమస్యకు భావాత్మక పరిష్కారం చూపాడు హృదయస్వాంతన సాధించడం, జీవితం సృష్టించే మానసిక వికారాలను అణచుకోవడం అన్నదే బుద్ధుడు చెప్పిన ప్రక్రియ తొలి దశలోకూడా అది ఆయుగంలో ప్రజలకు కావలసిన కాల్పనిక ఉపశాంతినే అందించగలిగింది దానికి రాజులు, వ్యాపారులనుండి ఆర్థిక సహాయం లభించింది ప్రజలలో అసంతృప్తి ప్రజ్వరిల్లకుండా మెత్తపరిచే అలాంటి బోధనలు తమకు ప్రయోజనకరమని వారు గ్రహించారు సమాజంలోని సంపన్నవర్గాలనుండి అందిన ఖరీదైన బహుమతుల జాబితా బౌద్ధ సాంప్రదాయంలో మనకు కనిపిస్తుంది అనాథ పిండకుడు ఇచ్చిన జేతవనం వీటిలో అత్యంత అద్భుతమైనది ఆ ఉద్యానవనం కొనుగోలు, నిర్మాణం కోసం 54కోట్ల బంగారు నాణాలు వెచ్చించినట్లు చెబుతారు ఇంతమొత్తం ఖర్చు అయినట్లు అతిశయోక్తిగా చూపించడానికి కారణం దాత వదాన్యతను ఎక్కువ చేసి చెప్పటమే బౌద్ధ సంప్రదాయం ప్రకారం వారికి ఆదరణ అశోక చక్రవర్తి కాలంలో తారాస్థాయికి చేరింది అప్పుడే బౌద్ధానికి నిజంగా తొలిసారి ఊపు వచ్చింది గంగా మైదానంలో కొద్దిమంది సభ్యులు గల సమూహాలకు పరిమితమైవున్న బౌద్ధం సరిహద్దులను దాటి విస్తరించింది ఇందుకు కేవలం కృతజ్ఞతగా పవిత్రులైన బౌద్ధులు అశోకుణ్ణి రెండవ బుద్ధుడని కీర్తించారు లేక బౌద్ధ పద్ధతిలో చెప్పాలంటే ద్వితీయ ధర్మచక్ర పరివర్తకుడు (చక్రాన్ని తిప్పిన రెండవ వ్యక్తి) అన్నమాట అశోకుడి హృదయంలో బౌద్ధం నిజంగా ఎంతవరకు ప్రవేశించింది అన్న విషయంలో ఆధునిక చరిత్రకారులకు చాలా సందేహాలున్నాయి విశాల ఉపఖండంలో తన అధికారాన్ని విస్తరించుకోవడానికి, స్థిరపరచుకోవడానికి ఈ నూతన సిద్ధాంతం చాలా ఉపయోగకరమని ఆయన భావించాడు క్రూరమైన అణచివేత, సామూహిక నరమేధం సాగించిన అశోకుడు అంతకన్నా బౌద్ధం మెరుగైన ఎత్తుగడ అని గ్రహించగలిగాడు ఈ సైద్ధాంతిక విజయం లేక ధర్మవిజయం అన్నది ఆయుధాలకన్నా చాలా మెరుగని ఆయన శాసనాలు అభివర్ణిస్తాయి

అయితే బౌద్ధానికి సంపన్నవర్గాలు అందించిన ఆదరణలో ఇది ఒక అధ్యాయం మాత్రమే తారానాధుడు రచించిన "భారతదేశంలో బౌద్ధ చరిత్ర" చదివితే అది అశోకుడి

తర్వాతకూడా ఎలా కొనసాగిందో తెలుస్తుంది ఆ దశకు సంబంధించిన భారతీయ బౌద్ధాన్ని గురించిన చాలా సమాచారమందజేసిన ఈ టిబెట్ చరిత్రకారుడికి మనం చాలా రుణపడివుండాలి తారానాథ్ మొదట ఇచ్చిన పట్టికలోనే బౌద్ధానికి విరాళాలిచ్చిన వారిపట్ల ఉత్సాహం కనిపిస్తుంది దాని ప్రచారకుల పట్ల కూడా అతనికి అదేవిధమైన ఉత్సాహం వుంది

అనేక శతాబ్దాలపాటు బౌద్ధాన్ని వర్ధిల్లచేసిన ఈ పోషణ దాని బాహ్యాడంబరానికి, అట్టహాసానికి చాలావరకు కారణమైంది దేశవ్యాపితంగా అసంఖ్యాకంగా బౌద్ధ మఠాలు, విహారాలు నెలకొల్పబడ్డాయి నిరంతరం బోధనల్లో గడిపేవారికి ఆర్థిక వనరులు కేటాయించబడ్డాయి బౌద్ధగ్రంధాలను ఎత్తిరాసేందుకు, ప్రచారం చేసేందుకు ఎంతో ఖరీదైన పద్ధతులు అనుసరించారు తారానాధుడు మహాయాన ప్రచారం కోసం చేసిన ఖర్చును గురించి పేర్కొనే ఒక్క భాగాన్ని మాత్రం ఇక్కడ ఇస్తాను "మూడవ మహా సమ్మేళనం తర్వాత రాజు కనిష్కుడు కన్నుమూశాడు ఉత్తరాదిన కాశ్మీర్‌కు పశ్చిమంగా తొగర దేశంలోని అస్మపరంతలో అత్యంత సంపన్నుడైన ఒక యజమాని వుండేవాడు. ఆయన 12ఏండ్లపాటు 3లక్షలమంది సన్యాసులను పోషించాడు "

పుష్కలావతి సౌధంలో కనిష్కుడి కుమారుడు అయిదేళ్ళపాటు వందలాదిమంది ఆర్యులకు ఆహుతులకు 10వేలమంది సన్యాసులకు ఆతిధ్యమిచ్చాడు తూర్పునగల కుసుమపురాలో విధు అనే బ్రాహ్మణుడు వుండేవాడు త్రిపిటకం ప్రతులు అనేకం తయారు చేయించి సన్యాసులకు విరాళంగా ఇచ్చాడు పూజకోసం ప్రతి సన్యాసికి బోలెడు సొమ్ములు ఇచ్చాడు

ఆసమయంలో మహాయాన ప్రచారం కోసం వేర్వేరుచోట్ల లెక్కలేనన్ని కళ్యాణమిత్ర అన్న నిర్మాణాలు సాగాయి మహాయాన సిద్ధాంత ప్రచారకులు 500మందివరకు వుండేవారు దేవ, నాగ, గంధర్వ, రాక్షస తదితర భూభాగాలనుండి వచ్చినవారు సూత్రాలవంటివి నేర్చుకునేవారు

ఈవిధంగా తారానాధుడి పుస్తకం ఒక్కో పుటలోనూ బౌద్ధానికి రాజులనుండి, సంపన్నులనుండి లభించిన ఆదరణ తాలూకు వివరాలు అనేకం కనిపిస్తాయి

దీనివల్ల ఆ సిద్ధాంత వ్యాప్తిలో చోటుచేసుకున్న అవలక్షణాలను గురించి మహాయానాన్ని అభిమానించే ఆ వ్యక్తి రాస్తాడని మనం నిజంగా ఆశించలేము మనకు సంబంధించినంతవరకు ముఖ్యాంశం ఒక్కటే సమాజంలోని ఉన్నతవర్గాలపై ఆధారపడి వారి అనుమతితో బ్రతకడంకంటే బౌద్ధ సిద్ధాంతానికి హానికరమైంది మరొకటి లేదు ఆ సిద్ధాంతాన్ని అనుసరించేవారి ఆంతరంగిక శక్తిని అది దెబ్బతీసింది బుద్ధుడి స్ఫూర్తికి భిన్నమైన అన్నిరకాల నమ్మకాలు, ఆచారాలు చొరబడుతున్నా నిస్సహాయంగా చూస్తూండిపోయింది ఎందుకంటే ఎవరైతే వేణువుకు ధర చెల్లిస్తారో వారికే దాని రాగాలపై కూడా హక్కు వుంటుంది కదా

ఆర్ ఎస్ శర్మ ఇందుకు మంచి ఉదాహరణ ఇస్తాడు

"కుషాణ పాలకుల్లో చాలామంది బౌద్ధులైనప్పటికీ వారే దేవపుత్ర బిరుదు ధరించారు చనిపోయిన రాజును ఆరాధించే పద్ధతి ప్రవేశపెట్టారు రాజును దేవుడిగా మార్చడం బౌద్ధ సిద్ధాంతాల సూత్రాలకు తెలియని విషయం దీగనికాయము అన్న గ్రంధాన్నిబట్టి మనకిది తెలుస్తుంది దేవపుత్ర బిరుదాన్ని కుషాణ రాజులు ఒకసారి ధరించిన తర్వాత మహాయాన బౌద్ధ బోధనల్లో సువర్ణ ప్రభాసోత్తమ సూత్రమన్నది చొప్పించారు శిల్వేన్‌లెవి దాన్ని మొదటిసారిగా గమనించారు రాజుగా పుట్టిన వ్యక్తిని దేవుడని, దేవపుత్రుడని ఎందుకంటామని దానిలో ప్రశ్నించారు మనిషిగా పుట్టకముందు అతను దేవతలమధ్య జీవించేవాడు 33మంది దేవుళ్ళు తమతమ అంశలను అతనికి ధారపోశారు కనుక దేవ పుత్రుడని పిలుస్తారు అని జవాబు ఇచ్చారు" తన మహారాజ పోషకుల అవసరాలకు ఉపయోగపడే నిమిత్తం తదుపరి బౌద్ధం తన సైద్ధాంతిక కర్తవ్యాలను మార్చుకున్న తీరును గమనించాలి ఎందుకంటే అంతకంతకూ ఎక్కువగా అది వారి ఆర్థిక రాజకీయ సహాయంపైనే ఆధారపడుతూ వచ్చింది ఈ సరికొత్త సైద్ధాంతిక పరిణామంలో అతి ముఖ్యమైన విషయమేమంటే యధార్ధ ప్రపంచ ఉనికిని నిరాకరించే భావవాద దృక్పధానికితోడు భయోత్పాతం కలిగించే మూఢ నమ్మకాలు చేర్చబడ్డాయి దీనివల్ల కలిగిన సాంఘిక ప్రయోజనం మనం తర్వాత చర్చిద్దాం భావవాద దృక్పధం దానితో ముడిపడిన మూఢనమ్మకాలు పీడిత ప్రజలను వారి వారి ఆర్థిక, సాంఘిక దీనావస్థకుఎలా కట్టిపడవేసి వుంచాయో తెలుసుకోవచ్చు చివరిదశలో బౌద్ధం ఇందుకు గొప్పగా ఉపయోగపడింది అయితే అందుకు చాలా మూల్యం చెల్లించాల్సివచ్చింది అది ఒక స్వతంత్ర ఉనికిని కోల్పోయింది తాత్వికంగా చెప్పాలంటే మరింత అధునాతనమైన రీతిలో ఉపనిషత్ భావవాదాన్ని పునరుద్ఘాటించేదిగా తయారైంది ఆస్థిక పరిభాషలో చెప్పాలంటే అతిమొరటైన రీతిలో వున్న బ్రాహ్మణమతంగా తిరోగమించింది

పరాయిభావనలు, ఆచారాలు బౌద్ధంలో చొరబడడంవల్ల క్రమక్రమంగా అది ఎలా కుప్పకూలిందో అర్థం కావడానికి తగినంత సమాచారం తారానాధుడు అందజేశాడు చాలావరకు మొదట్లో బుద్ధుడు ఏ భావాలకు, ఆచారాలకు వ్యతిరేకంగా బోధనలు ప్రారంభించాడో వాటితోనే అది విడదీయని రీతిలో పెనవేసుకుపోయిందని ఆయన వర్ణించిన బౌద్ధ చరిత్ర తెలియజేస్తుంది భారతదేశంలో బౌద్ధానికి ఆఖరి ప్రధాన కేంద్రమైన విక్రమశీల విహారం ధర్మపాలుడనే రాజు నిర్మించాడు బలులు, హోమాలకు అక్కడ విశాలమైన ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నట్లు తారానాధుడు వర్ణించాడు తరతరాలుగావున్న బలి కార్యక్రమాలు నిర్వహించే మతాధిపతులు అదివరకు బౌద్ధంలో వుండేవారుకాదు కాని వారేఇప్పుడు వీటిని వినియోగించడం ప్రారంభించారు

*దాని మధ్యలో వున్న ప్రధాన దేవాలయంలో మహాబోధి నిలువెత్తు విగ్రహమున్నది దానిచుట్టూ 33 చిన్న గుహ్యతంత్ర ఆలయాలు, 54 మామూలు ఆలయాలు ఉన్నాయి*

*ఆవిధంగా రాజు ధర్మపాలుడు విహారాన్ని 108 దేవాలయాలు, ప్రాకారాలతో సహా నిర్మించారు దానికి విలాసవంతమైన ఆహారం, వస్త్రాలు సమకూర్చారు 108మంది పండితులు, బలిఆచార్యులు, ప్రతిష్టానాచార్యులు, హోమాచార్యులు, మూషికపాలకులు, కపోతపాలక, దేవదాసీ పర్యవేక్షక తదితర 114మంది సేవకులను నియమించారు వారిలో ఒక్కొక్కరి కోసం నలుగురికి సరిపడే ఏర్పాట్లు చేయించాడు బోధనలు వినేవారికోసం ప్రతి నెలా ఉత్సవం జరిపించి వారికి అద్భుతమైన బహుమానాలు ఇచ్చేవారు*

ఈకేంద్రంలో అతి ప్రముఖులైన ఆధ్యాత్మిక నాయకుల్లో బుద్ధ జ్ఞానపాదులు ముఖ్యుడు అయితే ఆయన ఆధ్యాత్మిక కార్యకలాపాలు తన పోషకుడి సంపదలను పెంపొందించేందుకై ఉద్దేశించబడ్డాయి

మీ మనవడి కాలంలో మీ రాజ్యం పతనమౌతుంది మీరు బృహత్ హోమం చేయండి తద్వారా మీ వంశం నిలబడుతుంది సిద్ధాంతం కూడా వ్యాప్తి చెందుతుంది అని అతను ధర్మపాలునికి చెప్పాడు ఆ ప్రకారమే ధర్మపాలుడు వజ్రధరులతో అనేక సంవత్సరాలపాటు ఈ ఆచార్యుని ఆధ్వర్యంలోనే హోమం జరిపించాడు క్రతువులు జరిగే సందర్భంలో 9 లక్షల 2వేల తులాల విలువైన వెండి వస్తువులు దానంగా ఇచ్చాడు మీ వారసులు 12మంది రాజులౌతారు 5వ వారసుని నుండి మరిన్ని దేశాలు వారి పాలనలోకి వస్తాయి బౌద్ధం కూడా మరింత విస్తృతంగా వ్యాపిస్తుంది అని ఆచార్యుడు రాజుకి చెప్పాడు

ఇలాంటి మరిన్ని ఉదాహరణలు అవసరంలేదు విక్రమశీల విహారంలో జరిగే ఈ వ్యవహారాలన్నీ చూసివుంటే ప్రవక్త (బుద్ధుడు) కంపించిపోయి వుండేవాడు కాని మహాయాన బౌద్ధులు అప్పటికే అతడిని సుఖప్రదంగా తుషిత స్వర్గంలోకి పంపించి వేశారు క్లుప్తంగా చెప్పాలంటే బౌద్ధానికి చివరి గొప్ప కేంద్రమైన ఈ విహారంలో కేవలం దాని కళేబరమే మిగిలింది కొంతమంది మహారాజ పోషకులపైనే అది ఆధారపడిపోయింది బెంగాల్‌కు చెందిన పాలులు వారిలో చివరివారు పాల రాజులు పతనమై పోవడంతో భారతదేశానికి బౌద్ధాన్ని కట్టివుంచిన చివరి బంధాలు తెగిపోయాయి అప్పటినుండి విదేశాలలో పోషకుల కోసం పాకులాడటం మొదలుపెట్టింది కేవలం పరాన్నభుక్కు తత్వంపైనే ఆధారపడిన తర్వాత బౌద్ధానికి పట్టిన గతి అది

# III

# భారతీయ భావవాదపు సామాజిక పాత్ర

సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రాన్ని గురించి రాసిన ఆధునిక రచయితలు దాని ఒక ప్రత్యేకతను పైపైన మాత్రమే పరిశీలించారు అయితే పూర్తి అవగాహనకోసం దాన్ని వివరంగా పరిశీలించడం చాలా అవసరం మొత్తంగా తాత్విక కృషిపట్ల ప్రత్యేకించి స్వతంత్ర ఆలోచనా ధోరణి లేక దాదాపు హేతువాద దృక్పథం గల తాత్విక కృషి పట్ల స్మృతికారులు ప్రదర్శించిన వైఖరి ప్రభావాన్ని పరిశీలించడంద్వారానే ఆ అంశం తెలుసుకోగలుగుతాము

స్మృతికారులకు నచ్చని విషయాలలో స్వతంత్ర ఆలోచనా ధోరణి ఒకటి వారి ఉద్దేశంలో స్వతంత్ర ఆలోచన అంటే సాధారణ విశ్వాసాలకు అతీతంగా ఆలోచించడమన్నమాట మరోవిధంగా చెప్పాలంటే వేదాలలో వున్నదానికి పూర్తి విధేయతతోకాకుండా హేతుబద్ధంగా ఆలోచించడమన్నమాట సాధారణంగా భారతీయ స్మృతికారులు దాన్ని నిషేధిస్తారు చట్టానికి వ్యతిరేకంగా జరిగే ఇతర నేరాలను ఎంత తీవ్రంగా నిషేధిస్తారో ఇదికూడా అంతే స్వతంత్ర ఆలోచన కూడా వారి నేరాల జాబితాలో వుంది వేర్వేరు స్మృతులు ఈ నేరం తీవ్రతను గురించి వేర్వేరుగా వర్ణించినప్పటికీ అన్నింటిలోనూ కఠినశిక్షలే నిర్దేశించబడ్డాయి సరైన అర్థంలో తాత్విక విచారణను ప్రోత్సహించే అంశాలేవీ వీటిలో వుండవనేది స్పష్టమే సత్యాన్వేషణకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం స్మృతికర్తల అభిమతంకాదు మరైతే తాత్వికులు ఇందుకు ఎలా స్పందించారు?

మధ్యయుగాలనాటి ఐరోపాలో విచారణల సందర్భంగా క్రైస్తవుల మతాధిపతులను ధిక్కరించడం ఎంత కష్టమో అలాగే ఇక్కడ కూడా స్మృతికారులను బహిరంగంగా ధిక్కరించడం కష్టంతో కూడుకున్న పని అదేసమయంలో ఈ స్మృతులపట్ల కొందరు తాత్వికులు హృదయపూర్వకమైన ఉత్సాహం చూపించడాన్నిబట్టి స్మృతికారులు జ్ఞానాన్ని

ప్రేమించారనికానీ, అభివృద్ధిని కాంక్షించారనిగానీ చెప్పడం పొరపాటవుతుంది స్మృతికారులపట్ల భారతీయ తాత్వికుల వైఖరులు భిన్నంగా వున్నాయి వారి తాత్విక చింతనల పునాదులకు వీటికి చాలా సంబంధం వుంది

భారతీయ తాత్వికుల్లో ఒక వర్గం ముఖ్యంగా కరడుకట్టిన భావవాదులు తమ స్వతంత్ర ఆలోచనలపై శాసనపరమైన ఆంక్షలను ఆమోదించారు స్మృతికారులను ఆమోదించడంకోసం వారు సైద్ధాంతిక విశ్లేషణలు కూడా సృష్టించారు స్వతంత్ర ఆలోచన, విశృంఖలమైన హేతుశీలత స్వతహాగానే తప్పు అని, అందుకే వాటిపై ఆధారపడజాలమని సూత్రీకరించారు పై ఆంక్షలు తమ తాత్విక ప్రయోజనానికి సరిపడకపోతే వారు ఇలా చేసేవారు కాదు కాని ఇక్కడ విషయమేమంటే ఇది స్మృతికారుల సాంఘిక, రాజకీయ ప్రయోజనాలకు కూడా చక్కగా సరిపోయింది భావవాదులకు గొప్ప రాజకీయ ప్రాపు లభించడానికి కారణమిదే తమ అభిప్రాయాలు విజ్ఞాన సారాంశాన్ని ప్రతిబింబిస్తున్నట్లు స్మృతికారులు గొప్పగా ప్రకటించుకున్నారు

భారతీయ తాత్వికుల్లో మరోవర్గం ముఖ్యంగా సూటిగా మాట్లాడే భౌతికవాదులు స్వతంత్ర ఆలోచనల గొంతు నులిమే ధోరణిని గట్టిగా వ్యతిరేకించారు స్మృతికారులను, హేతువాదానికి వ్యతిరేకమైన వారి చర్యలను బహిరంగంగా, మొండిగా ధిక్కరించారు సహజంగానే వారు దీని పర్యవసానాలను ఎదుర్కోవలసి వచ్చింది వారిపై అసురులని, వితండవాదులని ముద్రలు వేశారు సాంఘిక సహజీవనంనుండి వారిని గెంటివేశారు వారి రచనలను అందుబాటులో లేకుండా నాశనం చేశారు వారిని సజీవదహనం చేసిన కథలు కూడా ఉన్నాయి

అయితే భారతీయ తత్వశాస్త్రంలో హేతువాదాన్ని సమర్థించినవారు సూటిగా మాట్లాడే ఈ భౌతికవాదులు మాత్రమే కాదు. ఇతరులుకూడా వున్నారు తార్కికులు, అణువాదులు భారతీయ హేతువాదానికి చేసిన సేవ చాలా గొప్పది లోపాయికారిగా పనిచేయడమే శ్రేయస్కరమని వారు భావించారు భౌతికవాదులతో చాలా విషయాల్లో పాలుపంచుకుంటూనే ముక్కుసూటిగా మాట్లాడేవారివలె వ్యవహరించలేదు లాంఛనంగాను, కొన్ని సార్లు దృఢంగాను కూడా భౌతికవాదంతో విడగొట్టుకున్నారు స్మృతికారుల ప్రాథమిక షరతులమేరకు వారు వేదాలపై విశ్వాసాన్నికూడా పైకి ప్రదర్శించారు అయితే దాన్ని తీవ్రంగా తీసుకోనవసరంలేదు గెలీలియో మతాధిపతుల శిక్షకు గురౌతున్నాడన్న వార్తతో రారెత్తిన డెస్కార్టెస్ తన విశ్లేషణాత్మక రేఖాగణిత పరిశోధనలను కృతజ్ఞతగా లోరెటో మందిరానికి తీర్థయాత్రకు వెళ్ళడంలాంటిదే ఇది కూడా

భారతీయ తాత్వికులు దేశంలోని స్మృతికారుల పట్ల ప్రధానంగా ప్రదర్శించిన మూడురకాల ధోరణులు ఇవి ప్రస్తుత అధ్యాయంలో మనం మొదటి తరహాకు చెందిన వాటిని గురించి తెలుసుకుంటాం

# స్మృతికారుల వైఖరి

స్మృతికారులకు కావలసిందేమిటో మొదట తెలుసుకుందాం విదేశాలలోని తమ సహచరులలాగే భారతీయ స్మృతికారులు కూడా తమకు లాభదాయకమైన సామాజిక వ్యవస్థను భద్రంగా కాపాడుకోవటంపట్లనే ఆసక్తి కలిగివున్నారు వారు చెప్పే సమాజం వాస్తవానికి పూర్తి అనుగుణంగా వున్నదా లేదా అనేది వేరే విషయం సమాజం ఎలా నిర్మించబడాలన్న వారి దృక్పధమే మనకు ముఖ్యమైంది దీన్ని కాపాడుకోవటంకోసం వారు తామే తాత్వికులం కావడానికి బదులు తాత్విక విషయాలపై తమకు ఉపయోగపడే ఒక వైఖరిని కోరుకున్నారు మరోవిధంగా చెప్పాలంటే ప్రాచీన మధ్యయుగాల భారతంలోని వివిధ దశల్లో వున్న నిజమైన సామాజిక నిర్మాణం మన స్మృతికారులు చెప్పిన ఆదర్శ సమాజమే అనుకోనక్కరలేదు, అదినిజం కాదుకూడా అయినప్పటికీ స్మృతికారులుగా వారికి కావలసిందల్లా తత్వశాస్త్రం అందుకు ఆటంకం కలిగిస్తుందా లేక బలపరుస్తుందా అనే సమస్య ఒక్కటే

అపార్ధానికి అవకాశంలేకుండా ఇక్కడ కొన్ని విషయాలను గమనించాలి మన స్మృతికారులు చెప్పే ఆదర్శ సమాజం కేవలం ఊహాజనితమైంది వారి తలల్లో మాత్రమే అది ఉంటుంది అయితే దానిలోని కొన్ని ముఖ్యాంశాలు మాత్రం ప్రాచీనకాలపు ఉత్తరభారతదేశంలో రూపుదిద్దుకుంటున్న నిజమైన సమాజంలో కనిపిస్తాయి అక్కడ అమలులోవున్న ప్రవర్తనా నియమావళి నియంతృత్వం అని స్మృతికారులే ప్రకటించారు రెండో విషయం స్మృతికారులు రూపొందించిన సాంఘిక నియమాలు వారి సృష్టికాదు బ్రాహ్మణాల రచయితలు అప్పటికే వాటిని తయారుచేశారు ప్రాచీన గిరిజన వ్యవస్థల శిధిలాలపై ఆవిర్భవిస్తున్న తొలి రాజ్యశక్తులకు చట్టబద్ధత కల్పించడానికి అవి రూపొందాయి మూడో విషయం భారతీయ స్మృతికారులు ప్రకటించిన సాంఘిక సాంప్రదాయాల అమలు, పరిరక్షణ రాజ్యంయొక్క ప్రధాన కర్తవ్యాలలో ఒకటి అని కౌటిల్యుడి అర్ధశాస్త్రంవంటి రాజకీయ ఆర్థిక రచనలు, అలాగే అనేక శాసనాల ఆధారాలు పరిశీలిస్తే అర్థమౌతుంది అందువల్లనే మనం ఒక ఆచారాన్ని లేక రాజకీయ సిద్ధాంతాన్ని చర్చిస్తున్నామంటే దాని అర్థం అది సాంఘిక ఆచరణతో నిమిత్తంలేని ఒక అమూర్త సిద్ధాంతం అని కాదు స్మృతికారుల సాంప్రదాయం ఎప్పుడూ పూర్తిగా వాస్తవికం కానప్పటికీ నిజమైన సమాజంపై దాని ప్రభావాన్ని తక్కువ అంచనా వేయరాదు అయితే భారతీయ తాత్విక పరిస్థితిని అర్థం చేసుకోవడం కోసం మనం ప్రధానంగా దాని సైద్ధాంతిక భాగాన్ని చర్చించాలి ఆ ప్రధానాంశాలేమిటి?

భారతీయ స్మృతికారుల రాజకీయ తత్వం వర్ణాశ్రమ ధర్మం అది చాతుర్వర్ణ సమాజం వ్యక్తుల విధులు, హక్కులు, బాధ్యతలు, ఆకాంక్షలు ఇవన్నీ ఒక కులంలో పుట్టుకతోనే నిర్ణయమైపోయే వ్యవస్థ అది వర్ణాశ్రమాన్ని గురించిన ఈ అవగాహన

తప్పుకాకపోయినప్పటికీ దానికి సంబంధించిన మరో అంశాన్ని మినహాయించినట్లయితే సమగ్ర దృష్టి కలగదు స్మృతికారులు ఆ రెండో అంశాన్ని నిరంతరం నొక్కి చెబుతుండేవారు నాలుగు కులాలు సమాజంలో రెండు ప్రధాన వర్గాలుగా ఉన్నాయనేదే ఆ ముఖ్యాంశం

వర్ణాశ్రమ ధర్మం సమాజాన్ని ద్విజులు, శూద్రులు అన్న రెండు వర్గాలుగా విభజించివేసింది ద్విజులు అంటే రెండు జన్మలు కలవారు అని అర్థం రెండోవర్గం వారికి ఆ అవకాశం లేదు స్మృతికారులు ఈ అంశాన్ని ఎలా చెప్తారో చూడండి *"బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు రెండుసార్లు జన్మిస్తారు (ద్విజులు) అయితే నాల్గవ వారైన శూద్రులకు ఒకే జన్మ వుంటుంది అయిదవ కులం లేదు"* అని మనువు ప్రకటిస్తాడు శూద్రుడు ఒకే ఒక జన్మగల నాలుగవ కులానికి చెందినవాడు అని గౌతముడు చెప్తాడు విష్ణు ధర్మసూత్రాల ప్రకారం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అన్నవి నాలుగు కులాలు వీటిలో మొదటి ముగ్గురూ రెండుసార్లు జన్మిస్తారు

ద్విజులు లేక రెండుసార్లు జన్మించినవారు అన్న పదానికి కొంత వివరణ ఇవ్వాలి తల్లి గర్భంనుండి జన్మించిన తర్వాత బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఉపనయనం ద్వారా రెండవ జన్మ పొందుతారు ఈ పునర్జన్మ గురించి ఐతరేయ బ్రాహ్మణం వివరంగా వర్ణిస్తుంది చావు, పుట్టుకల సందర్భంలో గిరిజనులలో అమలులో వుండే పద్ధతిపైనే ఇది అధారపడివుంది అయితే దానికి కల్పించిన ప్రాధాన్యత మరోవిధంగా వుంది గిరిజన సమాజ దశలో సమాజ సభ్యునిగా స్వీకరించడమే ఈ క్రతువు పరమార్థం. వ్యక్తికి పూర్తి గిరిజన హోదా కల్పించి గిరిజన జీవిత బాధ్యతలు కూడా అప్పగించడం దాని ఉద్దేశం అందులో సమిష్టి శ్రమ కూడా వుంటుంది అదే లేకపోతే తెగ మన జాలదు అయితే వర్గ సమాజ నేపథ్యంలో చూస్తే ఈ విషయం బోధపడుతుంది ఈ పునర్జన్మ ఉద్దేశ్యం తలక్రిందులైంది ఐతరేయ బ్రాహ్మణం తరువాత జరిగిన చర్చలు వ్యక్తికి కులీన వర్గాలకు సంబంధించిన పూర్తి హోదా కల్పించడమే దాని లక్ష్యమైంది ద్విజుడు లేక రెండుసార్లు జన్మించినవాడు అన్న వర్ణన ఆవిధంగానే వచ్చింది శూద్రులకు ఉపనయనం నిషేధించబడింది వారికి ఒకే జన్మ వుంటుంది కనుక ద్విజులకుండే హక్కులు, సదుపాయాలు వుండవు

ఇది వర్ణాశ్రమ ధర్మాలకు సంబంధించిన ఒక ముఖ్యమైన అంశం ద్విజులు అంటే పూజారులు, రాజవంశీకులు, రైతు వ్యాపారులతోకూడిన సంపన్నవర్గమైంది వీరిమధ్య తరతమ తేడాలు వుంటేవుండవచ్చు మిగిలిన ప్రజలందరూ శూద్రులుగా పరిగణించబడ్డారు కాని ఒక విషయం స్పష్టంగా దృష్టిలో పెట్టుకోవాలి పౌరోహితులు, రాజవంశీకులు, రైతులు, వర్తకులు మొత్తం కలిసినా ఏ సమాజంలోనైనా స్వల్ప సంఖ్యాకులుగానే వుంటారు వారు కాయకష్టం చేస్తారని ఆశించడమే దుస్సాధ్యంకాగా, సాధ్యమైనంతవరకు అసలు పని చేయనవసరమే లేదని శాస్త్రకారులు నిషేధించారు భారతీయ స్మృతికారుల రాజకీయ

తత్వంలో శూద్ర అన్న పదం ప్రత్యక్ష ఉత్పత్తిదారులైన అసంఖ్యాక ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తుందని మనం అర్థం చేసుకోవాలి

అదనపు ఉత్పత్తికి- అంటే శ్రామికుడి కనీస అవసరాలు పోగా అదనంగా మిగిలేదానికి సంబంధించిన దృక్పథం ఈరోజున మనం అర్థం చేసుకుంటున్నట్లుగా భారతీయ స్మృతికారులకు తెలిసివుండకపోవచ్చు అయినప్పటికీ శూద్రుల హక్కులు, బాధ్యతలను గురించి పొందుపరచిన తీరు శూద్రులవల్ల జరిగే మిగులు ఉత్పత్తి సంపన్నవర్గాలకే చెందాలని వారు కోరుకున్నట్లు స్పష్టం చేస్తుంది ఇతరులకు అంటే ద్విజులకు సేవ చేయడమే శూద్రుల ఏకైక వృత్తి అని మనువు చెపుతాడు ఇదికాక శూద్రుడు మరేమి చేసినా ఫలితం వుండదంటాడు ఈవిధంగా సేవ చేయడం కోసమే అతన్ని సజీవంగా వుంచుతారన్నది వాస్తవమే అయితే శూద్రులు తాము ప్రాణాలతో వుండడానికి అవసరమైన దానికంటే అదనంగా ఏమీ పొందరాదని స్పష్టంగా నిర్దేశించబడింది స్మృతికారులు వారికి నిర్దేశించిన కనీస జీవన ప్రమాణం ప్రకారం చూస్తే వారి శ్రమవల్ల జరిగే అదనపు ఉత్పత్తి ద్విజులు కబళించవచ్చునని స్పష్టమౌతుంది

స్మృతికారుల రచనలను ఇంకా సుదీర్ఘంగా ప్రస్తావించనవసరంలేకపోయినా వారి రాజకీయ తత్వానికి సంబంధించిన ఒక ముఖ్యాంశాన్ని పునరుద్ఘాటించడం అవసరం సమాజం రెండు వర్గాలుగా (ద్విజులు, శూద్రులుగా) నిలువునా చీలివుండడమే వారు కోరుకున్నారు ఆఖరుకు శూద్రులను ముట్టుకుంటేనే ద్విజులు మైలపడిపోతారనేంతవరకూ ఈ చీలిక సృష్టించబడింది ఈ రెండింటిలోనూ ద్విజుడు సంపన్నవర్గాలకు ప్రతినిధిగా మొత్తం ఉత్పత్తికి సంబంధించిన శ్రమనుండి దూరంగా వుంటాడు మిగిలిన ప్రజలు అంటే ఉత్పత్తిదారుల్లో అత్యధికులు శూద్రులు వారికి ఆర్థిక, సాంస్కృతిక సదుపాయాలు దాదాపు శూన్యం స్మృతికారులు అప్పట్లో ఊహించిన ఆదర్శ సమాజం స్వరూపమిది స్వతంత్రమైన ఆలోచనపట్ల హేతుశీలతపట్ల వారికిగల తీవ్ర వ్యతిరేకతను అర్థం చేసుకోవటం కష్టమేమీకాదు దేశసంపదను సృష్టిస్తూ తమకుమాత్రం కనీస అవసరాలకు మించి పొందలేని కోటానుకోట్లమంది శ్రామిక జనబాహుళ్యం దాసత్వంతో రాజీపడి వుండాలంటే అణచివేతకుతోడు తీవ్రమైన మూఢనమ్మకాలు కూడా అవసరమౌతాయి అందుకే మూఢత్వాన్ని ధ్వంసం చేసే హేతువాదం భారతీయ స్మృతికారులకు ప్రాణసంకటమైంది

## మూఢత్వం సామాజిక పాత్ర

ఈ మూఢత్వం రాజ్యాన్ని అదుపులో వుంచుకునే ఒక సాధనమనే అభిప్రాయం భారతీయ స్మృతికారుల రచనల్లో స్పష్టంగా చర్చించబడలేదు అయితే అంతమాత్రాన మూఢత్వానికి గల సామాజిక పాత్ర భారత రాజకీయవేత్తలకు తెలియదనుకుంటే పొరపాటే కౌటిల్యుడి అర్థశాస్త్రంలో ఈ విధమైన స్పృహ అనేకచోట్ల కనిపిస్తుందని ఆర్ ఎస్ శర్మ ప్రతిభావంతంగా విశ్లేషించారు "కౌటిల్యుడి అర్థశాస్త్రం" అన్న ఆయన గ్రంథంలో మతం

రాజకీయాలు అన్న అధ్యాయం పూర్తిగా చదవడం అవసరం మూఢత్వానికి, రాజకీయాలకు సంబంధించిన ఉపశీర్షిక క్రిందగల అందులోని కొన్ని అంశాలను మాత్రం ఇక్కడ ప్రస్తావించబడుతున్నాయి

*"కౌటిల్యుడు చెప్పిన రాజనీతిజ్ఞత ఆచరణశీలమైందనడానికి గట్టి ఉదాహరణ ఏమంటే కొన్ని మతాచారాలపట్ల ఆయన ప్రకటించిన విశ్వాస రాహిత్యమే అంతర్గతంగాను, బాహ్యంగాను రాజ్యప్రయోజనాలను కాపాడటానికిగాను ప్రజలలోగల మూఢనమ్మకాలను ఆయన ఉపయోగించుకుంటాడు రాజు ఖజానాను పెంపొందించుకునేందుకు మూఢత్వానికి సంబంధించిన అనేక సూచనలు చేస్తాడు ఉదాహరణకు రాజు కొన్నిసార్లు రాత్రివేళల్లో ఒక దేవుడినిగాని, పవిత్రమైన మందిరాన్నిగాని స్థాపించవచ్చు లేక ఒక దుష్ట క్షుద్రదేవతను గురించి ప్రచారం చేయవచ్చు ఆ తర్వాత దేవుడి పూజకోసం లేదా క్షుద్రశక్తులను నివారించడంకోసం అతను సమ్మేళనాలు, జాతరలు జరిపి సొమ్ములు వసూలు చేయవచ్చు దేవాలయ ఉద్యానంలో అకాలంగా పూలు పూసినా, కాయలు కాసినా దాన్ని దేవుడి రాకకు గుర్తుగా చిత్రించి తన స్వీయ ప్రయోజనాలు సాధించుకోవచ్చు ఏదైనా ఒక చెట్టుదగ్గర రాక్షసుడి వేషంలో ఒక గూఢచారిని నియమించి రోజూ ప్రాణబలి కోరుతూ ప్రజలలో భయోత్పాతం కలిగించవచ్చు ఈ క్షుద్రశక్తులను తరిమికొట్టాలన్న సాకుతో రాజధానిలోనూ, ఇతర చోట్ల ప్రజలనుండి విరాళాలు వసూలు చేయవచ్చు "*[1]

కౌటిల్యుడు చెప్పిన ఈ చిట్కాలలోకొన్ని వాస్తవంగా అమలు జరిగినట్లే కనిపిస్తుంది మౌర్య రాజులు నెలకొల్పిన ప్రతిమల అమ్మకం ఆదాయానికి వనరుగా ఉపయోగపడిందని పతంజలి రాస్తాడు ఆ ప్రతిమలకు ప్రజలు సమర్పించే కానుకలు జీవనోపాధినికూడా కల్పించాయి

కౌటిల్యుడు సూచించిన కొన్ని మార్గాలు చాలా మొరటుగా వున్నప్పటికీ వాటివల్ల జంట ప్రయోజనాలు సిద్ధించాయి ప్రజలలో మూఢనమ్మకాలపట్ల భయం కల్పించడంతోపాటు వాటికి వ్యతిరేకంగా ఇతర ప్రచారకులు ముందుకు రాకుండా అడ్డుకోవడంకూడా జరిగిందని శర్మ రాస్తాడు వీటిని అనుమానించిన వ్యక్తులచే విషం త్రాగించవచ్చు లేక వారిపై విషజలం చిలకరించి స్పృహ తప్పించవచ్చు ఇదంతా దేవతల శాపంవల్లనే జరిగిందని గూఢచారులతో చెప్పించవచ్చు అలాగే దేవుడిని నిరాకరించే వ్యక్తిని గూఢచారులు త్రాచుపాముతో కరిపించి దేవుడి శాపంవల్ల జరిగిందని ప్రచారం చేయవచ్చు అంతేగాక ఈ అపశకునాలకు వ్యతిరేకంగా ఖజానాను నింపేందుకు వారు విరాళాల వసూలు సాగించవచ్చు అని కౌటిల్యుడు రాస్తాడు ఈ చివరి రెండు అంశాలలోనూ హేతువాదులను లొంగదీసుకోవడం, ప్రభుత్వానికి డబ్బు రాబట్టడం అన్నవి కనిపిస్తాయి

---

1 ఆర్ ఎస్ శర్మ

అందువల్ల కౌటిల్యుడు సూచించిన ఈ పథకాలన్నీ ప్రజలలో మూఢత్వాన్ని రెచ్చగొట్టడంద్వారా డబ్బు గుంజడానికే ఉద్దేశించబడ్డాయి కౌటిల్యుడికి వ్యక్తిగతంగా ఎలాంటి మూఢనమ్మకాలు లేవు తన రాజు వాటిని పాటించాలని కూడా అతను కోరుకోలేదు ఆ నమ్మకాలు తనకు లేకపోయినప్పటికీ ఇలా రాశాడుగనకే అతని రచన మన చర్చకు చాలా ముఖ్యమైనదవుతున్నది పైగా తన రాజులు తర్కంలో ఆరితేరాలని అతనుకోరుకున్నాడు తనకు తెలిసినంతలో అత్యంత హేతుబద్ధమైన తర్కాన్ని వారికి నూరిపోస్తాడు ఆవిధంగానే వారు మతపరమైన సంకోచాలను అధిగమించితేనే ప్రజల మతధర్మాలను వారిని అణచివుంచేందుకు వినియోగించగలుగుతారని ఆయన భావించారు అందుకే ఆయన ఒకవైపున రాజులు దేవతావిగ్రహాలతో ఆలయాలు కట్టించడంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలంటాడు మరో వైపున పచ్చి అధర్మ లక్ష్యాలు సాధించుకునేందుకు ఈ దేవాలయాలను, విగ్రహాలను ఉపయోగించుకోవాలని సలహా ఇచ్చాడు అందుకే అతని దృష్టిలో రాజులు మతభావాలలో కూరుకుపోరాదన్నమాట

శత్రువును పూజాస్థలంలోనూ, అతను తరచూ సందర్శించే తీర్థయాత్రాస్థలంలోనూ హతమార్చేందుకు కౌటిల్యుడు అనేక మాయోపాయాలు సూచిస్తాడు వీటిలో కొన్నింటిని చెప్పాలంటే శత్రువు గుడిలోకి అడుగుపెట్టగానే నెత్తిన పడేలా పెద్ద బండరాయిని లేక గోడను అమర్చవచ్చు విగ్రహంలో ఆయుధాలను దాచిపెట్టి అతను రాగానే విరుచుకుపడవచ్చు ఆలయంలో భూగృహంలోగానీ, మరొకచోటగానీ దాగిన గూఢచారులు ఆకస్మికంగా దాడిచేయవచ్చు దేవతా క్రతువులు లేదా పూర్వీకుల ఆబ్దికాలవంటి సందర్భాలలో వడ్డించే ఆహారంలో, నీటిలో విషం కలిపి శుత్రు వర్గాన్ని సంహరించవచ్చు ద్రోహులను కూడగట్టి రహస్య సైన్యంతో శత్రువును దెబ్బతీయవచ్చు అంతేగాక కోటను శత్రువు చుట్టుముడితే రాజు విగ్రహంలో రంధ్రం చేసుకొని దాక్కోవచ్చు

మూఢత్వాన్ని ఉపయోగించుకోవడానికి కౌటిల్యుడు చేసిన సూచనలకు సంబంధించి మరొక అంశాన్ని మాత్రమే ఇక్కడ పేర్కొంటాము "కౌటిల్యుడికి రాజు పవిత్రతపట్లగాని, అతీతశక్తిపట్లగాని నిజంగా నమ్మకం లేదు రాజు ఈ విశ్వాసానికి విధేయుడైవుండాలని కూడా అతను కోరుకోలేదు" అయితే ఈవిధమైన అతీతశక్తి దివ్యత్వం కలిగివున్నట్లు ప్రకటించుకోవడానికి గల ప్రాధాన్యత ఏమిటో రాజకీయవేత్తకు తెలుసు కనుకనే ప్రజలలో ఈ భ్రమలు విస్తారంగా వ్యాపింపచేయడం ఎలా అన్నది సమస్య ఇందుకు కౌటిల్యుడు ప్రధానంగా రెండు పద్ధతులు సూచిస్తాడు కొన్ని పారదర్శకమైన చిట్కాలు చెప్తాడు గూఢచారులద్వారా సేకరించే సమాచారాన్ని ఉపయోగించుకొని రాజు తనకు అద్భుత జ్ఞానం వున్నట్లు ప్రజలను నమ్మించడం ఒకటి బాగా శిక్షణ పొందిన యంత్రాంగాన్ని ఇందుకోసం ఉపయోగించడం రెండవది ఈ రెండవ పద్ధతిపై శర్మ ఇలా వ్యాఖ్యానిస్తాడు

ఇందుకోసం "జ్యోతిషులు, సోది చెప్పేవాళ్ళు, పంచాంగకర్తలు, పౌరాణికులు, ఈక్షనికులు, (బహుశా ఒక విధమైన జ్యోతిషులై వుంటారు) గూఢచారులు, సచివ్యకరులు (మంత్రుల సహాయకులు) వగైరా ఏడురకాల అధికారులను రంగంలోకి దించాలి వీరిలో మొదటి నాలుగురకాలవారు అర్థశాస్త్రంలో ఇతరచోట్ల పూజారివర్గంలో భాగంగా పేర్కొనబడతారు ప్రజాభిప్రాయాన్ని మలచడంలో పూజారులకు గల ముఖ్యమైన పాత్రకు ఇది సాక్ష్యంగా వున్నది రాజుకుగల అతీతశక్తులను గురించి వారు దేశమంతటా చాటించాలి అదేవిధంగా రాజుకు దేవతలు ప్రత్యక్షమౌతున్నారని, స్వర్గం నుండి దివ్యమైన అర్థికశక్తులు (కోశం), యుద్ధశక్తులు (దండ) లభించాయని విదేశాలలో ప్రచారం చేయాలి రాజ్యానికి కీలకమైన రెండు అంశాలు ఇవే దేవుడి ప్రతిమలను నాశనం చేయడం కూడా కౌటిల్యుడు సూచించిన చిట్కాలలో ఒకటి దాని రక్తంవల్ల వరదలు సంభవించినట్లు ఇది శత్రువు ఓటమికి సూచన అయినట్లు గూఢచారులు ప్రచారం చేయాలి చాలా నైపుణ్యమైన రీతిలో పటిష్టమైన యంత్రాంగంతో ఈ ప్రచారం సాగించడంద్వారా విదేశీ దురాక్రమణదారు శక్తిసామర్థ్యాలగురించి ప్రజలలో విశ్వాసం కలిగించాలి అప్పుడు ఆ దేశంలోని ప్రజలు దురాక్రమణ పథకాలను హృదయపూర్వకంగా బలపరుస్తారు శత్రుదేశాల ప్రజలు కూడా తమ విశ్వాసం ఇటు మరల్చుకుంటారు

మనం ఇప్పుడు మళ్ళీ ధర్మశాస్త్రాల రచయితల దగ్గరికి వెడదాము రాజులు ఎలాంటి మతదృష్టి లేకపోయినా హేతుబద్ధమైన శిక్షణతో మూఢ నమ్మకాలను రాజకీయంగా ఉపయోగించుకోవాలని కౌటిల్యుడివలె పచ్చిగా వారు రాయలేదు అయితే దీన్నిబట్టి మూఢనమ్మకానికి గల సామాజిక పాత్ర వారికి తెలియదని భావించకూడదు జనబాహుళ్యాన్ని అదుపులో వుంచడం అన్న మౌలిక సమస్య వారికి బాగా తెలుసు అందుకే అల్పసంఖ్యాకులుగా వున్న సంపన్నవర్గాలకు దేవుని పేరిట, పూర్వజన్మ సుకృతం పేరిట భద్రత కల్పించే పవిత్రమైన భ్రమలను ప్రశ్నించే ధోరణులు వేటినీ వారు ప్రోత్సహించలేదు వీటిని విశ్వసించకపోయినట్లయితే తాము ఇష్టపూర్వకంగా ఊహించుకునే సమాజం పునాదులే కదిలిపోతాయని వారికి తెలుసు అందుకే మనువు నాస్తికులు చొరబడిన రాజ్యం అనతికాలంలో అంతరిస్తుందని అంటాడు ఇందుకు కొంత వివరణ అవసరమని వ్యాఖ్యాతల అభిప్రాయం ఉదాహరణకు వారిలో ఒకడైన మేధాతిథి ఇలా వివరిస్తాడు "రాజ్యం ధ్వంసం కావడమంటే పాలకులు కూలిపోవడమే " దీన్నే నాస్తికుల చొరబాటుగా అభివర్ణించాడు అంటే మరణానంతర జీవితాన్ని నిరాకరించే లోకాయతులు తదితరులన్నమాట" కుల్లూకభట్టుడనే మరో వ్యాఖ్యాత కూడా ఇలాగే వ్యాఖ్యానిస్తాడు సోక్రటీస్, ప్లేటో, పోలీబియాస్, స్ట్రాబోవంటివారు అనుకూలంగా చెప్పిన విషయాన్ని ప్రతికూలంగా చెప్పడంతప్ప ఇది మరొకటికాదు మరణానంతర జీవితం వగైరాలపై నమ్మకం లేకపోవడం రాజ్యానికి, పాలకులకు అభద్రతా కారణమయ్యేట్లయితే వాటిమీద

విశ్వాసం రాజ్యభద్రతకు చాలా అవసరమని అర్థం గ్రీకు రాజనీతిజ్ఞులు బహుశా కౌటిల్యుడు కూడా భారతీయ స్మృతికారులతో విభేధించిన విషయం ఒక్కటే వారు మరీ ఉన్నతస్థాయిలో వ్యవహరించారు అలాంటి నమ్మకాలు, మూఢ విశ్వాసాలు పవిత్రమైన భ్రాంతులు ప్రజలను అదుపులో వుంచేందుకు ఉద్దేశపూర్వకంగా సృష్టించబడ్డాయనే విషయాన్ని సూటిగా అంగీకరించలేదు ఎందుకంటే భారతీయ స్మృతికారుల దృష్టిలో ఈ పవిత్ర సత్యాలన్నీ వేదాలనుండి సంక్రమించినవే మరోవిధంగా చెప్పాలంటే మరణానంతర జీవితం వగైరాల అవసరాన్ని గుర్తించడంతోపాటు భారతీయ స్మృతికారులు ఆభ్రమలను సమర్థించడానికి మరిన్ని భ్రమలను కూడా సృష్టించారు ఈవిధంగా చూసినప్పుడు వారికి, ప్రాచీన ఈజిప్టు స్మృతికారులకు మధ్య పోలిక హెచ్చుగా కనిపిస్తుంది గ్రీకులు కూడా ఈజిప్షియన్‌లను ఎంతగానో కీర్తిస్తారు

*భారతీయ స్మృతికారులు నాస్తికులపట్ల వ్యక్తం చేసిన భయాందోళనలకు శూద్రులుగా పిలిచే శ్రామికుల రాజకీయ, సామర్థ్యం గురించిన వారి ఆందోళనకు మధ్య సంబంధం లేకపోలేదు "శూద్రులు పాలించే దేశంలో అపవిత్ర వ్యక్తుల పరివృతమైన భూమిలో, నిరీశ్వర వాదుల ఏలుబడివున్న భూమిలో అధమవర్ణులచే నిండివున్న భూమిలో అతను నివసించకుండుగాక" అని మనువు ప్రకటిస్తాడు*

## స్వతంత్ర ఆలోచనపై స్మృతికారుల దాడి

మౌఢ్యానికిగల సామాజికపాత్ర బాగా తెలిసిన స్మృతికారులు స్వతంత్ర ఆలోచన అవాంఛనీయత గురించి చాలా రాశారు అది భౌతికవాద దృక్పథంతో మమేకమౌతుందన్నట్లు, జతకడుతుందన్నట్లు అనేకచోట్ల పేర్కొన్నారు *"నిరీశ్వర వాదులతో, కులకట్టును ఉల్లంఘించేవారితో, కపటవర్తనులతో స్వతంత్ర ఆలోచనాపరులతో రెండు నాల్కలు గలవారితో మాట్లాడటం కూడా దోషమే"* అని మనువు చేసిన బోధ సుప్రసిద్ధమైనదే ఇక్కడ స్వతంత్ర ఆలోచనాపరులు అనడానికి "హైతుక" అన్నపదం ఉపయోగించబడింది తార్కికులు అని దీని సాధారణ అర్థం అయితే ఈ పదాన్ని ఆ అర్థంలోగాక విశ్వాసం సరిహద్దులలో తర్కబద్ధత అన్న పరిమిత అర్థంలో తీసుకోవడం జరిగింది కొంతమంది భావవాద తాత్వికుల భాషలో తర్కాన్ని వేదాలకు లోబడివుండేలా చేయడంగాక, దాని పరిధిమేరకు పెరగనివ్వాలన్న ధోరణి కూడా కనిపిస్తుంది తర్కానికి స్వతంత్ర సామర్థ్యాన్ని ఆమోదించడం స్మృతికారులకు, అలాగే భావవాద తాత్వికులకు సంబంధించినంతవరకు చాలా ప్రమాదకరమైనది ఎందుకంటే అది వేద ప్రామాణ్యాన్నే ప్రశ్నిస్తుంది ఇది చాలా ముఖ్యమైంది కనుకే దానిపట్ల స్పష్టత వుండాలని ఎస్ ఎన్ దాస్‌గుప్తా అంటాడు పైన పేర్కొన్న మను ప్రవచనాన్ని గురించి దాస్‌గుప్తా ఇలా అంటాడు "హైతుక అన్న పదాన్ని మామూలు అర్థంలోగాక అన్నిరకాల స్వతంత్ర చర్చలలో పాల్గొనేవారు అన్న అర్థంలో

తీసుకోవాలి ఎందుకంటే స్మృతికారుల మరికొన్ని ఇతర ప్రకటనలు చూస్తే విశ్వాసం పరిధిలో తర్కాన్ని ఉపయోగించేవారిపట్ల వారికి ఎలాంటి అభ్యంతరమూ లేదని అర్థమౌతుంది అందుకే క్లుప్తంగా చెప్పాలంటే మనువుకు అలాంటి ఆలోచనాపరులపట్ల అభ్యంతరం లేదు స్వతంత్ర ఆలోచనాపరులు అనే ఈ ప్రమాదకరమైన రకానికి చెందిన వారిపట్లనే అతని అభ్యంతరమంతా " దీన్నిబట్టి వెనువెంటనే రెండు అంశాలు ముందుకు వస్తాయి నిజమైన తత్వవేత్తల కోణంనుండి చూసినప్పుడు స్మృతికారులు తర్కానికి అప్పగించిన ఒకే ఒక బాధ్యత దాని అసలైన బాధ్యతను వమ్ము చేయడమే మూఢనమ్మకాలకతీతంగా ఆలోచించడం, హేతువును కనుగొనడం అన్న బాధ్యత వదులుకోవాలన్నమాట దాని నిరాకరించడంవల్ల చాలా అవాంఛనీయమైన సామాజిక ఫలితాలు కలిగాయి భారతీయ భావవాదులు ఇందులోని రెండవ ప్రతిపాదనను ఎంత ఉత్సాహంగా బలపరిచారో మనం చూడవచ్చు అది వారి దృక్పథానికిగల సాంఘిక స్వభావాన్ని వెల్లడిస్తుంది

మనువు గురించిన వ్యాఖ్యాతలు సహజంగానే స్వతంత్ర ఆలోచన సామాజికంగా అవాంఛనీయమైనదని వివరించడానికి ఆత్రుత చూపారు పైన పేర్కొన్న ఆయన ప్రకటనపై మేధాతిథి ఇలా అంటాడు "హైతుకులు అంటే నాస్తికులు తప్ప మరేమీకాదు మరణానంతర జీవితం లేదని, మఠాధిపతులకు కానుకలు ఇవ్వడంలో ప్రయోజనం లేదని బలులు నిరర్థకమని వీరి అభిప్రాయం " కుల్లూకభట్టుడు "హైతుకులంటే వేదాల ప్రామాణ్యాన్ని వ్యతిరేకించేవారు" అని ఒక్కముక్కలో తేల్చివేశాడు ఈ రెండు వ్యాఖ్యానాలకు మధ్యగల తేడా కేవలం బాహ్యమైనది మాత్రమే ఎందుకంటే స్మృతికారులు వేదాలను మరణానంతర జీవితం, దేవతలు, బహుమానాలు, బలులు, వగైరాలకు సంబంధించినవిగానే పరిగణించారు వాటిని ప్రశ్నించడం అంటే ఈ పవిత్రమైన మూఢనమ్మకాలను ప్రశ్నించడంతప్ప మరొకటి కాదు స్వతంత్ర ఆలోచన అన్నది వీటిని ప్రశ్నించే స్ఫూర్తిని పెంపొందించుతుంది కనుకే చెడ్డదైంది వారి ఆదర్శ సమాజపు భద్రతకు అది భంగం కలిగిస్తుంది

## ఆస్తిక, నాస్తిక దృక్పథాలు

భారతీయ తత్వశాస్త్రంలో నాస్తిక, ఆస్తిక దృక్పధాలు ఎలా ఏర్పడ్డాయి వాటికి ఆ ప్రత్యేక ప్రాధాన్యత ఎలా కలిగింది అన్న విషయాన్ని మనమిప్పుడు అర్థం చేసుకోవాలి నాస్తికుడు అంటే హేతుకుడు అనడానికి పర్యాయపదం మాత్రమేనని, స్వతంత్ర ఆలోచనాపరుడు అన్నది ఆలోచనా శీలికి ఒక చెడ్డపేరు మాత్రమేనని మనువు చెప్పడంవల్లనే ఈ ప్రాధాన్యత కలిగింది ఏమైనా నాస్తికుడు, లేక విశ్వాస రహితుడు అన్నది ఒక తాత్వికుడికి చెడ్డపేరు అయ్యేట్లయితే దానికి విరుద్ధమైన ఆస్తికుడు లేదా వేద ప్రామాణ్యాన్ని అంగీకరించేవాడు అన్నది స్మృతికారుల దృష్టిలో సరైన మార్గమన్నమాట

అందువల్ల స్మృతికారుల ఆదేశాలకు పూర్తి తాత్విక ప్రాధాన్యత కల్పించడం సాంప్రదాయక తాత్విక చింతనకే అవమానకరమైన విషయం తాత్విక దృక్పధాలను ఆస్తికనాస్తిక ప్రాతిపదికన గీటురాయి కావడానికిది దారితీసింది ఆస్తిక అంటే వేదాలకు విధేయత అని, నాస్తిక అలాంటి విధేయతను నిరాకరించే ధోరణి అని చెప్పబడింది భారతీయ తాత్విక దృక్పధాలకు సంబంధించిన ఈ విభజనను ఆధునిక రచయితలు కూడా ఆమోదించడం ఆశ్చర్యం కలిగిస్తుంది అటు తాత్వికులుగానీ, ఇటు చరిత్రకారులుగానీ గాక స్మృతికారులు అందించిన వికృతచరిత్ర ఈ కొలబద్దకు ప్రాతిపదిక అని తెలిసికూడా ఈవిధంగా ఆమోదించడం విడ్డూరమే స్మృతికారులకు సంబంధించినంతవరకూ తత్వశాస్త్రం అన్నది తాత్వికేతరమైన అంశం మాత్రమే ఎస్ ఎన్ దాస్‌గుప్తా వంటి ప్రముఖ భారతీయ తాత్విక చరిత్రకారులు కూడా నాస్తికత్వాన్ని గురించి చర్చించేటప్పుడు ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతారు “వేద నిందకులు” అని మనువు స్వయంగా చెప్పాడని ఆయన పేర్కొంటాడు అయితే ఆధునిక పండితులు మనువు కేవలం స్మృతికారుడు మాత్రమేనని తెలిసికూడా ప్రాధమిక తాత్విక విభజన సమస్యలో అతనికి ఎందుకంత ప్రాధాన్యతనివ్వాలి? ఇందుకు చాలా ముఖ్యమైన కారణమేమంటే శంకరుడు మనువుపట్ల అత్యంత గౌరవం చూపించడమే మన ఆధునిక పండితులకు మామూలుగానే శంకరుడిపట్ల గొప్ప ఆరాధన అందువల్లనే స్వయంగా తాత్వికుడు కాకపోయినప్పటికీ మనువు తాత్విక విషయాల్లో కూడా గొప్ప సాధికార ప్రతిపత్తి సంపాదించగలిగాడు భారతీయ తత్వశాస్త్రానికి సంబంధించిన సమకాలీన వ్యాఖ్యాతలు కూడా మనువు ప్రభావాన్ని దాటిరాలేకపోయారు

## భ్రమకు లోబడిన హేతువు

మనం ప్రధానచర్చను మళ్ళీ ప్రారంభిద్దాం ధర్మశాస్త్రాల ప్రకారం హేతుబద్ధతకు, తర్కానికిగల ఒకే నిజమైన బాధ్యత వేదాలలో నిక్షిప్తమైనట్లు చెప్పబడుతున్న సర్వాతీత జ్ఞానానికి సేవ చేయడమే వేద సారస్వతాన్ని గురించి మనం ఇప్పటికే చర్చించినదాన్నిబట్టి దానిలో మొత్తంగా విజ్ఞానం ఉన్నదనే మాట భ్రమేనని అర్ధమవుతుంది అపారమైన ఈ సారస్వతం తదుపరి భాగాలలో ఉన్న తాత్విక దృక్పధం తొలి వేద సూక్తాలలోని నిజమైన సైద్ధాంతిక స్ఫూర్తికి పూర్తిగా భిన్నమైంది అయినా స్మృతికారులకు అదేమీ పట్టలేదు దీనికి ఒక కారణమేమంటే వేదాధ్యయనంపై వారు తీవ్రమైన ఆంక్షలు విధించారు స్మృతికారుల మౌలిక ప్రయోజనాలతో అంగీకరించేవారు మాత్రమే వాటిని చదవాలన్నారు ముఖ్యంగా పూజారులు, కులీనవంశీకులు మాత్రమే ఈసారస్వతాన్ని చదవాలి మార్క్స్ చెప్పినట్లుగా [1] “వేదాలను చదివే అధికారం తనకుమాత్రమే అట్టిపెట్టుకోవడంద్వారా బ్రాహ్మణుడు వాటి పవిత్రతను నిరూపిస్తాడు” ఇందుకు మరో కారణమేమంటే స్మృతికారులకు వేదాలలోని

1 మతంపై మార్క్స్ మాస్కో ప్రచురణ

అసలైన సారాంశంపట్ల నిజంగా ఆసక్తి లేదు  ఒక రాజకీయ వ్యవస్థగానే వారికి వేదాలపట్ల ఆసక్తి.  పరలోకం, దేవుడు వగైరాలతో భయపెట్టి ప్రజలను అదుపులో వుంచేందుకు పదునైన సాధనాలుగా అవి ఉపయోగించబడ్డాయి  అందుకే వారు సర్వాతీతజ్ఞానం వేదాలలో పొందుపరచబడిందని ధైర్యంగా ప్రకటించగలిగారు  ప్రజలను అదుపులో వుంచేందుకు భయంపైనే వారు ఎక్కువగా ఆధారపడ్డారుకనుక  స్వతంత్ర ఆలోచనలన్న హేతుశీలత అన్న భయపడ్డారు  అందుకే వేద ప్రామాణ్యతకు లోబడినంతవరకు తర్కంతో వారికి పేచీలేదు  హేతు శక్తి ప్రయోజనం అదొక్కటేనని  వారు ఆమోదిస్తారు

అందుకే మనువు తర్కం *(అన్వీక్షికి)* పట్ల సహనంవుండాలంటాడు  అయితే ఆత్మ గురించి విమోచనం గురించి వేదాలలోని భావాలను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడినంత వరకు మాత్రమే ఈ సహనం వర్తిస్తుంది  తరచూ ఉటంకించబడే ఒక భాగంలో మనువు వేదాలు, రాజనీతి, అర్థశాస్త్రం, తర్కం అనే విజ్ఞానపు శాఖలను అధ్యయనం చేయవచ్చునని ప్రకటిస్తాడు  అయితే తర్కం అన్న చివరి శాఖ ఆత్మ సిద్ధాంతానికి పూర్తిగా లోబడి వుండాలంటాడు  (అన్వీక్షికి విద్య) మనువు వివిధ విజ్ఞానశాఖలను సూచించే సందర్భంలో తర్కాన్నికూడా విచక్షణారహితంగా బేషరతుగా పేర్కొన్నాడని కొన్నిసార్లు అపార్థం చేసుకోవడం జరుగుతుంటుంది  భాష్యకారుడైన మేధాతిథి అలాంటి అపార్థం తగదని ముందే హెచ్చరిస్తాడు  తర్కం (అన్వీక్షి=తర్కవిద్య) అని ఇక్కడ పేర్కొన్నది ఖచ్చితంగా ఆధ్యాత్మ విద్య లేక ఆత్మ విద్య అని అర్థం చేసుకోవాలంటాడు  అంతేగాని స్వతంత్ర ఆలోచన అన్న అర్థంలో నిరీశ్వర వాదులు, భౌతికవాదులు కోరుకుంటున్న రీతిలో దాన్ని పరిగణించరాదని చెప్పాడు

మనువు అసలైన దృక్పథం ఇదేనని చెప్పడానికి అనేక ఇతర ప్రకటనలు కూడా వున్నాయి  మరోచోట అతనిలా చెప్తాడు  "హేతుశీలత వేదాలతో ఏవిధంగానూ ఘర్షణ పడకూడదు " సరైన ప్రవర్తనను వివరిస్తూ ఇలా పునరుద్ఘాటిస్తాడు  అతను "అవిశ్వాసాన్ని, వేదాలపట్ల అవహేళన, దేవతలపట్ల తృణీకారం,ద్వేషం, అవిధేయత, అహంకారం, ఆగ్రహం, మొరటుదనం విడనాడాలి" అంటాడు  "పవిత్ర శాస్త్రాల ప్రకారం వేదాలను వాటి అనుబంధాలతో సహా అధ్యయనం చేసినవారే ఆదర్శప్రాయులైన బ్రాహ్మణులు వాటిలో పేర్కొన్నవిధంగా ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపేవారు  వేదాల నిజస్వభావాన్ని నిరూపించగలుగుతారు  (శ్రుతి ప్రత్యక్ష హేతవ)" వేదాలలో తలపండితే తప్ప తర్కాన్ని బోధించే అర్హత ఎవరికీ లేదు  ఎందుకంటే తర్కబోధకుడు దాన్ని వేదాలకనుగుణంగా అతీతశక్తి సిద్ధాంతం పరిధిలో బోధించాల్సివుంటుంది  అతను సూచించిన ఆదర్శ ప్రాయమైన బోధనాంశాలు ఇలా ఉన్నాయి  "అతను నిరంతరాయంగా వేదాలు వల్లె వేయాలి  దేవతలకు బలులను గురించి చెప్పేవి, ఉపనిషత్తులలో (వేదాంతం) పేర్కొనబడిన ఆత్మను అంగీకరించేవి " తమ తాత్విక వైఖరుల ప్రాథమిక రూపాన్ని ఆవిధంగా

ప్రోత్సహించినందుకు వేదాంతపు తదుపరి ప్రతినిధులు ఏవిధంగా కృతజ్ఞత తెలుపుకున్నారో మనం చూడవలసివుంది

## స్వతంత్ర ఆలోచనే నేరం

తర్కం న్యాయమైన బాధ్యత ధర్మశాస్త్రాలపట్ల విధేయంగా వుండడమే అయితే అది తన స్వతంత్రను చాటుకోవడం తప్పవుతుంది స్మృతికారుల దృష్టిలో తర్కం అలాంటి స్వయం ప్రతిపత్తి పొందటం ఖచ్చితంగా నేరమే అందువల్లనే వారు ప్రకటించిన నేరాల జాబితాలో స్వతంత్ర ఆలోచనను కూడా చేర్చారు

శ్రుతి అంటే వేదం, స్మృతి అంటే శాసన నియమం శాసనానికిగల ఈ రెండు ఆధారాలను వ్యతిరేక వాదనలను బట్టి నిర్ణయించరాదు తర్కం పట్ల అధికతర విశ్వాసం గల ఒక వ్యక్తి వేదాలను తృణీకరించినట్లయితే అతడిని నాస్తికుడిగా పరిగణించాలి అతను బ్రాహ్మణుడైనా సరే సమాజంనుండి వెలివేయాలి అని మనువు చెప్తాడు మామూలుగా మనువు బ్రాహ్మణులను శిక్షించడంగురించి మాట్లాడడు అన్నది బాగా తెలిసిన విషయమే అయినప్పటికీ ఒక బ్రాహ్మణుడు తన వర్గ ప్రయోజనాలను గమనించలేక వేదాలు శాసన నియమాలకన్నా తర్కంలో ఎక్కువ విశ్వాసం చూపడమనే నేరానికి పాల్పడితే ఆయన చేయగలిగిందేమిటి?

ధర్మశాస్త్రాలను ఉల్లంఘించే ఇతర రకాలైన నేరాలతోపాటు దీన్నికూడా చేర్చడాన్నిబట్టి ఈ అపరాధం తీవ్రతను గ్రహించవచ్చు మనువు ప్రకటించిన పంచమహాపాతకాలేమంటే బ్రాహ్మణహత్య, మద్యపానం, దొంగతనం, గురువుభార్యతో వ్యభిచరించడం ఇలాంటి నేరాలకు తోడ్పడటం వేదాలను మరచిపోవటం, వేదాలను గేలిచేయడం, దొంగసాక్ష్యం చెప్పటం, స్నేహితుని వధించడం, నిషిద్ధాహారం భుజించడం లేక ఆహారంగా అనర్హమైనవాటిని ఉపయోగించడం అనే ఆరు నేరాలు కూడా త్రాగుడుతో సమానమైనవిగా పరిగణించబడ్డాయి ఇప్పటికే చర్చించిన విషయాలను దృష్టిలో పెట్టుకుని దీన్ని అర్థం చేసుకోవలసి వుంటుంది స్మృతికారుల అభిప్రాయం ప్రకారం స్వతంత్రమైన ఆలోచనకు వేదాలను గేలిచేయడానికి మధ్య తేడాలేదు

యాజ్ఞావల్క్యుడు రచించినట్లు చెప్పబడే ధర్మశాస్త్రం మరింత సూటిగావున్నది దాని ప్రకారం వేదాలను ప్రశ్నించడమంటే బ్రాహ్మణహత్యతో సమానం అది ధర్మశాస్త్రకారుల దృష్టిలో అతి పెద్ద నేరం గౌతముడి స్మృతి ప్రకారం కూడా అది బ్రాహ్మణహత్యతోనూ, త్రాగుడుతోనూ సమానంగా చెప్పబడింది విష్ణుధర్మసూత్రం అంత తీవ్రతను ప్రకటించకపోయినా అలాగే పేర్కొన్నది వేదాలను ధిక్కరించేవారు పతనమౌతారని అది ప్రకటించింది

# ప్రజాబాహుళ్య ప్రచారపుటెత్తులు

ఇందుకు సంబంధించి స్మృతికర్తలు ఎదుర్కొన్న కష్టమైన సమస్యను ఇక్కడ పరిశీలించడం ఆసక్తిదాయకంగా వుంటుంది స్వతంత్రమైన ఆలోచన వాంఛనీయంకాదనే భావనను దేశంలోని లక్షలాదిమంది పీడితప్రజలకు ఎలా వంటబట్టించాలి ? అది వేద ప్రామాణ్యాన్ని ప్రశ్నించడమే అవుతుందని వారికి ఎలా తెలియజెప్పాలి ? ఇది చాలా తీవ్రమైన సమస్య ఎందుకంటే లక్షలాది పీడితప్రజలుగా వున్న శూద్రులకు కనీస విద్యకూడా నిరాకరించబడింది అయితే ధర్మశాస్త్రకారులు చెప్తున్న ప్రకారం తమ శాస్త్రాలకు వేదాల ప్రతిపత్తి వున్నది (శృతులుగా కాకపోయినా స్మృతులుగానైనా సరే) కాని శూద్రులు మలినజన్ములు కనుక వేదాలను పఠించరాదు అందువల్ల స్వతంత్ర ఆలోచన పనికిరాదనే భావన ధర్మశాస్త్రాలకే పరిమితమైతే అది ప్రజల మనసులపై ఎలాంటి ప్రభావం చూపించలేదు ప్రజలకు ఏదోవిధంగా వాటి ప్రభావం అందజేయాలి ఎందుకంటే అసలు ప్రజలను అదుపులో పెట్టడంకోసమే ఈ సూత్రాలన్నీ ఉద్దేశించబడ్డాయి స్వతంత్ర ఆలోచనను అణచే ఆరాటం అందుకే కాని వారికే ఆ సందేశం అందకపోతే ఇక ప్రయోజనమేముంటుంది? ఈ చిక్కుముడులు పరిష్కరించడానికే భారతీయ ఇతిహాసాలుగా మహాభారత రామాయణాలు వెలిశాయి

భారతీయ ఇతిహాసాలు విస్తార జనబాహుళ్య ప్రచార సాధనాలుగా నిర్వహించిన పాత్రను అందరూ గుర్తిస్తారు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వాటిని పారాయణం చేయడంద్వారా కొన్ని సైద్ధాంతికమైన, మరికొన్ని ఆచరణకు సంబంధించిన విలువలు ప్రజల ఆలోచనలలో గట్టిగా జొప్పించబడ్డాయి ధర్మశాస్త్రకారులు ముఖ్యమైనవిగా భావించివాటినన్నింటిని వీటిలో జొప్పించేందుకు ఇతిహాసకారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం గమనించాల్సిన విషయం కాణే[1] ఈ విషయాన్ని ఇలా వర్ణిస్తాడు " రెండు భారతీయ ఇతిహాసాలలో ధర్మశాస్త్రానికి సంబంధించిన అనేక భాగాలున్నాయి మధ్యయుగాలలోని అధికారవర్గాలు, తర్వాత రచయితలు వాటిపై ఆధారపడ్డారు మహాభారతం ధర్మశాస్త్రాలపై తనకు ఆధిపత్యం వున్నదని ప్రకటించుకున్నది "7వ శతాబ్దానికి చాలా పూర్వమే మహాభారతం ప్రజా విద్యాబోధనకు సాధనమైంది భారతదేశంలో స్త్రీపురుషులు హాజరయ్యే సమ్మేళనాలముందు దాన్ని పారాయణం చేసేవారు 19వ శతాబ్దంలోనూ ఇది జరిగింది ' ' రామాయణానికి కూడా ఇది వర్తిస్తుంది ప్రజల చైతన్యంపై దాని ప్రభావం మరింత ఎక్కువ ఎందుకంటే దాని కథానాయకుడైన రాముడు దేవుని అవతారమని ప్రజలను నమ్మించారు

ఈ ఇతిహాసాలలో స్వంతంత్ర ఆలోచనను గురించి పొందుపరచబడిన అంశాలు

---

1 కాణే-"హిస్టరీ ఆఫ్ ధర్మశాస్త్ర"

ఏ ధోరణిలో ఉన్నాయి? ఇందుకు రెండు ఉదాహరణలు చాలు

మహాభారతంలో భీష్ముడు యుధిష్టిరుడికి సుదీర్ఘోపదేశం చేస్తాడు అందులో ఆసక్తికరమైన ఒక పిట్టకథ చెప్తాడు అది ఇంద్ర, కాశ్యప కధగా పేరుపొందింది ఒకానొకప్పుడు బాగా ధన గర్వంతో విర్రవీగే ఒక వర్తకుడు తన రధాన్ని కాశ్యప వంశానికి చెందిన బ్రాహ్మణుని మీదుగా నడిపిస్తాడు ఆ అన్యాయానికి పరిష్కారం లేదు కనుక జీవించడం వ్యర్థమని అతను తలపోస్తాడు అందుకే ఆత్మహత్యకు సిద్ధమౌతాడు అతను చావకుండా అడ్డుకునేందుకై ఇంద్రుడు నక్క రూపంలో ప్రత్యక్షమౌతాడు ఒక సాధారణ జంతువుగా జన్మించడంలో ఇమిడివున్న కష్టనష్టాలను ఏకరువుపెడతాడు ఒక మానవునిగా ముఖ్యంగా బ్రాహ్మణునిగా జన్మించడం ఎంత గొప్ప అదృష్టమో వివరించడంపై కేంద్రీకరిస్తాడు అలాంటి జన్మను నాశనం చేసుకోవడం మంచిదికాదంటాడు అయితే ఈ నక్క ఎప్పుడూ నక్కగా లేదు గత జన్మలో మానవ రూపంలో వుంది అందుకే జంతుజీవితంలోని కష్టనష్టాలకు గురికాలేదు ఆ జన్మలో చేసిన ఒక ఘోర పాపానికిగాను ఇలా నీచజంతువుగా జన్మించాల్సి వచ్చింది స్వతంత్ర ఆలోచన లేక తర్కం పాటిస్తూ వేదాలను యధేచ్ఛగా ప్రశ్నించడమే తను చేసిన పాపం అని చెప్తాడు ఆ తోడేలు దాన్ని ఇలా వివరిస్తుంది

*"(గత జన్మలో) నేను తర్కాన్ని అనుసరించాను నిరర్థకమైన వాదోపవాదాలలో మునిగితేలాను (అన్వీక్షికం తర్కవిద్య అనురక్తో నిరర్థకం) నేను క్షుద్ర పండితుణ్ని అయ్యాను ఎందుకంటే స్వతంత్ర ఆలోచనగల హైతుకుడిగా వేదాలపై దాడిచేశాను (వేదనిందక) సభల్లో నేను రకరకాల తార్కిక ప్రశ్నలు లేవనెత్తేవాడిని అది చాలా పొరపాటైన పని నేను బ్రాహ్మణులను ఖండించేవాణ్ణి వారు చెప్పేదాన్ని వ్యతిరేకించేవాడిని నేను విశ్వాసరహితుడైన నాస్తికునిగా వుండేవాడిని ప్రతిదాన్నీ సందేహించేవాడిని జ్ఞానసముపార్జన చేస్తున్నట్లు నటించిన మూర్ఖుణ్ణి మాత్రమే ఓ బ్రాహ్మణులారా! ఇప్పుడు నేను అనుభవిస్తున్న బాధలన్నీ దానివల్ల కలిగినవే."*

*సామాన్య ప్రజలకు స్వతంత్ర ఆలోచనవల్ల కలిగే నష్టాన్ని గురించి చెప్పడానికి ఇంతకన్నా మెరుగైన మార్గం మరొకటి వుంటుందా? రామాయణంలో స్వతంత్ర ఆలోచనను నేరుగా ఖండించడం మరింత సూటిగా కనిపిస్తుంది స్వతంత్ర ఆలోచన అన్నది అనివార్యంగా భౌతికవాద దృక్పథంగా పరిణమిస్తుందని సూచించబడింది అందుకే రాజ్యాన్ని ఆదర్శంగా పాలించడమెలాగో రాముడు భరతునికి ఇలా చెప్తాడు[1] "ప్రియమైన భరతా భౌతికవాదం అనుసరించే ఒక బ్రాహ్మణున్ని ఎప్పుడూ ఆదరించవద్దు వారు అనర్థాలను తెచ్చిపెట్టడంలో సమర్థులు జ్ఞానార్జన చేస్తున్నట్లు నటిస్తున్నా వారు వాస్తవానికి పసిపిల్లలవలె వట్టి మూర్ఖులు*

---

1 ఆదిపర్వం

*ధర్మశాస్త్రంపై మహోత్కృష్ట గ్రంథాలున్నప్పటికీ ఈ మూర్ఖులు తమ మేధస్సును తర్కం దయాదాక్షిణ్యాలకు వదలిపెడతారు. ఆ శాస్త్రాలు నిరర్ధకమైనవని ప్రకటిస్తారు "*

## తాత్విక పరిస్థితి

దేశంలో నిజమైన తాత్విక కృషి కొనసాగడం అది సంశయంద్వారా ఉత్పన్నమయ్యే భావాలమధ్య సజీవ ఘర్షణకు దారితీయడంబట్టి చూస్తే స్మృతికారులు స్వతంత్ర ఆలోచనను పూర్తిగా పీక నులిమివేయలేకపోయారని రుజువవుతుంది అయితే అంతమాత్రాన భారతీయ తాత్వికరంగంపై వారి వినాశకర ప్రభావాన్ని తక్కువచేసి చూడరాదు తాత్వికుల్లో ఒక వర్గం స్మృతికారుల పట్ల వారి సిఫార్సులపట్ల అత్యుత్సాహం ప్రదర్శించడం ఒక ముఖ్యమైన విషయం తాత్విక కృషికి స్ఫూర్తినిచ్చే మరో ముఖ్యమైన అంశమేమంటే మరో తరహా తాత్వికులు ధర్మశాస్త్రకారులను, వారి కట్టుకథలను సూటిగా ధిక్కరించడమే లేకపోతే వేదాలకు నామకార్థంగా విధేయత చూపిస్తూ వారిని మోసగించడం జరిగింది

తాత్వికులు అనుసరించిన ఈ వైఖరులు ఏకపక్షమైనవి కావని ప్రత్యేకంగా గమనించాల్సివుంది అందుకు భిన్నంగా అవి భారతీయ తత్వశాస్త్రంలోని భావవాదంతో, దాని ప్రతి సిద్ధాంతంతో స్పష్టంగా ముడిపడివున్నాయి

## స్మృతికారులు - భావవాద తాత్వికులు

భారతీయ భావవాదుల్లో మహాయాన బౌద్ధులు స్మృతికారులకు చేసిన విశ్వసనీయమైన సేవను తర్వాతికాలంలో స్వామిభక్తికి సంబంధించిన వారి కోర్కెలను తర్వాత పరిశీలించవచ్చు ఎందుకంటే వారు సూచించిన పద్ధతి చాలా డొంకతిరుగుడుగా, సంక్లిష్టంగా వున్నది సూటిగా కనిపించే అంశంతో మొదలుపెట్టడంలో సౌలభ్యం వుంది అద్వైత వేదాంతుల విషయం చాలా సూటిగా ఉంది స్మృతికారుల ఒత్తిళ్ళను సంతృప్తిపరచే ప్రయత్నంలో వారు అవమానకరమైన లొంగుబాటును ప్రదర్శిస్తారు అద్వైత వేదాంతుల్లో అత్యంత ప్రముఖుడు శంకరుడు అతని గొప్ప తాత్విక రచన బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్యానమైన "వేదాంత భాష్యం" అందువల్లనే అద్వైత వేదాంతం స్మృతికారులపట్ల ఎలాంటి వైఖరి అనుసరించిందో అర్థం చేసుకోవడానికి మనం ఈ రచనలలో లభించే ఆధారాలపై కేంద్రీకరించడం సముచితంగా వుంటుంది

ఇక్కడ సహజంగా ఎదురయ్యే మొదటి ప్రశ్న స్మృతికారులపట్ల మరీముఖ్యంగా వారిలో అగ్రశ్రేణికి చెందిన మనువుపట్ల శంకరుడి సాధారణ వైఖరి ఏమిటి? ఈవిషయంలో శంకరుడు అస్పష్టతకు అవకాశం ఇవ్వలేదు మనువు చెప్పినదంతా ఔషధతుల్యం అని అతను గొప్ప ధీమాగా ప్రకటించాడు ఈ ప్రకటనపట్ల శంకరుడికిగల విశ్వాసం తిరుగులేనిది

---

1 అయోధ్యకాండ

అది ఆధ్యాత్మిక సాక్షాత్కారంలో భాగంగా వుండదగినది ఇందుకనుగుణంగానే అతను ఒక తాత్వికుడి దృష్టినుండి చాలా వింతగా కనిపించే పని చేశాడు తాత్విక వైఖరులను ఖండించడానికిగాని, బలపరచడానికిగాని ఆధారంగా స్మృతికారుల ఆధిపత్యాన్ని ఉటంకించాడు బ్రహ్మసూత్రాల వ్యాఖ్యానంలో కపిలుడి సాంఖ్య దృక్పధానికి వ్యతిరేకంగా, తన అద్వైతానికి అనుకూలంగా అతి బలమైన సాక్ష్యాధారంగా మనువు అభిప్రాయాన్ని ఉపయోగించుకున్నాడు "ప్రతిదాంట్లోనూ తననే చూడడాన్ని కీర్తించే సందర్భంలో మనువు పరోక్షంగా కపిలసిద్ధాంతాన్ని ఖండించాడు కపిలుడి భావాలు వేదాలను, వాటిననుసరించే మనువు సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తాయి " అని శంకరుడు వ్రాశాడు ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం ఎందుకంటే మనువు తత్వవేత్త కానేకాదు అయినప్పటికీ ఒక తాత్విక దృక్పధంయొక్క విలువ అంతిమంగా స్మృతికారుడి విముఖతపైనో, సుముఖత పైనో ఆధారపడివుంటుందని శంకరుడు భావిస్తాడు

మనువు చెప్పిన ప్రతిదానిపట్లా శంకరుడు ప్రశంసలు కురిపించిన సందర్భాలన్నీ ఇక్కడ పేర్కొనడం చాలా కష్టం తన వేదాంత భాష్యంలో శంకరాచార్యుడు మను స్మృతిని తరచూ ఉటంకిస్తాడని కానే పేర్కొన్నాడు " బృహదరణ్యక ఉపనిషత్తుపై తన భాష్యంలో అతను మనువును 12సార్లు ప్రస్తావిస్తాడు వేదాంత సూత్రాల రచయిత ఆధారపడదగిన ప్రమాణాలలో మనుస్మృతి ఒకటని అతను పరిగణిస్తాడని కాణే తెలియజేశాడు

## శంకరుడి వర్గ దృక్పథం

మరింత ముందుకు సాగేముందు మనం ఒక విషయాన్ని స్పష్టం చేసుకోవడానికి ప్రయత్నించాలి ఒక తాత్వికుని స్మృతికారుడితో అంత సన్నిహితంగా పెనవేసే అంశం ఏమిటి? ఈ ప్రశ్న చాలా ప్రధానమైంది

మనువు కేవలం స్మృతికారుడు మాత్రమే అయినప్పటికీ అతను తత్వశాస్త్రంపట్ల కొంత ఆసక్తి ప్రదర్శించాడు ఈ ఆసక్తి ప్రాధాన్యత ద్వితీయమైనది మాత్రమే తాను ఊహించే ఆదర్శ సమాజాన్ని సమర్థించుకోవడంపట్ల ఆత్రుత గల మనువు అందుకు సహాయపడుతుందా లేదా ఆటంకపరుస్తుందా అన్నమేరకే తత్వశాస్త్రం పట్ల ఆసక్తి ప్రదర్శించాడు అయితే శంకరుడు తాత్వికుడు వాస్తవికతకు సంబంధించిన ఒక ప్రత్యేక దృక్పధాన్ని సమర్థించుకోవడం అతని ప్రధాన లక్ష్యం మరి మనువును అతనంతగా ప్రశంసించడానికిగల ప్రాధాన్యత ఏమిటి? తాను చెప్పే సామాజిక స్వరూపానికి సైద్ధాంతిక భద్రతగా అద్వైత వేదాంతం ప్రాధమిక నమూనాను బలపరచడంపట్ల మనువుకు ఆసక్తి వుండటమే ఇందుకు కారణమా? అలాగే తన తాత్విక వైఖరికి అవసరమైన పాదార్థిక భద్రతను కల్పించగల ఏకైక మార్గంగానే శంకరుడు మనువు తత్వశాస్త్రంపట్ల ఆసక్తి చూపాడా?

A C. No. 72631

శంకరాచార్యుడి ఆధునిక అభిమానులకు ఇలాంటి అపవిత్రమైన ప్రశ్న లేవనెత్తడం ఇష్టం వుండదు అయితే ఈ ప్రశ్నను దాటవేయడం చాలా కష్టం ఎందుకంటే శంకరుడు ఒక సామాజిక సిద్ధాంతానికి కూడా విధేయత ప్రకటించాడు ఈ సామాజిక సిద్ధాంతం మనువు చెప్పే తరహా వర్గ ధోరణితో కరుడుకట్టిపోయి వున్నది

శంకరుడి సామాజిక భావనలు తెలుసుకోవడానికి మనం అతని ప్రధాన తాత్విక రచనను చూస్తే సరిపోతుంది బ్రహ్మసూత్రాలపై రాసిన తన వ్యాఖ్యానంలోనే శంకరుడు తన తాత్విక, సామాజిక భావాలను పూర్తిగా సమర్థించుకున్నాడు అందువల్ల అతని ఉద్దేశంలోనే ఈ రెండు వేర్వేరు కాదు అతని సామాజిక దృక్పథాన్ని దృష్టిలోకి తీసుకోకుండా అతని తాత్విక దృక్పథాన్ని మనం అర్థం చేసుకోలేము భారతీయ శాస్త్రకారుల పడికట్టు పదజాలంలోనే మనం శంకరుడి సామాజిక సిద్ధాంతాలను చర్చించాల్సివుంటుంది అతను దాన్ని వారినుండే తీసుకున్నాడు ఈ పదజాలం ప్రకారం సమాజం ద్విజులు, శూద్రులు అనే రెండు వర్గాలుగా ప్రధానంగా విభజితమైవుంది శంకరుడు తన రచనలలో ద్విజుల ఆధిక్యతను బేషరతుగా అంగీకరించాడు బ్రహ్మసూత్రాలపై తన వ్యాఖ్యానంలో ఒక మొత్తం భాగాన్ని దీన్ని వివరించడానికే ఉపయోగించాడు

శూద్రుడు తాత్విక జ్ఞానానికి అర్హుడు కాదని నిరూపించడమే శంకరుని ప్రధానలక్ష్యం ఇది చిన్న విషయంగా కనిపించవచ్చు కాని శంకరుని దృష్టిలో దాని నిజమైన ప్రభావం చాలా వినాశకరమైనది అతని దృష్టిలో తాత్వికజ్ఞానం మాత్రమే ఎవరికైనా నిజమైన స్వాతంత్ర్యాన్ని, విమోచనను ప్రసాదిస్తుంది అందువల్ల శూద్రుడు స్వతహాగానే తాను చెప్పే తాత్వికజ్ఞానానికి అనర్హుడైనట్లయితే దానికి అనుబంధ ప్రశ్న వస్తుంది శూద్రుడు నిజమైన స్వాతంత్ర్యం సాధించే అవకాశం ఎప్పటికీ కలగదు ద్విజులకు సేవ తప్ప మరేమి చేసినా ప్రయోజనముండదని మనువు అప్పటికే చెప్పిన ప్రకారం నిరంతర బానిసత్వంలో మగ్గిపోతూ శూద్రుడు శాశ్వతంగా ద్విజులకు సేవచేస్తూనే ఉండాలన్నమాట అయితే శూద్రులు తాత్విక జ్ఞానానికి ఎందుకని అర్హులు కారు? శంకరుడిలా జవాబు చెప్తాడు "శూద్రులకు ఆ హక్కు లేదు ఎందుకంటే వారు వేదాలు చదవలేదు వేదాలను చదివినవాడు వాటి సారాంశాన్ని గ్రహించినవాడు మాత్రమే ఆ విషయాలపై చర్చకు అర్హుడౌతాడు అయితే శూద్రుడు వేదాలు చదవలేడు ఎందుకంటే ఆవిధంగా చదవాలంటే ముందు ఉపనయనం జరగాలి ఆ అవకాశం ఉన్నత కులస్తులకు మాత్రమే ఉన్నది "

ఇదంతా మనకు కేవలం ఊహాపరంపరగా కనిపించవచ్చు కాని శంకరుడి విషయం వేరు స్మృతికారులచే నిషేధించబడటమంటే అతనికి తిరుగులేని విషయమన్నమాట అతనే ఇలా చెప్తాడు "మరోవైపున శూద్రులకు సంబంధించినంతవరకు క్రతువుల నిర్వహణ హక్కులేకపోవడం అనేకచోట్ల ప్రస్తావించబడింది ఉదాహరణకు మనువు వారిని ఒకే జన్మ

కలవారుగా పేర్కొన్నాడు కులాన్ని కోల్పోయే పాతకం ఒక శూద్రుడు చేయలేడు కనుక అతనికి ప్రాయశ్చిత్తాలు అవసరంలేదు " ఇంతటితోనే అయిపోలేదు ఈ విషయాన్ని ఇంకా వివరించడం అవసరమని శంకరుడు భావించాడు

శూద్రులు వేదాలు వినరాదని, చదవరాదని, వేద విషయాలను అర్థం చేసుకోరాదని, వేదక్రతువులు అమలు జరపరాదని స్మృతులు నిషేధించాయి వేద శ్రవణంపై నిషేధం క్రింది భాగాలలో పేర్కొనబడింది

*వేదాలను వినేవారి చెవుల్లో సీసం కరిగించిపోయాలి*

*శూద్రుడు శ్మశానంతో సమానం కనుక అతనికి సమీపంలో వేదాలు చదవకూడదు.*

ఈ చివరిభాగాన్నిబట్టి చూస్తే వేద పఠనంపై నిషేధం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది మరి అటువంటప్పుడు తన సమీపంలో కూడా చదవబడని వేదాలను అతనెలా అధ్యయనం చేస్తాడు? అంతేగాక మరో తక్షణ నిషేధం కూడా వున్నది

*"వేదాలను ఉచ్చరిస్తే అతని నాలుకను చీల్చివేయాలి"*

*వాటిని జ్ఞాపకం పెట్టుకుంటే అతని శరీరాన్ని ఖండఖండాలు చేయాలి*

వేద శ్రవణంపైనా, పఠనంపైనా నిషేధం అనడంలోనే వేదవిషయాలకు సంబంధించిన విజ్ఞానంపైనా, ఆచరణపైనా నిషేధం ఇమిడివున్నది అందుకే కొన్ని తక్షణ చర్యలు ప్రతిపాదించబడ్డాయి. అవి ఏమంటే

*"అతను శూద్రుడికి జ్ఞానబోధ చేయరాదు ద్విజుడికి మాత్రమే అధ్యయనం, బలి, కానుకలు పొందడానికి అర్హత వుంటుంది "*

శంకరుడు పొందుపరిచిన ఆధారాలలోగల పచ్చి పాశవికత ప్రాచీన గ్రీసు, రోములలో బానిసత్వాన్ని అత్యంత మొరటుగా సమర్థించిన సందర్భాలను కూడా తలదన్నింది తమ సిద్ధాంతకర్త దేశంలోని కోట్లాదిమంది పీడిత ప్రజలపట్ల ఇంతటి అమానుష చర్యలను ప్రబోధించగా శంకరుడి ఆధునిక అభిమానుల్లో కొందరు అతని సిద్ధాంతంలో మానవత్వం గురించి రాయాలని ముచ్చటపడటం ఆశ్చర్యం కలిగిస్తుంది

అతనికి, ప్లేటోకు పోలిక తీసుకురావడం అతని ఆధునిక అభిమానుల్లో మరికొందరికి ఇష్టమైన విషయం ఇలాంటి పోలికకు చాలా అవకాశం వుంది ఎందుకంటే ఈ తాత్వికులిద్దరూ ప్రకృతి వాస్తవికతను నిరాకరించేందుకు ప్రయత్నించినవారే తద్వారా విజ్ఞానశాస్త్రాభివృద్ధికి తీవ్ర సైద్ధాంతిక ఆటంకాలు కల్పించిన వారే అయితే పోలిక అదొక్కటేకాదు సాంఘికంగా కూడా ఉభయులమధ్యా చాలా పోలికవుంది తన దేశంలోని పీడితప్రజలను శంకరుడు శూద్రులు అంటే ప్లేటో బానిసలు అన్నాడు వారిపట్ల ఉభయులలో ఒకేవిధమైన తృణీకార దృష్టి ప్రదర్శితమైంది "బానిసత్వానికి సంబంధించిన పరిణిత సిద్ధాంతంలో బానిసను ఒక విచక్షణా శక్తిగల ప్రాణిగా పరిగణించడం జరగలేదు యజమాని మాత్రమే విచక్షణా జ్ఞానం కలిగివుంటాడు యజమాని ఆదేశాలను ఖచ్చితంగా

పాటించినప్పుడే బానిస సరైన అభిప్రాయాన్ని కలిగివుంటాడు అన్నిరంగాల్లోనూ ప్లేటో ఆలోచనలు యజమాని, బానిస అన్న విభజనపై ఆధారపడి ఉన్నాయి

పాదార్థిక ప్రపంచంపట్ల సైద్ధాంతిక తృణీకారం పీడితప్రజలపట్ల సామాజిక తృణీకారంతో ఎలా ముడిపడివుంటుందో అర్థం కావడానికి ఈరెండు ఉదాహరణలు మనకు దోహదం చేస్తాయి ఆధునిక ప్రపంచంలో వర్గ చైతన్యంగల కార్మికవర్గం ధాటికి అంతిమంగా కుప్పకూలే తాత్విక దృక్పథం ఇదే కావడంలో ఆశ్చర్యంలేదు మనిషి విముక్తికి సంబంధించిన భావనను గురించి చెప్తూ మార్క్స్ ఇలా అంటాడు *" ఈవిముక్తికి తల తత్వశాస్త్రం, హృదయం కార్మికవర్గం కార్మికవర్గాన్ని నిర్మూలించలేకపోతే తత్వశాస్త్రం వాస్తవంకాదు తత్వశాస్త్రాన్ని వాస్తవికం చేయకపోతే కార్మికవర్గం నిర్మూలించబడదు "*

## శూద్రులు-కష్టాలు

అయితే మనం మళ్ళీ శంకరుడి దగ్గరకు వెళదాం శూద్రుణ్ణి కదిలే శ్మశానంగా తెగనాడటం అతనికి సంతృప్తి కలిగించలేదు శూద్రుడు అన్నమాటకు అర్థమే కష్టాలను భరించటమని కూడా అతను వివరించేందుకు ప్రయత్నించాడు అందువల్లనే కష్టాలు పడేవారిని అలంకార రీత్యా శూద్రుడు అని అన్నారు ఆయన చెప్పిన సందర్భాన్ని గురించి చాందోగ్య ఉపనిషత్తులో ఆసక్తికరమైన ఒక కథ వుంది దాని సారాంశం ఇలా వుంటుంది

*"జనశ్రుతి పౌత్రాయనుడనే ఒక భాగ్యవంతుడు వుండేవాడు అతను గొప్ప దాత తన దానగుణానికి గర్వించేవాడుకూడా ఒకరోజు రాత్రి కొన్ని పక్షులు అతనిమీదుగా వెళ్ళాయి రథంగల రైక్వుడనే ఒక తాత్వికుడు అతనికన్నా గొప్పవాడని అవి గుసగుసలాడుకున్నాయి ఇది విన్న జనశ్రుతి తన సేవకుడిని ఆ తాత్వికుడెవరో తెలుసుకురమ్మని పురమాయించాడు కొంత అన్వేషణ తర్వాత సేవకుడు రైక్వుని జాడ తెలుసుకున్నాడు అప్పుడతను తన రథం క్రింద పడుకొని గజ్జిదురద గోక్కుంటున్నాడు జనశ్రుతి అతని దగ్గిరకు వెళ్ళి 600గోవులు, ఒక స్వర్ణహారం, ఆడకంచర గాడిదలు తోలే రథం ఇస్తానన్నాడు అందుకు బదులుగా తనకు రహస్యజ్ఞానం బోధించమని కోరాడు అయితే రథంగల రైక్వుడు ఎంతో ఆగ్రహం చెందుతూ అందుకు నిరాకరించాడు అప్పుడు జనశ్రుతి మరోసారి వెళ్ళి వెయ్యి గోవులు, స్వర్ణహారం, ఆడగాడిదలు తోలే రథం తాత్వికుడు నివసించే గ్రామం, తన కూతురు అన్నింటిని ఇస్తానన్నాడు ఆ యువతి ముఖారవిందం ఆ తాత్వికుని హృదయాన్ని కరిగించింది తన దాతకు రహస్యజ్ఞానాన్ని అందించేందుకు అతను అంగీకరించాడు*

*ఆ తర్వాత భాగాన్ని ఉపనిషత్తులు ఇలా వర్ణించాయి "అప్పుడు అతను (రైక్వ) ఆ అమ్మాయి ముఖాన్ని తన వైపుకు తిప్పుకున్నాడు నీవు ఇతర కానుకలు కూడా ఇచ్చావు కాని శూద్రుడా నేను మాట్లాడుతున్నది కేవలం ఈ ముఖం చూసి అన్నాడు " తన రథం క్రింద పడుకొని ఒక యువతిని ఇచ్చినందుకు బదులుగా జ్ఞానాన్ని అందించేందుకు అంగీకరించే ఉపనిషత్ ఋషి చిత్రణ ఆశ్చర్యంగా కనిపించవచ్చు అయితే శంకరుడికి అదేమి పట్టదు అతనికి వేరే విషయాలు చిరాకు తెప్పిస్తాయి జనశ్రుతి*

*శూద్రుడుగా వుండి ఉపనిషత్ జ్ఞానం పొందగలగటం శంకరుడు భరించలేడు ఇదెలా సాధ్యమైంది? ఉపనిషత్ సారస్వతంలో గల సాక్ష్యాధారాలను బట్టి శూద్రులు జ్ఞానానికి అనర్హులనే శంకరుడి వాదన చెల్లకుండా పోవటమా? ఆ ప్రస్తావనే శంకరుడికి దుర్భరమైంది ఇక్కడ శూద్రుడంటే నిజంగా శూద్రుడు కాదని అతను వాదిస్తాడు దు ఖంతో మునిగిపోయిన వ్యక్తిని అలంకార దృష్టితో అలా వర్ణించినట్లు వివరిస్తాడు ఆ పదం నైఘంటుకార్థాన్ని బట్టి మనలను అలా నమ్మమంటాడు*

*"ఈ సందర్భాన్ని బట్టి శూద్రపదాన్ని ఇలా అర్థం చేసుకోవలసి వుంటుంది జనశ్రుతి పౌత్రాయనుడు పక్షులు తనను కించపరుస్తూ మాట్లాడడం విని దు.ఖితుడయ్యాడు ఆ దుఃఖాన్ని శూద్ర పదంతో రైక్వుడు పోగొట్టాడు ఈ వివరణను తప్పక ఆమోదించాలి. ఎందుకంటే నిజంగా శూద్రుడుగా పుట్టిన వ్యక్తి జ్ఞానానికి అర్హుడుకాదు జనశ్రుతి మనస్సులో కలిగిన దుఃఖాన్ని శూద్రపదంతో వర్ణించడం ఎలా సాధ్యం అని అడిగితే దానికి మా సమాధానం-దుఃఖం పొంగుకురావడం (అద్వరణం)వల్ల ఎందుకంటే మనం శూద్రపదాన్ని భాషా శాస్త్ర రీత్యా రెండుగా విభజించవచ్చు అతడు దుఃఖంలో మునిగిపోయాడు (సూచం, అభిదుద్రవ) అనిగానీ, దుఃఖం అతనిని కమ్మివేసింది అనిగాని లేక అతడు దుఃఖంలో రైక్వుడి దగ్గిరకు పరుగెత్తాడు అనిగానీ అర్థం చేసుకోవలసి వుంటుంది అంతేతప్ప మామూలు అర్థంలో ఈ పదాన్ని తీసుకోరాదు "*

## విశ్వాస సమర్థన - అద్వైత వేదాంతం

తన అధిభౌతికవాదంగానీ, సామాజిక శాస్త్రంగానీ హేతువుకు, తాత్త్విక పరిశీలనకు నిలిచేవికావని శంకరుడికి తెలిసేవుంటుంది అతను అలా ఎప్పుడూ చెప్పుకోలేదు అందుకు భిన్నంగా మొదటిది శ్రుతుల మతశాస్త్రాలనుండి, రెండవది ధర్మశాస్త్రాలనుండి ఆమోదం పొందాయని చెప్పుకున్నాడు అందువల్లనే తన అభిప్రాయాలను మొత్తంగా ఆమోదించాలన్నట్లయితే ఈ రెండింటి సాధికారతపట్ల తిరుగులేని విధేయత అనివార్యం అన్నాడు హేతువాదానికి ఎలాంటి స్వయం శక్తి లేదని ఖండించడం తన విశ్వాసాన్ని బలపరచుకునేందుకు చాలా అవసరమని అతను తలపోశాడు ఆవిధంగా శంకరుడు తన భావాలసమర్థన కోసమే హేతువాదానికి వ్యతిరేకంగా పోరాడవలసి వచ్చింది అదేసమయంలో ఒక తాత్త్వికుడిగా అతను స్మృతికారులకు సహాయం చేయడంకూడా మనమిక్కడ చూడగలుగుతాము ఈ అంశాన్నే మరింతగా పరిశీలిద్దాము

స్మృతికారులు చెప్పిన ప్రతిదాన్ని అతనెంతగా ప్రశంసించాడో మనం చూశాము ఇది స్మృతికారులకు ఎంత సంతోషమైనా కలిగించవచ్చు అయితే తాత్త్వికుడిగా అతని నుంచి వారు కోరుకునే సహాయం ఇదికాదు ఎందుకంటే స్వార్థపర ప్రయోజనాలుగల వారెవరైనా అలాంటి సహాయం చేసిపెట్టగలరు తాత్త్వికులు మాత్రమే చేయగల సహాయం వేరే వుంది అదే హేతువాదాన్ని సైద్ధాంతికంగా ఖండించడం జనబాహుళ్యాన్ని అదుపులో

వుంచడంలో మూఢనమ్మకానికిగల ప్రాధాన్యత స్మృతికారులకు తెలుసుగనుకనే వారు హేతువాదాన్ని ఖండించేందుకు శక్తికొద్దీ పాకులాడారు అయితే అది కేవలం తాత్వికదృక్పధ మద్దతు లేని రాజకీయపరమైన ఖండన మాత్రమే కాని హేతువాద సామర్థ్యమన్నది పూర్తిగా తత్వశాస్త్ర సంబంధమైన ·సమస్యగనుక దానికి తాత్వికపరమైన సమాధానం ఇవ్వడమే అవసరమౌతుంది అంతేగాక భారతీయ తాత్వికుల్లో చాలామంది స్మృతికారులకు చాలా చికాకు తెప్పించే రీతిలో హేతువాదాన్ని సమర్థించారు వారి వాదనలకు సైద్ధాంతికంగా సమాధానం చెప్పాలి, ఖండించాలి ఇది స్మృతికారులకు మించిన పని మరి స్మృతికారుల మాట మన్నించి వారి అవసరాలకు సరిపడేలా హేతుశీలతకు వ్యతిరేకంగా తాత్విక సమర్థనలు సమకూర్చగలవారెవ్వరు? అలాంటి సమర్థన తమ తాత్విక అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని భావించేవారే ఆ పని చేయగలరు అలాంటి తాత్వికులెవరో మనం ఇదివరకే చూశాము అలాంటివారు మన భావవాదులే భావవాదులు మాత్రమే ఆ పనికి చక్కగా సరిపోయారు తమ అధిభౌతిక సిద్ధాంత ప్రాథమిక అవసరాలకోసం వారు హేతువును, అనుభవజ్ఞానాన్ని ఖండించడం అవసరమైంది తద్వారా సత్యంపట్ల హేతురహిత దృక్పధాన్ని హేతుబద్ధం చేయడం జరిగింది స్మృతికారులకు ఇంతకన్నా కావలసింది లేదు వారికి సంబంధించినంతవరకు ఒక భావవాది తాము చెప్పే ప్రతిదాన్ని బండగా సమర్థించాడా లేదా అన్నది ముఖ్యంకాదు శంకరుడి వంటి భావవాది ఆ పని చేస్తే వారికేమీ అభ్యంతరం లేదు కానీ ఇతర భావవాదులు అలా చేయకపోయినా వారి దృష్టినుండి అదేమీ సమస్యకాదు కాకపోతే నిరంతరం హేతువాదాన్ని ఖండిస్తూ వుండాలి ఎందుకంటే అది తాత్వికులు మాత్రమే చేయగల పని

స్మృతికారులకు ఆనందం కలిగించే రీతిలో శంకరుడు కూడా ఈ సేవచేసి పెట్టాడు వేదాలలో చెప్పినదానికి వ్యతిరేకంగా హేతువాదంపై ఎలాంటి నమ్మకం ఉంచుకోవడమైనా మూర్ఖత్వమేనని అతను తన సర్వశక్తులూ ఒడ్డి వాదించాడు

*"మనుషుల ఆలోచనలకు ఎలాంటి సంకెళ్ళు లేవు అందువల్ల వేదాలను తృణీకరించి వ్యక్తిగత అభిప్రాయంపైనే ఆధారపడే హేతుశీలతకు సరైన పునాది వుండదు కొంతమంది తెలివైనవారు చాలా కష్టపడి కనిపెట్టే వాదనలను అంతకన్నా తెలివైన మరికొందరు త్రోసిపుచ్చుతారు వారి అభ్యంతరాలను ఇంకా కొందరు తిరస్కరిస్తారు అందువల్ల మనుషుల విభిన్న ఆలోచనల ప్రాతిపదికన, హేతుశీలతకు ఖచ్చితమైన పునాదివుందని విశ్వసించడం అసాధ్యం ప్రతిభావంతులుగా గుర్తించబడిన కొందరువ్యక్తులు హేతువాదాన్ని సరైందిగా ఆమోదించినప్పటికీ మనకు ఇబ్బందులు తప్పవు కపిలుడు లేక మరెవరైనా సరే ఎందుకంటే నిశ్చయంగా గొప్ప ప్రతిభావంతులైన కపిలుడు, కణాదుడు (భారతీయ అణువాద పితామహుడు)వంటివారుగాని, ఇతర తాత్విక ధోరణులకు చెందినవారుగాని ఒకరినొకరు ఖండించుకున్నారు*

ఆవిధంగా విజ్ఞానానికి మూలాధారమైన హేతువాదం స్వతహాగానే విశ్వసించడానికి

లేనిదని చెప్పబడింది ఎందుకంటే హేతువాదంపై ఆధారపడ్డామని చెప్పే తాత్వికులు తమలోతామే విభేదిస్తారు హేతువు ఆధారంగా ఒకరు నిరూపించే విషయాన్ని మరొకరు హేతువు ఆధారంగానే ఖండిస్తారు అందువల్ల పవిత్రగ్రంధాలలోని విశ్వాసానికి తలవంచి హేతువును పూర్తిగా వదలుకోవడం ఉత్తమం కత్తియుద్ధంలో ఒకరికన్నా ఒకరు ఎక్కువ సామర్థ్యం చూపించేటట్లయితే అసలు కత్తియుద్ధమన్నదే పనికిరానిదైపోతుంది కత్తిని వదలుకోవడంద్వారా లేక నిరాయుధంగా పోరాడడంద్వారా మాత్రమే మంచి విజయాలు సాధ్యపడతాయి అని కూడా దీన్నిబట్టి వాదించవచ్చు అయితే శంకరుడి వాదనలలో ఇమిడివున్న మంచిచెడ్డలను అంచనా వేసే పని మనమిప్పుడు పెట్టుకోవద్దు అందుకుబదులు ఒక విషయాన్ని గమనిస్తే సరిపోతుంది అత్యంత ప్రతిభావంతంగా గౌతముడు, వాత్సాయనుడు తమ తాత్విక పద్ధతిని పెంపొందించడానికి ఉపయోగపడిన అంశానికి ఇది పూర్తి విరుద్ధమైంది వారు చెప్పిన ప్రకారం భావాల ఘర్షణ తాత్విక కృషికి ప్రాణవాయువు కాని శంకరుడు మాత్రం అదే అంశంపై ఆధారపడి నిజమైన తాత్విక కృషికి వ్యతిరేకంగా వాదనలు సృష్టించాడు సంశయమే లేకపోతే వారికి తత్వమే లేదు కాని శంకరుడి దృష్టిలో సంశయానికి సర్వ విరుద్ధమైన అంధ విశ్వాసం ఉన్నప్పుడే తత్వం వుంటుంది

భారతీయ తత్వశాస్త్రంలో వ్యక్తమయ్యే రెండు మౌలిక ధోరణులు ఇవి భావవాదం, దాని ప్రతి సిద్ధాంతాల లేడా ఈ రెంటికీ మధ్యనే ఇమిడివున్నది

శంకరుడు పై ఒక్క వాదనతోనే తాను హేతువాదాన్ని మొత్తంగా ఖండించగలనని అనుకునేంత అమాయకుడు కాదు పైగా తన వాదనలో అంతర్గతంగా గల లోపాలు అతనికి తెలుసు తనవాదనకు రాగల అభ్యంతరాలను అతనే ఈవిధంగా పేర్కొన్నాడు [1]

*ఏ హేతుశీలత కూడా నిలిచేదికాదన్న మీవాదనను సమర్థించుకోలేరు (అని ప్రత్యర్థి అన్నాడు) ఎందుకంటే హేతుశీలత పనికిరాదనే మీ వాదన కూడా హేతువు పైనే ఆధారపడివుంది కొన్ని వాదనలు పునాది లేనివిగావున్నాయి కనుక మిగిలినవికూడా అంతేనని అంటున్న సూత్రీకరణ సరైందికాదు పైగా అసలు హేతుశీలత అన్నదే నిరాధారమయ్యేట్లయితే మానవుడి వాస్తవ జీవితం సాగదు మనుషులు సంతోషం పొందడానికి, భవిష్యత్తులో బాధలు తొలగించుకోవడానికి పనిచేస్తారు భూత, భవిష్యత్, వర్తమానాలు ఒకేవిధంగా వుంటాయన్న ఆలోచనతో వారు వ్యవహరిస్తారు*

*"ఆధారం లేనిది అని మీరు దేన్నయితే అంటున్నారో అదే హేతుశీల సౌందర్యం అభ్యంతరకరమైన వాదనలకు గతంలో ఎదురైన తిరస్కరణలను గమనంలో వుంచుకుని నిరభ్యంతరకరమైన వాదనలను రూపొందించడానికి అది వీలుకలిగిస్తుంది (పూర్వపక్షం*

---

1 బ్రహ్మసూత్రాలపై వ్యాఖ్య

*బలహీనమైనది కనుక సిద్ధాంతం కూడా బలహీనమై వుండాలని భయపడనవసరంలేదు) అన్న మూర్ఖుడైనంత మాత్రాన తమ్ముడూ మూర్ఖుడు కావాలని చెప్పడం నిరాధారం !"*

హేతువాదాన్ని ఖండించేందుకు భావవాదులు తప్పక లేవనెత్తే ప్రాథమిక వాదనలకు ఇది చక్కటి విశదీకరణ దీనంతటివల్ల ఎదురైన తాత్విక సవాలును నిజంగా ఆధునికులైన నాగార్జునుడు, శ్రీహర్షుడువంటి భారతీయ భావవాదులు, వారి వ్యాఖ్యాతలు ఎదుర్కొన్నారు తన ఆలోచనలన్నింటికీ సంబంధించిన సాంకేతిక వివరాలలోకి పోవడం శక్తికి మించిన పని అని శంకరుడే గ్రహించి వుండవచ్చు లేక ఆ అవసరం లేదని భావించివుండవచ్చు ఏమైనా అతను సమస్య లోతుల్లోకి వెళ్ళేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు మొత్తం సమస్యను పక్కదోవ పట్టించేందుకే ప్రయత్నించాడు పాడిపాడి వాదనలు ఎంత జటిలంగా కనిపించినప్పటికీ విమోచనలకు దారితీసే అవకాశం లేదని చెప్తాడు అతని వాదన ఇలా సాగుతుంది [1]

*అంతిమ విమోచన సాధనకు ఆధారభూతమైన ప్రపంచ నిజప్రవృత్తికి గల కారణం చాలా దుర్గ్రాహ్యం గనుక దాన్ని అవగతం చేసుకోవడం సాధ్యంకాదు ఎందుకంటే పవిత్రగ్రంథాల సాయం లేకుండా అది అందేదికాదు ఆవిషయం ఆలోచించనేలేము రూపం తదితర లక్షణాలు వుండవుగనుక దాన్ని ఊహించుకోనూలేము ఎందుకంటే అది నిర్గుణమైంది ఊహాగానాలకు, ఇతర విజ్ఞాన మార్గాలకు అతీతమైంది అందువల్ల పరిపూర్ణ విజ్ఞానం విషయంలో మనిషి భావాల ఘర్షణ అసంభవం కాని హేతుశీలతపై ఆధారపడిన గ్రహింపు ఘర్షణకు గురవుతుందనేది తెలిసిన విషయమే ఒక తార్కికుడు తిరుగులేనిదిగా స్థాపించే జ్ఞానాన్ని మరొకడు ఖండఖండాలు చేస్తాడు మూడోవాడు వచ్చి వీడికి అదేగతి పట్టిస్తాడు అలాంటప్పుడు శాశ్వతమైన ఏకరూపత లేకుండా హేతుశీలతపై ఆధారపడితే జ్ఞానం ఎలా పరిపూర్ణమవుతుంది? ఒకానొక సందర్భంలో ఒకానొకచోట భూత, భవిష్యత్, వర్తమాన తార్కికులందరినీ చేర్చి వాదోపవాదాలు జరిపి పరిపూర్ణ జ్ఞానంగా పరిగణించదగిన ఏకరూప పదార్థాన్ని గురించి తేల్చుకోమని చెప్పలేము మరోవైపున చూస్తే వేదాలు జ్ఞానానికి నిరంతరాయమైన సాధనాలుగా, మూలాలుగా వున్నాయి అవి సువ్యవస్థితమైనవి కనుక వేదాలపై ఆధారపడిన జ్ఞానాన్ని భూత, భవిష్యత్, వర్తమాన తార్కికులెవరూ ఖండించజాలరు ఆవిధంగా మనం మన విజ్ఞానాన్ని పటిష్ఠపరచుకున్నాము ఉపనిషత్తులలో అది పునరుద్ధరించబడింది అవి లేకుండా జ్ఞానంలేదు వాటినిగనుక విస్మరిస్తే ఆత్మకు అంతిమ విమోచన లభించదు కనుక మా చివరి మాట ఏమిటంటే వేదాలు చెప్పేదాన్ని బట్టి వాటికి విధేయమైన హేతుశీలతనుబట్టి మేధావంతులైన బ్రాహ్మణులే ప్రపంచానికి కారణమని సారాంశమని చెప్పాల్సివుంటుంది*

---

1 బ్రహ్మసూత్ర వ్యాఖ్యానం

తార్కికులు తమలో తాము విభేదిస్తారుగనుక తర్కానికి ఎలాంటి విలువా లేదనే పాత వాదనకు తోడు శంకరుడు వివరంగా చెప్పిన విషయం పవిత్ర గ్రంథాలపట్ల గుడ్డి విశ్వాసం తన విశ్వాసాలలో భాగం పంచుకునే వర్గాలుగాక ఇతర భావస్రవంతులు కూడా వున్నాయని శంకరుడికి గుర్తుచేయడంవల్ల ఏమాత్రం ప్రయోజనం లేదు ఇందులో ప్రతి శాఖకు తనదైన పవిత్రగ్రంథం వుంది పవిత్రగ్రంథాలలో వున్నదే తిరుగులేనిదని, సార్వత్రిక జ్ఞానమనీ దాని ప్రాతిపదికపైనే విమోచన సాధ్యమనీ సాధారణ సూత్రీకరణ చేస్తే వారిలో కొందరు అంగీకరించరు కాని శంకరుడికి మాత్రం ఇదంతా అనవసరం అతని దృష్టిలో ఒకే ప్రమాణం వేదం అంతేగాక తాను కోరుకున్నవిధంగా మాత్రమే దానికి భాష్యం చెప్పాలంటాడు మనకు ఈ ధోరణి చాలా దుస్సాహసంగా కనపడవచ్చు కాని శంకరుడికి మాత్రం కాదు ఎందుకంటే ఈ భావాలను ప్రశ్నించేవారి సంగతి స్మృతులు చూసుకుంటాయని అతనికి బాగా తెలుసు

## విశ్వాస సమర్థన - మహాయాన బౌద్ధం

స్మృతులకు శంకరుడు చేసిన ఈ సేవల్లో మనకు తాత్వికేతరమైన, తాత్విక సంబంధమైన రెండు ప్రత్యేక భాగాలు కనిపిస్తాయి స్మృతికారులకు మొత్తంగా అతనిచ్చిన మద్దతు మొదటి కోవకు చెందినది హేతువాద ఖండన రెండవ తరహాకు చెందినది ఈ తేడాను మనసులో వుంచుకుంటూ మనం మహాయాన బౌద్ధులదగ్గిరకు వెళ్ళవచ్చు వారికి సంబంధించిన ముఖ్యాంశమేమంటే స్మృతికారులకు తాత్వికేతరమైన సహాయం చేయడంలో వారు శంకరుడికన్నా వెనకపడివున్నారు తాత్వికరంగంలో మాత్రం అదే పని చాలా సమర్థవంతంగా చేసిపెట్టారు

స్మృతికారుల సాధికార ప్రతిపత్తిని గురించి మహాయానబౌద్ధులు పెద్ద రచ్చచేయకుండా అడ్డుపడిన అంశం ఒక్కటే బౌద్ధుల గురించి మనకు తెలిసినంతటినీ బట్టి చూస్తే వారు తమ కోణంనుండి ఎలాంటి ప్రత్యామ్నాయ స్మృతిసారస్వతం సృష్టించలేదు వారికి ''వినయాల''నబడేవి ఉన్నాయనడంలో సందేహంలేదు కాని అవి నైతిక ప్రవర్తనకు సంబంధించినవి మాత్రమే ముఖ్యంగా సాధువులకు కొంతవరకు సాధారణభక్తులకు కూడా అవి వర్తిస్తాయి కాని సాధారణ పరిపాలనావసరాల దృష్టితో చూస్తే మనుధర్మశాస్త్రం వగైరాలవలె ఇవి ఏమాత్రం సరిపోవు బౌద్ధ స్మృతిగ్రంథం ఏదీ లేకపోవడం పైకి చాలా విచిత్రంగా కనిపించవచ్చు ఎందుకంటే దేశంలోని విశాల భూభాగాలలో అనేక దశల్లో బౌద్ధాన్ని అనుసరించినవారు పరిపాలన సాగించారు పాలకులు గనుక వారు తమ భూభాగంలో పాలనా కార్యక్రమం నిర్వహించవలసి వచ్చింది ఇందుకోసం వారికి స్పష్టమైన ధర్మసూత్రాలు అవసరమై వుండాలి కాని ఈ ధర్మసూత్రాలు ఏమిటి అన్న ప్రశ్న చాలా ముఖ్యమైంది చరిత్ర పరిశోధన ప్రస్తుత దశలో ఖచ్చితమైన సాక్ష్యాధారాలు లేనిదృష్ట్యా

మనం కొంతవరకు ఊహించిమాత్రమే సమాధానం చెప్పగలం ఒకటి -బౌద్ధ పాలకులు నియమబద్ధమైన ధర్మశాస్త్ర అవసరాన్ని పెద్దగా పట్టించుకోలేదు రెండవది- వారు కొన్ని నియమాలపై ఆధారపడినప్పటికీ అవి స్మృతులలోని పవిత్ర సూత్రాలు తప్ప మరేమీ కావు ఈ రెండు ఊహల్లో మొదటిదాన్ని మనం చాలా సాహసంతో ఆమోదించాలి భారతదేశ చరిత్రలో సాంప్రదాయక సూత్రాలకు సాధారణ ప్రాధాన్యత ఉన్నప్పటికీ మొత్తం పాలనా యంత్రాంగం కేవలం వాటిపైనే ఆధారపడి నడిచిందని భావించడం కష్టం రెండవ ఊహ మరింత నమ్మశక్యంగా కనిపిస్తుంది ఎందుకంటే బౌద్ధ పాలకులు తమ అధీనంలోని సాంఘిక, పాలనా వ్యవస్థలలో ఎలాంటి మౌలిక మార్పులు ప్రవేశపెట్టలేదు కనుక వారు సాధారణ ధర్మశాస్త్రాలనే అనుసరించి వుండవచ్చు

వారు ఆవిధంగా ఆమోదించారనుకున్నప్పటికీ మనం మరింత ముందుకు పోవాలి వాటిని ఆమోదించినట్లు ప్రకటించినట్లయితే బౌద్ధానికి ఒక మతపరమైన వ్యతిరేకత వస్తుంది కనుక అలా చేసివుండరు కనుక వాస్తవిక దృష్టితో చూస్తే బౌద్ధ పాలకులు ధర్మశాస్త్రాలలోని బౌద్ధ వ్యతిరేక భావనలను పట్టించుకోకుండా వాటిని పాలనావసరాలకు వినియోగించుకొని వుంటారు [1]

ఏమైనా పరిపాలకుల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ మహాయాన బోధకులు మాత్రం మనువు తదితరుల సాధికారతను ఎప్పటికీ గుర్తించలేరు వారి బౌద్ధ వ్యతిరేక ప్రవచనాలు చాలా తీవ్రమైనవి గనుక తాత్వికరంగంలోని వారు వాటిని పట్టించుకోకపోవడం అసాధ్యం మహాయాన బౌద్ధులు స్మృతికారుల ఆధిపత్యాన్ని మొత్తంగా ప్రశంసించడంద్వారా తాత్వికేతర రూపంలో ఎందుకు సహాయం చేయలేకపోయారన్నది దీన్నిబట్టి మనం తెలుసుకోవచ్చు అయితే భావవాద తాత్వికులుగా వారు స్మృతికారులు ప్రాతినిధ్యం వహించే నిజమైన వర్గ ప్రయోజనాలు పట్టించుకోలేదనుకుంటే పొరపాటే పరాన్నభుక్కు వర్గాల ప్రాపకంపై ఆధారపడి తమ విశాల విహారాలలో బ్రతుకుతున్న ఈ తాత్వికులు తమదైన పద్ధతిలో అందుకు సేవచేశారు మరోవిధంగా చెప్పాలంటే తమ మత భావాలు అడ్డుపడటంవల్ల స్మృతికారులను సూటిగా పొగడలేకపోయినా ప్రధానంగా తాత్వికరంగంలో సేవలందించారు ఈవిషయంలో మాత్రం వారు శంకరుడికన్నా చాలా సమర్థవంతంగా సేవచేశారు ఇక్కడ మనం ఈ సేవలకు సంబంధించిన కొన్ని ముఖ్యాంశాలను మాత్రమే పరిశీలించగలం

మొదటిది - మనం ఇప్పటికే చూసినట్లుగా భాగ్యవంతులైన స్వల్పసంఖ్యాకులు, అసంఖ్యాక పీడితప్రజలుగా విభజించబడిన ఒక సమాజాన్ని నిలబెట్టడానికి బాగా

---

1 పాల శాసనాలలోని అలాంటి ఆధారాలు కనిపించినట్లు డాక్టర్ ఎన్ ఎస్ భట్టాచార్య నాకు చెప్పారు

అవసరమయ్యేది గుడ్డినమ్మకం ఈ విశ్వాసాన్ని సమర్థించడానికి కావలసింది హేతువాద ఖండన మహాయాన తాత్వికులు ఈ పని శంకరుడికన్నా గొప్పగా చేశారు హేతువాదులు తమలో తాము విభేదిస్తారన్న వాదనతో శంకరుడు హేతువాదాన్ని నిరాకరించాడు కానీ నాగార్జునుడితో మొదలుపెట్టి మహాయాన బౌద్ధులు సాధారణ హేతువును, అనుభవ జ్ఞానాన్ని ఖండించేందుకు క్రమక్రమంగా మోసపూరిత వాదనలు కనిపెడుతూ వచ్చారు ఈ తాత్వికులు అత్యంత ప్రతిభావంతులైన తార్కికులని తరచూ చెపుతుంటారు అది వాస్తవమే వారిలో కొందరికి వాదనా ప్రక్రియలో ఆశ్చర్యకరమైన శక్తిసామర్థ్యాలున్నాయి ఈ తాత్వికులు తర్కానికి నిజంగా కట్టుబడ్డారని మాత్రం అనుకోరాదు మరీముఖ్యంగా దిగ్నాగుడు, ధర్మకీర్తి వంటి మహాయానబౌద్ధులు ప్రయోగించిన తర్కం అసలైన తర్కం ప్రయోజనాన్ని వమ్ము చేయడానికే ఉద్దేశించబడింది దిగ్నాగుడు ధర్మకీర్తి ఈ మార్గం నుంచి వైదొలగాలని కోరుకున్నమాట నిజమే అయితే తర్కానికి స్థిరంగా అంటిపెట్టుకోవడానికి, భావవాదంపట్ల నిబద్ధతకు మధ్య వారు చిక్కులు ఎదుర్కోవలసి వచ్చింది ఈ విషయం స్చెర్‌బాట్‌స్కీకీ చేసిన వాదనలు మాత్రం మనం ఉటంకించవచ్చు మహాయాన తాత్వికుల తర్కం తీరును అతను ప్రతిభావంతంగా విశ్లేషించారు "బౌద్ధుల తర్కం ఏదైనా సరే మతాన్ని కాపాడుకోడానికి తమ నైతిక వ్యవస్థ ఆధిక్యతను తప్పక నొక్కి చెప్పాలి మతాన్నిగాక తర్కాన్ని ఖండించాలి యోగాచార పద్ధతిలో తర్కాన్ని ఖండించడం షరతులతో కూడినదైతే మాధ్యమికుల విషయంలో ఆ ఖండన సర్వసంపూర్ణమైంది తర్కాన్ని మహాయానులు ఖండించడానికిగల కారణం విశ్వాసాన్ని రక్షించుకోవడమే వారి విశ్వాసం వారే చెప్పే మతగ్రంథాలకు కూడా అతీతమైనది ఈ విశ్వాసం యొక్క ప్రధాన లక్షణాలేమిటి? వాటి గురించి మహాయానులు మనకేం చెబుతారు? శాస్త్రంగురించి వారే ఇచ్చిన ఈ నిర్వచనంలో మనకు సమాధానం కనిపిస్తుంది లేదా వేదాల మహాయాన సారస్వతానికి నిర్వచనం ఇలా వుంది

మన అంత శత్రువులైన ఉద్రేకాలను అదుపుచేసేది ఏమిటి?
పునర్జన్మనుండి, కష్టాలనుండి విముక్తి కలిగించేది ఏది?
మన శ్రుతిమాత్రమే అది పాలించి, రక్షిస్తుంది
మరే శాఖకు ఇది లేదు
అదే (మహాయాన) ద్విముఖ ప్రయోజనం

కనుక శాస్త్రం అంటే శాస్+త్ర అని అర్థం చేసుకోవాలన్నమాట మొదటి భాగానికి పాలించేది అని , రెండవ భాగానికి రక్షించేది అని అర్థం శాస్త్రం దేన్ని అదుపు చేస్తుంది? మన ఉద్రేకాలను, ధర్మవిరుద్ధమైన కోర్కెలను దేన్నుండి అది మనలను రక్షిస్తుంది? మనం ఇప్పుడు చూస్తున్నట్లుగా జన్మ తరువాత జన్మ అనే దుఃఖ భాజనమైన పరంపరను

నరకంలో కష్టాల నుండి కాపాడుతుంది ఈవిధమైన ద్వంద్వ ప్రయోజనం తమ గ్రంథాలద్వారానే సాధ్యమని మహాయానులు చెప్తారు నిజమైన అర్థంలో ఇవి మాత్రమే పవిత్ర గ్రంథాంటారు దీని సామాజిక ప్రభావాన్ని తెలుసుకునే ముందు మనం మహాయాన తాత్వికులు శాస్త్రాలపట్ల ఈ దృక్పధానికి ఇచ్చిన ప్రాముఖ్యతను పరిశీలించాలి

మనం పైన పేర్కొన్న వాక్యాలు విష్ణుబంధు రచించిన *వ్యాఖ్యాయుక్తి* అన్న గ్రంథంలోనివి నాగార్జునుడు రచించిన *మాధ్యమిక కారిక* అన్న పుస్తకంలో మహాయాన బోధనకు ప్రామాణికమైన ప్రజ్ఞాపారమిత సారాంశం ఇమిడివున్నదని కనుక అదే శాస్త్రమని నిరూపించడానికి చంద్రకీర్తి పై గ్రంథాన్ని ప్రస్తావిస్తాడు

అలాగే మైత్రేయనాధుడు రచించినట్లు చెప్పబడుతున్న "మధ్యాంతవిభంకు" అన్న పుస్తకంపై వ్యాఖ్యానం చేస్తూ స్థిర మతి ఈ గ్రంథం కూడా శాస్త్రమని నిరూపిస్తాడు అతను మరింత సూటిగా ఇలా వివరిస్తాడు "ఈ శాస్త్రం శాస్త్రమని ఎందుకు పిలవబడుతుంది? ఎందుకంటే శాస్త్రం అన్న పదానికిగల అర్థంతో అది పూర్తిగా పొసుగుతుంది (శాస్+త్ర పాలించేది, రక్షించేది) మత సూత్రాలను పదే పదే బోధించడంద్వారా అన్ని ఉద్రేకాలను వాటి మూల కారణాలను నిర్మూలిస్తుంది నరకంలో భయానకమైనంత సుదీర్ఘకాలంపాటు నిర్విరామంగా రకరకాలైన తీవ్ర కష్టాలతో కూడిన దుర్భరమైన పునర్జన్మ పొందాల్సిన అవసరం లేకుండా చేస్తుంది అందుకే మన శత్రువులను అంటే మన ఉద్రేకాలను తొలగించడంద్వారా మనకు నరకంలో పునర్జన్మనుండి తప్పిస్తుందిగనుక అది శాస్త్రం అన్న నిర్వచనానికి సరిగ్గా సరిపోతుంది ఈ రెండు లక్షణాలు బోధలకోసం ఉద్దేశించిన మహాయాన రచనలన్నింటిలోను సర్వసాధారణంగా కనిపిస్తాయి మరెక్కడా కనిపించవు అందుకే ఇది శాస్త్రం

చంద్రకీర్తి శూన్యవాద ప్రతిపాదకులలో ప్రముఖుడు కాగా, స్థిరమతి విజ్ఞానవాదాన్ని ప్రబోధించాడు శూన్యవాద మౌలిక తాత్విక రచనలలో ఒకటి శాస్త్రమని చెప్పేందుకు అతను ఈ నిర్వచనాన్ని ఉపయోగించుకున్నాడు స్థిరమతి దాన్నే ఉపయోగించి విజ్ఞానవాదంపై మౌలిక తాత్విక రచన శాస్త్రమన్నాడు అందువల్ల మహాయాన భావవాదంలోని రెండు తరహాలమధ్య తేడాలు ఉన్నప్పటికీ శాస్త్రాలలోని విశ్వాసాన్ని బలపరచి హేతువాదాన్ని ఖండించడంలో మాత్రం అవి ఒకేవిధంగా వ్యవహరించాయి అవి రెండూ కూడా మన ఉద్రేకాలను తొలగించుకునే సాధనాలుగా శాస్త్రాలను వర్ణించాయి మరోవైపున నరకబాధను తప్పిస్తాయని చెప్పాయి తాత్వికులనుండి ధర్మశాస్త్రకారులు సరిగ్గా ఇదే కోరుకున్నారు సందర్భవశాత్తూ ఇక్కడ ఒక విషయం చెప్పవచ్చు ప్రజల భావోద్రేకాలపై అదుపు సాధించడం, వాటిని తొలగించడం అన్నది గ్రీకు రాజనీతిజ్ఞుడైన పోలిబిస్ దృష్టిలో చాలా ముఖ్యమైన కర్తవ్యం "ప్రతి రాజ్యంలోనూ జనం అస్థిరంగా చట్టవ్యతిరేకమైన కోర్కెలతో,

నిర్హేతుకమైన క్రోధంతో, హింసాత్మకమైన ఆవేశంతో వుంటారు" అని అతనుచెప్పాడు అందువల్ల వారి ఉద్రేకాలను అణచివుంచాలి మహాయాన తాత్వికులు చెప్పే ప్రకారం ఈ పని చేయడానికి తమ శాస్త్రాలు గొప్పగా పనికి వస్తాయి అంతేగాక తమ శాస్త్రాలు ప్రజలకు నరకభయం తప్పిస్తాయి శాస్త్రాలపట్ల అవిశ్వాసం అంటే నరకాన్ని ఆహ్వానించడమే

స్మృతికారులకు మహాయాన తాత్వికులు చేసిన సేవ ఇదొక్కటే కాదు, దాంతోపాటు వారు పచ్చి మూఢనమ్మకాలను కోకొల్లలుగా సృష్టించి వదిలారు దేశంలో దొరికిన ప్రతి మూఢ విశ్వాసాన్ని తెచ్చి జతచేసి ప్రజలను దిగ్భ్రమతో, భక్తితో, భయంతో అణచివుంచడానికి ప్రయత్నించారు ఈవిషయంలో ప్రాచీన ఈజిప్షియన్ల పవిత్రమైన మూఢనమ్మకాలు రాజ్యరక్షణకు గొప్పగా ఉపయోగపడ్డాయని ఆధునిక గ్రీకులైన సోక్రటీస్, ప్లేటోవంటివారు పేర్కొన్నారు కాని మహాయాన తాత్వికులు ఈవిషయంలో వారిని మించిపోయారు

## భావవాదం వాస్తవ వర్గ పాత్రపై లెనిన్

ఇప్పటివరకు జరిపిన చర్చను మనం లెనిన్ చెప్పిన క్రిందిమాటలతో చక్కగా క్రోడీకరించవచ్చు తన మహత్తర తాత్విక రచన అయిన "భౌతికవాదం అనుభవజ్ఞాన విమర్శ" పుస్తకం చివరిలో ఆయన రాసిన వాక్యాలివి " అనుభవ జ్ఞానవాదంలో కనిపించే శుష్క పాండిత్యం వెనుక తత్వశాస్త్రంలో పెనుగులాడే భిన్నశక్తుల పోరాటం చూడాల్సివుంటుంది అంతిమంగా చెప్పాలంటే ఈ పోరాటం ఆధునిక సమాజంలోని విరుద్ధవర్గాల ధోరణులను, సిద్ధాంతాలను వ్యక్తం చేస్తుంది ఇటీవలి తత్వశాస్త్రంకూడా రెండువేల యేళ్ళక్రిందటి వలెనే అదే పరాన్నభుక్కు తత్వధోరణి కలిగివున్నది ఇరువైపులా పోరాడే పక్షాలు కూడా అవే. భౌతికవాదం, భావవాదం రెండవది మరింత సున్నితమైన, నాణ్యమైన మూఢత్వం మాత్రమే అది పూర్తిగా అన్నిహంగులూ సమకూర్చుకొని అపారమైన సంఘాలను శాసిస్తూ క్రమంగా పెరుగుతూ ప్రజలను ప్రభావితం చేస్తున్నది తాత్విక ఆలో చనలలో కానవచ్చే ఏ చిన్న ఊగిసలాటనైనా తన స్వప్రయోజనానికి వాడుకొంటున్నది "

లెనిన్ చూసిన అత్యాధునికమైన రూపంలో భావవాదమే అనుభవ జ్ఞాన వాదం దానికి సంబంధించి కొత్తగా చెప్పబడే విషయాలు ఎన్నివున్నప్పటికీ వర్గ రీత్యా అది చరిత్ర పొడుగునా భావవాదం పోషించిన పాత్రనే పోషిస్తుంది మూఢత్వానికి విశ్వసనీయమైన సేవ చేయడమే ఆ పాత్ర లెనిన్ ఇదంతా చెప్పడంలో గల ఉద్దేశ్యమేమిటి?

ఫైడిజమన్నది విశ్వాసాన్ని ఆరాధించే పద్ధతి విశ్వాసానికి చోటు కల్పించేందుకై జ్ఞానాన్ని నిరాకరించేవారు ఫైడిస్టులు లెనిన్ చెబుతున్నట్లుగా తాత్విక భావవాదం యొక్క ప్రధాన లక్ష్యమిదే అయితే సమాజంతో విశ్వాసానికి గల సంబంధం ఏమిటి? లెనిన్ ఉద్దేశ్యంలో దీనికి సమాధానం చాలా స్పష్టం వర్గ వైరుధ్యాలపైన, వర్గ దోపిడీపైన ఆధారపడిన సమాజాన్ని నిలబెట్టడానికి అవసరమైన సాధనాలలో విశ్వాసం ఎప్పుడూ చాలా

ముఖ్యపాత్ర వహిస్తుంది ఈ విశ్వాస రూపం ఆయా సమయాలనుబట్టి, స్థలాలనుబట్టి మారవచ్చు కాని చరిత్రలో వేర్వేరు సందర్భాలలో వేర్వేరుచోట్ల అది ఏ రూపం తీసుకున్నప్పటికీ దానికి సంబంధించిన ఒక్క విషయం మాత్రం మారదు చుట్టూ వున్న వస్తువులు పైకి కనిపించే ప్రపంచేతర శక్తులవల్లనే ఇలా ఉన్నాయని చెప్పడమే ఆ విషయం కనుక పాదార్థిక ప్రపంచపు నిజమైన లక్షణాలను - మనిషి నిజంగా జీవించే, తెలుసుకునే ప్రపంచపు లక్షణాలను - ప్రగతిశీల మానవుడి అదుపులోకి వచ్చే లక్షణాలుగా గాక మానవ జ్ఞానానికి అతీతమైనవని, మానవజోక్యం వాటినేమీ చేయలేదని చెప్పడం జరుగుతుంది వర్గసమాజంలో ఇలాంటి భావాలకు గల ప్రాధాన్యత ఏమిటో స్పష్టమే ఏదిఏమైనా బానిస బానిసగానే మిగిలిపోతాడు అర్థబానిస అర్థబానిసత్వానికే లొంగివుంటాడు అలాంటి భావాలకు విధేయత కలిగివుండడంవల్ల వున్న పరిస్థితులను అంటే సామాజిక అసమానతలు, అన్యాయాలతోసహా వేటినీ మార్చేందుకు ప్రయత్నించడం అసాధ్యమని, అపవిత్రమని కూడా నమ్మించడం జరుగుతుంది యధాతధ పరిస్థితిని ప్రజలచేత ఆమోదింపచేసే ప్రయత్నమిది అనేకవిధాలుగా తాత్విక భావవాదం ఈ విశ్వాస కల్పనకు విశ్వసనీయంగా సేవ చేస్తున్నది అదే దాని వాస్తవ వర్గ పాత్ర అని లెనిన్ మనకు చెప్పారు

## భౌతికవాద నిరసన

స్మృతికారుడైన మనువును, తాత్వికుడైన శంకరుని గురించి మనమిప్పటికే చర్చించినదాన్నిబట్టి వారి ఉద్దేశ్యం పూర్తిగా అమలుజరగడమంటే స్వతంత్ర ఆలోచనను పూర్తిగా అణగద్రొక్కడమేనని మనకు అర్థమౌతుంది విజ్ఞానశాస్త్రాన్ని పూర్తిగా నిరోధించడం, దేశంలోని కోట్లాదిమంది పీడిత ప్రజలను శాశ్వత దాస్యంలో వదలివేయడం అన్నమాట ఒక్కముక్కలో చెప్పాలంటే అది మొత్తం అభివృద్ధికి స్వస్తి వాక్యం పలకడమే అందువల్లనే అభివృద్ధి కోసం దేశంలో కొంతమంది ప్రజలు స్మృతికారుల, వారి సైద్ధాంతిక సమర్థకులైన భావవాద తాత్వికుల ఆదేశాలను సూటిగా ధిక్కరించాల్సివచ్చింది పవిత్రగ్రంధాలు లేక శాస్త్రాలకు సంబంధించిన భ్రమలను జాగ్రత్తగా కాపాడేందుకు వారు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టవలసిన అవసరం ఏర్పడింది అలాంటి శాస్త్రాలే వేదాలని మనువు, శంకరుడు చెప్పారు కనుక వాటినీ ఖండించవలసి వచ్చింది

భారతీయ తత్వశాస్త్రంలో ఈ పనిచేయడానికి సాహసించినవారెవ్వరు? ధర్మశాస్త్రకారులపట్ల వీరవిధేయత ప్రదర్శించిన శంకరుడికి దీటుగా అంత ధైర్యంగా వ్యవహరించినవారెవ్వరు? ఈ సమస్యకు ఒకే సమాధానం ముక్కుసూటిగా మాట్లాడే మన భౌతికవాదులు ఆపని చేశారు వారే లోకాయతులు లేక చార్వాకులు

ఈ భౌతికవాదులను గురించి మనకు తెలిసినది అసంపూర్ణం అనడంలో సందేహంలేదు బహుశా వారి రచనలను ధ్వంసం చేసి వుంటారు వారిని రాక్షసులుగా,

భూతాలుగా వర్ణించారు వారి తాత్త్విక వైఖరులను గుర్తించలేనంతగా వక్రీకరించారు వారి వాదనా రీతి మోసం తప్ప మరేమీకాదన్నారు భారతీయ తత్వశాస్త్రంలో లోకాయత లేక చార్వాక అన్న పదమే అశ్లీలతకు, అపవిత్రతకు, దుష్టత్వానికి పర్యాయపదంగా పరిగణించబడింది అయినప్పటికీ భారతీయ తాత్వికులలో కొందరు ఈ భౌతికవాదులు ఎంత అపవిత్రులో, గర్హనీయులో వర్ణించే ప్రయత్నంలో ఈ భౌతికవాదుల ప్రాచీనమైన, ప్రామాణికమైన బోధనలను కొన్నింటిని ఉటంకించారు వాటినే ప్రామాణిక లోకాయతం అంటారు వాటిలో అతి ప్రసిద్ధమైన కొన్ని భాగాల స్వేచ్ఛానువాదం ఇక్కడ ఇస్తాము[1]

*స్వర్గం, విమోచనం అన్నవి వట్టి బూటకపు మాటలు ఆత్మ పరలోకానికి వెళ్ళడమనే ప్రసక్తి లేదు వర్ణాశ్రమ ధర్మాలు పాటించడంవల్ల సిద్ధిస్తాయని చెబుతున్న ఫలితాలేవీ నిజం కాదు.*

*అగ్నిహోత్రం, బలిహోమం, వేదత్రయం, మూడువేదాలు, త్రివిధావస్థలు మతాధిపతులు శరీరానికి బూడిద పూసుకోవడం వగైరాలన్నీ కేవలం జీవనోపాధికి సాధనాలు తప్ప మరేమీకాదు వారు తెలివిగలవారుగానీ, కష్టపడేవారుగానీ కానేకాదు*

*పూజారులు చెబుతున్నట్లుగా జ్యోతిస్తోమ హోమంలో బలి ఇచ్చే జంతువు నేరుగా స్వర్గానికి చేరేట్లయితే హోమకర్త తన తండ్రినే ఎందుకు బలి ఇవ్వడు (అప్పుడతనికి తప్పక స్వర్గ ప్రాప్తి కలగాలికదా)*

*శ్రాద్ధకర్మలవల్ల చనిపోయిన పితరుల ఆత్మశాంతి కలిగేటట్లయితే దీపం పగిలిపోయిన తరువాత నూనె పోసినా వెలుగునివ్వాలికదా.*

*శ్రాద్ధ కర్మలలో పిండాలు పితరులకు అందేట్లయితే బాటసారులు తమతో సరుకులన్నీ మోసుకుపోవడానికి బదులు వారికి ఇంటిదగ్గిరే వండి పెడితే సరిపోతుందికదా*

*శ్రాద్ధ కర్మలు స్వర్గంలో వున్నట్లు చెప్పబడేవారికి సంతృప్తి కలిగించేటట్లయితే క్రింది అంతస్తులోవుండేవారికి పెట్టే తిండి పైనున్నవారికి ఎందుకు అందదు?*

*బ్రతికినన్నాళ్ళూ సంతోషంగా బ్రతకండి అప్పుచేసైనా వెన్న తినండి ఈ శరీరం మంటలపాలైన తరువాత ఇంకా తిరిగి వచ్చేదేమిటి? శరీరాన్ని విసర్జించిన తరువాత పరలోకంలోకి పోవడమే నిజమైతే స్నేహితులు, ఇతరులు చూపించే ప్రేమకోసం వారెందుకు తిరిగి వెనక్కురారు? అందువల్ల బ్రాహ్మణులు కేవలం జీవనోపాధికోసమే చనిపోయినవారికి సంబంధించిన ఈ కర్మకాండను ప్రతిపాదించారు అంతకుమించి ఏమీ లేదు*

*మూడువేదాలను రాసినవారు పచ్చి వంచకులు, దొంగలు మాత్రమే గొప్పవిగా చెప్పబడే సూత్రాలు జార్వరి, తుర్వరివంటి అర్థరహితమైన మంత్రోచ్చారణలు, అశ్వమేధయాగంలో భార్యను యోనిలో గుర్రపు లింగం పెట్టుకోమని చెప్పడం ఇటువంటి వ్యవహారాలే ఇవి తమకు*

---

1 మాధవ-సర్వదర్శన సంగ్రహ

కావలసిన సొమ్ములు రాబట్టుకోవడం కోసం మోసగాళ్ళు కనిపెట్టినవితప్ప మరేమీకావు

శిధిలమైపోయిన ప్రాచీన లోకాయత భౌతికవాద సారస్వతంలో ఇంకా మిగిలివున్న కొన్ని భాగాలివి మరికొన్నింటిని ముందు ముందు చూడవచ్చు అనువాదంలో మూలంలోని నైశిత్యం, వ్యంగ్యం కొంత దెబ్బతినడం అనివార్యం అయినప్పటికీ వారిది శుష్క పాండిత్యంకాదని మనకు స్పష్టంగా అర్ధమౌతుంది నిజానికి కోట్లాది పీడిత ప్రజల వర్గప్రయోజనాలు వారిని నడిపించాయి స్వల్పసంఖ్యాకులుగా వున్న సంపన్నవర్గాల కోసం స్మృతికారులు, వారి సైద్ధాంతిక సమర్ధకులు శాస్త్రాలకు సంబంధించిన భ్రమలను, మరణానంతర జీవితాన్ని, దేవుళ్ళను, హోమాలను పటిష్టపరచడం అవసరమనుకోగా, లోకాయత భౌతికవాదులు వాటన్నింటిపైనా దాడిచేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు భావవాద తాత్వికులకు పూర్తి వ్యతిరేకమైన వర్గ పాత్ర నిర్వహించేందుకు సంసిద్ధులయ్యారు

# IV

# భావవాద ప్రతి సిద్ధాంతం

## ప్రాథమిక వ్యాఖ్యలు

భారతీయ తత్వశాస్త్రంలో భావవాదానికి గల ప్రాధాన్యతను ఎక్కువ చేసి చెప్పే ధోరణి ఆధునిక పండితులలో సాధారణంగా కనిపిస్తుంటుంది అందుకే మన తాత్విక వారసత్వంలో దాని అసలైన స్థానాన్ని ముందుగా నిర్ధారించుకోవడం అవసరం ఉపనిషత్ ఆలోచనాపరులలో ఒక భాగం మహాయాన బౌద్ధులు, అద్వైత వేదాంతులు మినహాయిస్తే నిజంగా ప్రముఖులైనవారెవ్వరూ భావవాదాన్ని అనుసరించలేదు భావవాదులకు ప్రఖ్యాతిగాని, శక్తిగాని లేవనికాదు అయితే ప్రధానంగా ఆ తాత్విక వైఖరి నిర్వహించిన సామాజిక పాత్రవల్ల లభించిన రాజకీయ ప్రాపకం, ఆర్థిక మద్దతు ఇందుకు కారణం ఏమైనా భావవాదం కేవలం ఈ తాత్వికులకే పరిమితమైందికనుక భారతీయ తాత్వికుల్లో అత్యధికులు భావవాదులు కాదని చెప్పవచ్చు ఇది కేవలం సంఖ్యాపరమైన పరిమాణాత్మక వివరణ మాత్రమే సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రంలో అనుసరించిన పద్ధతులను మొత్తంగా దృష్టిలో వుంచుకొని చూసినప్పుడు దీనికిగల గుణాత్మకమైన ప్రాధాన్యత అర్థమవుతుంది భావవాదాన్ని ఖండించేవారు దానిపట్ల ఉదాసీనంగా వుండలేరు వారు దాన్ని గట్టిగా వ్యతిరేకించాలి సైద్ధాంతికంగా నిర్మూలించేందుకు ప్రయత్నించాలి భారతీయ పరిభాష ప్రకారం భావవాదులు కాని వారు దాన్ని తమ పూర్వపక్షంగా లేక ప్రతిసిద్ధాంతంగా పరిగణించారు భారతీయ తాత్వికుల్లో అత్యధికులు ఇలా భావించారుకనుక ఈ ప్రతిసిద్ధాంతం సైద్ధాంతికంగా చాలా సుసంపన్నతను సంతరించుకోగలిగింది

# భావవాద వ్యతిరేకుల్లో ప్రముఖులు

భావవాద ప్రత్యర్థులైనవారి అభిప్రాయాలు, లేక సిద్ధాంతాలలో తరచూ పరస్పర తేడాలు కనిపిస్తాయి మనమిక్కడ ఆ వాదానికి గట్టి ప్రతినిధులయిన వారిని తీసుకుందాము దానికంటే ముందు భావవాద దృక్పథంతో గట్టిగా విడగొట్టుకున్నవారి గురించి క్లుప్తంగా తెలుసుకోవాలి వారిలో కొందరి జాబితా

ప్రాచీన భారత భౌతికవాదుల గురించి మనకు ఉపనిషత్తుల్లో, తొలి బౌద్ధ రచనల్లో రేఖామాత్రంగా తెలుస్తుంది రచనల్లో వారు అక్కడక్కడా అసలు పేర్లతో ప్రస్తావించబడ్డారు పచ్చి అపవిత్ర భావాలు కలిగినవారుగా వారి గురించి అనేకచోట్ల చెప్పబడింది ఈ ఆలోచనాపరులు లేదా కనీసం వారిలో ముఖ్యులైనవారు తర్వాతికాలంలో చార్వాకులు లేదా లోకాయతులుగా పేరుపొందారు

కపిలుడు సాంఖ్య దర్శనకర్తగా చెబుతారు. అచేతనమైన ప్రాథమిక పదార్థం ప్రపంచ సృష్టికి మూలమని ఆ సిద్ధాంతం చెబుతుంది మనం అతని కాలాన్ని ఖచ్చితంగా చెప్పలేము. కాని భారతీయ తాత్విక పరంపర ప్రకారం అతడు మొదటి తాత్వికుడు లేక ఆది విద్వాన్. ఉపనిషత్తుల రచయితలకు లేదా కూర్పరులకు కూడా అతని ప్రఖ్యాతి తెలియందికాదు బుద్ధుడుకూడా కపిలుడి శిష్యులైన ఇద్దరి దగ్గిర ప్రాథమిక విద్యాభ్యాసం చేసినట్లు చెబుతారు అతని పేరుతో వున్న సిద్ధాంతం చాలా ప్రాచీనమైంది

మీమాంస దర్శనానికి మూలమైన మీమాంస సూత్రాల రచయిత జైమిని ఒక తత్వంగా దానికి చిత్రమైన ప్రయోజనమున్నట్లు కనిపిస్తుంది వేదాలలోని తాంత్రిక క్రతువులైన యజ్ఞాల వెనుకగల ప్రాథమిక భావనలను సైద్ధాంతికంగా సమర్థించడమే దాని లక్ష్యం నేరుగా క్రతువులతో ముడిపడిన అలాంటి విస్తారమైన తత్వ గ్రంథం మనకు ప్రపంచంలో మరెక్కడా కనిపించదు జైమిని పుట్టుకగురించి, అతని వ్యక్తిగత జీవితాన్ని గురించి కూడా ఏమీ తెలియదు పరోక్షసూక్తులు, జ్ఞాపక శకలాలు, చిన్న వాక్యాలతో కూడిన అరుదైన తాత్విక రచనల్లో మీమాంస సూత్రమే మొదటిదని అనిపిస్తుంది అయితే దాని రచనా కాలం మాత్రం మనకు తెలియదు క్రీస్తు శకానికి ముందే అయివుండాలి

ఉలూకుడు లేదా కణాదుని కణభక్షకుడు అనికూడా వ్యంగ్యంగా పిలిచేవారు ఆయన వైశేషికతత్వం రచించినట్లు చెబుతారు దానిలోఅతిముఖ్యమైన అంశం అణువాదమే కణాదుడు రచించిన వైశేషికసూత్రం బహుశా క్రీ శ తొలి రోజులకు చెందినది

గౌతముడు లేదా అక్షపాదుని వ్యంగ్యంగా చరణాక్షుడు అని పిలిచేవారు

కాళ్ళల్లో కళ్ళు ఉన్నవాడు అని దీని అర్థం భారతీయ తర్కంలో సత్య నిరూపణలో తొలి క్రమబద్ధమైన గ్రంథం న్యాయసూత్ర ఆయన రచించినదేనని విశ్వసిస్తారు దానిలోనే అణువాదం వైశేషిక సూత్రాలకు సంబంధించిన సాధారణ ధోరణులు కూడా పొందుపరచబడ్డాయి మనకు లభ్యమౌతున్న గౌతముడి గ్రంథంలో మహాయానుడి భావవాదాలకు వ్యతిరేకమైన వాదనలు కూడా ఉన్నాయి కనుక అది మహాయానం ఉచ్ఛదశ అనంతర కాలానికి చెందినదని భావించవచ్చు బహుశా క్రీ శ 2వ శతాబ్దానికి చెందినదై వుండవచ్చు

శ్రీలాభుడు అతని సోదరతాత్వికులను సౌతాంత్రిక బౌద్ధులంటారు శ్రీలాభుడు నాగార్జునుడికన్నా కొంచెం ముందువాడై వుండవచ్చు బౌద్ధ తత్వశాస్త్రంలో సౌతాంత్రిక అన్నది ప్రారంభదశ ఎందుకంటే అది భావవాదానికి వ్యతిరేకమైంది అందుకే మహాయాన భావవాదులు దానిపై పనిగట్టుకుని దాడిచేశారు

కాత్యాయినీపుత్రుడు క్రీ శ మొదటి శతాబ్దంకన్నా ముందరివాడు బౌద్ధంలో మరో ప్రాచీన శాఖ అయిన వైభాషికకు అతను ఆద్యుడు విభాష పేరుతో అతనొక వ్యాఖ్యానం వ్రాసినట్లు చెబుతాడు దానినుండే వైభాషిక అన్నపేరు వచ్చింది ఇది క్రీ శ మొదటి శతాబ్దానికి చెందింది

ఉమాస్వతి మొదటి శతాబ్దానికి చెందినవాడు జైనమతంలో తాత్వికాంశాన్ని మొదటిసారి క్రమబద్ధంగా విశదీకరించిన వ్యక్తి బౌద్ధంకన్నా ముందే పుట్టిన జైనంలో అతి ప్రాచీనమైన భావాలు కనిపిస్తాయి

సాంఖ్యశాస్త్రంలో తొలి వివరమైనగ్రంథం రచించింది ఈశ్వరకృష్ణుడు విచిత్రమేమంటే అతను ప్రతిపాదించిన తత్వంలో అప్పటికే విదేశీభావాల ఛాయలు కనిపిస్తాయి కొంతమంది ఆధునిక పండితులు అతనిని క్రీ శ 5వ శతాబ్దానికి చెందినవాడిగా పరిగణిస్తారు

ఇంచుమించుగా మరికొందరు ప్రసిద్ధ తత్వవేత్తలుకూడా ఆ కాలానికి చెందినవారు ఉన్నారు వారంతా కూడా భావవాదాన్ని గట్టిగా ఖండించినవారే జైమినీపై వ్యాఖ్యానం రాసిన శబరుడు, గౌతముడిపై వ్యాఖ్యానం రాసిన వాత్సాయనుడు, ఉలూకుడు లేదా కణాదుని అణువాదాన్ని ప్రచారం చేసిన ప్రశస్థపాదుడు వీరిలో ముఖ్యులు

తర్వాతి దశను భారతీయ తాత్విక కృషిలో అత్యంత పరిపక్వమైన దశగా అభివర్ణించవచ్చు భావవాద వ్యతిరేకులలో ప్రఖ్యాతులైనవారెందరో ఆ కాలానికి చెందినవారే వారిలో కొందరిని మాత్రమే ఇక్కడ ప్రస్తావించుకోగలం

సర్మాకు చెందిన శుభాగుప్తుడు క్రీ శ 7, 8 శతాబ్దాలకు వైభాషిక బౌద్ధుల వైఖరికి అతను ప్రాతినిధ్యం వహించాడు విజ్ఞానవాదమనే ఒకే ఒక భావవాదాన్ని ఖండించడంపైనే అతను కేంద్రీకరించాడు

8వ శతాబ్దికి చెందినవాడు అకళంకుడు మతరీత్యా జైనుడైనప్పటికీ అతను తర్కంలో గొప్ప సమర్థుడు ధర్మకీర్తి ప్రతిపాదించిన విజ్ఞానవాదాన్ని సవివరంగా ఖండించడమే అతని తాత్విక రచనల్లో ముఖ్యాంశం అలాగే భావవాదుల దాడి నుంచి అణువాదాన్ని సమర్థించాడు

8వ శతాబ్దికి చెందిన ప్రభాకరుడు, కుమారిలుడు మీమాంసతత్వానికి ప్రతినిధులు వారిలో కుమారులుడిని భారతీయ తాత్వికుల్లో అతిగొప్ప వాడుగా పేర్కొంటుంటారు నిస్సందేహంగా అతను చాలా గొప్పవాడే

6, 7 శతాబ్దాలకు చెందిన ఉద్యోతకారుడు, 8, 9 శతాబ్దాలకు చెందిన జయంతభట్టుడు కూడా భారతీయ అణువాదాన్ని, తర్కాన్ని న్యాయ వైశేషిక తాత్వికుల వైఖరులను, వాటి క్రమానుగత విలీనాన్ని సమర్థించినవారే

భావవాదానికి వ్యతిరేకులైన భారతీయుల జాబితాలో చివరగా వచ్చేవారు నవ్యన్యాయ సూత్రాలను ప్రతిపాదించిన గంగేసుడు ఆయన 13వ శతాబ్దపు మిధిలకు చెందినవాడు 17వ శతాబ్దాపు బెంగాల్‌కు చెందిన గధాధరుడు ఇందులో చివరి వ్యక్తి

మరిన్ని పేర్లను పేర్కొనడం కష్టమేమీకాదుగానీ అవసరంలేదు అంతకన్నా ముఖ్యమేమంటే భారతీయ తత్వశాస్త్ర చరిత్ర పొడుగునా ఉపనిషత్తులనుండి నవ్యన్యాయ సూత్రాలవరకు కూడా వివిధ కోణాలనుండి భావవాదానికి నిరంతర ప్రతికూలత ఎదురౌతూనే ఉన్నది

## భావవాద వ్యతిరేకుల్లో అగ్రగణ్యులు

భారతీయ భావవాదానికి వ్యతిరేకమైన సిద్ధాంతాలలో అతి బలమైనవి ఏవి?

వీటిలో ఒకటి బాగా తెలిసిందే అదే ముక్కుసూటిగా మాట్లాడే భౌతికవాదం అదే లోకాయతం లోకాయతకు సంబంధించి లభిస్తున్న ఆధారాలనుబట్టి చూస్తే ఖచ్చితమైన భౌతికవాదంగా వారు భావవాదాన్ని దానితో ముడిపడిన అంశాలను త్రోసిపుచ్చారు మత దృక్పధం, పవిత్ర గ్రంథాలపట్ల విశ్వాసం, మూఢత్వాలు వగైరాలలో ముఖ్యమైన వాటినన్నింటినీ తిరస్కరించినట్లు కనిపిస్తుంది

భారతీయ స్మృతికారుల తీవ్ర వ్యతిరేకత మధ్య లోకాయతులు తమ అభిప్రాయాలు స్పష్టంగా ప్రకటించారు వేదాల సాధికారత అలాగే వాటిపట్ల విశ్వాసానికి సమర్థన అంతా బూటకమేనని వారు గట్టిగా ప్రకటించారు సమాజంలో పరాన్నభుక్కులైనవారికోసం ప్రజలను దోచుకునేందుకు ఉద్దేశ్యపూర్వకంగా ఈభ్రమలను ప్రచారంలో పెట్టారని వారు వెల్లడిస్తారు లోకాయతుల పదజాలం ప్రకారం పరాన్నభుక్కులంటే అటు తెలివితేటలూ లేక, ఇటు కాయకష్టమూ చేయక పైపైన బ్రతికేవారు *(బుద్ధి, పౌరుషహీనులు)* అయితే ఇందుకు మద్దతుగా లోకాయతులు పెద్ద తర్కాన్ని ఉపయోగించలేదు ఒకవిధమైన ప్రాధమిక హేతువుపై ఆధారపడి వాదించారు యజ్ఞపశువును బలి ఇవ్వడంద్వారా దానికి మోక్షం కలిగించేటట్లయితే మీ తండ్రినే బలి ఇచ్చి స్వర్గానికి పంపవచ్చు కదా? లోకాయత వాదనలు ఇలా వుంటాయి ఇది చాలా సరళమైన వాదన

ఈ వాదనలు తేలిగ్గా వుండడాన్నిబట్టి చూసినప్పుడు మనకు వారి భావాల గొప్పతనం అలాగే వారి వైఖరుల పరిమితులు బోధపడతాయి వాటికి ఆ గొప్పతనం కలగడానికి కారణం నవ్యత్వంకాని, పాండిత్యంగానీ కాదు లోకాయతులు ఆవిషయాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు సరైన తాత్విక వైఖరికి కట్టుబడడంవల్ల వాటికి ఆ గొప్పతనం సహజంగా అబ్బింది ఇప్పటికి లభిస్తున్నంతలో ప్రామాణికమైన ప్రజా వాంఙ్మయాన్నిబట్టి చూస్తే ఒక సూత్రీకరణ విలువను వారు ఆచరణ ద్వారానే నిర్ణయించేవారు చాలాకాలం క్రిందట మరణించిన మనిషికి ఆహారం పెట్టడం అన్న కోణంనుండి వారు శ్రాద్ధకర్మలను పరిశీలిస్తారు ఇది సరైందైతే బయటవున్న బాటసారికి ఇంట్లోనే ఎందుకు తిండి పెట్టకూడదని ప్రశ్నిస్తారు శ్రాద్ధకర్మలలోని భావాన్ని సూటిగా తిరస్కరించే విలక్షణమైన లోకాయత శైలి ఇది అంతేగాని దానికి సంబంధించి ఎలాంటి అధిభౌతిక చర్చలో వారు మునిగిపోరు లోకాయత వాదనలో ముఖ్యమైన విషయమేమంటే దైనందిన జీవితానికి సంబంధించిన ప్రాథమిక ఇంగితజ్ఞానంపై ఆధారపడి వాదించడమే మరోమాటలో చెప్పాలంటే భావవాద తాత్వికులు దేనిగురించైతే ఎక్కువగా భయపడతారో వీరు దానిపైనే ఆధారపడటం జరుగుతుంది పాదార్థిక ప్రపంచం అవాస్తవమన్న వాదనను ఆచరణ ఇచ్చే తీర్పు పూర్తిగా తిరస్కరిస్తున్నదని వారు తేలిగ్గా గ్రహించగలిగారు తమ వ్యక్తిగత జీవితంలోనే వారు తమ భావవాద దృక్పథాన్ని వదులుకోవలసి వస్తుంటుంది తమ సిద్ధాంతానికి, ఆచరణకుగల ఈ వైరుధ్యాన్ని అధిగమించేందుకే భావవాదులు సత్యంలా కనపడే అసత్యం సంవృతి సత్యం లేక వ్యవహారిక సత్యం అన్నది కనిపెట్టారు ఏమైనా లోకాయత దృక్పథంనుండి చూసినప్పుడు వ్యవహారిక సత్యం ఒక్కటే సత్యం యధార్థ జీవితంలో రుజువయ్యేది మాత్రమే సత్యం ఆచరణ పరిధిలోకి రాని సత్యం ఏదైనా శ్రాద్ధ క్రతువువలె బూటకం మాత్రమే

లోకాయత వైఖరుల నిజమైన బలానికి ఇది నిదర్శనం సత్యానికి కొలబద్దగా ఆచరణను పెట్టకుండా భావవాద దృక్పథంనుండి బయటపడడం అసంభవం అదేసమయంలో లోకాయతులు తీసుకునేవైఖరిలో కూడా బలహీనతలు, పరిమితులు ఉన్నట్లు గ్రహించవచ్చు తాత్వికంగా చెప్పాలంటే ఇది తన వైఖరిని తాను సమర్థించుకోవటానికి చేపట్టిన మొండివాదన సత్యానికి ప్రామాణికతను చర్చించే అనేక వైఖరులు భారతీయ తత్వశాస్త్రంలో ముందుకొచ్చాయి ప్రముఖ తత్వవేత్తలు వాటిని ప్రతిపాదించారు అందువల్ల సత్యానికి ఆచరణ నిజమైన ప్రమాణం అని నిరూపించడం అంత తేలికైన విషయం కాదు ఇతర భావాలను, వైఖరులను విమర్శనాత్మకంగా తిరస్కరించడంద్వారా మాత్రమే ఆ పని సాధ్యమౌతుంది లోకాయతులు ఆ పని చేశారా? మనకు తెలిసినదాన్ని బట్టి ఆ పని ఎంతమాత్రం చేయలేదు నిజమైన తాత్విక పరిభాషలో తాత్విక పరంగా అలాంటి అవసరమే వారు గుర్తించలేదని మనం నిర్ణయానికి రావచ్చు సత్యానికి కొలబద్ధ ఆచరణేనని వారు స్వతహాగానే ఆమోదించారు అందువల్ల అది ప్రత్యర్థుల విమర్శల తాకిడికి గురికావలసి వచ్చింది వారు లోకాయత వాదనలను పెద్దగా పట్టించుకోనవసరంలేనట్లు నటించారు

భారతీయ తాత్త్విక చరిత్రలో సత్యానికి నిజమైనకొలబద్ద ఆచరణ అన్న సూత్రీకరణ అలాగే స్వాభావిక ఆమోదస్థాయిలోనే వుండిపోతుందని కాదు న్యాయవైశేషికాలు ఈ విషయంలో ఉన్నతస్థాయికి చెందినవే తత్వశాస్త్రరీత్యా ఈ వైఖరిని సమర్థించుకోవడానికి ఈ తాత్త్వికులకు మరేమీ కనిపించనప్పటికీ వారు భారతీయ భావవాదాన్ని వ్యతిరేకించినవారిలో చాలా ప్రముఖులుగానే వుంటారు అయితే వారు చేసిందాని విలువ అంతకన్నా ఎక్కువే తత్వశాస్త్రంలో శుభగుప్తుడు, కుమారిలుడు, అకళంకుడు వంటి గొప్ప ఆలోచనాపరులతో సమానంగా వారు భావవాదాన్ని ఖండించారు వాస్తవంగా చెప్పాలంటే తాత్త్విక భావవాదానికి వ్యతిరేకంగా తర్వాతికాలంలో కనిపించే వాదనల్లో చాలాభాగం ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని న్యాయవైశేషికాలనుండి ఎరువు తెచ్చుకున్నవే

ఇదంతా ఊహించగలిగిన విషయమే భారతీయ తాత్త్విక చరిత్ర పరిణిత దశలో ప్రముఖ తాత్త్వికులెవరూ లోకాయతాన్ని సమర్థించలేదు న్యాయ వైశేషికాలలో ఉన్నదంతా భావవాదాన్ని సంపూర్ణంగా ఖండించేదే అది తర్కానికి, అణువాదానికి ప్రాతినిధ్యం వహిస్తుంది అందువల్ల భావవాదానికి ఏమాత్రం తావిచ్చినా దాని పునాది పూర్తిగా కూలిపోతుంది పరిణిత భారతీయ తాత్త్వికుల్లో భావవాదాన్ని ఖండించడం కోసం బాగా కృషిచేసినవారు న్యాయ వైశేషికులే అందుకే వారి రచనలు సహజంగానే భావవాద ప్రతిసిద్ధాంతానికి అమూల్యమైన సంపదగా నిలిచిపోయాయి

భావవాదాన్ని ఖండించే సందర్భంలో తమ వాదనకు తాత్త్విక పరమైన సమగ్రత వుండేందుకై వారు సంపూర్ణ వైఖరులు రూపొందించుకున్నారు అవి ఎంతో ముఖ్యమైనవి సత్యానికి కొలబద్ద ఆచరణ అన్న సూత్రీకరణ వాటిలో ఒకటి మరొకటి కల, భ్రాంతి అన్న వాటికి సంబంధించినది భావవాదులు వాటి ఆధారంగానే అనేక నిర్ధారణలు చేసినట్లు ఇప్పటికే చూశాం ఏమైనా కలలు, భ్రాంతులకు సంబంధించిన ఈ సాక్ష్యాలను భావవాదులు పైపైనే అర్థం చేసుకున్నారని న్యాయ వైశేషికులువివరించారు సరిగ్గా అర్థం చేసుకున్నట్లయితే అవి భావవాదాన్ని తిరస్కరించడానికే పనికివస్తాయి ఎందుకంటే పాదార్థిక ప్రపంచ వాస్తవికతను అంగీకరించకపోతే కలలకు, భ్రాంతులకు అర్థమే వుండదు

హేతురాహిత్యానికి, మూఢత్వానికి వ్యతిరేకంగా హేతుశీలతను సమర్థించేందుకు కూడా న్యాయవైశేషిక శాస్త్రాలు గణనీయమైన కృషిచేశాయి హేతువు అన్నది ఆ శాస్త్రాలకు మూల సూత్రం గనుక అవి పూర్తిగా లౌకిక దృక్పథానికే కట్టుబడాల్సివచ్చింది అయితే ఈ విషయమై కొన్ని వివరణలు ఇవ్వాల్సివుంటుంది అంతేగాక తత్వశాస్త్ర దృష్టితో న్యాయ వైశేషికాలు అణువాదం లేకుండా సంపూర్ణం కాజాలవు ముఖ్యంగా భారతీయ తాత్త్విక చరిత్ర పరిణిత దశలో అణువాదానికి కట్టుబడటం అంటే భావవాదుల బలమైన వాదనలనుండి దాన్ని రక్షించడమే న్యాయవైశేషికులు ఈ పని చేసే సందర్భంలో విజ్ఞాన శాస్త్రానికి కూడా గొప్ప సేవ చేశారు అంతేగాక అవి హేతువాదానికి, లౌకికతత్వానికి, శాస్త్రవిజ్ఞానానికి కూడా కట్టుబడినవిగా పరిగణించాల్సివుంటుంది

ఇలాంటి గట్టి ధోరణులు ఇంకా ఏమైనా ఉన్నాయా? శంకరుడి దృష్టిలో అలాటిది మరొకటి వుంది అదే సాంఖ్య సిద్ధాంతం కపిల విరచితంగా భావించే ఈ

సిద్ధాంతాన్ని ఖండించేందుకు శంకరుడు చాలా ప్రయాస పడ్డారు ఎందుకంటే పవిత్రగ్రంధాలను, తన భావవాదాన్ని అది అతి తీవ్రంగా ఖండిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు పూర్తిగా కాకపోయినా దాదాపుగా అది భౌతికవాదాన్ని ప్రతిపాదిస్తుంది కనుక తన భావవాదానికి ముప్పు తెచ్చిపెడుతుందని శంకరుడు భయపడ్డాడు శంకరుడి ఉద్దేశ్యం ప్రకారం "మరే ఇతర అంశంతోనూ ప్రమేయంలేని (స్వతంత్ర) అచేతనమైన ప్రాథమిక పదార్థం ప్రపంచానికి మూలం" అని సాంఖ్యం చేసే బోధ అతి ప్రమాదకరమైనది స్వతంత్రం అన్న మాటలను ఉద్దేశ్యపూర్వకంగానే వాడారని, సాంఖ్య సిద్ధాంతం ప్రకారం ప్రపంచం పదార్థంనుండి నేరుగా ఉత్పన్నమౌతుందని శంకరుడు వివరిస్తాడు

"గడ్డి, మూలికలు, నీరు వగైరాలన్నీ ఏ ఇతర కారణం లేకుండానే *(నిమిత్తాంతర, నిరపేక్ష)* స్వతంత్రంగా తమ ప్రకృతినిబట్టి (స్వభావ *తేవ*) పాలుగా మారిపోతున్నట్లుగానే సాంఖ్య సిద్ధాంతం కూడా ప్రాథమిక పదార్థం మేధస్సుగా (మహత్ లేక బుద్ధి) మారుతున్నట్లు సాంఖ్యం చెబుతుంది గడ్డి మరే ఇతర కారణం లేకుండా స్వతంత్రంగానే మారిపోతున్నట్లు ఎలా చెప్పగలరని ప్రశ్నిస్తే సాంఖ్యులు ఇలా చెప్తారు అలాంటి కారణమేదీ కనిపించడంలేదుకనుక "అలాంటి కారణాలు నిజంగా కనిపించినట్లయితే మనం గడ్డి వగైరాలకు అన్వయించవచ్చు మన ఇష్టం ప్రకారం పాలు ఉత్పత్తి చేయవచ్చు కాని వాస్తవమేమంటే మనకలాంటి విషయమేమీలేదు అందుకే గడ్డి వగైరాలు మారిపోవడమన్నది ప్రకృతి సిద్ధంగానే జరుగుతున్నదని భావించవలసి వుంటుంది ప్రాథమిక పదార్థం ఇదే రీతిలో ఒక కొత్త తరహా రూపం తీసుకొని వుంటుందని దాన్నిబట్టి మనం నిర్ధారణకు రావచ్చు" అని వారు వివరిస్తారు

సాంఖ్యంలోని భౌతికవాదంతోపాటు అది పవిత్రగ్రంధాలను ప్రశ్నించడం శంకరుడికి మరింత ఎక్కువగా కోపకారణమైంది కపిలుడి వాదన వేదాలతో విభేదిస్తుంది వేదాలను అనుసరించే మనువు రచనలను కూడా వ్యతిరేకిస్తుంది అని అతను చెప్తాడు ఉపనిషత్తులనుండి అలాగే పౌరాణిక సారస్వతాన్నుండి అనేక ఉదాహరణలను తీసుకొని తన వాదనలను నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తాడు ఈ విషయం వరకైనా సరే తను చెప్పేది పూర్తిగా వాస్తవమని మనలను నమ్మించేందుకు ప్రయత్నిస్తాడు సాంఖ్య సిద్ధాంతంలో చాలా భాగం ఇప్పుడు లభించడంలేదు భావవాదంపట్ల మతైక దృక్పథం పట్ల సాంఖ్యుల వైఖరులను గురించి ఆ దృక్పథాలకు అగ్రశ్రేణి ప్రతినిధిగావున్న (శంకరుడి వంటి) వ్యక్తి మాటలనుండి తెలుసుకోవడం పరిశోధనా పద్ధతులరీత్యా పొరపాటు కాదు

ఇప్పటివరకు చేసిన చర్చను ఈ విధంగా క్రోడీకరించుకోవచ్చు భారతీయ భావవాద ప్రతిసిద్ధాంతం చాలా కరుకైనది లోకాయతం, న్యాయవైశేషికం, సాంఖ్యం అందుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి భావవాదాన్ని గట్టిగా వ్యతిరేకించిన ఇతరులలో మీమాంసకులు, వైభాషికులు, సౌత్రాంతికులు, జైనులుకూడా పేర్కొనదగినవారు వారు భావవాద ప్రతిసిద్ధాంతానికి ఛాయా మాత్రమైన ప్రతినిధులుగా ఉన్నారు అయితే తాత్విక భావవాదాన్ని ఎండగట్టడంలో వారు చూపించిన పద్ధతుల సాంకేతిక ప్రాధాన్యత మాత్రం విస్మరించరానిది

# ఒంటెత్తువాదంలో విడ్డూరం

పై సిద్ధాంతాలలో లోకాయతం తాత్వికపరమైన ప్రావీణ్యానికి అతి తక్కువ ప్రాధాన్యతనిస్తుంది పరిణిత తాత్వికులెవరూ దాన్ని సమర్థిస్తూ వాదనలు చేసినట్లు మనకు ఆధారాలు కనిపించడంలేదు ఇక సాంఖ్య సిద్ధాంత చరిత్రకూడా చాలా విచిత్రమైనది ఈ తాత్విక ధోరణిలో బ్రాహ్మణీయ పద్ధతిన సంస్కరణలు వచ్చిన తరువాత అది ఒక విధమైన వేదాంతంగా మార్చివేయబడింది ఆ తదుపరి దశలో మనకు సాంఖ్యానికి సంబంధించిన ప్రముఖ ప్రతినిధి ఎవరూ కనిపించరు భావవాదానికి వ్యతిరేకమైన సిద్ధాంత సంపదలో దానికి సంబంధించిన అంశాలను మనం పునర్నిర్మించుకోవలసి వుంటుంది తర్వాతిదశలో మిగిలిన అవశేషాలను, ఇతర గ్రంధాలలోని ప్రస్తావనలను బట్టి దాని మూల సూత్రాలను మనం క్రోడీకరించుకోవలసివుంటుంది ప్రధానంగా భావవాదానికి వ్యతిరేకమైన న్యాయ వైశేషికాలు మాత్రమే మనకు తాత్వికంగా సమగ్రరూపంలో లభ్యమౌతున్నాయి

అయితే ఇదెలా జరిగింది? భారతీయ భావవాదానికి నిరంతరాయమైన మూలాధారాలు ఉపనిషత్ ఊహాగానాలలో లభిస్తున్నాయి వాత్సాయనుడితో మొదలుపెట్టి న్యాయ వైశేషికాలవరకు చూస్తే ఉపనిషత్ తత్వాలతో రాజీ పడాలన్న ఆరాటం స్పష్టంగా కనిపిస్తుంది ఉపనిషత్తులను వేదాల చివరిభాగాలుగా పరిగణించి వాటి ప్రామాణికత ప్రశ్నించరానిదని చెప్పారు ఉపనిషత్తుల పవిత్ర ప్రతిపత్తి న్యాయవైశేషికుల భ్రమాకల్పనలో ముఖ్యాంశమైనప్పుడు ఉపనిషత్తులలోని తాత్వికచింతనను వారు గట్టిగా తిరస్కరించడం, త్రోసిపుచ్చడం ఎలా సాధ్యమౌతుంది? యాజ్ఞవల్క్యుడు, శాంతకుమారుడు వంటి వ్యక్తులే గాక ఇంద్రుడు, ప్రజాపతివంటి దేవుళ్ళు కూడా ప్రచారం చేసిన ఆ అంశాలను వారెలా తిప్పికొట్టగలరు? ప్రారంభంనుండి కూడా న్యాయ వైశేషికాలు భావవాద తాత్వికచింతనతో గట్టిగా విభేదించాయి అయితే తర్వాతి దశలో న్యాయ వైశేషికులు వేద ఛాందసాన్ని స్వీకరించారు ఇలా ఉపనిషత్తులకు ప్రాధమికంగా కట్టుబడివుంటూనే భావవాదాన్ని తిరస్కరించడం సంభవమా?

ఈచర్చ మనలను భారతీయ తత్వశాస్త్ర చరిత్రలో అత్యంత విచిత్రమైన అంశంవద్దకు తీసుకువెళుతుంది భావవాదానికి పునాది వేదాలలోనే ఉన్నది అయినప్పటికీ మలి దశకు చెందిన న్యాయ వైశేషికులు వేద ఛాందసంలోని దృఢమైన అభిప్రాయాలను బలపరుస్తున్నట్లు చెబుతూనే భావవాదాన్ని గట్టిగా ఖండించారు తత్వశాస్త్రంలో ఒంటెత్తువాద వైఖరిలోని విడ్డూరపు ధోరణులకు ఇదొక ఆసక్తికరమైన ఉదాహరణ ఈ అంశం అర్థంకావాలంటే భారతీయ భావవాద చరిత్రను స్థూలంగా పరిశీలించాలి

భారతీయ తత్వశాస్త్రంలో భావవాదం ఉపనిషత్తులలోని ఊహాగానాలలో మొదటిసారిగా కనిపిస్తుందనడంలో సందేహంలేదు అయితే ఆ తర్వాత ఐదారువందల

సంవత్సరాలపాటు అది పూర్తి తిరస్కరణకు గురైంది తత్వశాస్త్ర చరిత్రలో అది పూర్తిగా తెరమరుగైనట్లు కనిపిస్తుంది క్రీస్తు శకం తొలి సంవత్సరాలలో విస్తృతమైన మహాయాన సూత్రాలలో ఉపనిషత్ భావవాదపు కొనసాగింపు మళ్ళీ ప్రత్యక్షమైంది అయితే వేద సారస్వతంలో ఉన్న రూపంలో మాత్రం కాదు మహాయాన సూత్రాలు వాటిని బుద్ధుడి బోధనలుగా చెప్పాయి వేద ఛాందసాన్నిబట్టి చూస్తే ఇది వట్టి బూటకంగా, వేద దృష్టికి విరుద్ధమైన నయాబౌద్ధంగా చెప్పవచ్చు మహాయాన సూత్రాల తర్వాత బయలుదేరిన రెండు ప్రధానమైన తాత్విక ధోరణులు- మాధ్యమిక యోగాచార-అన్నవికూడా అదే భావవాద దృక్పధాన్ని మరింత పరిణిత తాత్వికరూపంలో ముందుకు తెచ్చాయి ఈ తాత్వికులు తమ ప్రాధమిక భావాలు ఉపనిషత్తులనుండి ఎక్కువగా ఎరువు తెచ్చుకున్న విషయాన్ని కప్పిపుచ్చి తమ తమ శాఖలను సమర్థించుకోవడానికి ప్రాకులాడినమాట వాస్తవమే తమ తాత్విక దృక్పధాలు బుద్ధుడి భావాలు తప్ప మరేమీకాదని, అయితే ఆయన తన జీవితకాలమంతటా వాటిని బయటపెట్టలేదని యుక్తిగా దాచుకున్నాడని వారంటారు ఆయన మృతి చెంది అనేక శతాబ్దాలు గడిచాయి గనుక వీటిని ప్రజలలో ప్రచారం చేయవచ్చునని సమర్థించుకుంటారు దీనంతటివల్ల భావవాద దృక్పథం ఉపనిషత్ తాత్వికులు మొదటిగా బోధించినప్పటికీ కాలక్రమంలో బౌద్ధతత్వంగా రూపం సంతరించుకుంది గౌడపాదుడు ఆ తరువాత శంకరుడు ఉపనిషత్తుల పేరుతోనే భావవాద తత్వశాస్త్రాన్ని ప్రచారం చేసిన మాట వాస్తవం కనుకనే ఆ తర్వాత వచ్చిన న్యాయ వైశేషికులు అద్వైత వేదాంతం మహాయాన బౌద్ధానికి కొనసాగింపు అనే విషయాన్ని తేలిగ్గా విస్మరించారు న్యాయవైశేషికుల తాత్విక వైఖరిని బట్టి భావవాదాన్ని గట్టిగా ఖండించడం చాలా అవసరమైంది వేద ఛాందసంపట్ల గల భ్రమలు భావవాద ఖండనకు అటంకమైనప్పుడు వారు ఆ భ్రమలను బౌద్ధంపేరు పెట్టి ఖండించారు ఆ విధంగాభావవాదతత్వానికి వ్యతిరేకంగా సాగిన వాదోపవాదాలకు వేద ఛాందసుల ఆశీర్వాదాలు లభించాయి బౌద్ధాన్ని ఖండించడం మంచిదేనని వారు సంతోషించారు అయితే యాజ్ఞవల్క్యుడు వంటి ఉపనిషత్‌యోగులు చేసిన బోధలు కూడా న్యాయవైశేషికుల ఖండనలకు గురౌతున్నాయనే వాస్తవాన్ని గుర్తించలేకపోయారు

## హేతువాదం, విజ్ఞాన శాస్త్ర పునరాగమనం

భావవాదాన్ని న్యాయవైశేషికులు ఎలా ఖండించారో మనమిప్పుడు చూడాలి ఆ సందర్భంగా తత్వశాస్త్రం తన మౌలిక స్వభావాన్ని తిరిగి పొందింది హేతువాదం, లౌకికతత్వం, శాస్త్రవిజ్ఞానాల స్ఫూర్తిని సంతరించుకుంది తత్వశాస్త్రంలో వాత్సాయనుడు ఆ తర్వాత న్యాయ వైశేషికులు ప్రవేశపెట్టిన సైద్ధాంతిక మార్పులు ప్రక్కకు నెట్టబడ్డాయి తత్వశాస్త్రమన్నది ఉపనిషత్తులు చెప్పిన అధ్యాత్మ విద్య మాత్రమేనన్న వివరణ వెనక్కుపోయింది భావవాదాన్ని ఖండించే సందర్భంలో న్యాయవైశేషిక అనేది అన్నింటినీ

మించి అణువాద సమర్థనగా పనిచేసింది పదార్థ విభజనకు గల అవకాశాలను, పరిమితులను అనుభవజ్ఞానాన్నిబట్టి చర్చించింది ఉపనిషత్‌కాలంలో భావవాదానికి మద్దతుగా ఉదహరించబడిన కలలు, భ్రాంతుల సాక్ష్యాధారాలను న్యాయ వైశేషికులు చీల్చి చెండాడారు అదే అంశాన్ని శాస్త్రీయ దృష్టితో వారు తమ శక్తిమేరకు రూపొందించారు అదేవిధంగా సాక్షాత్కారానికి అనుగుణంకాని హేతువు చెల్లదని చెప్పే వేద ప్రామాణ్యమంతటినీ పక్కకునెట్టారు భావవాదాన్ని ఖండించేందుకు హేతువునే ప్రధానమైన ఆధారంగా చేసుకున్నారు

భారతీయ తత్వశాస్త్ర చరిత్రలో ఒంటెత్తువాదమన్నది చాలా విచిత్రమైన, సంక్లిష్టమైన పాత్ర నిర్వహించింది తాత్వికులు తమతమ వర్గాల ప్రతిష్టకోసం ప్రాకులాడటమే ప్రధానాంశమైంది సాధారణంగా చెప్పాలంటే దీనివల్ల ఒకవిధమైన పిడివాద వాతావరణం ఏర్పడింది ఇతర దేశాలలో ఇలాంటి పరిస్థితి కనిపించదు తాత్వికేతర అంశాలు అసలైన తాత్వికాంశాలతో కలగాపులగం కావటం ఆవిధంగా ఈనాడు మనకు చాలా విచిత్రమైన అభిప్రాయాలు లభించడం జరిగింది కొన్నిసార్లు ఈ అభిప్రాయాలు తప్పుగా కూడా వుంటాయి అదేసమయంలో ఒంటెత్తువాదం అంతర్గత వైరుధ్యాలను కూడా కలిగివుంది న్యాయ వైశేషిక శాస్త్రంలో ఇందుకు కొట్టవచ్చినట్లు కనపడే ఉదాహరణలు ఉన్నాయి మలి దశలో ఈ శాస్త్రాన్ని అనుసరించిన వారు వేద ఛాందసానికి సంబంధించిన భ్రమలను కల్పించారు తత్ఫలితంగా వారు భావవాదానికి సంబంధించిన అనేక వైఖరులతో రాజీపడాల్సివచ్చింది అంటే వేదాలు లేదా ఉపనిషత్తులలో చెప్పిన వాటికి ఒప్పుకోవాల్సివచ్చింది బౌద్ధులపట్లగల అతి తీవ్రమైన వ్యతిరేకతతో ఇదే తాత్వికులు ఆ వైఖరులను ఖండించడం కనిపిస్తుంది మహాయాన బౌద్ధులు వాటికి బుద్ధుడి పేరుపెట్టడమే ఇందుకు కారణం

## ప్రకృతి, పదార్థాలకు సంబంధించిన సిద్ధాంతాలు

మనకు అందుతున్నదాన్నిబట్టి న్యాయవైశేషిక శాస్త్రం విజ్ఞానం, మూఢనమ్మకాల విచిత్ర సమ్మేళనంగా కనిపిస్తుంది అందువల్ల మనం దాని నిజమైన అంతస్సారమేమిటి? బాహ్యంగా తెచ్చిపెట్టుకున్నదేమిటి అని విడమర్చి విచక్షణగా చూడటం అవసరమౌతుంది అంతర్గతంగా చూస్తే అది హేతువాదానికి, సెక్యులరిజానికి, విజ్ఞానానికి చెందింది వేద ఛాందసాన్ని నమ్ముతున్నట్లు చెప్పడం కేవలం ఆంక్షలను తప్పించుకోవడాని ఉద్దేశించబడింది క్రమక్రమంగా అది ఒక భ్రమా కల్పనగా దారితీసింది ఆవిధంగా భావవాదంతో ఒక కృత్రిమమైన రాజీ జరిగింది మనం భావవాద ప్రతిసిద్ధాంతంగా దాన్ని అర్థం చేసుకునే సందర్భంలో ఈ రెండవ అంశానికి అవసరమైనదానికన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు మొదటి అంశంపైనే ప్రధానంగా కేంద్రీకరించాలి అలా చేసినట్లయితే సాంఖ్యులు, లోకాయతులతోపాటు ఈ శాస్త్రం కూడా భావవాద వ్యతిరేక సిద్ధాంతమేనని గ్రహించగలుగుతాము

ఈ మూడు తాత్విక సిద్ధాంతాలు భావవాదాన్ని తిరస్కరిస్తాయన్నది పైకి చూడగానే కనిపించే అంశం బాహ్య ప్రపంచ వాస్తవికతను తిరస్కరించే భావవాదుల ధోరణికి ఇది విరుద్ధమైనది లోకాయతులు, సాంఖ్యులు, న్యాయ వైశేషికులు ప్రపంచ వాస్తవికతను బలపరిచారు అయితే అంతమాత్రంతోనే ఈ మూడు తత్వశాస్త్రాలు ఒక్కటైపోవు అంతకన్నా ముఖ్యమైన అంశాలున్నాయి పదార్థ స్వభావానికి సంబంధించిన తమ తమ సిద్ధాంతాల ప్రాతిపదికనే ఈ మూడు రకాల తత్వవేత్తలు వాస్తవ ప్రపంచాన్ని గురించి వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు ఈ కారణంచేతనే వాటికి అత్యంత ప్రాధాన్యత కలుగుతున్నది వాస్తవ ప్రపంచ ఉనికిని నిరాకరించే వాదనలను ఊరికే త్రోసిపుచ్చడంగాక వాస్తవ ప్రపంచం పదార్థ నిర్మితమైందని సానుకూలంగా నొక్కి చెప్పడం ఇక్కడ ముఖ్యమైన విషయం లోకాయతులు పదార్థాన్ని భూతాలుగా లేక భూమి, నీరు, గాలి, నిప్పు అనే భౌతికపదార్థ సముదాయంగా పరిగణించారు అందువల్లనే వారు తమ దృక్పథాన్ని భూతవాదం లేక భౌతిక పదార్థ సిద్ధాంతం అన్నారు సాంఖ్యులు పదార్థాన్ని ప్రధానమైందిగా పరిగణించారు ప్రపంచంలో ప్రతిదీ దానిచుట్టూనే పరిభ్రమిస్తుందన్నారు న్యాయవైశేషికులు పదార్థాన్ని అణువులు, పరమాణువులుగా చూశారు అందుకే వారి సిద్ధాంతం అణవాదంగా పేరుపొందింది పదార్థ స్వభావానికి సంబంధించిన ఈ మూడు సిద్ధాంతాలు ఒకటికాదు అలాగే వాటినిబట్టే పదార్థరహస్యాలన్నీ వెల్లడికావు అయితే అది వేరే విషయం మనకు ముఖ్యమైందేమంటే ఇలాంటి సైద్ధాంతిక తేడాలున్నప్పటికీ పదార్థ స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు భారతదేశంలో జరిగిన ప్రయత్నానికి అవి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి ఈ ప్రాతిపదికనే ఈ మూడు సిద్ధాంతాలు బాహ్య ప్రపంచం లేదా వాస్తవప్రపంచ మౌలిక నిర్మాణాన్ని వర్ణించేందుకు ప్రయత్నించాయి భావవాదాన్ని వ్యతిరేకించి ప్రపంచపు వాస్తవికతను సమర్థించాయి

భావవాద దృక్పథానికి వ్యతిరేకమైన భారతీయ సిద్ధాంతాన్ని అర్థం చేసుకోవడంలో ఇది చాలా ముఖ్యమైన విషయం భారతీయ పదజాలం ప్రకారం ఇది కేవలం బాహ్యార్థవాదంకాదు అంటే కేవలం మనకు తెలిసిన బాహ్యప్రపంచ భావేతర అంశాలను చెప్పేదిమాత్రమే కాదు ఈ బాహ్యార్థవాదానికి తోడుగా భూతవాదం లేక పరమాణువాదం లేక ప్రధాన వాదాల రూపంలో ప్రపంచం పదార్థ నిర్మితమని నిర్ధారించడం జరిగింది

## వాస్తవికవాదమా లేక భౌతికవాదమా?

ఇక ఇప్పుడు మరో సమస్యను పరిశీలించాలి భావవాదానికి ప్రతి సిద్ధాంతంగా వున్న ఈ భావనలు మౌలికంగా భౌతికవాదానికి సంబంధించినవేనా? ఈ ప్రశ్న చాలా కీలకమైంది సాంప్రదాయక భారతీయ భావవాదానికి భాష్యం చెప్పే ఆధునిక విమర్శకులకు ఈ ప్రశ్న అఘాయిత్యంగా కనిపించవచ్చు వారు భారతీయ తత్వశాస్త్రంలో ఎలాంటి భౌతికవాద ధోరణులు లేవని చెప్పరు అయితే వాటిని పూర్తిగా విడదీయాలని వారు

వాదిస్తారు భారతీయ తత్వశాస్త్రంలో భౌతికవాదమన్నది లోకాయతులులేక చార్వాకులకే పరిమితమని, వారు మన మొత్తం తాత్వికులలో చాలా అల్ప సంఖ్యాకులని, వారి తాత్విక సామర్థ్యం కొన్నిసార్లు సందేహాస్పదంగా కనిపిస్తుందని వ్యాఖ్యానిస్తారు

భావవాదాన్ని ఖండించిన తత్వవేత్తలు ఇంకా అనేకమంది ఉన్నమాట వాస్తవమే వారిలో కొందరు చాలా ప్రసిద్ధులు ఆవిధంగా భావవాదాన్ని వ్యతిరేకించడం ఒక విషయమైతే భౌతికవాదాన్ని ఆమోదించడం మరో విషయం తక్కిన తాత్వికులు భావవాదాన్ని వ్యతిరేకించారుగనుక వారు భౌతికవాదానికి సంబంధించివారని చెప్పడానికి అవకాశంలేదు అందువల్ల లోకాయతులు భావవాదాన్ని వ్యతిరేకించిన తీరుతో పోలిస్తే ఇతరుల వ్యతిరేకత భౌతికవాద దృష్టినుండి జరగలేదు మరే దృష్టినుండి జరిగింది ?

భారతీయ తత్వశాస్త్రంపై రాసిన చాలామంది ఆధునిక రచయితలు దీనికి వాస్తవికవాదం అని పేరుపెట్టారు ఆవిధంగా వారు సాంఖ్య వాస్తవిక వాదం, న్యాయ వైశేషిక వాస్తవికవాదం అని యధేచ్ఛగా పిలుస్తారు లోకాయతానికి మాత్రమే భౌతికవాదమన్న పేరు అట్టిపెట్టారు ఆవిధంగా వాస్తవికవాదం అన్న పదం ఆమోదించబడింది ఈ వాస్తవిక వాదం భావవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించినా భౌతికవాదంపట్ల ఎలాంటి మొగ్గు చూపదు అంతేగాక భౌతికవాద వ్యతిరేకులకు కూడా వాస్తవిక వాదం లోపరహితంగా వుంటుంది ఎందుకంటే మామూలుగా భౌతికవాదులకు తాము ఆపాదించే అవలక్షణాలు, వికృతధోరణులు దానికి వుండవుకనుక వారు తేలిగ్గా ఆమోదిస్తారు

భారతీయ తాత్విక సాంప్రదాయంపట్ల సాధారణమైన పరిశీలనా దృక్పధం ఇలా వుంటుంది సరైన పదం ఎంపికకు సంబంధించిన సమస్యగనుక మనం ముందు దాన్నే తేల్చుకోవచ్చు భారతదేశంలో భావవాద వ్యతిరేక సిద్ధాంత ప్రతినిధులకు లేదా వారిలో అతి ప్రధానమైనవారికి భౌతికవాదం అన్న మాటకంటే వాస్తవిక వాదం అన్న పదం బాగా సరిపోతుందా? ఈ పదాల నిర్దిష్ట అర్థాన్నిబట్టి సమాధానం ఆధారపడివుంటుంది ఏకపక్షమైన తీర్పు సాధ్యంకాదు యూరోపియన్ తత్వశాస్త్రంలో వీటిని ఉపయోగించిన సందర్భాన్నిబట్టి భారతీయ తత్వశాస్త్రంలో అర్థాన్ని అన్వయించుకోవలసి వుంటుంది భౌతికవాదానికి భిన్నమైన కొత్త అర్థం ఏదో మనం చొప్పించకపోయినట్లయితే యూరోపియన్ తాత్వికులు వాడిన అర్థంలోనే మనం దాన్ని వాడుతున్నామని అనుకోవాలి వాస్తవికతావాదం అన్న సిద్ధాంతాన్ని అనుసరించిన తాత్వికులెవరు వారి బోధనలేమిటి?

యూరోపియన్ తత్వశాస్త్రంలో మధ్యయుగాలలోనే పండితవాదులు అనబడే వారిలో అది ఒక ధోరణిగా వుండేది అయితే వారు ఆ పదాన్ని వినియోగించిన అర్థం ఇప్పుడు దాదాపు మరుగునపడిపోయింది భావవాదాన్ని ఏవిధంగానూ వ్యతిరేకించడంగాక నామవాదానికి భిన్నంగా వాస్తవికవాదం అన్నది ప్రాచీన భావవాదంలో అతి ప్రధానమైన ధోరణి అని వారు పరిగణించేవారు ప్రపంచాన్ని గురించి, భావాలను గురించి ప్లేటో సిద్ధాంతం ఈ కోవకు చెందిందే విశ్వజనీనమైన అంశాలు కేవలం పేర్లకు సంబంధించినవి

మాత్రమేనని నామవాదులు చెప్పేవారు అందుకు భిన్నంగా విశ్వజనీనమైన పదార్థేతర అంశాలకే భౌతికవస్తువులకన్నా హెచ్చువాస్తవికత ఉన్నదని మధ్యయుగాలలోని వాస్తవికవాదులు చెప్పేవారు 18వ శతాబ్దం చివరి దశలో థామస్ రైడ్ భావవాద ప్రతిసిద్ధాంతం అన్న అర్థంలో వాస్తవిక వాదం పదాన్ని ప్రతిపాదించారు ముఖ్యంగా బెర్క్లీ భావవాదానికి వ్యతిరేకంగా మన మనస్సుకు వెలుపలా, మన మనస్సుతో నిమిత్తం లేకుండా పదార్థాలు ఉన్నాయనే ఇంగితజ్ఞాన దృక్పథాన్ని అతను సమర్థించాడు అయితే అతనికి దొలుతనే పెద్దగా విజయం లభించలేదు 1899, 1903లలో సి యు మూర్ ప్రకటించిన రెండు సైద్ధాంతిక పత్రాలతో యూరోపియన్ తత్వశాస్త్రంలో వాస్తవికవాదం అన్న పదానికి గొప్ప ప్రఖ్యాతి లభించింది భావవాద ఖండన అన్నది ఆ పత్రాలలో ఒకటి భావవాద ప్రతిసిద్ధాంతంగా వాస్తవికవాదం ఆవిధంగా 20వ శతాబ్దంలో కనుగొనబడింది ముఖ్యంగా బ్రిటిష్, అమెరికన్ తత్వవేత్తలు అనేకమంది భావవాద తిరస్కరణకోసం ఉపయోగించడంవల్ల అది బాగా వ్యాప్తిలోకి వచ్చింది బర్క్లీ భావవాదానికి ఆధారమైన జ్ఞానసిద్ధాంతాన్ని వారు ముఖ్యంగా ఖండిస్తారు వాస్తవికవాదుల ప్రధాన వాదన ఏమంటే వస్తువులు జ్ఞాన సముపార్జనతో సంబంధం లేకుండానే ఉనికిలో వుంటాయి చైతన్యం ఉనికిని లేక వాస్తవికతను నిర్ణయిస్తుందని భావించడం పొరపాటు అని వారు చెప్తారు

నవీన వాస్తవికవాదులు భావవాదంయొక్క బూటకత్వాన్ని బట్టబయలు చేస్తున్నారన్న విషయంలో సందేహంలేదు కాని మనకు అవసరమైనదేమంటే ఈ తత్వవేత్తలు నిజంగా భావవాద వ్యతిరేకులైతే భౌతికవాదం అన్న పాత పదాన్ని ఎందుకు ఆమోదించరు? తాత్విక భావవాదాన్ని ప్రాచీనకాలంనుండి యూరోపియన్ తత్వవేత్తలు ఖండిస్తూనేఉన్నారు మనస్సుతో నిమిత్తం లేకుండా వస్తుజాలం వాస్తవిక ఉనికి కలిగివుంటుందని అంగీకరించడం ఇందుకు కనీస ప్రాతిపదిక డెమోక్రటీస్‌నుండి ఫ్యూయర్‌బా, మార్క్స్‌ల వరకూ భావవాదాన్ని తిరస్కరించినవారే అయితే వీరు తమను భౌతివాదులుగా చెప్పుకున్నారు వారి సిద్ధాంతాలు రకరకాలైన భౌతికవాదాలుగా పేరుపొందాయి మరి నవీన వాస్తవికవాదులు భావవాదానికి వ్యతిరేకమంటూనే భౌతికవాదం అనిగాక వాస్తవిక వాదం అని పిలిపించుకోవడంపట్ల ఎందుకు మొగ్గుచూపుతారు? ఇందుకు సమాధానం ఏమంటే వీరు భావవాదంతోపాటు భౌతికవాదాన్ని కూడా సమానస్థాయిలోనే వ్యతిరేకిస్తారు

వస్తువులు మనస్సుతో నిమిత్తం లేకుండా స్వతంత్రమైన ఉనికి కలిగివుంటాయని చెప్పడంవరకు భావవాదంపట్ల వారి వ్యతిరేకతను తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు కాని భౌతికవాదం అనే పదాన్ని వారు తిరస్కరించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇలాంటి దురభిప్రాయాలకు గల అవకాశం త్రోసిపుచ్చలేము నవీన వాస్తవికవాదులు కూడా భౌతికవాదులను తిరస్కరించడానికి తాత్విక భూమిక ఉన్నది

భౌతికవాదులు ఈ వస్తువులు ప్రధానంగా పదార్థమేనని చెప్తారు అందులోని అంతస్సారాన్ని పదార్థం అన్న పదంతో అభివర్ణిస్తారు కాని నవీన వాస్తవికవాదులు అలాంటి అవకాశాలను అంగీకరించరు తాత్వికంగా అదే వారికిగల విభేదం మరి పదార్థాల

స్వభావాల గురించి వారి అభిప్రాయమేమిటి? ఈ ప్రశ్న అత్యంత క్లిష్టమైనది నవీన వాస్తవిక వాదులమధ్య ఈ విషయంలో అనేక వ్యత్యాసాలున్నాయి వాస్తవిక వాదులను కలిపివుంచే అంశాన్ని వాస్తవానికి ప్రతికూల కోణం నుంచి మాత్రమే అర్థం చేసుకోగలం భావవాదంపట్ల ఉమ్మడి వ్యతిరేకతే వారిని కలిపివుంచుతుంది మరోవిధంగా చెప్పాలంటే వారి ప్రతికూలత ద్విముఖమైనది వారు భావవాదాన్ని, అలాగే భౌతికవాదాన్ని కూడా తిరస్కరిస్తారన్నమాట తత్వశాస్త్రంనుండి పదార్థానికి సంబంధించిన దృక్పథాన్ని పూర్తిగా తొలగించాలన్న ధోరణి వారిది వారిలో గణనీయమైన భాగం చెప్పే ప్రకారం వస్తు సంచయంలో మౌలికపదార్థం మూలకం అన్న తటస్థ పదంతో వర్ణించబడుతుంది ఇది మనస్సూ కాదు, పదార్థమూ కాదు

ఈ పదానికిగల అర్థమేమిటన్నది వేరే ప్రశ్న అది ప్రధానంగా నవీన భౌతికవాదులకు సంబంధించినది ఏమైనప్పటికీ భౌతికవాదంపట్ల విముఖతతో నవీన వాస్తవికవాద ప్రతినిధులు చివరకు భావవాద వైఖరులకే లోబడతారు దాన్ని తిరస్కరించడమే వారి తాత్విక ఉత్సాహానికి నాంది అవుతుంది

మనమిక్కడ దీని వివరాలన్నింటిలోకి పోనవసరంలేదు "భౌతికవాదం, అనుభవజ్ఞాన విమర్శ" అన్న తన గ్రంధంలో లెనిన్ సానుకూలవాదులు, ఆధునిక వాస్తవికవాదులు తదితరులు భావవాదంపట్ల ప్రతికూలత పైకి చూపుతూనే దానికే లొంగిపోయిన తీరును అభివర్ణిస్తారు ఈవిధంగా వారిని ఎండగట్టే సందర్భంలో లెనిన్ ఖచ్చితమైన భౌతికవాద దృక్పథంనుండి ఈ ఆధునిక వాస్తవికత అన్న పదాన్ని కూడా తిరస్కరించాలని చెబుతారు తన కాలంలో బాగా చలామణిలోవున్న తాత్విక రచనలనుద్దేశించి ఆయనిలా అంటారు *'ఇప్పుడు వాస్తవికత అన్న పదం ఇక్కడ భావవాద వ్యతిరేక సిద్ధాంతంగా ఉపయోగించబడిన సంగతి మనం గుర్తించాలి ఏంగెల్స్‌లాగే ఈ అర్థంలో నేను కూడా భౌతికవాదం అన్న పదాన్ని మాత్రమే ఉపయోగిస్తాను అదే అందుకు ఒకే ఒక సరైన పదమని నా అభిప్రాయం. ఎందుకంటే సానుకూలవాదులు, భౌతికవాదానికి, భావవాదానికి మధ్య ఊగిసలాడే ఇతర సందేహాస్పదులు వాస్తవికత అన్న పదాన్ని ఇప్పటికే దారితప్పించారు "*

ఇప్పుడు మనం ప్రధానమైన ప్రశ్నకు తిరిగిరావచ్చు ఐరోపా తాత్విక చరిత్రలో భావవాద వ్యతిరేక సిద్ధాంతాన్ని వర్ణించడానికి రెండు భిన్నమైన పదాలు వాస్తవికవాదం, భౌతికవాదం అన్నవి ఉపయోగించబడ్డాయి. భారతదేశంలో భావవాద ప్రతిసిద్ధాంత ప్రధాన స్రవంతిని వర్ణించడానికి ఇందులో ఏ పదం సరిగ్గా అతుకుతుంది? ఆ పదాలకు నూతన అర్థాలు కల్పించకుండా మనం ఈ ప్రశ్నకు జవాబు చెప్పవలసి వుంటుంది అందువల్ల ఈ రెంటికీ మధ్యగల తేడాను ముందు చూడాలి. ఇప్పటికే గమనించినట్లుగా ప్రధానమైన తేడా ఒక్కటే. భౌతికవాదంవలెగాక వాస్తవికవాదం పదార్థాన్ని చూడ నిరాకరిస్తుంది అంటే మనకు తెలిసిన బాహ్యావస్తువులు పదార్థ నిర్మితాలని అంగీకరించదు. అందువల్ల భావవాద వ్యతిరేకమైన సిద్ధాంతం కూడా బాహ్య ప్రపంచం పదార్థనిర్మితమనే అభిప్రాయంతో విడగొట్టుకున్నప్పుడు దాన్ని వర్ణించడానికి వాస్తవికత అన్న పదాన్ని ఉపయోగించడం న్యాయం. అలాగాక ఈ వ్యతిరేక సిద్ధాంతం బాహ్యప్రపంచాన్ని పదార్థనిర్మితంగా

పరిగణించినప్పుడు మనం వాస్తవికత అన్న పదాన్ని వాడకూడదు. భౌతికవాదమన్నదే అందుకు సరైన పదమౌతుంది.

మనమిప్పుడొక తేలికైన ప్రశ్న వేసుకోవచ్చు. ఒక తాత్వికుడు బాహ్యాప్రపంచం పదార్థ నిర్మితమని తీవ్రంగా భావిస్తున్నాడా లేదా అన్నది ఎలా నిర్ణయించాలి? పదార్థ స్వభావానికి సంబంధించి ఏదో ఒక సిద్ధాంతాన్ని రూపొందించడం లేక కట్టుబడివుండడం అన్నదే ఇందుకు కొలబద్ద అవుతుంది ఎందుకంటే తెలిసిన వస్తువుల నిర్మాణాన్ని వర్ణించేందుకు మాత్రమే అలాంటి సిద్ధాంతం అవసరం ఏర్పడుతుంది.

అందువల్లనే భారతదేశంలో భావవాద ప్రతిసిద్ధాంత ప్రధాన ప్రవంతిని భౌతికవాదం అనిగాక వాస్తవికవాదం అని పిలవాలన్నట్లైతే అది పదార్థ స్వభావానికి సంబంధించిన సిద్ధాంతంనుండి విడగొట్టుకుని వుండాలి. అందుకుభిన్నంగా అది ఏదో ఒక పదార్థ సూత్రానికి కట్టుబడిన్నట్లైతే అప్పుడు భౌతికవాదమన్న పదమే సరైందవుతుంది.

లోకాయత, సాంఖ్య, న్యాయ వైశేషిక అనే మూడు తాత్విక ధోరణులు ఈ ప్రధాన ప్రవంతిగా వున్నాయని మనం తెలుసుకున్నాము మరి ఈ తాత్విక చింతనలు కేవలం భావవాదాన్ని ఖండించేందుకై పరిమితమయ్యాయా లేక పదార్థ స్వభావానికి సంబంధించి ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడ్డాయా?

భారతీయ భావవాద ప్రతిసిద్ధాంత ప్రధాన ప్రవంతి దాన్ని తిరస్కరించడంతోనే సరిపెట్టుకోకుండా ఏదో ఒక పదార్థ సిద్ధాంతానికి కట్టుబడింది. అది కేవలం బాహ్యార్థవాదంకాదు లేక వస్తువులు మనస్సుకు వెలపల వుంటాయని చెప్పడంకాదు. ఈ బాహ్యార్థవాదానికితోడుగా వాటిలో భూతవాదం లేక ప్రధానవాదం లేక పరమాణువాదం అన్న మూడు సిద్ధాంతాలు రూపొందాయి. అందుకే యూరోపియన్ పదజాలం ప్రకారం వాస్తవికత అన్న పదం దీనికి సరిపోదు, భౌతికవాదం అన్న పదమే సరిపోతుంది

## భౌతికవాదం-ప్రాచీనం, ఆధునికం

అయితే భౌతికవాదమన్నది పదార్థ వాస్తవికతను గుర్తించే తత్వం మాత్రమేకాదు, పదార్థం ప్రాధమికం, చైతన్యం ద్వితీయం అని చెప్పే దృక్పధం కూడా. చైతన్యం అంతిమంగా పదార్థంనుండే ఉత్పన్నమౌతుందని కూడా ఈ దృక్పధం చెబుతుంది భారతీయ భావవాద ప్రతిసిద్ధాంతానికి ప్రధానంగావున్న తాత్విక చింతనల్లో లోకాయతం, అలాంటి దృక్పధాన్ని చేపడుతుంది. అయితే సాంఖ్య న్యాయ వైశేషికాల సంగతి ఏమిటో మనం తర్వాత చూద్దాం. వారి అభిప్రాయానికి సంబంధించి అనేక పొరపాటు ధోరణులు ఉన్నప్పటికీ వాస్తవానికి చైతన్యం గురించిన వారి భావన లోకాయతానికి దగ్గిరగా వుంటుందని మనం తెలుసుకోగలుగుతాము.

భారతీయ తత్వశాస్త్రంలో భౌతికవాద సాంప్రదాయాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన మరో వివరణ ఏమంటే మనం అచ్చమైన భౌతికవాదాన్ని కేవలం ఒక తాత్విక చింతనగానే పరిగణించరాదు. ఎందుకంటే దానికి కొన్ని బాహ్యమైన, తాత్వికేతరమైన

అంశాలు కూడా చారిత్రికంగా జతచేయబడ్డాయి. ముఖ్యంగా భౌతికవాద ధోరణి తొలి దశలో ఇది జరిగింది ఆమేరకు దానిలోని బాహ్యాంశాలు శాస్త్రీయ స్ఫూర్తికి భిన్నంగా వున్నమాట వాస్తవమే. ఇది తొలి భౌతికవాదుల బలహీనతలకు ప్రతిబింబం భౌతికవాదం ఈ బలహీనతలను అధిగమించడంద్వారానే తాత్విక ప్రాధాన్యత సంతరించుకున్నది. అందువల్ల అలాంటి అంశాలన్నింటిని విమర్శనాత్మకంగా త్రోసిపుచ్చాలని ఆధునిక భౌతికవాదులు చెబుతారు. అదేసమయంలో మనం తొలి భౌతికవాదుల సానుకూల పాత్రను చూడనిరాకరించే స్థితికి వెళ్ళరాదు.

తొలి తాత్విక దృక్పథం మౌలికంగా భౌతికవాదమా, కాదా అని నిర్ధారించుకోవడం కోసం మనం ఒక కొలబద్ద నిర్ణయించుకోవాలి ఆధునిక ప్రపంచంలో అత్యున్నత భౌతికవాదులైన మార్క్స్, ఎంగెల్స్‌లకన్నా కఠినమైన కొలబద్దను పెట్టుకోవచ్చు ఉదాహరణకు వారు ఫ్రాన్సిస్‌బేకన్ తాత్విక చింతనను ఎలా అంచనా వేశారు. దాన్ని వారు చాలా ప్రశంసించారు అయితే అతని భావాలలోని కొన్ని అస్థిమిత వైఖరులను గట్టిగా ఖండించారు. మార్క్స్ ఇలా పేర్కొన్నాడు

*ఇంగ్లీషు భౌతికవాదానికి, ఆధునిక ప్రయోగ శాస్త్రాలకు అసలైన పితామహుడు బేకన్ ఆయన దృష్టిలో ప్రకృతి శాస్త్రమే నిజమైన శాస్త్రం, గ్రహింపుపై ఆధారపడిన భౌతిక శాస్త్రం, ప్రకృతి శాస్త్రంలో అత్యద్భుతమైన భాగం భౌతికవాద తొలి సృష్టికర్త అయిన బేకన్‌లో దాని గొప్పతనం చాలా ప్రాధమికంగానూ, అదే సమయంలో అపరిపక్వంగానూ వుంది పదార్థం మనిషిని చూసి కవితాత్మకంగా దరహాసం చేసింది ఈ కలగాపులగపు సిద్ధాంతంలో ఆస్తికత్వంలోని అసంబద్ధతలన్ని వున్నాయి*

ఈ అసంబద్ధతలు బేకన్‌ను ఎంత హాస్యాస్పద స్థితికి చేర్చాయో ఎంగెల్సు మరింత వివరంగా ఇలా పేర్కొన్నారు

*కొసలు కలుస్తాయనే ప్రాచీన సూక్తి చందంగా గతితర్కం సాధారణ చైతన్యంలో స్థానం సంపాదించింది అందువల్ల అత్యంత విడ్డూరమైన కాల్పనికత, అపరిపక్వత, మూఢత్వం మనకు కనిపిస్తే ఏమాత్రం పొరబాటులేదు వాస్తవ ప్రపంచాన్ని స్వేయాత్మక యోచనల వైపు నెట్టే జర్మన్ ప్రాకృతిక తత్వ శాస్త్రంవలెగాక అందుకు పూర్తి విరుద్ధమైన వైఖరిక్కడ కనిపిస్తుంది అనుభవాన్ని అతిగా చిత్రిస్తూ, ఆలోచనను సర్వాతీతమైనదిగా పరిగణిస్తూ వ్యర్థ భావాల శూన్యత్వాన్ని సాధ్యమైనంతగా సాగదీస్తుంది ఈ ఆలోచనా ధోరణి ఇంగ్లాండులో వుంది ఎంతో ప్రశంసనీయుడైన ఫ్రాన్సిస్ బేకన్ దీనికి ఆద్యుడు ఈయన అనుభవవాద, వ్యూహాత్మక విధానాన్ని అనుసరించడం ద్వారా దీర్ఘాయుష్షు, నూతన శక్తి కలుగుతాయని చెప్పారు హోదా, కవళికలు కూడా మార్చవచ్చని, ఒక శరీరాన్ని మరొకటిగా మార్చవచ్చని చెప్పాడు కొత్త జాతులను సృష్టించవచ్చని చెప్పాడు అలాటి పరిశోధనలను వదలివేసి నందుకు ఆయన కినుక వహించాడు బంగారం చేసేందుకు ఇంకా అనేక అద్భుతాలు సాధించేందుకు ఋచ్చితమైన దినుసులను ఆయన పేర్కొన్నాడు అలాగే ఐజాక్ న్యూటన్ కూడా తన వృద్ధాప్య దశలో సెయింట్ జాన్ బోధల ప్రచారంలో మునిగిపోయాడు '*

అలాంటప్పుడు మనం బేకన్‌ను భౌతికవాదిగా పరిగణించాలా? పరిణితిచెందిన ఆధునిక భౌతికవాదుల దృక్పథం ప్రకారం ఇందుకు సానుకూల సమాధానం లభిస్తుంది అయితే ఆయనను మనం స్థిరమైన భౌతికవాదిగా పరిగణించవచ్చునా? ప్రధానస్రవంతికి ప్రతినిధులైన తత్వవేత్తల రచనలలో కొన్నిసార్లు మనకు ఆధునిక విజ్ఞానశాస్త్రం, భౌతికవాదాలతో ఏమాత్రం పొసగని అభిప్రాయాలు, పోకడలు కనిపిస్తాయి. ప్రాచీన, మధ్యయుగాలకు చెందిన తాత్వికులు గనుక వారు ఆనాటి ఇంగితజ్ఞానంలో భాగంగా పరిగణించబడిన అనేక అంశాలను నిస్సంకోచంగా స్వీకరించారు అయితే ఆధునిక విజ్ఞాన ప్రమాణాలకు చాలా మొరటైనవిగా కనిపిస్తాయి. చాలా తొలిదశకు చెందినవారైనప్పటికీ అలాంటి విశ్వాసాల నుండి విడగొట్టుకున్నవారు లోకాయతులు మాత్రమే అనేక మూఢ నమ్మకాలనుండి విడగొట్టుకోవడంతోపాటు వారు నిస్సందేహంగా భారతీయ భౌతికవాదుల్లో ప్రముఖుల కోవకు చెందుతారు అదేసమయంలో మరికొందరు వారు తమ కాలపు మూఢనమ్మకాలనుండి అంతగా విడగొట్టుకోకపోయినా సరే వారు నిర్వహించిన నిజమైన తాత్విక పాత్ర లోకాయతం కన్నా మరింత ప్రముఖమైంది భారతీయ తర్కానికి, అణువాదానికి ప్రతినిధులైనవారు ఈ కోవకే చెందుతారు. లోకాయతుల గురించి మనకు తెలిసినంతటిదాన్నిబట్టి వారు భావవాదానికి వ్యతిరేకంగా వ్యవహరించేందుకు అత్యంత నైపుణ్యమైన ఎలాంటి యంత్రాంగాన్నీ రూపొందించుకోలేదు భావవాదుల నిర్ధారణలు సైద్ధాంతిక శిధిలతను సూచిస్తున్నాయనడంలో సందేహంలేదు అయినప్పటికీ వాస్తవమేమంటే ఈ నిర్ధారణలకు వచ్చే సందర్భంలో వారు కొన్ని కీలకమైన సైద్ధాంతిక సమస్యలను గురించిన చైతన్యం ప్రదర్శించారు. వాటిని చర్చించకపోతే భారతీయ తాత్విక వారసత్వం అగమ్యంగా, ముతగ్గా వుండిపోతుంది. ఉదాహరణకు హేతువు, అనుభవాలకుగల విలువను గురించిన సమస్య. సత్యానికి కొలబద్ద కల, భ్రాంతుల ప్రాధాన్యత ఆకస్మికతకు అర్థం, పదార్థ దృక్పథం చెల్లుబాటు వగైరాలు ఆ కోవకు చెందినవే. లోకాయతులు ఈ సమస్యలను ఎప్పుడైనా చర్చించారనిగానీ, వాటి ప్రాధాన్యతను అర్థం చేసుకున్నారనిగానీ మనం చెప్పలేము వీటిపై తీవ్రమైన తాత్వికచర్చ చేసే బదులు వారు పురోహితవర్గాలకు వ్యతిరేకంగా వాదించేందుకు ఎక్కువగా ఇంగితజ్ఞానంపైనా, వ్యంగ్యంపైనా ఆధారపడి భ్రమలను త్రోసిపుచ్చారు అలాంటి వ్యంగ్యానికిగల ప్రాధాన్యతను తక్కువ అంచనా వేయనవసరంలేదు కాని భావవాదం మొత్తం ప్రభావంనుండి విమోచన సాధించడానికి అదొక్కటేసరిపోదు అత్యవసరమైంది భౌతికవాద ప్రత్యామ్నాయాన్ని చూపించడం. భావవాదులు లేవనెత్తిన కీలక తాత్విక చర్చలకు సమాధానం చెప్పే కర్తవ్యం, భావవాదుల ప్రధాన వాదనలను సైద్ధాంతికంగా త్రోసిపుచ్చే కర్తవ్యం న్యాయవైశేషికులు చేపట్టారు వాటిని అమలు జరిపే సందర్భంలో వారు భావవాద వ్యతిరేకులైన కొద్దిమంది ఇతరుల సహాయం కూడా తీసుకున్నారు అంతేగాక లోకాయతంలో పదార్థ భౌతికస్వభావానికి సంబంధించి ప్రాధమిక సిద్ధాంతం మాత్రమే ఉన్నది. దాని ఆధారంగా వారు అత్యంత సంక్లిష్టమైన ప్రకృతి స్వభావాన్ని వర్ణించడం సాధ్యమై వుండేదికాదు అందుకుభిన్నంగా పదార్థ స్వభావానికి సంబంధించిన సిద్ధాంతంగా అణువాదం అత్యంత శ్రేష్టమైనది. న్యాయ

వైశేషికులు అనేక ప్రాకృతిక విషయాలను వర్ణించడానికి అది సహాయపడింది అదే వారి భౌతికవాదానికిగల మరో విశిష్టత అందువల్ల లోకాయతులు భారతీయ భౌతికవాద సాంప్రదాయానికి చేసిన సేవను తక్కువ అంచనా వేయకపోయినా మనం భారతీయ అణువాదులు సైద్ధాంతికంగా మెరుగైన స్థితిలో ఉన్నారని చెప్పవచ్చు. ఆధునిక పండితులు ఈ విషయం ఆమోదించలేకపోవడానికి కారణం న్యాయ వైశేషికాలు అనేక మూఢనమ్మకాలతో ముడిపడివుండడమే. అయితే అవి ఈ తాత్విక చింతన ప్రధానాంశాలకు సంబంధించినవి కావు వాటికి తాత్విక ప్రాధాన్యత ఏమీలేదు

అయితే అంతమాత్రాన భారతీయ అణువాదానికి లేక ఆ మాటకొస్తే భారతీయ భౌతికవాద సాంప్రదాయానికి గల తాత్విక ప్రాధాన్యతను అతిశయోక్తిగా చూడరాదు. దానికీ అనేక పరిమితులు ఉన్నాయి. ఆనాటి ప్రమాణాల ప్రకారం చూస్తే ఆ పరిమితుల్లో కొన్ని చాలా తీవ్రమైనవికూడా. చారిత్రికంగా అవి అనివార్యమే కావచ్చు. అప్పటికి విజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రం అంతగా అభివృద్ది చెందలేదు. వారు ఈ సాంప్రదాయాలను మన ప్రస్తుత తాత్విక అవసరాలకోసం ఉపయోగించుకుంటూ సమకాలీన అనుభవంతో వాటిని సుసంపన్నం చేయాలి.

# V

# భావవాద ఖండన

## కల, భ్రాంతి ఇచ్చే సాక్ష్యం

"ఇంద్రజాల మివ మయమాయాం స్వప్నఇవ మిధ్యాదర్శనం" అని మైత్రీ ఉపనిషత్తు ప్రకటించింది ఈ బూటక ప్రపంచాన్ని గురించిన అనుభవం ఇంద్రజాలంలాగా భ్రాంతి మాత్రమే అది స్వప్నం మాత్రమే అని దీని అర్థం. తర్వాతికాలంలో రెండువేల సంవత్సరాలపాటు పెంపొందిన భారతీయ భావవాద పరిణామక్రమంలో ఈ చిన్న సూత్రీకరణకు చాలా ప్రాధాన్యత వుంది వాస్తవంగా భారతీయ భావవాదులందరూ ఉపనిషత్ సూచనలను పాటిస్తారు. మన నిత్యజీవిత అనుభవాన్ని ఒక కలగా, భ్రాంతిగా దిగజార్చివేస్తారు.

తదనుగుణంగానే భావవాదాన్ని ఖండించే సందర్భంలో గౌతముడు, వాత్స్యాయనుడు, దాని వాదనలను పరిశీలించేందుకు పూనుకున్నారు. హేతువాదాన్ని సమర్థించిన తర్వాత భావవాదాన్ని ఖండించేందుకు సాగిపోయారు సహజసిద్ధమైన పరోక్షరూపంలో గౌతముడు ఇలా వాదించాడు "జ్ఞాన సాధనాలను గురించి జ్ఞాన సంబంధమైన వస్తుజాలంగురించి ఉన్న భ్రాంతులు కలలోని వస్తువులను గురించిన భ్రాంతులవంటివే లేదా ఐంద్రజాలికుడు చేసే గారడీవంటివే మేఘాలలో సౌధాలు, రాతిలో నీరు వంటి మాయావిద్యలే".ఈ వాదనలో ముఖ్యాంశాన్ని మరొకసారి ప్రస్తావించడం అవసరం

మనం పాదార్థిక ప్రపంచంలోని అన్నిరకాల వస్తువులను ప్రత్యక్షంగా గమనిస్తాం గనుక వాటి వునికిని గుర్తిస్తాం అయితే భావవాది ప్రత్యక్ష అనుభవం ఒక్కటే బాహ్యప్రపంచంలో నిజమైన ఉనికికి నిదర్శనం కాదంటాడు. పైగా కలలు, భ్రాంతులు, భ్రమలు వగైరాలలో తరచూ జరిగేట్లుగా ప్రత్యక్షంగా తెలిసే వస్తువులు బూటకమై వుంటాయి. మొత్తం భారతీయ

---

1.న్యాయసూత్రాలు

భావవాదులందరికీ ప్రారంభవాచకం ఇదే. దీనినుండే వారు మరొక కపటపు వాదన ముందుకు తెస్తారు వస్తువుల ఉనికి వాస్తవికతను గురించిన భ్రమాపూరితమైన ప్రత్యక్ష జ్ఞానాన్ని శాశ్వతంగా త్రోసిపుచ్చాలని వారు చెబుతారు ఎందుకంటే వస్తువుల ప్రత్యక్షజ్ఞానం కూడా వాటి వాస్తవికతను నిరూపించలేదు కనుక దాన్ని నిరూపించే మార్గమే లేదు అంటారు. ఈ వాదనలో రెండు దశలున్నాయి. మొదటిది కలలు, భ్రాంతులు వగైరాలలో కనిపించే వస్తువులు బూటకమైనవి రెండవది- దీన్నిబట్టి ప్రత్యక్షంగా తెలిసే వస్తువులు కూడా వాటివలెనే బూటకమైనవి

భావవాదాన్ని ఖండించేందుకోసం దాని వ్యతిరేకులు సహజంగానే ఈ వాదనలోని రెండు దశలను పరిశీలించాల్సివచ్చింది ఇవి రెండూ తాత్వికంగా నిలిచేవికావని వారు వాదించారు. కలల్లో కనిపించే వస్తువులు నిజమైనవికావని భావవాది చేసే వాదన అనుభవాన్ని తప్పుగా అర్థం చేసుకున్న ఫలితమే వాస్తవానికి ఆ ఊహాజనిత అనుభవాలు భావవాదులు నమ్మించ జూస్తున్నట్లుగా పూర్తిగా ఊహలుకావు. దీన్ని నిరూపించేందుకే భావవాద వ్యతిరేకులు భ్రమలకు సంబంధించిన సమస్యలను లోతుగా పరిశీలించే సంతృప్తికరమైన వివరణ కోసం ప్రయత్నించారు. వారిలో ముఖ్యులైనవారందరూ అంగీకరించిన ఒక అంశంతో మనం మొదలుపెడదాం. అది భావవాదుల పైవాదనలో రెండవ దశకు సంబంధించినది వస్తువులను గురించిన జ్ఞానమంతా కలలు వగైరాల రీతిలో అర్థం చేసుకోవాలని ఆ వాదన చెబుతుంది. ఇంకా తేలిగ్గా చెప్పాలంటే కల అన్నది నిస్సందేహంగా బూటకం గనుక వస్తువులను గురించిన జ్ఞానమంతా బూటకమని చెప్పడమన్నమాట

కలలో అనుభూతి చెందే వస్తువులు బూటకమైనవా? లేక నిజమైనవా? అనేది పక్కన పెడితే కలలోని అనుభవం నిజం కాదనేది నిర్వివాదాంశం. ఈ విషయంలో భావవాదులకు వారి ప్రత్యర్థులకు మధ్య ఎలాంటి తేడా లేదు. కలలో మీరు ఏనుగును చూస్తారు. భ్రమలకు సంబంధించి ఎప్పుడూ చెప్పే ఉదాహరణలో తాడును చూసి పామనుకుంటారు. ఆ ఏనుగు లేదా ఈ పాము పూర్తిగా కల్పితమైనవని భావవాది చెప్తాడు కాని భావవాద ప్రత్యర్థి దీన్ని తీవ్రంగా ప్రశ్నిస్తాడు అయితే అతని ఏనుగును లేదా పామును గురించిన జ్ఞానంయొక్క బూటకత్వాన్ని ప్రశ్నించినట్లు కాదు. ఆ కోణంనుండి చూసినప్పుడు అది తప్పకుండా బూటకమే. అయితే అంతమాత్రాన మామూలు జ్ఞానం కూడా తప్పనిసరిగా బూటకమైపోతుందా? అంటే భావవాది ఔననడమేగాక తన వాదనను వివిధ రూపాలలో ముందుకుతెస్తాడు. అయితే అతను ఏవిధంగా చెప్పినప్పటికీ అవి పొరపాటు సూత్రీకరణలే అవుతాయి. గతంలో పరిచయమైన ఒక వ్యక్తిని గురించిన సాక్ష్యాధారాలు బూటకమైనవంటే చెల్లుబాటుకాదు. కలలో మోసం జరగడం వగైరాల ఆధారంగా తీర్పులకు రావడం అసాధ్యం. అయితే ఈవిధమైన పోలికలు, విశ్లేషణలు అసంబద్ధమైనవి. గతంలో మోసగించిన అనుభవాన్నే మళ్ళీ నమ్మడం అన్న ప్రశ్న వుండదు మరోవిధమైన పూర్తి విభిన్న

అనుభవాన్ని నమ్మడమా లేదా అన్నదే ఇక్కడ ప్రశ్న అదే మెలకువలోని సాధారణ అనుభవం మనకు తెలిసిన కొంతమంది అబద్ధాలు చెప్తారు గనుక భూమిమీద ఉన్న మనుషులందరూ అసత్యపరులని అవిశ్వాసం ప్రకటిస్తామా? ఇతరులను విశ్వసించడానికి స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ అలా చేయాలనడం చాలా హాస్యాస్పదమౌతుంది

వాస్తవ ప్రపంచాన్ని గురించిన అనుభవం కలల ఉదాహరణతో త్రోసిపుచ్చడం సరైందికాదని భావవాద ప్రత్యర్థులు వాదిస్తారు రెండు సందర్భాలలోనూ వస్తువును గురించిన ప్రత్యక్షజ్ఞానం ఉందనే ఒకే ఒక్క వాదనతో ఈ రెండురకాల అనుభవాలను ఒకే గాట కట్టడం సరైందికాదు. అసలు వాస్తవమేమంటే దైనందిన అనుభవానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. కనుక దాని నిర్ధారణలను ప్రశ్నించడానికి లేదు ఏమిటా ప్రత్యేక లక్షణాలు?

మొదటి విషయం సాధారణ జీవితానుభవానికి తన గురించి ఒక విచిత్రమైన స్పష్టత-విస్పృతి ఉంటాయి దీన్నే భారతీయ పరిభాషలో *'సువరినిశిత'* అంటారు. రెండవది తదుపరి అనుభవాలు దాన్ని తొలగించలేవు లేక ఖండించలేవు. దీన్నే *'అవధితత్వ'* లేక *'అవిసంవాదిత్వ'* అంటారు

సాధారణ జీవితానుభవంలో ఒక స్తంభమంటే స్తంభమే. ఉదాహరణకు దానికి ఒక ప్రత్యేకమైన సుస్థిరత్వం, గట్టిదనం వుంటాయి. ఒక విలక్షణమైన నిర్వచనం వుంటుంది అస్పష్టతకు, అసంబద్ధతకు మారుపేరైన కలలోగాని, భ్రమలు, భ్రాంతుల్లోగాని ఇలాంటి సుస్పష్ట లక్షణాలేమీ వుండవు. అయితే సాధారణ అనుభవానికి కలలో అనుభవానికి గల ఈ తేడాను భావవాది అంత తేలిగ్గా అంగీకరించడు. కలలో అనుభవం కూడా సాధారణ అనుభవం లాగే అంత స్పష్టంగానూ, విశదంగానూ వుండవచ్చునంటాడు. ఒక ఏనుగు గురించి కలగంటున్నంతవరకు ఏనుగును గురించిన అనుభవం అంతస్పష్టంగా, విశదంగా వుండవచ్చు ఒక స్తంభాన్ని గురించి మామూలుగా ఎంత స్పష్టమైన అవగాహన వుంటుందో కలలో ఏనుగును గురించిన అనుభూతి కూడా అంత స్పష్టంగానూ వుండవచ్చు

భావవాద వ్యతిరేకులకు సంబంధించినంతవరకు ఇది సత్యానికి ఒకవైపు మాత్రమే ఈ అంశాన్ని అంగీకరించే సందర్భంలో అతను భావవాదిని ఒక సూటిప్రశ్న వేస్తాడు. కలలో ఏనుగును గురించిన అనుభవం బూటకం ఎందుకైంది? దీనికి సమాధానం ఒకటే లేవగానే అక్కడ నిజంగా ఏనుగు లేదని తెలిసిపోతుంది. అక్కడ కేవలం గోడ మాత్రమే ఉండవచ్చు. తాడును చూసి పాము అనుకోవడం కూడా అలాంటిదే. ఒక అనుభవంగా అది బూటకం ఎందుకైందంటే అక్కడ నిజంగా పాము లేదని, ఉన్నది తాడు ముక్క మాత్రమేనని తెలిసింది గనుక.

దీన్నిబట్టి ఒక విషయం స్పష్టమౌతుంది. భ్రమాపూరితమైన అనుభవం ఖచ్చితంగా బూటకమైందే *ఎందుకంటే తదనంతర అనుభవం దాన్ని* త్రోసిపుచ్చుతున్నది ఎదురుగా వట్టి గోడ మాత్రమే కనిపిస్తున్నందువల్ల కలలో కనిపించిన ఏనుగు అబద్ధమని తేలిపోతుంది.

అక్కడ ఉన్నది తాడు అని తెలియడంవల్ల పాము అన్న భావన అదృశ్యమౌతున్నది. మరొక అనుభవంవల్ల ఈ అనుభవం అసత్యమని రుజువవుతున్నది. భారతీయ పరిభాషలో చెప్పాలంటే బూటక జ్ఞానపు బూటకత్వానికి మూల కారణం వాధితత్వం లేక విశ్వం వాధిత్వం తదుపరి పరిజ్ఞానం వచ్చి దాన్ని బూటకమని నిరూపించడమన్నమాట అయితే దానికి పూర్తి విరుద్ధమైన అంశం అదే అవధితత్వం లేక అవిసం వాదిత్వం తదుపరి అనుభవాలు వేటిచేకూడా త్రోసిపుచ్చబడని, ఖండించబడని పరిస్థితి అన్నమాట ఇదే ఒక అనుభవం సత్యమని హామీనిస్తుంది.

ఈ అంశం స్పష్టమవ్వగానే భావవాద వ్యతిరేకులు కలలో అనుభవానికి భిన్నమైన వాస్తవ అనుభవం నిజమైందిగా, విలువైందిగా గ్రహించాలని వాదిస్తారు. ఎందుకంటే అది స్పష్టంగా నిర్వచించదగిందేగాక దానికి విరుద్ధమైన అంశాలు, తదుపరి అనుభవంలో దాన్ని త్రోసిపుచ్చే అంశాలు, తిరస్కరించే అంశాలు ఏమీ ఉండవు. అందువల్ల ఆ జ్ఞానాన్ని బూటకంగా పరిగణించడానికి ఆధారమే లేదు అలాంటి జ్ఞానంవల్ల తెలిసే వస్తువుల వాస్తవికతను గురించి ప్రశ్నించడానికి ఆస్కారమే ఉండదు.

కుమారిలుడు, న్యాయ వైశేషికులు మౌలికంగా చేసే వాదన ఇదే అయితే వారుమరిన్ని వివరాలలోకి పోతారు ఆ క్రమంలో భావవాదులు కలలోని అనుభవం బూటకత్వాన్ని ముందుకు తేవడం అన్నది నిత్యజీవితానుభవంలోని వస్తువులు వాస్తవికమైనవి కావనే వారి ప్రధాన నిర్ధారణకే వ్యతిరేకంగా పరిణమిస్తుందని వారు తేల్చిచెప్తారు కుమారిలుడు ఇలా చెప్తాడు.

*ఒక అనుభవం బూటకమైనదైతే దాన్ని తిరస్కరించవద్దా! తిరస్కరణలకు గురికాకుండానే అది బూటకమయ్యేట్లయితే అప్పుడు ఆంక్షలేవీ వుండవు ( అంటే ఏ అనుభవాన్నైనా నిజమని గాని, బూటకమని గాని ఏకపక్షంగా ప్రకటించవచ్చునన్నమాట ) మా వుద్దేశంలో కలలోని అనుభవందాన్ని త్రోసిపుచ్చే సాధారణానుభవం ద్వారా బూటకమని నిరూపించబడవచ్చు మీ (అంటే భావవాది) ఉద్దేశంలో ఇలాంటి తేడాకు ఏది ప్రాతిపదిక? సాధారణ అనుభవానికి సంబంధించినంత వరకు దానితో విభేదించే మరొక సరైన అనుభవమేదీ లేదు స్తంభం వగైరాల వంటి నిజమైన ఆధారాలేవీ లేవు సాధారణ అనుభవం కలలోని అనుభవాన్ని త్రోసిపుచ్చడమన్నది అందరికీ తెలిసిన విషయమే కనుకనే తిరస్కరణకు గురౌతున్న కలలోని అనుభవం వంటి వాటికంటే అది భిన్నంగా వుంటున్నది.*

ఈ విధంగా కలలోని అనుభవం బూటకం అన్నది తర్వాత వాస్తవానుభవంలో అది తిరస్కరించబడటం అన్న ఒక్క అంశంపైనే ఆధారపడివుంది కాని ఈ సాధారణ అనుభవాన్ని తదుపరి అనుభవమేదీ ఖండించడంలేదు కనుక అది వాస్తవం అన్నది తిరుగులేని విషయం ప్రత్యక్షంగా కనపడే, నిరూపితమయ్యే వాస్తవాలకు *(సుపరినిశిత)* భావవాదుల వైఖరి పూర్తి భిన్నమని కుమారిలుడు వాదిస్తాడు. "ఆ అనుభవం స్పష్టంగా

నిర్వచించబడింది సాధారణ అనుభవాల అత్యధిక శక్తిని వెల్లడించడానికి అది తోడ్పడుతుంది. అందుకు భిన్నమైన అనుభవం తర్వాత లేదుకనుక దాని నిజమైన సాధికారత లేక విశ్వసనీయత ప్రశ్నించడానికి లేనిది. "...

అత్యధిక శక్తి అన్న పదం ఆసక్తికరమైనది. రెండు అనుభవాలకు మధ్యలో ఒక అనుభవం మరొకదాన్ని తరిమివేయగల శక్తి కలిగివుంటే లేక దాన్ని త్రోసిపుచ్చి తిరస్కరించగలిగితే దానికే ఎక్కువ శక్తి వున్నట్లు భావించవలసి వుంటుంది. కలలోని అనుభవానికి సాధారణ అనుభవానికి మధ్య చూసినప్పుడు ఏది హెచ్చు శక్తి కలిగివుంది? స్పష్టంగా సాధారణ అనుభవమే. ఎందుకంటే అది కలలోని అనుభవాన్ని త్రోసిరాజనగలుగుతున్నది. అందువల్ల కలలోని అనుభవం ప్రాతిపదికన సాధారణ అనుభవం విలువను ప్రశ్నించే భావవాద వైఖరి మరింత విడ్డూరమే అయింది.

కుమారిలుడి వాదన మొత్తం భావవాదాన్ని చీల్చి చెండాడేదే. సాధారణ అనుభవాల మహత్తర శక్తి ఒక్కసారి నిర్ధారణ చేసిన తర్వాత అతను భావవాదానికి వ్యతిరేకంగా బలమైన సూత్రీకరణలు రూపొందించగలిగాడు బాహ్యప్రపంచ వాస్తవికతను నిరూపించగలిగాడు.

*సాధారణ జ్ఞానానికి అనుగుణమైన నిజమైన వస్తువు వుంటుంది.*
*ఎందుకంటే అది తదుపరి అనుభవంచే తిరస్కరించబడలేదు*
*ఉదాహరణకు ఈ అనుభవం కలలోని అనుభవాన్ని త్రోసిపుచ్చగలుగుతుంది*

ఈ వాదన ఒక అంశంపైన ఆధారపడివుంది. అదే కలలోని అనుభవం బూటకత్వం భావవాది కూడా దీనిపైనే హెచ్చుగా ఆధారపడ్డాడు. ఏమైనా అది భావవాది వైఖరిని బలపరచడంకంటే త్రోసిపుచ్చేదిగానే ఉన్నది కలలోని అనుభవం ఏవిధంగా బూటకమో నిరూపించలేకపోతే అది బూటకమన్న ప్రకటన అర్థరహితమౌతుంది. అలా నిరూపించడానికి ఒకే ఒక మార్గం సాధారణ అనుభవాన్ని కొలబద్దగా ఉపయోగించడమే. నిద్ర లేచిన తర్వాత వట్టి గోడ మాత్రమే కనిపిస్తున్నది కనుక కలలో చూసిన ఏనుగు బూటకమని నీవు అర్థం చేసుకుంటావు. తాడును తాడుగా చూడగలిగావు కనుక దాన్ని పాము అనుకోవడం పొరపాటని తెలుసుకోగలుగుతావు. అందువల్ల వాస్తవానుభవాన్ని వర్తింపచేయడంద్వారానే కల లేదా భ్రమ బూటకమని తెలుసుకోగలుగుతాము

సాధారణ అనుభవం చెల్లుబాటును ఆమోదించకుండా మనం దాన్ని వర్తింపచేయటం సాధ్యమౌతుందా? సాధారణ అనుభవం చెల్లేది కాకపోతే కలలోని అనుభవం బూటకత్వాన్ని అదెలా తిరస్కరించగలుగుతుంది? అలా చేయజాలదన్నది స్పష్టమే. అందువల్ల కలలోని అనుభవం బూటకత్వాన్ని ఆమోదించడమంటేనే సాధారణ అనుభవం వాస్తవికతను గుర్తించడం అన్నమాట. ఈ సాధారణ అనుభవం వాస్తవమని గుర్తించినట్లయితే దానికి

మూలమైన వస్తువుల వాస్తవికతను ప్రశ్నించడం నిరర్ధకమౌతుంది ఆవిధంగా బాహ్యప్రపంచం వాస్తవికత రుజువై భావవాదం తిరస్కరించబడుతుంది

కలలోని అనుభవం బూటకత్వం గురించిన వాదనను లేవనెత్తడం ద్వారా భావవాది తానే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్లు దీనంతటిని బట్టి స్పష్టమౌతుంది ఇది స్వవచన వ్యాఘాతం లాంటిది. అలాంటప్పుడు అతనేమి చేయాలి? తన వైఖరిని వెనక్కు తీసుకుని కలలోని అనుభవం బూటకం కాదని చెప్పాలా? ఇలా చెప్పినట్లయితే బహుశా సాధారణ అనుభవం వాస్తవికతను, దానికి సంబంధించిన వస్తుజాలంయొక్క ఉనికిని అంగీకరించే బాధ అతనికి తప్పవచ్చు. కాని అప్పుడు భావవాది మరింత ఇరకాటంలో పడతాడని కుమారిలుడు నిరూపిస్తాడు. అలా చేసినట్లయితే మొత్తం అనుభవమే బూటకమని చెప్పే తన సూత్రీకరణకు ప్రాతిపదికగా అతను పెట్టుకున్న ఒకే ఒక ఆధారం (దృష్టాంతం లేదా ఉదాహరణ) లేకుండా పోతుంది. సాధారణ భారతీయ తాత్విక చర్చ సాంప్రదాయం ప్రకారం ఆధారానికి, ఆధేయానికి మధ్యగల సార్వత్రిక సంబంధం చాలా కీలకమైంది అదే సూత్రీకరణలు చేయడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది బాహ్యప్రపంచంలోని సమస్తం అవాస్తవమని నిరూపించడంకోసం భావవాది మొత్తం అనుభవం బూటకమని లేక అనుభవంలోకి వచ్చిన ప్రతిదీ బూటకమని చెప్పినంతమాత్రాన సరిపోదు కలలోని అనుభవం వగైరా వాదనలు చేసినట్లే ఇందుకు కూడా గట్టి సాక్ష్యాధారాలు సమకూర్చవలసి వుంటుంది. అందువల్ల భావవాది ఈ ఆధారాన్ని తిరస్కరించినట్లయితే, కలలోని అనుభవం వగైరా వాదనను విడనాడినట్లయితే అప్పుడు వాటిపై ఆధారపడిన అతని మొత్తం సిద్ధాంతమే కూలిపోతుంది అనుభవంలోకి వచ్చే వస్తువులు అవాస్తవమని రుజువు చేసే అవకాశమే లేకుండా పోతుంది

## నిగూఢ జ్ఞానం

ఇప్పటివరకు చూసిన కుమారిలుడి వాదనలను ఇలా క్రోడీకరించవచ్చు భావవాది కలలోని అనుభవం బూటకత్వాన్ని ఆమోదించనూ లేడు, తిరస్కరించనూ లేడు ఇందులో ఏది చేసినా అతను తన స్వీయ తాత్విక వైఖరులను విడనాడవలసి వుంటుంది

మరైతే అతనేమి చేయాలి? అతనికి మరొక అవకాశం వుండవచ్చునని కుమారిలుడు సూచిస్తాడు కలలోని అనుభవం బూటకమని చెప్పడానికి ఏ ప్రమాణాన్ని ఉపయోగిస్తున్నాడో అదే ప్రమాణంతో సాధారణ అనుభవం కూడా బూటకమేనని నిరూపించవచ్చు ఈ అనుభవం కూడా తదుపరి జ్ఞానం చేత తిరస్కరించబడితే అది సాధ్యపడుతుంది అలాంటప్పుడు సాధారణ పరిజ్ఞానం కూడా తదుపరి జ్ఞానాన్ని బట్టి బూటకమని నిరూపించబడితే అది కూడా బూటకమని భావవాది తేల్చివేయవచ్చు కాని సాధారణ అనుభవాన్ని తిరస్కరించే అలాంటి జ్ఞానాన్ని దేన్నైనా భావవాది చూపించగలడా?

ఇందుకోసం భావవాది రెండు మార్గాలు అనుసరించవచ్చునని కుమారిలుడు చెబుతాడు మొదటిది -కలలోని అనుభవం లేదా భ్రమాపూరితమైన అనుభవం ప్రాతిపదికన సాధారణ జ్ఞానాన్ని తిరస్కరించడం. అయితే ఆ పద్ధతి అతనికి చాలా చేటుతెస్తుంది. అంతేగాక ఒక వ్యతిరేక అనుభవం సాధారణ అనుభవాన్ని త్రోసిపుచ్చే సామర్థ్యం కలిగివుందని చెప్పినట్లయితే అప్పుడు అది కూడా వాస్తవమేనని ఒప్పుకోవలసివస్తుంది. అది నిజమైన జ్ఞానం కానప్పుడు మరో జ్ఞానాన్ని ఎలా నిరాకరించగలుగుతుంది? అయితే కలలోని అనుభవం నిజమని ఎవరైనా గట్టిగా వాదించడం సాధ్యమా?

భావవాదికి మిగిలిన మరో మార్గమేమంటే సాధారణ జ్ఞానం తరువాత అసాధారణ జ్ఞానంచే తిరస్కరించబడుతుంది గనుక అది బూటకమని చెప్పాలి నిగూఢ ధ్యానం లేక యోగం ద్వారా సిద్ధిస్తుందని చెప్పే అసాధారణ జ్ఞానం ఇది కుమారిలుడు ఇలాంటి వాదనకు గల అవకాశాన్ని సూచించడం భావవాదికి ఊహాజనిత వైఖరిని అంటగట్టటడమేమీ కాదు. భారతీయ తత్వశాస్త్రంలో భావవాదాన్ని పరిశీలిస్తే వారు నిజంగానే అలాంటి వాదనలు చేసినట్లు అర్థమవుతుంది. పాదార్థిక ప్రపంచాన్ని గురించిన సాధారణ జ్ఞానం కలలోని అనుభవంచే కొట్టివేయబడుతుందని ఉపనిషత్తులలో నిజంగానే వాదించారు. కలలోని అనుభవం, కలలురాని నిద్రాదశ లేక సుషుప్తిలో కొట్టివేయబడుతుంది. ఆ తరువాత కలలు రాని ఈ నిద్ర అనుభవం నాల్గవ దశ అయిన తురియలో కొట్టివేయబడుతుంది. నిగూఢమైన ధ్యానం అని ఈ పదానికి అర్థం. మలి దశ భావవాదులలో యోగాచార్యులు ప్రత్యేకించి ఈ వాదనను ముందుకు తెచ్చారు. కుమారిలుడు ఇదే వాదనని ఇలా చెప్పాడు ----

క్లుప్తంగా చెప్పాలంటే కలలోని అనుభవం బూటకమని నిరూపించబడటానికి కారణం ఆ తర్వాత సాధారణ అనుభవం దాన్ని త్రోసిపుచ్చడమే. సాధారణ అనుభవం కూడా బూటకంగా గుర్తించబడాలంటే ఆ తర్వాత యోగం ద్వారా పట్టుబడే నిగూఢ ధ్యానంతో అసాధారణ అనుభవాన్ని సాధించవలసివుంటుంది

ఈ వాదనను భావవాద ప్రత్యర్థులు ఎలా ఎదుర్కొన్నారు? భారతీయ తత్వశాస్త్రంలో పరిస్థితిని బట్టి కుమారిలుడు దీన్ని చాలా తీవ్రమైన పద్ధతిలోనే ఎదుర్కొన్నాడు యోగ విద్య ద్వారా అతీత జ్ఞానం కలగడమే బూటకమని అతను చెప్పిన ప్రధాన విషయం. అందువల్ల భావవాది దాని ఆధారంగా తన వాదనను నిరూపించుకోవాలని చూడటం నిరర్థకం.

## భ్రమ - వాస్తవం

కలలు, భ్రాంతులు వగైరాలలో కలిగే అనుభవం బూటకం గనుక బాహ్యావస్తువుల గురించి కలిగే జ్ఞానమంతా బూటకమని భావవాదులు చేసే ప్రధాన వాదన తప్పని స్పష్టంగా కనిపిస్తుంది ఈ వాదనకు ఎలాంటి భూమిక లేదు గనుక అది తప్పు అని గౌతముడు పరోక్షంగా వ్యాఖ్యానిస్తాడు. ఎలాంటి భూమిక లేదనడంలో గౌతముడి ఉద్దేశ్యమేమిటి? దీన్ని ఇలా అర్థం చేసుకోవాలని వాత్సాయనుడు వివరిస్తాడు 'మొదటి విషయం కలలోని

అనుభవం బూటకం గనుక సాధారణ అనుభవం కూడా వాస్తవమయ్యే అవకాశం లేదని చెప్పడం నిరాధారం. కలలోని అనుభవం ఖచ్చితంగా బూటకమే. కాని దాన్ని బూటకమని నిరూపించడానికి సాధారణ అనుభవంపైనే ఆధారపడవలసివుంటుంది ఈ అనుభవంతో ఇచ్చే తీర్పును వాస్తవంగా స్వీకరించాల్సివుంటుంది. ఎందుకంటే అది వాస్తవం కాకపోతే కలలోని అనుభవం వాస్తవం కాదని నిరూపించడం సాధ్యంకాదు. సాధారణ అనుభవం ఇచ్చే తీర్పు వాస్తవమైతే దానికి మూలమైన వస్తుజాలం కూడా వాస్తవమే అవుతుంది. బూటకపు అనుభవాలకు సంబంధించిన చెదురుమదురు ఉదాహరణలపై గాక భావావాది అన్ని అనుభవాలు బూటకమని నిరూపించడానికి ఏదైనా గట్టి ఆధారం చూపించి వుంటే అప్పుడు అతనికి బలం చేకూరేది. కాని అలాంటి ఆధారమేది లేదు గనుక అతడు చూపించలేడు. అందుకు భిన్నంగా భావవాద ప్రత్యర్థులకు తమ వాదాన్ని నిరూపించుకోవడానికి స్పష్టమైన ఆధారాలున్నాయి. అదే సాధారణమైన అనుభవం వాస్తవికత. కలలోని అనుభవాన్ని తిరస్కరించగలగడం ద్వారానే అది తన శక్తిని నిరూపించుకొన్నది.

అయితే అన్ని అనుభవాలు బూటకమని చెప్పే తన వాదనకు ఆధారం లేదంటే భావవాది అంగీకరించడు. అనుభవం ఉనికి అందుకు ఆధారమంటాడు. ఒక అనుభవం వుండటమే లేక ఒక జాగృత రూపం కలిగివుండటమే అన్ని అనుభవాల బూటకత్వాన్ని నిరూపిస్తుందంటాడు. కలలు, భ్రమలు వగైరాలను కేవలం ఇందుకు ఉదాహరణలుగా మాత్రమే చూపించినట్లు అతను పేర్కొంటాడు. అనుభవంలోకి వచ్చేది ఏదైనా సరే బూటకం. అన్ని అనుభవాలు అనుభవాలు గనుకే బూటకం అని సాధారణ సూత్రీకరణ చేస్తాడు.

ఇలాంటి సూత్రీకరణ అర్థం లేనిదని న్యాయవైశేషికులు పేర్కొంటారు ప్రపంచంలో ఎక్కడా సత్యమనేది లేదని అనుకుంటే అప్పుడు బూటకం అన్న మాటకు విలువే వుండదు. ఒక విషయం బూటకమా లేక బూటకపు అనుభవమా అని నిర్ధారించుకోవడానికి ఆధారం వుండదు ఒక అంశాన్ని నిర్ణయించడానికి ఏదో ఒక ప్రమాణం వుంది. కాబట్టి అది నిజమా బూటకమా అని చెప్పడం సాధ్యమవుతున్నది మరి ప్రపంచంలో ఏదీ సత్యం కాకపోతే? అన్ని రకాలైన జ్ఞానాలు బూటకమే అయితే అప్పుడు బూటకపు జ్ఞానం అన్న మాటే అర్థంలేనిదవుతుంది. పాము, తాడు గురించిన పరిజ్ఞానం కూడా బూటకమే. ఎందుకంటే తాడు తాడేనన్నది నిజమైన జ్ఞానం. అదే బూటకమైతే అప్పుడు తాడు పాము కాదని చెప్పే జ్ఞానం ఎలా కలుగుతుంది? కలల్లోని అనుభవం కూడా ఇలాంటిదే. అది బూటకమని తేలిపోయిన అనుభవం ఎందుకంటే అలాంటి నిర్ధారణకు రావడానికి తోడ్పడే జ్ఞానం వేరే వున్నది. అది సత్యంగా ఆమోదించబడినది అందువల్ల మనమిప్పటికే చూసినట్లుగా సాధారణ అనుభవంలోని సత్యాన్ని ఆమోదించకపోతే బూటకపు అనుభవాలు నిజంగా బూటకమని నిరూపించడం సాధ్యంకాదు. ఈ విషయాన్నే కుమారిలుడు చెప్పాడు దాన్ని అతడు న్యాయవైశేషికుల నుండి తీసుకొనివుండవచ్చు

ఇక రెండవ విషయం. భావవాదుల వాదనలకు ఎలాంటి ఆధారం లేదని గౌతముడు చేసిన వ్యాఖ్యానానికి మరో ముఖ్యమైన ప్రాధాన్యత వుందని వాత్స్యాయనుడు వివరిస్తాడు. కలల అనుభవం అనుభవంగా బూటకమనేది స్పష్టమే. అందులోని వస్తువులు పూర్తిగా అవాస్తవాలు, కల్పనలు. నిజమైన ప్రపంచంలో అవెక్కడా లేవు. వాస్తవానికి ఈ అంచనాతోనే భావవాది తన వాదన కోసం కలల అనుభవాన్ని అడ్డం వేసుకుంటున్నాడు. సాధారణ అనుభవం బూటకం అన్న అంచనా మాత్రమేగాక ఆ బూటకపు అనుభవానికి కారణమైన వస్తువు కూడా కల్పితమేనని అనుకోవడం ఈ వాదనకు మరో ప్రాతిపదిక. భావవాది చెప్పే ఈ రెండవ అంచనా మరీ ఆధారరహితమని వాత్స్యాయనుడు చెప్తాడు.

ఒక జ్ఞానం లేదా అనుభవం బూటకం లేక భ్రమ అని ఒప్పుకోవాలంటే దానికి ప్రామాణికమైన కొన్ని సూత్రాలు వుండాలి. తర్వాత దశలో గౌతముడు, వాత్స్యాయనుడు ఇందుకు 'ప్రధానం' అనే పదం ఉపయోగించారు. అంటే 'ప్రాథమిక' అని అర్థం. ఊహాజనితమైన జ్ఞానం ఆ విధంగా ప్రాథమిక జ్ఞానంపై ఆధారపడుతుంది. ఉదాహరణకు స్తంభం చూసి మనిషి అనుకోవడం. దీనికి సంబంధించిన జ్ఞానం తప్పనిసరిగా మరొక ప్రాథమిక జ్ఞానంపై ఆధారపడివుండాలి. ఏమిటా ప్రాథమిక జ్ఞానం? అది మనిషిని గురించి మనిషికి వుండే జ్ఞానం. అంతకుముందు ఎప్పుడు మనిషిని చూడని వారు మానవుడు ఎలా వుంటాడో తెలియనివారు స్తంభంలో మనిషిని ఎప్పుడూ ఊహించుకోలేరు. అతని దృశ్యేంద్రియాలు స్తంభానికి సంబంధించిన సార్వత్రిక లక్షణాలను తెలుసుకోగలుగుతాయి స్తంభానికి, మనిషికి మధ్య గల పోలికను గుర్తించడం వల్ల అతను మనిషిని గుర్తు తెచ్చుకుంటాడు. ఈ విధమైన పోలిక ఆ తర్వాత అతని తీర్పును దారితప్పిస్తుంది. స్తంభమే మనిషి అనుకుంటాడు. అయితే అతను అసలు మనిషిని గుర్తు పెట్టుకోవడం ఎలా సాధ్యమైంది? మనిషిని గురించి లోగడ అతనిలో నాటుకుపోయిన జ్ఞాపకాల ముద్ర వల్లనే. కనుక స్తంభంలో మనిషికి సంబంధించిన కాల్పనిక అనుభవం అంతిమంగా మనిషి గురించిన అవగాహనపైనే ఆధారపడి వుంటుంది. ఈ సందర్భంలో అదే ప్రాథమిక జ్ఞానం (ప్రధాన). అంతేగాక ప్రాథమిక జ్ఞానం సత్యమని అంగీకరించకపోయినట్లయితే బూటక జ్ఞానపు బూటకత్వాన్ని గుర్తించడం, అర్థం చేసుకోవడం సాధ్యంకాదు. అంతిమంగా విశ్లేషించాలంటే బూటకపు జ్ఞానం వాస్తవ జ్ఞానంపై ఆధారపడివుంటుందని చెప్పాలి. అయితే పూర్తి అసత్యమైన, కల్పితమైన దాన్ని గురించి నిజమైన జ్ఞానం అంటూ మాట్లాడటంలో అర్థం ఏమైనా వుందా? లేదనేది స్పష్టం. నిజంగా ఉనికిలో వున్న వస్తువులను గుర్తించినప్పుడే నిజమైన జ్ఞానం అన్నమాటకు అర్థం కలుగుతుంది. ఈ కోణం నుండి చూసినప్పుడు బూటకపు జ్ఞానం వుండటమే ప్రపంచంలో నిజమైన వస్తువులను నిజమైన ఉనికిని నిర్ధారిస్తుంది స్వప్నజ్ఞానం బూటకజ్ఞానంగా తేలిపోయింది గనుక అది కూడా ఇందుకు మినహాయింపు కాజాలదు కలలో చూసే ఏనుగులు కాని, పర్వతాలు కాని అంతిమంగా వాటి గురించిన ప్రాథమిక జ్ఞానంపైన అంటే వాటి వాస్తవికతకు సంబంధించిన నిజమైన జ్ఞానం ఆధారపడివున్నాయి -

# భ్రమ పూర్తిగా భ్రమేనా?

ఇప్పటివరకు జరిగిన చర్చను క్రోడీకరించాలంటే వాస్తవం లేకుండా భ్రమపడటం జరగదు భ్రమాజనితమైన అనుభవాలు భౌతికప్రపంచ కాల్పనికతకు నిదర్శనాలు కావు నిజానికి భౌతిక ప్రపంచ వాస్తవికతను అంగీకరించకపోతే వాటికి అర్థమే వుండదు

అయినప్పటికీ భ్రమ అంటూ ఒకటి వున్నది దీని గురించి సైద్ధాంతిక పరిశోధన చేయడం అవసరం

మొదటి ప్రశ్న- భ్రమ అంటే ఏమిటి? లేక భ్రమ అన్నది ఎంతవరకు భ్రమ లేక నిజంగా దానిలో భ్రమ ఎంత? అది పూర్తిగా విభ్రమేనా? అది భావవాదులు చెప్పే మాట కాని భ్రమ స్వభావాన్ని గురించి లోతైన అవగాహన లేనందువల్లే వారలా చెప్తారని గౌతముడు, వాత్స్యాయనుడు పేర్కొన్నారు భావవాదులు మనకు చెప్తున్నట్లు భ్రమలకు సంబంధించిన అతి బలమైన ఉదాహరణలుకూడా పూర్తిగా, అచ్చంగా భ్రమలుకావు ఈ విషయంలో వారు చేసిన వాదనలను తర్వాతి వారి అనుయాయులు కొనసాగించారు

చర్చ సౌలభ్యంకోసం వాత్స్యాయనుడు భ్రమకు సంబంధించిన మూడు సాధారణ ఉదాహరణలు తీసుకున్నాడు. అవేమంటే స్తంభంలో మనిషిని చూడటం, దూరంగావున్న జెండాలో పక్షుల సమూహాన్ని చూడటం, నల్లటి మట్టి ముద్దలో పావురాన్ని చూడటం ఈ ఉదాహరణలన్నింటిని విడివిడిగా చూసినట్లయితే భ్రమకు సంబంధించిన ఒక ప్రత్యేకమైన అంశం మనకు అందకుండా పోతుంది వీటన్నింటినీ కలిపి చూస్తేనే అన్ని భ్రమలలో సమానంగా వుండే ఒక ఉమ్మడి అంశం మన కళ్ళముందు ఆవిష్కృతమౌతుంది మీకు స్తంభంలో మాత్రమే మనిషి ఉన్నట్లు కనిపిస్తాడు జెండాలో మాత్రమే పక్షుల సమూహం, మట్టిలో మాత్రమే పావురం కనిపిస్తాయి స్తంభంలోకాని, మట్టిలో కాని పక్షుల సమూహం కనిపించదు. అలాగే జెండాలో లేక స్తంభంలో పావురం కనిపించదు ఇలాంటి ఉదాహరణలు ఇంకా ఎన్నైనా వుండవచ్చు తాడులో మాత్రమే మీకు పాము కనిపిస్తుంది తప్ప మెరిసే శంఖంలో కాదు మెరిసే శంఖం మాత్రమే మీకు వెండిలా కనిపిస్తుంది తప్ప తాడు కాదు

అందువల్ల ఈ సాధారణ భ్రమలలో ఒక క్రమబద్ధత, ఒక ఎంపిక ఉన్నాయి దీన్ని దృష్టిలోకి తీసుకోవాలి అతి సాధారణ భ్రమలలోకూడా వస్తుగతమైన వత్తిడి ఉన్నదనే అవగాహనద్వారా మాత్రమే దీన్ని వర్ణించగలము ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకేవిధమైన భ్రమ కలగడానికి స్వేచ్ఛ వుండదు మీ మెదడులో లేని, మీ చైతన్యంలో లేని మీ భ్రమ స్వభావాన్ని వస్తుగతమైన ప్రభావం నిర్ణయిస్తుంది స్తంభం మీకు మనిషిలా భ్రాంతి కలిగిస్తుంది నిర్దిష్టంగా అది అలాగేవుంటుంది జెండా పక్షిలాగా మాత్రమే భ్రమ కలిగిస్తుంది మట్టిముద్ద పావురంలా మాత్రమే కనిపిస్తుంది మీరిలా భ్రమపడి తీరాలని

నిబంధన ఏమీలేదు సాధారణ పరిస్థితుల్లో మీరు స్తంభాన్ని స్తంభంగానూ, జెండాను జెండాగానూ మాత్రమే చూస్తారు ఇవి సరైన జ్ఞానానికి ఫలితాలు తప్ప భ్రమలుకావు ఏమైనా మీరు భ్రమపడినప్పుడు మాత్రం వస్తుగతమైన ప్రభావంనుండి బయటపడలేరు మీ చైతన్యానికి వెలుపలవున్నదేదో మీ చైతన్యాన్ని నిర్దేశిస్తుంది ఈ వస్తుగతమైన వత్తిడిని గమనంలోకి తీసుకోకపోతే భ్రమ అన్నదాన్ని వర్ణించడం సాధ్యంకాదు

మరి భ్రమను గురించిన వస్తుగతమైన వత్తిడిని మనమెలా అర్థం చేసుకోవాలి? భావవాదుల ఆలోచనల ప్రకారం దీనికి సరైన వివరణ ఏదీ లభించదు ఆ సిద్ధాంతం ప్రకారం వాస్తవ ప్రపంచమే లేదు నిజమైన పాదార్థిక ప్రపంచానికి సంబంధించిన విషయాలన్నీ కల్పితమైనవి లేక భ్రమలు మాత్రమే స్తంభం, జెండా, మట్టి వగైరాలన్నీ అవాస్తవాలు, భ్రమలు అయితే ఎక్కడైనా దేనిగురించైనా భ్రమలు కలగాల్సివుంటుంది కాని ఏ భ్రమ కూడా ఇష్టానుసారం కలగదు భ్రమలపైన ప్రకృతికి స్పష్టమైన అదుపు ఉంటుంది ఆ అదుపు భ్రమకు అతీతమైంది

స్తంభంలో మనిషి కనిపించడానికి సంబంధించిన ఉదాహరణలు తీసుకుంటే అందులో ఒక అంశానికి మాత్రం భ్రమతో నిమిత్తంలేదు. అదే స్తంభం ఉనికి స్తంభం స్తంభం అని తెలిస్తే అది సరైన జ్ఞానమౌతుంది అందుకు బదులు దాన్ని మనిషి అనుకుంటే అది భ్రమాజనిత జ్ఞానం అవుతుంది కాని ఆ భ్రమ కూడా శూన్యంనుండి పుట్టిన శూన్యంకాదు దానికి ఒక స్పష్టమైన పాదార్థిక ప్రాతిపదిక అంటేస్తంభం ఉనికి ఉంది అలాంటి ప్రత్యేకమైన ప్రాతిపదిక ఏమీ లేకపోతే నిర్దిష్టమైన భ్రమకూడా వుండదు

ఒక నిర్దిష్టమైన ప్రాతిపదిక నిర్దిష్టమైన భ్రమకు దారితీయడం ఎలా జరుగుతుంది? స్తంభం చూసినప్పుడు మాత్రమే మనిషిని గురించిన భ్రమ ఎలా కలుగుతుంది? దీనికి వాత్స్యాయనుడు ఇచ్చే సమాధానం ఏమంటే స్తంభానికి, మనిషికి మధ్య వుండే పోలికే కారణం సాధారణ పోలికలకు సంబంధించిన ఈ సూత్రం సామాన్యమైన భ్రమలన్నింటికీ వర్తిస్తుంది జెండాలో పక్షులు కనిపించినా, తాడులో పాము కనిపించినా అలాంటి పోలికలుండటమే అందుకు కారణం నిజంగా కనిపిస్తున్న దానికి పొరపాటుగా ఊహించుకుంటున్నదానికీ మధ్యన వుండే సాధారణమైన పోలికే ఇందుకు కారణమౌతున్నది రెండు విషయాల మధ్య ఇటువంటి సాధారణమైన పోలిక ఉన్నప్పుడే ఎవరైనా దారితప్పుతారు తన ముందున్నదానిలో ఎక్కడో వున్నదాన్ని చూస్తున్నట్లు భ్రమించడం జరుగుతుంది వాత్స్యాయనుడు చెప్పిన ఈ విషయం భ్రమ స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో చాలా కీలకపాత్ర వహిస్తుంది ఆ తర్వాతికాలంలో అతని అనుయాయులైనవారు ఈ విషయాన్ని మరింత విశదంగా వాదించారు సాధారణమైన భ్రమలకు సంబంధించిన ఉదాహరణలవరకే చూసినా అవి కేవలం భ్రమలు కాదని దీన్నిబట్టి రుజువవుతుంది నిజంగా ఉన్నదానికీ, ఊహించుకుంటున్నదానికీ మధ్య పోలికలు లేకపోతే భ్రమలకు ఆస్కారమే వుండదు భారతీయ పరిభాషలో భ్రమకు సంబంధించిన ఈ అంశాన్ని తత్వ లేక ధర్మి అని పిలుస్తారు భ్రమల సాధారణ రూపాలు అలాంటి అంశం పైన తప్పనిసరిగా ఆధారపడతాయి గనుక

ఈ అంశాలు నిజమైన జ్ఞానానికి సూచనలు కనుక సాధారణ భ్రమల్లో కూడా కొంత వాస్తవం వుంటుందని అంగీకరించాలి

భ్రమాపూరితమైన అనుభవాన్ని చక్కదిద్దే అనుభవం స్వభావంకూడా దీన్ని బలపరచేదిగా వుంటుంది స్తంభాన్ని చూసి మనిషి అనుకున్నప్పుడు భ్రమాజనితమైన అనుభవం ఇది మనిషి అని చెప్తుంది నిజమైన జ్ఞానం స్వభావం దాన్ని త్రోసిపుచ్చి ఇది స్తంభం అని సరిచేస్తుంది నిజంగా అక్కడ ఉన్నదానికి సంబంధించిన జ్ఞానం ఈ దిద్దుబాటువల్ల ఏమీ మారదు నిజంగా ఈ దిద్దుబాటువల్ల జరిగేదేమంటే మనిషి ఉన్నాడనుకున్న అనుభవం తిరస్కరించబడి స్తంభం ఉన్నదన్న అనుభవం ఆ స్థానాన్ని ఆక్రమిస్తుంది క్లుప్తంగా చెప్పాలంటే భ్రమాపూరిత అనుభవంలో వస్తువు ఏమిటన్న భాగం మాత్రమే చక్కదిద్దబడింది ఈ వస్తువు ఫలానా అని చెప్పేందుకుగల ప్రాతిపదికకు మాత్రం ఈ భ్రమాపూరితమైన అనుభవంవల్ల ఏవిధంగానూ భంగం కలగదు

సామాన్యమైన భ్రమలకు సంబంధించిన ఉదాహరణలన్నీ ఇలాగే వుంటాయి. ఇది పాము అన్న భ్రమాపూరితమైన అనుభవం ఆ తర్వాత ఇది తాడు అన్న అనుభవంచే తిరస్కరించబడుతుంది తాడు స్థానాన్ని పాము ఆక్రమిస్తుంది అయితే తాడుకు సంబంధించి గమనించిన కొన్ని సాధారణ లక్షణాలు అలాగే వుండిపోతాయి ఇదివరకు కలిగిన భ్రమాపూరిత అనుభవంలో దీనికి సంబంధించి గుర్తించబడిన వాస్తవ అనుభవ భావాలు నిజమైన జ్ఞానంగానే వుండిపోతాయి అవిధంగా క్లుప్తంగా చెప్పాలంటే సాధారణ భ్రమల్లో కొంత వాస్తవాంశ ఉంటుంది అదే ఉన్న వస్తువుకు సంబంధించిన సాధారణ లక్షణాల నిజమైన అనుభవం

భ్రమే పూర్తిగా భ్రమ కానప్పుడు ఆ ప్రాతిపదికన భావవాదులు పాదార్థిక ప్రపంచ భ్రమాపూరిత స్వభావాన్ని ఎలా నిరూపించగలరు?

## భ్రమ-భారతీయ సిద్ధాంతాలు

భారతీయ భావవాదులు తమ వాదనను ప్రధానంగా భ్రమపై ఆధారపడి నిరూపించాలని ప్రయత్నించారు అందువల్లనే తమ ప్రధాన వాదనను సమర్థించుకుంటూ సిద్ధాంతాలు రూపొందించారు భారతీయ భావవాదంలోని మూడు ప్రధాన తరహాలైన శూన్యవాదం, విజ్ఞానవాదం, అద్వైత వేదాంతం భ్రమకు సంబంధించి వేర్వేరు సిద్ధాంతాలు రూపొందించుకున్నాయి వాటిని *అసత్‌ఖ్యాతి, ఆత్మఖ్యాతి, అనిర్వచనీయ ఖ్యాతి* అంటారు

భావవాద ప్రతిసిద్ధాంత ప్రతినిధులైన వారు భ్రమనుగురించి రూపొందించిన ఈ సిద్ధాంతాలు భావవాదాన్నే త్రోసిపుచ్చేవిగా ఉన్నాయి భారతీయ తాత్విక కృషిలోని పరిణిత దశలో ముందుకొచ్చిన అలాంటి రెండు సిద్ధాంతాలు ప్రత్యేకంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి అవే *అన్యథా ఖ్యాతి (లేక విపరీత ఖ్యాతి), అఖ్యాతి* మొదటిదాన్ని న్యాయ వైశేషికులు, కుమారిలుడు బలపరిచారు కాని మీమాంస సిద్ధాంతంలో మరో

ప్రముఖుడైన ప్రభాకరుడు ఈ సిద్ధాంతాన్ని తిరస్కరించి అఖ్యాతి అన్న తనస్వీయ సిద్ధాంతాన్ని రూపొందించుకున్నాడు

భ్రమకు సంబంధించిన ఈ సిద్ధాంతాలు భావవాదులవైనప్పటికీ, భౌతికవాదులవైనప్పటికీ వాటి ప్రధాన లక్ష్యం భ్రమాపూరిత అనుభవానికి కారణమైన వస్తువు నిజ స్థితిని నిర్వచించడమే

## పదార్థ దృక్పథ సమర్థన

బాహ్య వస్తువును తిరస్కరించడం రెండురకాల వాదనలపై ఆధారపడి వుందని కుమారిలుడు చెప్తాడు వీటిలో ఒకటి పూర్తిగా తాత్వికమైనది కుమారిలుడు చెప్పే ప్రకారం అది జ్ఞానానికిగల ఆధారాలను పరిశీలించడంపై ఆధారపడి వుంటుంది మరొకటి వస్తుగతమైనది లేక కుమారిలుడి భాషలో వస్తువు స్వభావాన్ని పరిశీలించడానికి సంబంధించింది ఇప్పటివరకు మనం ఈ రెండురకాల వాదనలలో మొదటిదాన్ని పరిశీలించాము ఇప్పుడురెండవ భాగాన్ని క్లుప్తంగా తెలుసుకోవచ్చు భావవాద ప్రత్యర్థులు దానికి ఎలాంటి సమాధానం ఇచ్చారో చూడవచ్చు

భావవాదానికి ఆధారంగా దిజ్ఞాగుడు "ఆలంబన పరీక్ష" అన్న గ్రంథం వ్రాశాడు దాని ప్రధాన ఇతివృత్తం జ్ఞానానికిగల మూలాధారాలతో అణువాదాన్ని ఖండించడం బాహ్యవస్తువులు ఉన్నాయనే అనుకున్నప్పటికీ వాటిని అణువులుగా గానీ, లేక అణుసముదాయాలుగా మాత్రమే అర్థం చేసుకోవాలని అతను అంటాడు కాని ఈ రెండు వాదనల్లో ఏవీ తర్కానికి నిలిచేవికావు అణువులను ఎప్పుడూ నిరూపించడం కష్టం అది కేవలం కల్పన మాత్రమే గగనకుసుమం వంటిదే అణువులమొత్తం లేక మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే మొత్తం అణువులతో చేయబడినప్పటికీ అణువులకు లేని ఒక ప్రత్యేక ఉనికి దానికి ఏర్పడుతుంది అనడం కూడా కల్పన మాత్రమే వైశేషికులకు ఇద్దరు చంద్రులని దిగ్నాగుడు ఎగతాళి చేస్తాడు అంటే ఇది భారతీయ తత్వశాస్త్రంలో తరచూ ప్రస్తావించబడే ఒక భ్రమాపూరితమైన వస్తువే ఆ విధంగా బాహ్య వస్తువులు ఏ అర్థంలో చూసినా వాస్తవంగా వుండేవికావు మరైతే అవేమిటి? దిగ్నాగుడి అభిప్రాయం ప్రకారం అవి భావాలు మాత్రమే క్లుప్తంగా చెప్పాలంటే భావాలు మాత్రమే నిజమైనవి వాటికి సంబంధించి ఉన్నట్లు చెప్పబడే బాహ్యవస్తువులకు వాస్తవ ఉనికిలేదు

దిగ్నాగుడి ఈ గ్రంథం చాలా చిన్నదైనప్పటికీ భారతీయ తాత్విక సాంప్రదాయంలో దానిపట్ల ప్రత్యేకమైన ఆసక్తి వున్నది భారతీయ భావవాదులు మరీముఖ్యంగా పరిణత దశకు చెందినవారు తమ వైఖరి నిరూపించుకోవడానికి చేసిన ప్రయత్నం దానిలో కనిపిస్తుంది ప్రత్యక్షపరీక్షద్వారా తమ వైఖరిని నిరూపించుకోవడానికి పదార్థమనే దృక్పథాన్ని నిర్మూలించడం ఇందులోని ప్రాథమిక ఎత్తుగడ పదార్థ స్వభావానికి సంబంధించి భారతీయ తత్వశాస్త్ర

చరిత్రలో మనకు మూడు ప్రధాన సిద్ధాంతాలు కనిపిస్తాయి అవే భూతవాదం, ప్రధానవాదం, అణువాదం ఏమైనా క్రీ శ 5వ శతాబ్ది తర్వాత చెప్పుకోదగిన తత్వవేత్త ఎవరూ మొదటి రెండు సిద్ధాంతాలను సమర్థించలేదు అణువాదాన్ని మాత్రం చాలామంది సమర్థించారు అందువల్లనే పరిణిత దశలో భారతీయ భావవాదులు అణు సిద్ధాంతాన్ని నిర్మూలించడంపై కేంద్రీకరించారు

అణువాదాన్ని తిరస్కరించాలనే ఉత్సాహం నాగార్జునుడి కాలంలోనే ఉన్నప్పటికీ తర్వాతికాలంలో దానికి మరింత ప్రాధాన్యత లభించింది ప్రత్యేకించి ఇందుకోసం ఒక పుస్తకమే రాయడం అవసరమని దిజ్ఞాగుడు భావించాడు అప్పటికే అణువాదానికి వ్యతిరేకంగా వసుబంధుడు ముందుకు తెచ్చిన ప్రాధమిక వాదనలను అతడు కొనసాగించాడు ఆ వాదనలను మరింత విస్తృత పరచాడు దిగ్నాగుడి తర్వాత అణువాదానికి వ్యతిరేకమైన వాదనలను శాంతరక్షితుడు, కమలశీలుడు మరికొందరు విస్తృతపరిచారు ఇందుకోసం వారు చాలా పాండిత్యం ప్రదర్శించారు ఆవిధంగా భారతీయ తత్వశాస్త్రంలో అణువాదాన్ని త్రోసిపుచ్చేందుకోసం విస్తారమైన సారస్వతం సృష్టించబడింది

ఏమైనప్పటికీ అణువాద ఖండనలో ప్రధానమైన ఉద్దేశం భావవాద తాత్వికతను సమర్థించుకోవడం అందువల్ల భావవాదాన్ని ఖండించేందుకు అణువాదాన్ని సమర్థించవలసిన అవసరం కూడా ఏర్పడింది ఈవిధంగా సమర్థించే సందర్భంలో శుభగుప్తుడు, అకళంకుడు, కుమారిలుడు తదితర తత్వవేత్తలనేకులు ఎంతో ఆసక్తి ప్రదర్శించారు సహజంగానే వారిలో న్యాయ వైశేషికులు అత్యధిక శ్రద్ధ ప్రదర్శించారు వారి తాత్విక చింతనలో అతి ప్రధానమైన భాగం అణువాదమే

అనుకూల, ప్రతికూల వాదనలతో సహా భారతీయ అణువాదాన్ని పరిశీలించడం ఒక ప్రత్యేక అధ్యయనం వంటిది అందువల్ల ఇక్కడ కొన్ని ముఖ్యాంశాలను మాత్రమే పరిశీలించడం సాధ్యం ఇందుకోసం ప్రధానంగా న్యాయవైశేషికుల వాదనలకే పరిమితమౌదాము

పాదార్థిక ప్రపంచ అవాస్తవికతను నిరూపించేందుకోసం భారతీయ భావవాదులు చేసే ప్రధాన వాదనలు ఇదివరకే గమనించాం పాదార్థిక ప్రపంచంలో ఉన్నట్లుగా చెప్పబడే వస్తువులు నిజంగా లేవు ఎందుకంటే అవి జ్ఞాన పరీక్షను నిలబడలేవు ఆవిధంగా ఉదాహరణలు తీసుకుంటే పాదార్థిక ప్రపంచంలో నిజంగా గుడ్డ ఉన్నట్లు కనిపిస్తుంది కాని లోతుగా పరిశీలిస్తే అవి వేర్వేరు దారాల పోగులు మాత్రమేనని నిజంగా గుడ్డ అనేది లేదని తేలిపోతుంది ఈ దారపు పోగులు కూడా నిజమైనవేనని చెప్పడానికి లేదు ఎందుకంటే మరింతగా విభజిస్తే ఈ పోగులు కూడా చివరకు మిగలవు వాటిలోని భాగాలు మాత్రమే వుంటాయి ఈ భాగాలను మరిన్ని భాగాలుగా విభజిస్తూ పోతే ఒక బిందువు దగ్గిర మరేమీ మిగలని పరిస్థితి ఏర్పడుతుంది అని భావవాది వాదిస్తాడు ఆవిధంగా మొదట్లో వున్న

వస్తువు చివరకు శూన్యంగా మిగిలిపోతుంది

ఈ తరహా వాదనలో రెండురకాల సమస్యలు ఉన్నాయి

మొదటిది - భాగాలకు, *(అవయవ)* మొత్తానికి *(అవయవి)* సంబంధించినది మరో విధంగా చెప్పాలంటే వస్త్రం (అవయవి) దారాలతో (అవయవ) తయారైనప్పటికీ దానికి వాటిని మించి తనదైన ప్రత్యేక ప్రతిపత్తి *(ద్రవ్యాంతర)* కలిగి ఉన్నదా?

రెండవది - ఒక భౌతిక వస్తువు విభాజ్యతకు సంబంధించినది. వస్తువును భాగాలుగా, భాగాలను ఉపభాగాలుగా విభజిస్తూ పోవడం చివరకు శూన్యానికి దారితీస్తుందా?

న్యాయవైశేషికుల దృష్టిలో ఈరెండు సమస్యలు పరస్పర సంబంధం గలవైనప్పటికీ మనం రెండవదాన్ని మాత్రమే పరిశీలిద్దాం. అది మనను నేరుగా అణువాద ఆధారాలదగ్గిరకు తీసుకువెళ్ళగలుగుతుంది [1]

భౌతిక వస్తువులని భాగాలుగా విభజించవచ్చునని ఈ భాగాలను మరిన్ని ఉపభాగాలుగా చేయవచ్చునని చెప్పడం న్యాయ వైశేషికుల దృష్టిలో తిరుగులేని అనుభవ సత్యం అయితే ఈ విభజనకు హద్దులు ఏమిటన్నది తార్కిక ప్రశ్న ఈ విభజన ప్రక్రియను ఎంతవరకు కొనసాగనివ్వవచ్చు? ఈ ప్రశ్నకు-మూడురకాలుగా జవాబు చెప్పవచ్చు

మొదటిది వస్తువును చిన్నవైన, మరింత చిన్నవైన భాగాలుగా విభజించడం తార్కికంగా చెప్పాలంటే ఒక అంతులేని ప్రక్రియ ఈ విభజనను నిరంతరాయంగా, నిరవధికంగా కొనసాగించవచ్చు తర్కపరంగా చెప్పాలంటే దాన్ని ఏ ఒక్క బిందువుదగ్గిరా ఆపవలసిన అవసరమే లేదు

రెండవది- విభజన ప్రక్రియకు ఒక తార్కిక పరిమితి ఉందనడం నిస్సందేహం అదే శూన్యత వస్తువును భాగాలుగా, వాటిని ఉపభాగాలుగా విభజించే యోచన చేయవచ్చు చివరకు విభజించేందుకు ఏమీ మిగలనంతవరకూ ఈ పనిచేయవచ్చు ఆవిధంగా శూన్యతకు చేరుకున్నప్పుడు విభజనక్రమం ఆగిపోతుంది ఇది వాస్తవానికి కొంతమంది భావవాదుల వైఖరి వస్తువుల విభజన ప్రక్రియ చివరకు శూన్యతకు దారితీస్తుంది కనుక మీరు శూన్యత అన్నదే వస్తువుయొక్క అంతిమ స్థితికి సూచన అని అంగీకరించకతప్పదని- మరో మాటలో చెప్పాలంటే వస్తువులకు తమదైన వాస్తవికత ఏమీ లేదని భావవాదులంటారు

మూడవది-విభజన క్రమానికి ఒక ఖచ్చితమైన హద్దు వుంటుంది అయితే అది పై వాదనలో వంటిది కాదు అతి సూక్ష్మమైన శకలాలుగా విడిపోయిన తర్వాత విభజనక్రియ సహజంగానే ఆగిపోతుంది ఈ శకలాలలో వేరే విడిభాగాలు లేవని భావించాల్సివుంటుంది విభజన అంటే ఒక వస్తువును భాగాలుగా విడగొట్టడం తప్ప

---

1 తారకవాగేశ

మరేమీ కాదుకనుక ఈ అవిభాజ్యమైన అంతిమ శకలాలను ఇంకేమాత్రం విభజంచడం సాధ్యంకాదు

ఇలాంటి అంతిమ శకలాలే న్యాయ వైశేషికులు చెప్పిన అణువులు. తమ వాస్తవికతకు మద్దతుగా వారు భౌతికవస్తువు విభాజ్యతకు సంబంధించిన మొదటి రెండు సిద్ధాంతాలు తర్క రీత్యా చెల్లుబాటుకావని నిరూపించారు

విభజన క్రమం అనంతం అన్నది మొదటి విషయం ఇది అత్యంత విడ్డూరమని న్యాయ వైశేషికులు అంటారు ఎందుకంటే స్పష్టంగా కనిపించే వాస్తవాలకు అది భిన్నంగా వున్నది పర్వతాలు ఒక విత్తనంకన్నా చాలా పెద్దవని, కుండ దానిలోని మట్టిరేణువులకన్నా పెద్దదని చెప్పడంలో భిన్నాభిప్రాయాలేమీ వుండవు అయితే భౌతికవస్తువుల అనంతమైన విభాజ్యత అన్న సూత్రం ఆధారంగా చూసినప్పుడు ఈ వాస్తవాలు నిజాలు కానేరవు ఈ సూత్రీకరణ ప్రకారం ఒక పర్వతాన్ని లెక్కలేనన్ని భాగాలుగా విభజించవచ్చు అంటే అది అంతిమంగా అనేక భాగాలతో కలసి రూపొందిందన్నమాట అలాగే విత్తనంకూడా కనుక పర్వతం విత్తనంకూడా లెక్కలేనన్ని భాగాలతో కలసి ఏర్పడినప్పుడు వాటిని సమానమైన పరిధిగలవిగా పరిగణించాల్సి వుంటుంది అంతేగాక పరిధి అన్నది కొలవడానికి వీల్లేనిదిగా (అమేయం) భావించాల్సి వుంటుంది ఎందుకంటే అసంఖ్యాకమైన భాగాలతో కూడిన వస్తువుకు ఒక హద్దు లేదా పరిమిత పరిధి వుండదు అదేవిధంగా వస్తువుల అనంత అవిభాజ్యత అన్న ఆలోచన ప్రకారం మొత్తం వస్తువును దానిలోని భాగాలతో సమానంగా పరిగణించాల్సివుంటుంది అంటే కుండను దానిలోని రేణువులతో సమానంగా చూడాలన్నమాట మళ్ళీ రేణువులు కూడా కుండలాగే అసంఖ్యాకమైన భాగాలతో తయారయ్యాయి అలాంటప్పుడే ఎవరైనా సరే వస్తువు దానిలోని భాగాలకన్నా పెద్దదని ఎలా చెప్పగలుగుతారు వాస్తవానికి అనంతమైన విభాజ్యతా సూత్రం ఆధారంగా చూస్తే మొత్తాలు మాత్రమే ఉంటాయి తప్ప భాగాలు వుండవు భాగాలు అనేవి అవెంత చిన్నవైనా సరే సాపేక్షమే వాటిని మరింతగా విభజంచడానికి అవకాశముంటుంది అవి తిరిగి మొత్తాలుగా రూపొందగలుగుతాయి అంతులేని పరిధి ఏర్పర్చుకోగలుగుతాయి ఇదంతా ఊహకందని విషయమన్నది స్పష్టమే ఈ విడ్డూరాన్ని ఒక సూటి ప్రశ్నతో తేల్చివేయవచ్చు. భాగాలు విశాలమైన పరిధితో కూడివున్నాయా? ఈ పరిధి మొత్తంతో సమానంగా ఉన్నదా లేక అసమానంగా ఉన్నదా? భాగాలకు విశాల పరిధి లేకపోతే అవి అణువులవుతాయి భాగాలు, మొత్తం ఒకే పరిధి కలిగివున్నట్లయితే అప్పుడు భాగాలకు మొత్తానికి మధ్యగల సంబంధం ఊహించడం కష్టం వాటి పరిధి సమానం కాకపోతే అణు సిద్ధాంతం ద్వారానే అసమానత అన్న వివరణ సాధ్యమౌతుంది అణువుల సంఖ్యలో అసమానతే పరిధిలో అసమానతకు కారణమని చెప్పడానికి వీలు కలుగుతుంది [1] న్యాయ వైశేషికులు పై

1 ఎస్ బహుదూరి స్టడీస్ ఇన్ న్యాయ వైశేషిక మెటాఫిజిక్స్

వాదనల్లో మొదటిదాన్ని అంటే ఒక భౌతిక వస్తువు విభాజ్యతకు అంతులేదని చెప్పేదాన్ని తిరస్కరించేందుకు అనుసరించిన పద్ధతి అది ఖచ్చితంగా కానవచ్చే వాస్తవాల ఆధారంగా అనేక విడ్డూరపు వాదనలను త్రోసిపుచ్చడం కోసం ఒక వస్తువుయొక్క విభాజ్యతకు ఏదో ఒక పరిణితి వుండి వుండాలి న్యాయ వైశేషికుల పరిభాషలో అదే అంతిమ విశ్రాంతి బిందువు (విశ్రామ)

మరైతే ఈ సరిహద్దు ఖచ్చితంగా ఏది? అది శూన్యమా? ఒక వస్తువును భాగాలుగా, వాటిని మరిన్ని భాగాలుగా విభజించే ప్రక్రియ చివరకు ఏమీ మిగలదని చెప్పడంతో ముగిసిపోతుందా? అందువల్ల ఆ తర్వాత కూడా విభజన అన్నమాట అర్థరహితమౌతుందా? మనం ఇప్పటికే చూసినట్లుగా కొంతమంది భారతీయ భావవాదులు ఇటువంటి వాదనను తీసుకువచ్చారు వారు భౌతికవస్తువులు చివరకు శూన్యంతో చేయబడ్డాయని సూత్రీకరించారు అయితే ఇది వారి వైఖరిలోని విడ్డూరతకు ప్రతిబింబమని న్యాయవైశేషికులు చెప్పారు ఒక వస్తువును విభజించే ప్రక్రియ చివరకు శూన్యంలో ముగుస్తుందని భావించితే మొదట్లో ప్రారంభమైన వస్తువు కూడా శూన్యమే కావాలి ఎందుకంటే దాని అంతరంగిక నిర్మాణాన్ని పరిశీలించేందుకు జరిగే ప్రయత్నం చివరికి అక్కడికే దారితీస్తుంది ఒక మట్టి కూజాను విభజించే ప్రక్రియ దాని లోలోతుల్లోకి చివరకు శూన్యంలోకి తీసుకువెళ్ళేటట్లయితే అప్పుడు అసలు ఆ కూజాయే శూన్యమని, ఉనికిలో లేనిదని, అవాస్తవమని భావించాల్సివుంటుంది అదే నిజమైతే కూజాను ముక్కలుగా చేయడం అనడంలో అర్థమేమైనా వుంటుందా? అసలు ఉనికిలో లేనిదాన్ని విభజించడం ఎలా సాధ్యమౌతుంది? అందువల్ల లేనివస్తువు విభజనగురించి మాట్లాడటమంటే అది శూన్యంలో రంధ్రం చేయడంలాంటిదే క్లుప్తంగా చెప్పాలంటే విభజన జరగాలన్నప్పుడు ఒక వస్తువు ఉనికిలో వుండాలి అందువల్ల వస్తువు విభజన శూన్యతకు దారితీస్తుందనే వాదనను బుట్టదాఖలా చేయాలి ఎందుకంటే అది విభజన అన్న ప్రక్రియనే అర్థరహితంగా మారుస్తున్నది

ఆవిధంగా భౌతికవస్తువుల అనంత విభాజ్యత, అంతిమ శూన్యత అనిచెప్పే అవకాశాలను త్రోసిపుచ్చిన తర్వాత భావవాదులకు ఒకే ఒక మార్గం మిగులుతుందని న్యాయవైశేషికులు చెప్పారు అదేమంటే వస్తువులో ఇమిడివున్న సూక్ష్మ భాగాలు ఒక నిర్ణీత సంఖ్యలో లభ్యం కావడంతో విభజన ప్రక్రియ అన్నది పూర్తవుతుంది అలాంటి శకలాలు ఇంకేమాత్రం భాగాలుగా విభజించే అవకాశం వుండదు కనుక వాటిని నాశము లేనివిగా పరిగణించాల్సివుంటుంది నాశనం అంటే ఒక దాన్ని ముక్కలు చేయడం తప్ప మరేమీకాదు ఒక కుండను పగలు గొడితే ముక్కలౌతుంది న్యాయ వైశేషికుల దృష్టిలో ఈ ముక్కలే అంతిమ భాగాలు అవే అణువులు

అయితే ఈ అణువులన్నవి సాధారణ ఇంద్రియాలకు గోచరమయ్యేవి కావు

గ్రంథాలయ
A No. 6.31

అంతమాత్రాన వాటి వునికిని నిరూపించలేమని అనుకోరాదు అణువుల ఉనికిని నిరూపించడానికి స్పష్టమైన ఆధారాలున్నాయని న్యాయ వైశేషికులు చెప్తారు

మట్టి ముద్దను పగలుగొట్టినప్పుడు అనేక ముక్కలౌతుంది అప్పుడు సూర్యకాంతిలో ధూళికణాలు కంటికి స్పష్టంగా కనపడతాయి ఆ ధూళికణాలు కంటికి కనిపిస్తున్నాయి కనుక భాగాలుగా పరిగణించవచ్చు కూజా వాటితో తయారైందని భావించవచ్చు- అదేవిధంగా కనిపించే ప్రతిదీ మరిన్ని భాగాలతో కూడివుంటుంది కనుక ఈ ధూళి కణంలో కూడా అనేక భాగాలుంటాయని అనుకోవాల్సివుంటుంది ఉదాహరణకు కుంద ఏమైనప్పటికీ ఈ ధూళి కణాలలోని భాగాలు సాధారణ దృష్టికి కనపడవుకనుక వాటిలో మరేమీ వుండవని అనుకోవాల్సివుంటుంది అవే అణువులు కనుక ఈ వాదనలో రెండు దశలున్నాయి

ఒకటి- కూజావలె గమనించదగినంత పరిధిగల ప్రతిదీ భాగాలతో కూడివున్నది. మట్టి ముద్దను పగలగొట్టడంద్వారా బయటపడే ధూళికణాలకు కనిపించేంత పరిధివున్నది కనుక దానిలో భాగాలున్నాయని చెప్పవచ్చు అయితే న్యాయవైశేషికుల దృష్టిలో ధూళికణంలోని భాగాలు కూడా భాగాలు కలిగివుంటాయని నిరూపించడానికి లేదు. వాటిలోని ఆ భాగాలు మరీ చిన్నవికనుక ప్రత్యక్షంగా గోచరించవు వాటి పరిధి చాలా స్వల్పంగావున్నది కనుక చిన్న భాగం మరింత చిన్నభాగాలతో కూడివుంటుందని దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాల్సివుంటుంది

రెండవది-ఒక వస్తువులో భాగాలలోకూడా మరిన్ని భాగాలు వుంటాయి ఇవన్నీ కలసి కూజా అవుతాయి ధూళికణంలోని భాగాలన్నీ కలసి ఆ కణం అవుతుంది ఈ భాగాలే మరిన్ని భాగాలుగా రూపొందుతాయి ఏమైనా ఇందులోని ఏ ఒక్క భాగం కూడా దానికదే గుర్తించదగ్గ పరిధి కలిగివుండదు అందువల్ల ధూళికణంలోని భాగాలు కూడా భాగాలతో తయారయ్యాయని వాదించడం అర్థం లేని విషయం ఒక భౌతిక వస్తువును భాగాలుగా చూసే విశ్లేషణ ఇంతటితో పూర్తి అవుతుంది (విశ్రామ) ఈ విశ్లేషణ ఏదో ఒక చోట ముగింపుకు రావాలని మొదటే చెప్పబడింది

దృష్టికి కనిపించే అతి చిన్న వస్తువు సూర్యకాంతిలో గోచరించే ధూళికణం అన్నది త్రాసరేణు లేక త్రయణువు అని పిలవబడింది దానిలో ద్వయనుకు లేక ద్యాద్ అనబడే భాగాలు మూడు ఉన్నాయన్న అభిప్రాయం వల్ల ఈ నామకరణం జరిగింది త్రసరేణు అన్నది గుర్తించదగిన అతి చిన్న భాగంకనుక దానిలోని ఉపభాగాలైన ద్రైదులు, ద్వాదులు కనిపించేవికావు తగినంత పరిమాణం ఉన్నదానిలో భాగాలు కనుక ప్రతి ద్వయనుకు లేక ద్యాద్ కూడా మరిన్ని భాగాలతో రూపొందిందని భావించబడింది ద్యాద్‌లో రెండు భాగాలు మాత్రమే వుంటాయి అవే పరమాణువులు క్రమక్రమంగా క్షీణించే పరిణామంలో ఇది ఆఖరిమెట్టు

తమ అణువాదానికి అనుగుణంగానే న్యాయ వైశేషికులు ఉత్పత్తిని కొన్ని భాగాల

సమ్మేళనంగా మాత్రమే చూసేశారు అలాగే వినాశము అన్నప్పుడు కూడా దానిలోని భాగాల వినాశంగా పరిగణించేవారు అణువులలో భాగాలు లేవు కనుక వాటిని నాశనం చేయడం కూడా సాధ్యంకాదని వారు భావించారు. మరో విధంగా చెప్పాలంటే అణువులన్నవి ఆద్యంత రహితాలు, శాశ్వతమైనవి

ఇక్కడ న్యాయ వైశేషికుల అణువాదంలోని వివరాలన్నింటిలోకి పోనవసరంలేదు మనం భారతీయ భావవాదులు దాన్ని ఏవిధంగా ఖండించడానికి ప్రయత్నించారో న్యాయ వైశేషికులు ఎలా ఎదుర్కొన్నారో చూస్తే సరిపోతుంది అప్పటికే తొలిదశ శూన్యవాద ప్రతినిధులైన కొందరు అణు సిద్ధాంతం శూన్యస్థలం లేక ఆకాశానికిగల సర్వాతీత శక్తి అన్న దృక్పథంతో పొసగదని వాదించినట్లు కనిపిస్తుంది న్యాయ వైశేషికులు కూడా ఆకాశం శూన్యతను ఆమోదించినవారే శూన్యం అన్నది సర్వశక్తివంతంగా వుండాలంటే అది అణువు లోపలా, బయటా కూడా వుండితీరాలి అయితే అలా అంగీకరించడం అణుసిద్ధాంతానికి అత్యంత ప్రమాదకరం అణువు అన్నది ఒక లోపలి భాగం, ఒక బయటి భాగం కలిగివుండదని, ఇవి రెండూ వేర్వేరని అంగీకరించినట్లవుతుంది ఒక అణువును లోపలి, వెలుపలి భాగాలుగా విభజించవచ్చునని ఒప్పుకున్నట్లవుతుంది అదే జరిగితే అణువు అవిభాజ్యం, శాశ్వతం అన్న వాదన కూలిపోతుంది అంతిమంగా అణువు అన్న భావన నిలబడదు ఇందుకు మరో ప్రత్యామ్నాయమేమంటే శూన్యం లేక ఆకాశం సర్వశక్తివంతమని ఒప్పుకోవటం అదికూడా న్యాయ వైశేషికులకు ప్రాణసంకటమే అందుకుగల కారణాలన్నీ మనమిక్కడ పేర్కొనలేము

అణువాదానికి వ్యతిరేకంగా ఇలాంటి అభ్యంతరాలు లేవనెత్తడం అసంబద్ధమని గౌతముడు వాదిస్తాడు సంక్లిష్ట స్వరూపాలకు వుండే ప్రత్యేక లక్షణాలన్నీ అణువులకు ఆపాదించడంగా ఆయన దీన్ని పేర్కొంటాడు మామూలుగా ఒక సంక్లిష్ట నిర్మాణానికి వెలుపలా, బయటా అంటూ వుండటంలో సందేహంలేదు కాని సంక్లిష్ట నిర్మాణాలకు సంబంధించిన దృక్పథాలన్నింటినీ అధిగమించిన తర్వాతే సైద్ధాంతికంగా అనంతమైన అణువు అన్నదానికి చేరుకోవడం సాధ్యమౌతుంది అందువల్ల అణువుకు వెలుపలా లోపలా శూన్య స్థలం అన్న వాదనే అర్థం లేనిది శూన్యమైన స్థలం సర్వశక్తివంతం కనుక అణువులతో అది సంబంధం కలిగివుంటుంది అయితే అంతమాత్రాన అణువు కూడా తన అంతర్భాగంలోకి శూన్యస్థలాన్ని అనుమతిస్తుందని అర్థం చేసుకోరాదు

భావవాదులు అణువాదానికి వ్యతిరేకంగా లేవనెత్తిన అభ్యంతరాలలో తీవ్రమైనవి మరికొన్ని ఉన్నట్లు కనిపిస్తుంది సర్వశక్తివంతమైనది కానిది ఏదైనా సరే పరిమితమైన పరిమాణం *(మూర్తి)*గలది ఏదైనా స్పష్టమైన ఆకృతి *(సంస్థాన)* కలిగివుండాలి చదరం,

త్రిభుజం, గోళం వగైరా అన్నమాట సర్వశక్తివంతంగాని అణువు పరిమాణంలో పరిమితంగా వుంటుందికనుక దానికి తనదైన ఆకృతి వుండదు అదే పరిమండలం అంటే గోళాకారం అని దీని సాధారణ అర్థం కాని భాగాల సమ్మేళనాన్ని ఆమోదించకపోతే ఎలాంటి ఆకృతినైనా ఊహించడం కష్టం అందువల్ల దానిలో భాగాలున్నాయని అంగీకరించడంద్వారానే అణువుల ఆకృతి అన్నదాన్ని వివరించడం సాధ్యమౌతుంది లేకపోతే అసలు అవే లేవని చెప్పాల్సివుంటుంది

దైనందిన అనుభవంలోని సంక్లిష్టవస్తువులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఆలోచించే అలవాటు ఇలాంటి వాదనలకు కారణమని న్యాయ వైశేషికులు భావించారు. అయితే అణువులకు వీటిని వర్తింపచేయడం సాధ్యంకాదు ఎందుకంటే ఒక సంక్లిష్ట నిర్మాణాన్ని చిన్నచిన్న భాగాలుగా విభజించే అవకాశాలన్నీ ముగిసిపోయిన తర్వాతే సైద్ధాంతికంగా అణువు అన్న దృక్పధం ఉనికిలోకి వస్తుంది అటువంటప్పుడు సంక్లిష్ట నిర్మాణాల సూత్రాన్ని అణువులకుకూడా వర్తింపచేయడం ఎలా సాధ్యం? అణువులకు సంబంధించి పరిమండలం అన్న పదం వినియోగించబడుతున్నమాట వాస్తవమే అయితే దీనిలక్ష్యం అణువులు గోళాకారంలో ఉన్నాయని చెప్పడంకాదు అవి అనంతమైనవని, గుర్తించడానికి సాధ్యంకాని అతి సూక్ష్మరూపంలో ఉన్నాయని చెప్పడమే దాని ఉద్దేశం కాని ఈ పదాన్ని వినియోగించడంపై తాత్విక రభస చేయడంవల్ల ప్రయోజనం లేదు దాని నిజమైన అర్థమేమిటో తెలుసుకుంటే చాలు

అయితే అణువులలో భాగాలు లేవని అంటూనే వాటి సమ్మేళనాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అని వసుబంధుడు ప్రశ్నించాడు న్యాయ వైశేషికుల దృష్టిలో సాధారణ అనుభవానికి సంబంధించిన వస్తువులు అణువుల సమ్మేళనంవల్ల ఏర్పడతాయి అణువును త్రిముఖ దృష్టినుండి చూసినప్పుడు ఉత్తరం, దక్షిణం, తూర్పు, పశ్చిమం, పైన, క్రింద అని ఆరు దిశలు కనిపిస్తాయి అందువల్ల మరో ఆరు అణువులుకూడా దానితో ఆరు దిశల్లో కలిసి వుంటాయి లేక కలవడానికి అవకాశం వుంటుంది మరలాంటప్పుడు కేంద్రంలోని అణువులో ఆరు వేర్వేరు భాగాలు వుంటాయి కనుక అది అణువే కాకూడదు మరో ప్రత్యామ్నాయం ఏమంటే కలసిపోయిన అణువులు స్థలంలో ఒకదానినుండి ఒకటి విడిపోవని ఊహించుకోవడం అవన్నీ ఒకే బిందువువద్ద కేంద్రీకృతమౌతాయని, అందువల్ల కేంద్ర అణువు అవసరమైన కలయికకోసం వేర్వేరు భాగాలు కలిగివుండనవసరంలేదని భావించడం ఇది సైద్ధాంతికంగా విద్ధూరమైన పరిస్థితికి దారితీసింది కలసిపోయే అణువులన్నీ ఒకేబిందువువద్ద కేంద్రీకృతమైనట్లయితే వాటి మొత్తం పరిధి ఒక అణువు పరిధికన్నా ఎక్కువగా వుండడానికి వీలులేదు ఆవిధంగా ఒక సంక్లిష్ట నిర్మాణ వస్తువు

ఏర్పడ్డానికి అవసరమైన అణువుల సంఖ్య ఎంతైనప్పటికీ ఆ వస్తువు కూడా పరమాణువు పరిమాణంలోనే ఉండిపోతుంది అందువల్ల గోచరం కాదు అలాంటి విడ్డూరమైన పరిస్థితిని తప్పించడంకోసం అణువాదులు కేంద్ర అణువులోని వేర్వేరు భాగాల్లో వేర్వేరు మోతాదుల్లో అణువులు కలుస్తాయని సూత్రీకరించాల్సివచ్చింది మరోవిధంగా చెప్పాలంటే అణువు అన్న సూత్రాన్నే వదులుకోవడమన్నమాట

క్లుప్తంగా చెప్పాలంటే అణువాదుల దృష్టినుండి అణువుల కలయికను సంతృప్తికరంగా వివరించడం సాధ్యంకాదు అణు సిద్ధాంతానికి వ్యతిరేకంగా ముందుకొచ్చిన అతి బలమైన వాదన ఇది ఇందుకు సమాధానం చెప్పగలిగిన స్థితి చారిత్రికంగా ఆనాటి అణువాదులకు లేదు అంతటి పరిణితి అప్పటికి సాధ్యంకాలేదు అణువుల కలయికను అర్థం చేసుకోవాలంటే గొప్ప శాస్త్రీయ పరిశోధన, పదార్థ నిజ స్వభావాన్ని గురించిన పరిశీలనలు, ప్రయోగాలద్వారా గొప్ప సమాచార సేకరణ అందుకు అవసరమౌతుంది సమకాలీన శాస్త్రవిజ్ఞానం ఆదశకు చేరుకున్న తర్వాత అవిభాజ్యమైన శకలాల గురించిన పాత దృక్పథాన్ని కూడా సవరించుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది

కాని దీన్నిబట్టి న్యాయ వైశేషికులకు ఈ అభ్యంతరాలను ఎదుర్కొనే వాదనలు లేవని అనుకోరాదు అణువుల కలయిక్రను గురించి తగిన వివరణ వారు ఇవ్వలేకపోయారని కాదు వారు పదార్థాన్ని గురించిన తమ దృక్పధాన్ని వదులుకోవడానికి వారు సిద్ధపడలేదు. పైగా భావవాదుల అభ్యంతరాలకు వ్యతిరేకంగా గట్టి సమాధానమే ఇచ్చారు ఇది గౌతముడు, వాత్సాయనుడి కాలంలోనే కనిపిస్తుంది

అసమాన పరిమాణంగల భౌతికవస్తువుల విభాజ్యతకు సంబంధించిన సమస్యలకు అణు భావన మాత్రమే సంతృప్తికరమైన సమాధానం ఇస్తుందని ఇప్పటికే విదితమైంది అణువుకన్నా చిన్నదైన శకలం వుంటుందని భావించడం సైద్ధాంతికంగా అసంబద్ధమని కూడా పేర్కొనబడింది అందువల్ల అణువులకన్నా చిన్నవైన భాగాలు వుంటాయనే వాదనతో అణు సమ్మేళనాన్ని గురించి లేవనెత్తే ప్రశ్నలు విడ్డూరమైనవి క్లుప్తంగా చెప్పాలంటే అణువుల కలయికకు సంబంధించిన సమస్యలను అర్థం చేసుకోవడంఎంత కష్టమైనప్పటికీ దాన్ని బట్టి అణువుల ఉనికిని తిరస్కరించడం సరికాదు

మొదటి విషయం-న్యాయ వైశేషికులు అణుభావనకు ఎలా రాగలిగారు? వారు దాన్ని అవసరార్థం సృష్టించలేదు ఆ సూత్రాన్ని అంగీకరించకపోతే ప్రకృతి పరిశీలనలో స్పష్టమైన రెండు నిర్వివాదవాస్తవాలను వివరించడం సాధ్యంకాదని వారు గ్రహించారు మొదటిది-ప్రకృతిలోని ప్రతిదీ మరింత సూటిగా చెప్పాలంటే ప్రతి పదార్థమూ భాగాలుగా విభజింపబడుతుంది ఈ భాగాలు మరిన్ని ఉపభాగాలుగా విభజించబడతాయి. రెండవది-

ఈ భౌతిక వస్తువులు వేర్వేరు పరిమాణాలలో వుంటాయి పరిశీలనను బట్టి ఈ రెండు వాస్తవాలు సందేహించడానికి ఆస్కారంలేనివి అందువల్ల ఈ రెండింటికీ కలిపి ఒకే వివరణ సంపాదించడమే ఇక్కడ సమస్య ఇందుకు పరిష్కారంగా న్యాయ వైశేషికులకు కనిపించిన ఒకేఒక ప్రత్యామ్నాయ వివరణ అణు భావన మనమిప్పటికే చూసినట్లుగా భౌతిక వస్తువు విభాజ్యతకు సంబంధించిన అంశాన్ని మూడుమార్గాలలో మాత్రమే అర్థం చేసుకోగలుగుతాము మొదటిది- ఈ విభజన అనంతమైన ప్రక్రియ రెండవది-అది శూన్యతలో ముగుస్తుంది మూడవది-మరేమాత్రమూ విభజింపశక్యంగాని అసంఖ్యాకమైన భాగాలతో అది ముగుస్తుంది ఈ చివర సూత్రం అణు భావనకు మూలం మొదటి రెండు సూత్రాలు అసంబద్ధమైనవి కనుక చివరిదాన్ని ఆమోదించాల్సి వస్తుంది

ఈ పరిస్థితులలో అణు భావనను తిరస్కరించడం, అణువులు ఇతర భాగాలతో కూడివున్నాయని చెప్పడం అంటే అది మొదటి రెండు మార్గాలకు తిరోగమించడమే అవుతుంది అప్పుడు వాటిలోని అసంబద్ధతనంతటినీ స్వీకరించవలసి వుంటుంది అణు సమ్మేళనాన్ని అర్థం చేసుకోవాలంటే అణువులుకూడా వివిధ భాగాలతో ఏర్పడినట్లు అంగీకరించక తప్పదని చెప్పేవారి వైఖరి ఇదే న్యాయవైశేషికుల దృష్టిలో మాత్రం అలా చేయడం అణువాదాన్ని త్రోసిపుచ్చడంకాదు కొన్ని విడ్డూరపు వాదనలను నెత్తినెట్టుకోవడమే అణుభావనకు అంటిపెట్టుకోవడం సైద్ధాంతికంగా తప్పనిసరి అయితే ఆవిధంగా ప్రపంచంలోని భౌతికవస్తువులు అణువుల కలయికవల్ల ఏర్పడ్డాయని అంగీకరించేటట్లయితే అణువుల కలయిక గురించి తెలియకపోయినా అసలు ఆ భావననే త్రోసిపుచ్చవలసిన అవసరంలేదు అని వారు చెప్పారు ఆ కలయిక నిర్దిష్ట స్వరూపం వారికి తెలియదు కాని అలా తెలియనంతమాత్రాన అణు భావన చెల్లబాటునే ప్రశ్నించడం సరికాదని వారు చెప్పారు పైగా అణువులను ఆమోదిస్తున్నందువల్ల అవి ఏదో ఒక విధంగా కలవడంవల్లనే రోజువారీ జీవితంలో కనిపించే భౌతికవస్తువులు ఏర్పడుతున్నాయని అంగీకరించవలసి వుంటుంది ఈకలయిక ఖచ్చితంగా ఎలా జరుగుతుందనేది పరిశీలించవలసి వుంటుందని వారు చెప్పారు మరి అణువుల కలయికకు సంబంధించిన ఈ సమస్యను న్యాయ వైశేషికులు ఎలా అర్థం చేసుకున్నారు? మనమిప్పుడు వెనక్కు తిరిగి చూస్తే అది భారతదేశంలో విజ్ఞానశాస్త్ర అభివృద్ధికి సంబంధించిన సమస్యగా కనిపిస్తుంది పదార్థ స్వభావానికి సంబంధించిన ఒకసమస్యకు సంతృప్తికరమైన పరిష్కారం కనుగొనే క్రమంలో నూతనమైన కొత్త అపరిష్కృత సమస్యలు ఏర్పడినట్లు అర్థమౌతుంది అయితే ఇలాంటి ఆటుపోట్లతోనే విజ్ఞానశాస్త్రం గతంలో అభివృద్ధి చెందింది ఇంకా ముందుకు పోతున్నది పదార్థ స్వభావానికి సంబంధించిన మరో సమస్య అపరిష్కృతంగా వుంది కనుక అప్పటికే

జయప్రదంగా లభించిన పరిష్కారానికి దాన్ని వ్యతిరేకంగా నిలపడం సాధ్యమయ్యే విషయంకాదు పదార్థ స్వభావానికి సంబంధించిన మన జ్ఞానం ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్నట్లు తెలుస్తుంది దాన్ని గురించి మనం తెలుసుకోవలసింది ఇంకా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది అప్పుడు తెలుసుకోవాలన్న తహతహ ఇంకా ఇనుమడిస్తుంది. ఒక తుది పరిష్కారం, ఒక అఖండ సత్యం చూపిస్తే తప్ప మరి దేనితోనూ సంతృప్తి చెందడానికి నిరాకరించి విజ్ఞానశాస్త్ర పురోగమనాన్ని నిరుత్సాహపరిచే భావవాదులకు భిన్నంగా భౌతికవాదులు చేపట్టిన వైఖరి ఇది లెనిన్ దీన్నే ఇలా చెప్తాడు *"భౌతికవాదం ఇంకా అపరిష్కృతంగావున్న సమస్యలను సూత్రీకరించి ఆవిధంగా వాటికి పరిష్కార ప్రయత్నాలకు పురికొల్పుతుంది "*

## పదార్థం, చలనం యాంత్రిక భౌతికవాదం

పదార్థ దృక్పథాన్ని నిర్మూలించేందుకు ఉబలాటపడిన భావవాదుల వైఖరికి భిన్నంగా దాన్ని సమర్థించడానికి న్యాయ వైశేషికులు చూపిన శాస్త్రీయ దృష్టిని గమనిస్తూనే మనం వారి దృక్పథానికిగల పరిమితులను అర్థం చేసుకోవడం ముఖ్యం చలనానికి, పదార్థానికిగల సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో వారి వైఫల్యం ఇప్పటివరకు గుర్తించినవాటిలో తీవ్రమైంది

చలన సూత్రాలను అర్థం చేసుకోవడానికి న్యాయ వైశేషికులు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదని కాదు చేశారు, వారు చేసిన దానికి ఆ కాలాన్నిబట్టి చూస్తే ప్రాధాన్యత కూడా వున్నది భౌతికవస్తువుల చలనాన్ని గమనించినమేరకు క్రమబద్ధంగా వర్గీకరించేందుకు ప్రయత్నించారు ఇది వారిని రెండురకాలైన చలనాల దగ్గిరకు చేర్చింది ఒకటి 'ప్రయత్న' అంటే స్వీయ కృషితో సాధించే చలనం రెండవది 'గమన' బహుశా స్వయం ప్రయత్నంలేని ఇతర రకాలైన చలనాలన్నీ దీనికిందకు వస్తాయనుకోవాలి ఏదైనా వస్తువును పైకి విసరడం, లేక క్రింద పడవేయడం, సంకోచం, వ్యాకోచంవంటివన్నీ మొదటికోవకు చెందుతాయి చలనంలో జ్వాల పైకెగయడం, ద్రవాలు పల్లానికి పారడం, భారంవల్ల వస్తువులు పడిపోవడం వగైరాలు రెండవరకం చలనానికి చెందుతాయి వాస్తవంగా పరిశీలించినమేరకు అన్నిరకాల చలనాలకు సంబంధించిన నిర్దిష్ట కారణాలను వివరించేందుకు కూడా న్యాయ వైశేషికులు ప్రయత్నించారు భారతదేశ వైజ్ఞానిక చరిత్రలో ఈకృషికిగల ప్రాధాన్యత విస్మరించరానిది

అయినప్పటికీ వారి వాదనలలోని బలహీనత తొలగేది కాదు ఎందుకంటే వారు చలనాన్ని పదార్థానికి బాహ్యమైనదిగానే పరిగణించారు వారి ఉద్దేశంలో పదార్థమన్నది స్వతస్సిద్ధంగా నిశ్చలమైంది ఈ నిశ్చలత్వం సంక్లిష్టమైన భౌతికవస్తువులకు మాత్రమే పరిమితంకాదు అవి ఏదైనా బాహ్య ప్రభావం లేనిదే కదలనూ లేవు, మారనూ లేవు కేవలం అణురూపంలోవున్న పదార్థానికి కూడా ఇది వర్తిస్తుంది ఈ తేలికైన శకలాలు

శాశ్వతమైనవికనుక ఎలాంటి మార్పుకూ గురికావు వాటిని స్థలంలో ఒకచోటనుండి మరొకచోటకు మార్చడంమాత్రమే సాధ్యమౌతుంది కొన్ని అణు సమ్మేళనాలనుండి వేరే సమ్మేళనంలోకి మార్చడంమాత్రమే సాధ్యమౌతుంది న్యాయ వైశేషిక తత్వశాస్త్రం ప్రకారం మార్పు అన్న దృక్పథం అణువుల యాంత్రిక మార్పు మాత్రమే అంతకన్నా అధ్వానమైన విషయమేమంటే అలాంటి యాంత్రికమైన మార్పుకు అవసరమైన చలనంకావాలన్నా అణువులకు పదార్థేతరమైన ప్రభావం ఏదో కావాలి ఎందుకంటే న్యాయ వైశేషికుల దృష్టిలో అణువులు తమకు తాముగా కదలలేవు అదేసమయంలో చలనాన్ని కలిగించే ఈ బాహ్యాంశం న్యాయ వైశేషికులకు చాలా ముఖ్యావసరం అది లేకపోతే అణువులు సమ్మేళనాలుగా ఏర్పడటం కాని, తద్వారా సంక్లిష్ట భౌతికవస్తువులుగా రూపొందడంగాని సాధ్యంకాదు పరస్పరం దూరమవడం, భౌతికవస్తువులలో మార్పు రావడం కూడా జరగదు ఆవిధంగా అణువులనేవి నిరంతరం చలనంలో వుంటాయని భావించినప్పటికీ వాటి స్వభావంగాక మరేదో బాహ్యప్రభావం అందుకు కారణమని భావించబడింది ఆ శక్తి ఏమిటి? భారతీయ పరిభాషలో దాన్ని 'అదృష్ట' అన్నారు అంటే కనిపించనిది ఇది కేవలం అజ్ఞాన ప్రకటన అయితే స్వతంత్రమైన అణువులు పరస్పరం కలసిపోయి ఒక భౌతిక వస్తువుగా ఏర్పడేందుకు కారణమైన అంశాలను కనుగొనగల విజ్ఞానం లేదని నిజాయితీగా ఒప్పుకుని వుంటే అప్పుడది న్యాయ వైశేషికుల శాస్త్రీయ స్ఫూర్తికి పెద్ద నష్టం కలిగించి వుండేదికాదు కాని ప్రాచీనకాలంలో ప్రారంభదశనుండి కూడా ఈ అదృష్ట అన్న దృక్పథం భారతీయ తత్వశాస్త్రంలో ఒక ఆస్థిక, నైతిక ప్రాధాన్యత సంతరించుకున్నది అది శాస్త్రవిజ్ఞానానికి వ్యతిరేకమైనది పదార్థానికి, చలనానికి సంబంధం లేదని భావించిన తీవ్ర బలహీనత వల్ల అది న్యాయ వైశేషిక శాస్త్రంలో చొరబడగలిగింది కనీసం మనకు సంబంధించినంతవరకు మాత్రం చూస్తే న్యాయ వైశేషిక వైఖరి ఇలా వుంటుంది *"సృజనాత్మకమైన చలనాన్ని అదృష్టగా భావించాలి కనిపించని ఆ నైతిక శక్తి ఆత్మలను వాటి కర్మానుసారంగా నడిపిస్తుంది వాటికి తగిన సంపత్తిగల శరీరాలను అమరుస్తుంది, సమకూరుస్తుంది సుఖదుఃఖాలు అనుభవించడానికి తగిన యధార్థ ప్రపంచాన్ని సృష్టిస్తుంది ఈ అనుభవాతీత శక్తి పనిచేయడంవల్లనే పరమాణువులు పరస్పరం దగ్గరౌతాయి ఆవిధంగా అవి సమ్మిళితమై అసంఖ్యాకమై రకరకాల వస్తుజాలంగా రూపొందుతాయి* [1]

న్యాయ వైశేషికుల వాదనల్లోని ఈ భాగంపట్ల మన ఆసక్తి కేవలం ప్రతికూల కోణం నుంచి చూపుతున్నది మాత్రమే ఆ ప్రాచీన మధ్యయుగాల అణువాదుల భౌతికవాదం యూరోప్‌లోని యాంత్రిక భౌతికవాదంలాగే తద్భిన్నమైన మార్గంలోకి దారితీసే ప్రమాదాన్ని ఎలా ఎదుర్కొన్నదో మూఢత్వం శాస్త్రవిజ్ఞానాన్ని కమ్మివేయడాన్ని ఎలా అనుమతించిందో మనం దాన్నిబట్టి తెలుసుకోగలుగుతాము

---

1 ఎస్ బహుదూరి

# VI

# పదార్థం-చైతన్యం

భారతీయ భావవాద ప్రతిసిద్ధాంతానికి ప్రచండ ప్రతినిధులైన లోకాయతులు, సాంఖ్యులు, న్యాయ వైశేషికులకు సంబంధించిన రెండు లక్షణాలను మనమిప్పటివరకు ప్రధానంగా చర్చించాము మొదటిది- భావవాదాన్ని ఖండించే కొన్ని యితర వాదాలవలెగాక ఇవి మౌలికంగా లౌకికతత్వానికి, హేతువాదానికి, శాస్త్రీయ దృక్పధానికి కట్టుబడ్డాయి రెండవది-ఈ తాత్విక చింతనలు పాదార్థిక ప్రపంచం లేదా ప్రకృతి వాస్తవికమైనవని సమర్థించడంతోనే సరిపెట్టుకోలేదు అంతకుమించి అవి పదార్థ నిర్మాణాన్ని గురించి వ్యాఖ్యానాలు చేశాయి పదార్థ స్వభావానికి సంబంధించిన తమ తమ సిద్ధాంతాలుగా భూత, (భౌతికపదార్థాలు) ప్రధాన (ప్రాథమిక పదార్థం), అణు వాదాలను ప్రతిపాదించాయి

ఇప్పుడు మనం ఈ తాత్విక చింతనలకు సంబంధించిన మరో ముఖ్యలక్షణం చర్చిద్దాం పదార్థంతో పోలిస్తే చైతన్యం స్వీయ ప్రతిపత్తిని గురించిన చర్చ వీటన్నింటిలోనూ ద్వితీయ స్థానంలోనే ఉంది లోకాయతుల విషయంలో ఈ విషయం చాలా స్పష్టంగా కనిపిస్తుంది సాంఖ్యంలోనూ కొన్ని వివరణలు చూస్తే ఆ సంగతి అర్థమౌతుంది న్యాయ వైశేషికులకు చెప్పే ప్రకారం పదార్థమన్నది అణురూపంలో శాశ్వతము, అవిభాజ్యమూ అయినప్పటికీ చైతన్యమన్నది నిరంతర చలనంలో వుండే ధోరణి అది ఏదో ఒక విధంగా స్వతహాగా అచేతనమైన (జడత్వం) పదార్థాల ప్రత్యేక కలయికతో ఏర్పడుతుంది

ప్రధానంగా అచేతనమైన వస్తుజాలం, దానికి తెలియని ఒక చైతన్యాన్ని ఎలా సృష్టించగలుగుతుంది? ఇదెలా జరుగుతుందన్నవిషయంలో న్యాయ వైశేషికులదగ్గర స్పష్టమైన సమాధానం లేనిమాట నిజమే అయితే వారి తాత్విక వైఖరినిబట్టి అది అలా జరిగితీరాల్సిందే సాంఖ్య దర్శనంలో మనకు పదార్థంనుండి చైతన్యం ఉద్భవిస్తుందన్న

సైద్ధాంతిక అవగాహన గజిబిజిగా కనిపిస్తుంది అయితే ఈ విషయంలో సాహసోపేతమైన వివరణ లోకాయతంలో కనిపిస్తుంది భారతీయ తాత్విక చింతనలన్నీ లోకాయతాన్ని ఎంతగానో నిర్లక్ష్యం చేసినప్పటికీ ఈ కోణంనుండి భారతీయ ఆలోచనా ధోరణిలో అది ప్రత్యేకమైన ఆసక్తి రేకెత్తించింది

## చైతన్యం - లోకాయత దృక్పథం

బ్రహ్మ సూత్రాల భాష్యంలో శంకరుడు లోకాయతాన్ని గురించి మూడుసార్లు ప్రస్తావించి ఖండిస్తాడు ఆత్మ చైతన్యాలకు సంబంధించిన దాని సిద్ధాంతాన్ని త్రోసిపుచ్చుతాడు ఇందులో ఏదైనా ఒకదాన్ని తీసుకొని మనం లోకాయత గురించిన చర్చను ప్రారంభించడం సులభంగా వుంటుంది శంకరుడు అవగాహన చేసుకున్న ప్రకారం చూస్తే లోకాయత దృక్పథం సాంఖ్యానికి చాలా దగ్గరగా వుంట్లుంది అలాగే లోకాయతులు చేసినట్లు చెప్పబడుతున్న వాదనలతో సాంఖ్యం తనను తాను సమర్థించుకోగలుగుతుంది ఆవిధంగా సాంఖ్య దృక్పథాన్ని ఖండించే సందర్భంలో అచేతనమైన లేక ప్రధానమైన పదార్థంవల్ల ప్రపంచ క్రమానుగత నిర్మాణం జరిగిందనే వాదనను వివరించడం సాధ్యంకాదంటూ శంకరుడు సాంఖ్యాన్ని ఖండిస్తాడు ఆయన ఇంకా ఇలా చెప్తాడు

*"ప్రపంచంలోని క్రమానుగత ఏర్పాటుకు సంబంధించిన సాక్ష్యాధారాలను ప్రక్కన పెట్టి మనమిప్పుడు అదెలా రూపొందిందనే విషయానికి వద్దాం మూడు అణువులు తమ స్వీయ చలనంతో పరస్పం సంధానమై కార్యకలాపాలు సాగిస్తూ కొన్ని ప్రత్యేకమైన ప్రభావాలు కలిగిస్తాయి " ఈ విషయం చెప్పిన తర్వాత శంకరుడు ఇలా ప్రశ్నిస్తాడు "ఈ కార్యకలాపాలను అచేతనమైన ప్రధాన పదార్థానికే వదిలివేయలేము ఎందుకంటే మట్టిలోగాని అలాంటి ఇతర పదార్థాలలోగాని, రథాలు, వగైరాలలోగానీ అలాంటి కదలికలు మనకు కనిపించవు మట్టి వగైరాలు, రథాలు స్వతహాగా అచేతనమైనవి కుమ్మరులు లేక గుర్రాలువంటి చైతన్యంగల అంశాలు జతకలిస్తేనే అవి కదలికలోకి వస్తాయి నిజంగా కనిపించేదాని ప్రాతిపదికన కనిపించనిదాని స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు అందువల్ల ప్రపంచానికి అచేతన పదార్థం కారణమని సూత్రీకరించడం సాధ్యంకాదు అలాగైతే దాని ఉత్పత్తికి అవసరమైన కదలిక ఎలా కలిగిందో వివరించగలగడం అసాధ్యం "*

*దీనికి సాంఖ్యుడు ఇలా ఎదురు వాదిస్తాడు- కేవలం చైతన్యవంతమైన దాని కదలిక కూడా ఎప్పుడూ కనిపించదు*

*శంకరుడు-నిజమే కాని అచేతన వస్తువులైన రథం వంటివి చైతన్యవంతమైన అంశాలు కలిసినప్పుడే కదలికలోకి రావడం మనం చూస్తాము*

*సాంఖ్యుడు- అచేతనమైన వస్తువులతో కలిసినప్పుడైనా చైతన్యంయొక్క కదలికను మనమెప్పుడూ నిజంగా చూడలేము*

*శంకరుడు- సరే మంచిది అప్పుడొక ప్రశ్న ఏమంటే కదలిక అన్నది (సాంఖ్యులు చెబుతున్నట్లు) కనిపించే వస్తువుకు చెందినదా లేక (వేదాంతం చెబుతున్నట్లు) దానితో జరిగిన కలయికలవల్ల కలిగేదా?*

*సాంఖ్యుడు- దేనిలోనైతే కదలిక కనిపిస్తుందో దానికే దాన్ని ఆపాదించడం తర్కబద్ధం ఎందుకంటే ఈరెండు (కదలిక, దానికి సంబంధించిన వస్తువు) ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి అందుకు భిన్నంగా నిజమైన చైతన్యం కదలికకు మూలంగా ఎప్పుడూ కనిపించదు. ఉదాహరణకు రథంలో కనిపించినట్లు అందువల్ల చైతన్యం అన్నది శరీరం వగైరాలతో కలసి మాత్రమే ఉనికిలో వుంటుందని, అదే నిజమైన కదలికకు మూలమని నిరూపించబడుతున్నది. ఒక సజీవమైన శరీరం కేవలం అచేతనమైన రథాలు వగైరా వస్తువులకు మౌలికంగా భిన్నమైనది ఎందుకంటే దీనివల్ల చైతన్యమన్నది కనిపించే ఆకారం వున్నప్పుడే తెలుస్తుంది ఇక చైతన్యం అలాంటి శరీరం లేకపోతే ఎప్పుడూ కనిపించదు లోకాయతులు కూడా చైతన్యం శరీరానికి చెందినదేనని వాదిస్తారు అందువల్ల కదలిక అన్నది పూర్తిగా అచేతనానికి సంబంధించినది*

సాంఖ్యులకు శంకరుడు ఆపాదించిన ఈ వాదన గణనీయంగా భౌతికవాదమే. అందువల్లనే సాంఖ్యానికి సంబంధించిన తన దృక్పధాన్ని అతి స్పష్టంగా చెప్పాలని శంకరుడు ప్రయత్నిస్తాడు తమ వైఖరులను సమర్థించుకోవడం కోసం సాంఖ్యులు సుప్రసిద్ధమైన లోకాయత వాదనపై ఆధారపడతారని, చైతన్యం అన్నది శరీరానికి అనుబంధమేనని చెప్తారని ఆయన పేర్కొంటాడు భారతీయ ఛాందసవాదం ప్రకారం లోకాయతాన్ని ప్రమాణంగా కలిగివుండడంకన్నా అభ్యంతరకరమైన విషయం మరొకటివుండదు శంకరుడు ఇదంతా చెప్పడంలో వుద్దేశం సాంఖ్యులను త్రోసిపుచ్చడమేనా లేక కరుడుగట్టిన భావవాదిగా ఆయన వ్యవహరించారా? సాంఖ్య తత్వం పురుష తత్వానికి సంబంధించిన ఆధ్యాత్మిక అవగాహనను ఆమోదించినప్పటికీ భౌతికవాదం పట్ల మౌలిక విశ్వాసాన్ని వదులుకోలేకపోయిందని ఆయన భావించారా? సాంఖ్యతత్వం ప్రధానంగా భౌతికవాదమేనని అందువల్లనే అది నేరుగా భౌతికవాదాన్ని చెప్పే లోకాయతంపై నిస్సంకోచంగా ఆధారపడిందని శంకరుడు చెప్పదలచుకున్నాడు [1]

మనం మళ్ళీ లోకాయతుల దగ్గిరకు వెళ్ళి వారి అనుయాయులు దాన్ని ఎలా సమర్థించారో తెలుసుకుందాం ఇందుకోసం మనం వారి ప్రత్యర్థుల రచనలపైనే ఆధారపడవలసి వుంటుంది శంకరుడు ఇలా అంటాడు "అలగా జనం (ప్రాకృత జనం) అలాగే లోకాయతులు ఆత్మ అంటే చైతన్యంగల శరీరంతప్ప మరేమీ కాదని భావిస్తారు ' ' వారి వాదనలను ఆయన ఇలా వర్ణిస్తాడు

ఆత్మ అన్నది శరీరంలోనే వుంటుందని భావించే లోకాయతులు శరీరంగాక ఆత్మ అంటూ వేరే లేదని చెప్తారు వారికి సంబంధించినంతవరకు చైతన్యం అన్నది భూమివంటి భౌతిక పదార్థాలలో కలసిగానీ, విడివిడిగాగానీ కనిపించినప్పటికీ అది ఒక పదార్థంగా మారిన తర్వాతే ఆవిర్భవిస్తుంది అందువల్లనే వాటినుండి మాత్రమే చైతన్యం ఉద్భవిస్తుంది అందువల్ల చైతన్యమన్నది మాదకద్రవ్యం కలిగించే ప్రభావం వంటిది అది కొన్ని పదార్థాల కలయికతో ఉత్పన్నమౌతుందే తప్ప వాటిలో ఏ ఒక్కదానిలోనూ వుండదు మానవుడు అంటే చైతన్యంగల శరీరం తప్ప ఇంకేమీ కాదు ఆవిధంగా వారు చెప్పే ప్రకారం శరీరంతో సంబంధం లేకుండా ఆత్మ అన్నది ఏదీ విముక్తి పొందడంగానీ, స్వర్గానికి పోవడంగానీ జరగదు ఎందుకంటే అది వుండడంవల్లనే శరీరానికి చైతన్యం కలుగుతున్నది అయితే అందుకుభిన్నంగా శరీరమే చైతన్యం అదే ఆత్మ

బ్రహ్మసూత్రాలలో లోకాయత దృక్పథాన్ని సమర్థించే వాదన ఇలా చెప్పబడింది

"శరీరం వున్నచోటనే దాని ఉనికివల్ల ఎక్కడైనా ఏదైనా వుంటే మరొకటి కూడా వుంటుంది ఆ మరొకటి వుండకపోతే ఇదికూడా వుండదు అప్పుడు మనం ఆ మరొకదాన్ని మొదటిదాని లక్షణంగా పరిగణిస్తాము ఉదాహరణకు ఉష్ణం, కాంతి అన్నవి అగ్నికి వుండే లక్షణాలు జీవితం, ప్రయత్నం, చైతన్యం, జ్ఞాపకం వగైరాలన్నీ ఆత్మ లక్షణాలేనని ఆత్మ స్వతంత్రవాదాన్ని చెప్పేవారు వాదిస్తారు అయితే ఇవి శరీరంలోనే బంధించబడి వుంటాయి శరీరం వెలుపల ఎప్పుడూ కనిపించవు శరీరానికి వెలుపల ఈ లక్షణాలకు ప్రాతిపదిక వున్నట్లు నిరూపించే ఆధారాలేమీ లేవుకనుక ఇవి శరీరం లక్షణాలు మాత్రమేనని నిర్ధారించవలసి వుంటుంది అందువల్ల ఆత్మ అన్నది శరీరంకంటే భిన్నమైనది కాదు

ఈ వాదనలోని ప్రధానాంశాలను స్పష్టంగా అర్థం చేసుకోవడానికి మనం మొదట ప్రయత్నిద్దాం ఆత్మను లోకాయతులు ఖండించడంవల్ల చైతన్యానికి సంబంధించిన సమస్య ముందుకు వచ్చింది చైతన్యం ఉందనే వాస్తవాన్ని ఖండించడం అసాధ్యం కాని మామూలుగా అది ఆత్మకు సంబంధించినదని భావించేవారు కేవల పదార్థం, మట్టిదిబ్బవంటివి స్వతహాగా అచేతనమైనది సజీవమైన వస్తువులు మాత్రమే ఆత్మ కలిగివుంటాయి కనుక చైతన్యం సంతరించుకుంటాయి ఆవిధంగా లోకాయత వాదంలో ప్రధానాంశమేమంటే చైతన్యమన్నది ఆత్మ ప్రత్యేక లక్షణమనే ఈ అంచనాను త్రోసిపుచ్చడమే ఇలా తిరస్కరించడంలో రెండు దశలున్నాయి మొదటిది చైతన్యం ఆత్మ ప్రత్యేక లక్షణంకాదని, శరీరానికి మాత్రమే గల లక్షణమని లేదా దానికి మాత్రమే ఆపాదించదగినదని నిరూపించాలి రెండవది-శరీరమన్నది భౌతిక మూలకాలతోనే తయారైనప్పటికీ దానినుండి చైతన్యం ఆవిర్భవించడంలో ఎలాంటి విచిత్రమూ లేదని నిరూపించాలి భౌతికవాద కోణంనుండి చూసినప్పుడు ఈ రెండవ వాదన చాలా ముఖ్యమైనది భారతదేశ శాస్త్రవిజ్ఞానంలో దానికిప్పుడు గల ప్రాధాన్యత మనం తెలుసుకోగలం కాని మొదటి వాదనకూడా అప్రధానమైనదేమీకాదు

చైతన్యమన్నది శరీరానికి వుండే లక్షణం మాత్రమేనని చెప్పే ఈ మొదటివాదనలో ప్రధానాంశం ఏమిటి? శరీరానికి, చైతన్యానికిగల సంబంధం, పదార్థానికి, లక్షణానికిగల సంబంధం మాత్రమే నన్నట్లు శంకరుడు మాట్లాడినప్పటికీ ఈ ప్రత్యేక సందర్భంలో పదార్థానికి, లక్షణానికిగల సంబంధం కేవలం యాదృచ్ఛికమైనది మాత్రమే ఎందుకంటే లోకాయతుల దృష్టిలో భౌతిక పదార్థాలు సజీవ శరీరంగా ఏర్పడినప్పుడు దానిలో చైతన్యం ఉద్భవిస్తుంది ఈ దృక్పథం ప్రకారం శరీరం కారణం చైతన్యం దాని కార్యం అందువల్ల మనం లోకాయత వాదనలోని నిజమైన శక్తిని అర్థం చేసుకోవాలంటే రెండు దృగ్విషయాలమధ్య కార్య కారణ సంబంధాన్ని నిరూపించే భారతీయ సాంప్రదాయాన్ని అనుసరించాలి శరీరానికి, చైతన్యానికి మధ్య అదేవిధమైన సంబంధాన్ని స్థాపించేందుకు అదెలా ఉపయోగపడుతుందో చూడాలి

వ్యతిరేక స్థానాన్ని అన్వయ అక్రమించచడంగా భారతీయ పరిభాషలో దీన్ని చెబుతారు ఇంచుమించుగా చెప్పాలంటే రెండు వస్తువుల సార్వత్రికమైన ఉమ్మడి ఉనికి, దానికి అనుబంధంగా సార్వత్రికమైన ఉమ్మడి అదృశ్యం అన్వయం అంటే అక్కడవున్న కార్యం కారణం కారణంవున్న ప్రతిచోటా కార్యం వుంటుంది నిప్పునుండి పొగరావడం అటువంటిదే ఎక్కడైనా సరే నిప్పువుంటే పొగవస్తుందని ఎవరైనా నిరూపించాల్సివుంటుంది అలాగే శరీరం చైతన్యానికి కారణమని రుజువు చేయాలంటే శరీరం వున్నచోటే చైతన్యం వుంటుందని ముందు నిరూపించాలి

అందువల్ల లోకాయత దృక్పథంనుండి చూసినప్పుడు ముఖ్యమైన సమస్య వేరే వుంటుంది కేవలం భౌతిక పదార్థాలు మాత్రమే స్వతహాగా అచేతనమైనవైనప్పటికీ చైతన్యవంతమైన సజీవ శరీరాలుగా రూపొందుతాయా? మరోవిధంగా చెప్పాలంటే అచేతనమైన శరీరాలనుండి చైతన్యం ఉద్భవిస్తుందా? ఇదే లోకాయతులు వాదించే ముఖ్య విషయం చైతన్యం పదార్థంనుండి వుత్పన్నమౌతుందనే మాట ఖచ్చితమైనది మనం ప్రాచీన భౌతికవాదులకేసి చూసినప్పుడు పదార్థ స్వభావానికి సంబంధించిన వారి అవగాహన చాలా ప్రాథమికమైనదని అర్థమౌతుంది అలాగే కేంద్ర నాడీవ్యవస్థనుగురించి మరీ ముఖ్యంగా మెదడును గురించి ఈనాడు ఆధునిక భౌతికవాదులకు లభిస్తున్నట్లు వారికి నిజమైన జ్ఞానం వుండివుండాలని మనం ఆశించలేము మన లోకాయతులకు అందుబాటులోవున్న శాస్త్రీయ సమాచారం ఆధునిక ప్రమాణాల ప్రకారం చూస్తే అతి స్వల్పం అందువల్ల ఇలాంటి తీవ్రమైన పరిమితులున్నప్పటికీ ఆనాటి చారిత్రక పరిస్థితుల్లోవారు పదార్థంనుండి చైతన్యం ఆవిర్భావానికి సంబంధించి వివరణ ఇచ్చేందుకు ప్రశంసనీయమైన కృషిచేశారు ఆనాటికి భావవాదాన్ని వ్యతిరేకిస్తున్నవారిలో లోకాయతులు మాత్రమే ఈ ప్రయత్నం చేయగలిగారు శంకరుడు వివరించినదాన్నిబట్టి వారి వైఖరికి సంబంధించిన ముఖ్యాంశాలను ఇలా పేర్కొనవచ్చు,

స్వతహాగా అచేతనమైన భౌతిక పదార్థాలనుండి చైతన్యం ఆవిర్భావం అన్నది అసంభవంగా కనిపించడానికి ఒక కారణముంది అయా వస్తువులలో ఈ లక్షణాలు లేకపోయినా వాటి విచిత్రమైన కలయికవల్ల ఒక కొత్త లక్షణం కలగడం అసంభవం అన్న ఆలోచనే ఆ కారణం అయితే ఈ అంచనా సరైందికాదు వాస్తవం అందుకు భిన్నంగావుంది వస్తువులు ప్రత్యేకమైన తరహాలో కలిపినప్పుడు తమలో లేని కొత్త లక్షణాలు పొందటం చూడవచ్చు ఇందుకు చక్కటి ఉదాహరణగా లోకాయతులు మద్యాన్ని పేర్కొంటారు మద్యాన్ని తయారుచేసేందుకు ఉపయోగించే వస్తువులు వేటిలోనూ మత్తు కలిగించే శక్తి లేదు అయినప్పటికీ వాటినన్నింటినీ కలిపి ఒక క్రమపద్ధతిలో మార్చినప్పుడు మనకు మాదకద్రవ్యం లభిస్తుంది దానికి మత్తు కలిగించే గుణం వుంటుంది బహుశా ఈ వాస్తవానికి సంబంధించిన పూర్తి వివరణ మనకు తెలిసినట్లుగా లోకాయతులకు అందుబాటులో లేనట్లు కనిపిస్తుంది కాని ఆ సమస్యను వారు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన తీరు మాత్రం శాస్త్రీయంగా చాలా ఆసక్తికరమైనది లోకాయతం ప్రారంభమైననాటి ప్రాచీన కాలాన్ని దృష్టిలోపెట్టుకుంటే ఈ భౌతికవాదులు పదార్థంనుండి చైతన్యం పుట్టుకను వివరించేందుకు మత్తు కలిగించే శక్తి ఉదాహరణను తీసుకురావడం చాలా పెద్ద విశేషం దినుసుల ప్రత్యేక కలయికవల్ల మత్తు కలిగించే శక్తి రావడం అన్నది ఒక రహస్యం అలాగే భౌతిక పదార్థాలనుండి చైతన్యం ఆవిర్భవించడం కూడా విచిత్రమేమీకాదని వారు చెప్పారు అచేతనమైన భౌతిక పదార్థాలు ఒక ప్రత్యేకమైన తరహాలో మార్పు చెందడాన్ని ఈ ఉదాహరణ సహాయంతో చక్కగా అర్థం చేసుకోవచ్చు లోకాయత వాదనకు మూలాధారమైన ఒక ప్రధానాంశమిది

## పదార్థం-చైతన్యం - ఆధునిక భౌతికవాదం

చైతన్యంపట్ల లోకాయత భౌతికవాదం ప్రదర్శించిన దృక్పథం మార్క్సుకు ముందున్న వివిధ రకాల భౌతికవాదాలతో ఉమ్మడి లక్షణాలను పంచుకున్నప్పటికీ దానికిగల స్వభావసిద్ధమైన పరిమితులను విస్మరించడం కూడా తప్పే అవుతుంది చైతన్యానికి సంబంధించిన సమస్యలపై మాయావాద తెరలను తొలగించివేసిన తర్వాత చైతన్యం అన్నది పదార్థంలో వేళ్ళు తన్నుకున్న ప్రాకృతిక లక్షణం మాత్రమేనని నొక్కి చెప్పిన తర్వాత భౌతికవాదులు చేయవలసిన పని ఇంకా చాలా మిగిలేవుంటుంది ప్రకృతి నిర్దిష్ట రూపాలు, కలయికలు, సుదీర్ఘ జీవ ప్రక్రియల ఫలితంగా ఆవిర్భవించిన మానవులలో చైతన్యం నిర్వహించే వివిధ కర్తవ్యాలు వగైరాలను వారు వివరించాలి మానవ చైతన్యమన్నది మనుషులకు శాశ్వతంగా వుండేదికాదు అది ఒక నిశ్చలమైన లక్షణం కాదు సరికదా అతిశక్తివంతమైన వైవిధ్యభరితమైన దశలలో జరిగే మార్పు, అభివృద్ధి క్రమంలో అది ఆవిర్భవించింది చైతన్యానికి సంబంధించిన ఈ అంశం కూడా వుంటేనే భౌతికవాద

అవగాహన సమగ్రం అవుతుంది. లేకపోతే అది ఒక సరికొత్త భ్రమాపూరితమైన చైతన్యవాదంగా మారిపోయే ప్రమాదం ఏర్పడుతుంది అలాగే చైతన్యమన్నది విలక్షణ విషయమని, అదే మానవచరిత్రను నిర్దేశిస్తుందని చెప్పే భావవాద దృక్పథానికి కూడా దారితీస్తుంది

మార్క్సిస్టు భౌతివాదం మార్క్సుకు ముందున్న అన్నిరకాల భౌతికవాదాలనుండి విడగొట్టుకున్న అంశం అదే దానిద్వారానే చైతన్యాన్నిగురించిన సమగ్ర అవగాహన కలుగుతుంది లోకాయత భౌతికవాదుల వాదనలోగల విప్లవాత్మకమైన సామర్థ్యం ఆధునిక శాస్త్రీయ భౌతికవాదంలో ఎలా నిజమైందో అర్థం చేసుకోవడానికి మనం ఈ విషయం తెలుసుకోవలసి వుంటుంది

చైతన్యానికి సంబంధించిన మార్క్సిస్టు దృక్పథంలో రెండు ప్రధాన అంశాలను మాత్రమే ఇక్కడ పేర్కొంటాను ముఖ్యంగా అంతకుముందున్న భౌతికవాదానికిగల పరిమితులను అధిగమించి మార్క్సిజం గుణాత్మకంగా దాన్ని నూతన దశకు ఎలా చేర్చిందో దాన్ని బట్టి మనం తెలుసుకోగలం మొదటిది చైతన్యానికిగల పాదార్థిక మూలంపట్ల తగినంత అవగాహన రావాలంటే మానవ చైతన్యాన్ని రూపొందించడంలో మానవ జీవిత భౌతిక పరిస్థితులను దృష్టిలోకి తీసుకోవాలి రెండవది- పదార్థంనుండి ఉత్పన్నమయ్యే చైతన్యం తానే ఒక సృజనాత్మకశక్తిగా మారగలదన్న అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకోకపోతే చైతన్యానికిగల భౌతిక పునాదిని తప్పుగా అర్థం చేసుకుంటారు చైతన్యానికిగల ఈ క్రియాశీల పాత్రను మార్క్సుకు ముందున్న భౌతికవాదులు విస్మరించారు. అది భావవాదులకే ఉపయోగపడింది వారు శుద్ధ చైతన్య ఆరాధనగా దాన్ని మార్చివేశారు

మార్క్సిజంపై తమ తొలి సమగ్ర ప్రకటనలో మార్క్స్, ఎంగెల్స్‌లు పై రెండు అంశాలకు సంబంధించిన వివరాలను పేర్కొనడం అవసరమని భావించారు వాటిని క్రింద పేర్కొంటున్నాము

*"భావాలు, దృక్పథాలు, చైతన్యం మొదట పాదార్థిక కార్యకలాపాలతో నేరుగా అల్లుకుపోయి వుంటాయి మనుషులమధ్య భౌతిక ఉత్పత్తి సంబంధాలతో, వాస్తవ జీవిత పరిభాషతో ముడిపడి వుంటాయి మనుషులమధ్య మేధాపరమైన సంబంధమైన భావాల సృష్టి, ఆలోచన ఈ దశలో వారి పాదార్థిక ప్రవర్తనకు ప్రత్యక్ష వ్యక్తీకరణలుగా కనిపిస్తాయి ఒకానొక ప్రజానీకపు రాజకీయాలు, శాసనాలు, నైతికత, మతం, ఆది భౌతికవాదం వగైరాలలో వ్యక్తమయ్యే మేధాపరమైన ఉత్పత్తికికూడా ఇది వర్తిస్తుంది తమ దృక్పథాలు, భావాలు వగైరాల సృష్టికర్తలు మనుషులే నిజమైన, చురుకైన మనుషులే తమ ఉత్పత్తిశక్తుల నిర్దిష్ట అభివృద్ధి పరిధిలో అందుకు అనుగుణమైన పరస్పర సంబంధాల క్రమంలో సాధ్యమైనంత చివరి రూపాలవరకు ఇవి ఏర్పడతాయి చైతన్యం అంటే ఎప్పుడైనా చైతన్యవంతమైన ఉనికి మాత్రమే మనుషుల ఉనికి అంటే వారి వాస్తవ జీవన క్రమమే "* జర్మన్ తత్వశాస్త్రం

దివినుండి భువికి దిగివచ్చింది అందుకు పూర్తి భిన్నంగా మనం భువినుండి దివికి చేరాలి అంటే మనుషులు ఏమి చెబుతున్నారు, ఊహించుకుంటున్నారు, గ్రహిస్తున్నారు అన్న దానినుండి ప్రారంభంకావాలి అలాగే రక్తమాంసాలుగల మనుషులగురించి నిర్ణయాలకు రావడానికి వివరణలు, ఆలోచనలు, ఊహలు, గ్రహింపులపైన ఆధారపడ్డాము మనం నిజమైన, చురుకైన మనుషులతో ప్రారంభిస్తాము వాస్తవ జీవన ప్రక్రియనుండే మనం వారి సైద్ధాంతిక ప్రతిఫలతను, జీవిత ప్రతిధ్వనులను గ్రహిస్తాము మనిషి మేధలో రూపుదిద్దుకునే కల్పనలు కూడా తప్పనిసరిగా వారి పాదార్థిక జీవిత క్రమంనుండే ఉద్భవిస్తాయి దాన్ని అనుభవంతో పరిశీలించుకోవచ్చు దానికి భౌతిక పరిధి వుంటుంది నైతికత, మతం, అదిభౌతికవాదం తదితర సిద్ధాంతాలన్నీ వాటికి తగిన చైతన్య రూపాలు కలిగివుంటాయి ఆ విధంగా తమ స్వతంత్ర సాధనాన్ని కల్పించాయి వాటికి చరిత్ర, అభివృద్ధి లేదు మనిషి తన భౌతిక ఉత్పత్తిని పెంపొందించే సమయంలో వస్తుగతమైన సంబంధాలద్వారా తమ నిజమైన ఉనికితోపాటు తమ ఆలోచనలు, ఆలోచనకు కారణాలను కూడా ఊహిస్తారు జీవితాన్ని చైతన్యం నిర్ణయించదు అందుకుబదులు జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది మొదటి పద్ధతిలో చైతన్యాన్ని సజీవ వ్యక్తిగా తీసుకోవడం జరుగుతుంది రెండవ పద్ధతి వాస్తవ జీవితాన్ని వ్యక్తుల నిజమైన జీవితాన్ని నిర్దేశిస్తుంది చైతన్యం అన్నది వారి చైతన్యంగానే పరిగణించబడుతుంది కనుక చైతన్యం అనేది ఎప్పుడూ సాంఘిక ఉత్పాదనే మనిషి వున్నంతకాలం అది అలాగే వుండకతప్పదు

ఆవిధంగా చైతన్యానికిగల పాదార్థిక పునాదిని తగినంతగా అర్థం చేసుకోవడం అంటే అచేతనమైన పదార్థం మానవ శరీరంగా ఏర్పడి చైతన్యం పొందుతుందని చెప్పడం కన్నా చాలా ముందడుగు ఇది మానవ చరిత్రను నిజంగా అర్థం చేసుకోవడానికి నూతన ద్వారాలు తెరుస్తుంది చరిత్రను ఈవిధంగా అర్థం చేసుకోవడంద్వారా మాత్రమే భౌతికవాదం భావవాదంపై నిర్ణయాత్మకమైన విజయం సాధిస్తుంది దీనినే ఎంగెల్స్ ఇలా అంటారు "ఇప్పుడు భావవాదాన్ని దాని చివరి మజిలీనుండి కూడా అంటే చరిత్ర తత్వంనుండి కూడా తరిమివేయడం జరిగింది ఇప్పుడు చరిత్ర భౌతికవాద పరిశీలన పరిపుష్టమైనది మనిషి తెలుసుకోవడం అతని ఉనికిపై ఆధారపడివుందని, ఉనికి తెలుసుకోవడంపై ఆధారపడి లేదని వివరించే పద్ధతి లభ్యమైంది "

లోకాయతాన్ని గురించి మనకు తెలిసినంతటిదాన్నిబట్టి మార్క్సిస్టుపూర్వ భౌతికవాదాలన్నిటిలాగే చైతన్యాన్ని గురించిన దాని దృక్పథానికిగల తీవ్ర పరిమితులలో చైతన్యపు క్రియాశీల పాత్రను గుర్తించలేకపోవడం ఒకటి మనిషి చైతన్యం ప్రాథమికంగా అతని భౌతిక పరిస్థితులను బట్టి నిర్ణయించబడుతుందంటే దాని అర్థం అది ఆ పరిస్థితులవల్ల నిర్జీవ ఉత్పత్తిగా జరుగుతుందని కాదు వాటికి ఏవిధంగానూ స్పందించే శక్తి దానికి వుండదనీ కాదు వాటిని రూపొందించడంలోగానీ, నూతన దిశల్లోకి మళ్ళించడంలోగానీ, నూతన అభివృద్ధిని అడ్డుకోవడంలోగానీ నిస్సహాయంగా వుంటుందనీ కాదు చైతన్యమన్నది

అంతిమంగా పదార్థంలో వేళ్ళు తన్నుకుని వున్నప్పటికీ పదార్థంతో పరస్పర సంబంధం కూడా కలిగివుంటుంది ఆవిధంగా తనకు తాను ఒక సృజనాత్మకశక్తి సంతరించుకుంటుంది మెదడు ప్రకృతిని కేవలం నిరాసక్త అర్థంలో ప్రతిబింబించదు అదికూడా ప్రకృతిలో భాగం పంచుకుంటుంది, మలుస్తుంది అదుపు చేస్తుంది మరింత తేలికైన భాషలో చెప్పాలంటే ప్రకృతిని జయించడానికి మనిషిని సమాయత్తం చేస్తుంది ఈ ప్రక్రియ కొన్నిసార్లు సాపేక్షంగా మందగించవచ్చు కొన్నిసార్లు విప్లవాత్మకమైన వేగంతో నడవవచ్చు ఎందుకంటే ఈ వేగంపైనే వాస్తవ పాదార్థిక పరిస్థితులు పరిపక్వం కావడం ఆధారపడివుంటుంది అవి మాత్రమే సర్వాధిపత్యం సాధించడానికి హామీనిస్తాయి ఆవిధంగా చైతన్యానికి సృజనాత్మక పాత్ర కూడా వుంటుంది భావవాదులు ఊహించినట్లు అదొక్కటే సృజనాత్మకశక్తికాదు ప్రకృతిని దాని సూత్రాలను చైతన్యవంతంగా అవలోకించడంద్వారా శక్తి సామర్థ్యాలు పొందుతున్నదనే అర్థంలో అది సృజనాత్మకశక్తి కాగలుగుతుంది మనిషి, ప్రకృతి సజీవ ఐక్యతే సత్యమన్న వాస్తవాన్ని గుర్తించిన ఫలితంగానే పదార్థానికి, చైతన్యానికి గల పరస్పర సంబంధాన్ని గురించిన ఈ నూతన గతితర్కిక అవగాహన సాధ్యమైంది అందువల్లనే మనిషి ప్రకృతిపై ఆధిపత్యం సాధించడంలో చైతన్యం ఒక ముఖ్యపాత్ర వహించడాన్ని ప్రకృతి పదజాలంలోనే అర్థం చేసుకోవలసి వుంటుంది దీన్నే ఎంగెల్స్ ఇలా చెప్తాడు "*ఆవిధంగా ప్రతి దశలోనూ మనం ఒక విషయం గుర్తిస్తాము పరాయిదేశ ప్రజానీకంపై దురాక్రమణదారుడు దూసుకుపోయినట్లుగా మనం ప్రకృతిని శాసించలేము ప్రకృతికి వెలుపల వున్నదేదో దాన్ని అదుపుచేసినట్లు చేయలేము రక్తమాంసాలు మెదడుగల మనమూ ప్రకృతికే చెందుతాము దాని మధ్యలో వుంటాము దాని సూత్రాలను అర్థం చేసుకొని సరిగ్గా అన్వయించడంలో ఇతర జీవులన్నింటికన్నామనం మెరుగైన స్థితిలో వున్నాము కనుకనే దానిపై మనం ఆధిపత్యం సాధించగలుగుతున్నాము*"

విముక్తికి సంబంధించిన చర్చలో ఈ సమస్యకు మనం మళ్ళీ వస్తాము ప్రస్తుతానికి మాత్రం మార్క్సిస్టు పూర్వ భౌతికవాదులు చైతన్యానికిగల ఈ క్రియాశీల పాత్రను తిరస్కరించడం ఎంతటి లోపమో గమనిస్తున్నాము భౌతికవాదాన్ని కేవలం పదార్థం లేదా ప్రకృతిల కలయికగా మాత్రమే వారు దిగజార్చివేశారు మార్క్స్ దీన్నే ఇలా వివరించాడు

"ఫ్యూయర్‌బా వాదనలతో సహా ఇప్పటి వరకు వున్న భౌతిక వాదాలన్నింటిలో ప్రధానమైన లోపం ఏమంటే వస్తువు వాస్తవికత ఇంద్రియానుభూతి అన్నది కేవలం వస్తుగతంగాను లేక కదలికగాను మాత్రమే అర్థం చేసుకోవడం జరిగింది స్వీయాత్మకత లేని మానవ ఇంద్రియాల కార్యాచరణగా దాన్ని చూడలేదు అందువల్ల ఏం జరిగిందంటే మరో వైపు నుంచి చూస్తే భౌతిక వాద దృక్పథానికి భిన్నంగా భావవాద ధోరణి పెంపొందింది అయితే అమూర్త రూపంలో జరిగింది ఎందుకంటే భావవాదానికి నిజమైన ఇంద్రియ కార్యాచరణ తెలియదు"

చైతన్యాన్ని భావవాదుల దయాభిక్షకు వదిలేస్తే దాని క్రియాశీల పాత్రకు ఏ గతి పట్టిస్తారో మనమిప్పటికే చూశాము చైతన్యంపట్ల ఇలాంటి దృక్పథం చాలా విస్తరించి చివరకు దానికొక ఆరాధనా స్థాయి కల్పించబడుతుంది చైతన్యమొక్కటే వాస్తవమని గుర్తించాలనే విడ్డూరపు వాదనలు ముందుకు వచ్చాయి భావవాద తత్వశాస్త్రంలో చైతన్యాన్ని భ్రమాపూరితంగా ఆకాశానికి ఎత్తే ధోరణికి భిన్నంగా మార్క్సిస్టు భౌతివాదం దాని క్రియాశీలపాత్రను గుర్తించుతుంది అది తద్వారా తత్వశాస్త్రానికి, తాత్వికులకు ఒక కొత్త పాత్ర కలిగిస్తుంది "తత్వవేత్తలు ప్రపంచాన్ని పరిపరివిధాల నిర్వచించడమే చేశారు ఏమైనా అసలు విషయం దాన్ని మార్చడం" అని మార్క్సిజం పిలుపునిచ్చింది

## మార్పు, కొనసాగింపు-గతి తర్కం

ఆత్మకు సంబంధించిన భారతీయ వాదనల్లో ఒక ముఖ్యాంశాన్ని మనం ఇంతవరకు ప్రస్తావించలేదు ఆత్మసిద్ధాంతాన్ని సమర్థించేవారిలో అత్యధికుల వాదనలు లోకాయతానికి వ్యతిరేకంగాగాక బౌద్ధానికి వ్యతిరేకంగా వుద్దేశించబడ్డాయి బౌద్ధులు కూడా ఆత్మఉనికి నిరాకరించేవారే అందుకే దాన్ని అనాత్మవాదం అని అంటారు అయితే ఆత్మను తిరస్కరించడానికి వారు చూపించే కారణమూ లోకాయతుల వాదనా ఒకటికాదు పదార్థంనుండి చైతన్యం ఎలా ఉద్భవిస్తుందనే విషయం నిరూపించడంపట్ల బౌద్ధులకు పెద్ద ఆసక్తి లేదు అయినా ఆత్మ అనేది కేవలం కల్పితమని, దాని సహాయంతో అధిభౌతికవాదులు మోసం చేయజూస్తున్నారని వారు నిరూపించదలచుకున్నారు దీనంతటికీ కారణమేమంటే బౌద్ధ దృక్పథం ప్రకారం అన్నింటినీ కట్టిపడవేసే శక్తి అంటూ ఏదీ లేదు వారికి సంబంధించినంతవరకు అతి ప్రాథమికమైన వాస్తవం ఒకటే నిరంతరాయమైన మార్పు లేక అనంతమైన కదలిక- ఉనికిలోకి రావడం, ఉనికిని కోల్పోవడానికేనని వారి భావన అందువల్లనే వారు నిర్వచనం రీత్యానే చిరంతనమైనదిగా సమగ్రమైనదిగా చెప్పబడే ఆత్మను అంగీకరించడమన్న ప్రసక్తి లేకుండా పోయింది

ఆవిధంగా భారతీయ తత్వశాస్త్రంలో ఆత్మ నిరాకరణ రెండు తాత్విక దృక్కోణాలనుండి జరిగింది లోకాయతులు భౌతికవాద దృక్పథంనుండి చేశారు బౌద్ధుల తిరస్కరణకు కారణం గతితర్క దృక్పథం పర్యవసానం దీనినే ఎంగెల్స్ ఇలా చెప్తారు

*అతి చిన్న మూలకంనుండి అత్యున్నతమైన పదార్థంవరకు ఇసుకరేణువులనుండి సూర్యమండలంవరకు, ఏకకణంనుండి మానవునివరకు "మొత్తం ప్రకృతి ఉనికి ఆవిర్భావం, అదృశ్యం అనే నిరంతరాయమైన కదలికలు, అవిశ్రాంతమైన చలనంలో మార్పులోనే ఉన్నాయి "*

ఈరెండు దృక్పథాలు భౌతివాద దృక్పథం, గతితార్కిక దృక్పథం ఆత్మ నిరాకరణ విషయంలో పూర్తిగా ఏకీభవిస్తాయనడంలో నిస్సందేహం కాని భారతీయ తత్వశాస్త్రంలో ఇవి రెండూ వేర్వేరుగా వుండిపోయాయి భౌతికవాద గతితర్కంగాగానీ, గతితార్కిక భౌతికవాదంగా గానీ సమన్వయం కాలేదు ఆ పని మార్క్స్, ఎంగెల్స్‌ల తత్వశాస్త్రంలో

జరిగింది అలాంటి సమాగమం మరింత ఖచ్చితంగా చెప్పాలంటే ఈ రెండు ఒకదానిలో మరొకటి పరిపూర్ణత పొందడం భౌతికవాదం, గతితర్కం రెండూ ఎంతగానో అభివృద్ధి చెంది సుసంపన్నమైన తర్వాత మాత్రమే సాధ్యమైంది ఏమైనా భౌతికవాద గతితర్కం అభివృద్ధి చెందినా ఆనాటి భారతదేశంలోని ప్రాచీన మధ్యయుగాల తత్వశాస్త్రంలో చారిత్రికంగా అపరిపక్వమై వుండేది దీనికి గల ఒక ముఖ్య కారణాన్ని ఎంగెల్స్ ఇలా వివరించారు

*"తాత్వికులు వారనుకున్నట్లుగా కేవలం హేతువు ప్రకారమే వ్యవహరించజాలరు ప్రత్యేకించి ఆధునిక కాలంలో వారిని ముందుకు నడిపించేదేమంటే ప్రకృతిశాస్త్రంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ సాధించిన అభివృద్ధి భౌతికవాద గతితర్కం దిశగా నిర్ణయాత్మకమైన అడుగులు వేయాలన్నట్లైతే అనుభవవాద ప్రకృతిశాస్త్రం తత్వశాస్త్రానికి కావలసినంత సమాచారం అందజేసినప్పుడు మాత్రమే సాధ్యమౌతుంది కణజాలాల పరిశోధన, శక్తిపరివర్తన, జీవ పరిణామం వగైరాలకు సంబంధించిన సమాచారం లభ్యమైనప్పుడే తాత్వికరంగంలో ఒక అడుగు వేయడానికి తగిన సమర్ధన లభిస్తుంది ఇవి లేనప్పుడు తత్వశాస్త్రం అందుబాటులో లేని వాస్తవాల స్థానాన్ని ఊహలతో భర్తీచేసుకోవాలి ఆవిధంగా ఖాళీలను కేవలం ఊహాశక్తితో పూరించాల్సివుంటుంది ఈ క్రమంలో అది అనేక ప్రతిభావంతమైన భావాలను రూపొందించింది తదుపరి పరిశోధనలు అనేకం దాని మరుగున పడిపోయాయి అయితే అదేసమయంలో అది గణనీయమైన పరిమాణంలో నిరర్ధక వాదనలను కూడా ముందుకు తెచ్చింది అలా జరగడం అనివార్యం*

సాంప్రదాయక భారతీయ తత్వవేత్తలలో భౌతికవాదులుగానీ లేక గతితర్కక దృక్పథానికి ప్రతినిధులైనవారుగానీ, ప్రకృతిశాస్త్రాల నుండి అధునాతన సమాచారం అందుకోగల అవకాశం లేదు కనుక భౌతికవాద గతితర్కం దిశగా నిర్ణయాత్మకమైన అడుగులు వేసేందుకు అవకాశంలేదు కాని దీని అర్థం భారతీయ తత్వవేత్తలు ఎలాంటి ప్రతిభావంతమైన భావనలు రూపొందించలేదని, ఆ తర్వాత జరిగిన కొన్ని పరిశోధనలను కూడా అధిగమించలేదని కాదు భారతీయ భౌతికవాదులు ఆ పని చేయగలిగారని మనమిప్పటికే చూశాము గతితర్కానికి ప్రతినిధులైనవారు కూడా అలాంటి సామర్థ్యం ప్రదర్శించారు వాస్తవానికి బౌద్ధులు ఆత్మను తిరస్కరిస్తూ ప్రపంచం నిరంతర చలనంలో వుంటుందని సూత్రీకరించడమే భారతీయ తత్వశాస్త్రంలో ఒక విప్లవాత్మక లక్షణం రిస్ డేవిడ్స్ దీన్ని ఇలా చెప్తారు [1]

*"భారతీయ మతాలలో ఒక్క బౌద్ధం మాత్రమే ఆత్మను నిరాకరించింది ఈ ప్రత్యేకతకు గల శక్తి, ప్రాథమికత బౌద్ధం ఆనాడు ప్రపంచంలో వున్న అన్ని మతాలనుండి విడివడి వంటరిగా నిలవడంలో గోచరిస్తుంది అప్పటికింకా సనాతన భావాలలోనే ఉండిపోయిన ఐరోపా రచయితలు, ఈ సిద్ధాంతాన్ని హర్షించడానికి, అర్థం చేసుకోవడానికి కూడా చాలా కష్టపడ్డారు అందువల్ల మానవాళి ఆలోచన తొలి దశలోనే ఆ సిద్ధాంతాన్ని రూపొందించినవారు మతంలోనూ, తత్వశాస్త్రంలోనూ అంత పెద్ద నిర్ణయాత్మకమైన ముందంజ వేయడానికి ఎంత కష్టపడి వుంటారో మనం తెలుసుకోవచ్చు*

1 టి డబ్ల్యు రేస్ డేవిడ్ డైలాగ్స్ ఆఫ్ బుద్ధ

# VII

# విముక్తి - సమస్యలు

మన ప్రస్తుత తాత్విక అవసరాలనుబట్టి చూసినప్పుడు భారతీయతత్వశాస్త్రంలోని మరో ముఖ్యమైన అంశాన్ని చర్చించకపోతే అది అసంపూర్ణమే అవుతుంది ఈ అంశం మన తాత్వికుల విజయాన్ని సూచించేది కాదు వైఫల్యాన్ని వెల్లడించేది విముక్తికి సంబంధించి ఒక సానుకూల అవగాహనకు రాలేకపోవడమే వారి వైఫల్యం అదేసమయంలో భారతీయ తాత్వికులు తమ ఊహాజనిత విజయాలలో నిజంగా విఫలమైన సందర్భం ఇదే కాని దాన్ని తరచూ కీర్తించడం జరుగుతుంటుంది

దీనివల్ల కలిగింది తాత్వికపరమైన గందరగోళం మాత్రమే కాదు, అది ఒక భ్రమకు దారితీసింది ఆ భ్రమ ప్రజల చైతన్యంపై ప్రభావం చూపింది కాని కేవలం తృణీకారంవల్లా, త్రోసిపుచ్చడంవల్లా దాన్ని బద్దలు కొట్టలేము మనమీ వైఫల్యాన్ని వాస్తవాల ప్రాతిపదికన అర్థం చేసుకోవాలి ఆనాటి తాత్వికుల మేధాపరిధికిగల పరిమితులను గుర్తించాలి అప్పుడు మాత్రమే మనం వారి వైఫల్యాలను అధిగమించి నేటి మన అవసరాలకు సరిపడేట్లు విముక్తి పట్ల సరైన దృక్పథానికి రాగలుగుతాము

## భారతీయ తత్వశాస్త్రంలో విముక్తి

భారతీయ తత్వశాస్త్రం కేవలం మేధాపరమైన జిజ్ఞాస మాత్రమే కాదని, తరచూ పొగడ్తలు వినిపిస్తుంటాయి దానిలో జ్ఞానం కూడా ఒక మార్గంగా మాత్రమే చెప్పబడుతుంటుంది అంటే సైద్ధాంతిక క్రమశిక్షణ అన్నది అత్యున్నత మానవాదర్శమైన నిశ్రేయసను సాధించే దిశలో అలవర్చుకున్నప్పుడే ప్రాధాన్యత కలిగివుంటుందన్నమాట అన్నిటినీ మించినదాన్ని కోరుకోవడం అని ఈ పదానికి అర్థం ఈ ఆదర్శాన్నే మామూలుగా ముక్తి అంటుంటారు దీన్ని *మోక్షం, అపవర్గం, నిర్వాణం, కైవల్యం, నిరోధం* అనికూడా పిలుస్తుంటారు భారతీయ తాత్వికులలో అతికొద్ది మందిని మినహాయిస్తే చాలామంది

తమ తాత్విక కార్యకలాపాలు ఈ విముక్తిని సాధించే మార్గాన్ని అన్వేషించేందుకేనని చెప్పుకున్నారు భారతీయ తత్వశాస్త్రమన్నది స్వేచ్ఛా, పిపాసతో మత్తెక్కిపోయింది దానిలో ప్రతిపోగూ బంధాలను నిరసిస్తుంది

దీనిలో ఏమీ లేదని కాదు తొలి మీమాంసకులు లోకాయతులను మినహాయిస్తే భారతీయ తాత్వికులందరూ విముక్తికి సంబంధించిన సమస్యను లేవనెత్తి సమాధానమివ్వడం తప్పనిసరిగా భావించారు తమ భావాల అసలైన ప్రాధాన్యత దాన్ని సాధించడంలోనే వుందని భావించారు ఒక తాత్విక రచన మామూలుగా దానిలో చర్చించిన విషయమేమిటనే ప్రకటనతో ప్రారంభమౌతుంది విముక్తి లేక ముక్తి కలిగిస్తాననే వాగ్దానం చేస్తుంది మన తాత్వికులు ముక్తి సాధించడంపట్ల ప్రదర్శించిన చిత్తశుద్ధి ప్రశ్నించడానికి లేనిది అయితే అది వారి ఉద్దేశ్యం మాత్రమేనని అర్థం చేసుకోవాలి మన తాత్వికులకు తాము కోరుకుంటున్నదేదో తెలుసు. దాన్ని ఒక సానుకూల రూపంలో కనుగొనాలంటే, విముక్తి గురించి తగిన దృక్పథం రూపొందించాలంటే పాండిత్య ప్రకర్ష అందుకుతోడు సహృదయం మాత్రమే వుంటే చాలదు ఇంకా ఏదో కావాలని వారు తెలుసుకున్నారు ఆ ఇంకా ఏదో, ఏమిటో, మన సాంప్రదాయుక తత్వవేత్తలకు అదెలా అలభ్యంగా వుండిపోయిందో మనమిప్పుడు చూడాలి

## విముక్తి -భారతీయ భావవాదం

భారతీయ తత్వవేత్తల్లో ముక్కుసూటి భావవాదులు మాత్రమే విముక్తికి సంబంధించి ఒక ఏకీకృత దృక్పథం రూపొందించడంలో కృతకృత్యులయ్యారు తాత్వికంగానూ వాదన రీత్యానూ అది వారి వైఖరికి పూర్తిగా పొసగుతుంది అయితే ఈ వైఖరి మౌలికంగా ప్రతికూలమైంది ప్రకృతి వాస్తవికతను త్రోసిపుచ్చడంపట్లనే దానికి ఆసక్తి అంతేగాని ప్రకృతిని అర్థం చేసుకోవడం, దానిపై ఆధిపత్యం సాధించడం కాదు

పదజాలాలకు సంబంధించిన ప్రాకులాటను ప్రక్కనపెడితే అవాస్తవ బంధాలనుండి విముక్తి పొందడం దాని అర్థం అంటే చైతన్యాన్ని పదార్థంతో నిమిత్తం లేకుండా తప్పించడం పదార్థంలాగా ఈ బంధనం కూడా లేనిదే ఒక బూటకపు భాగస్వామ్య భావన మాత్రమే ఇది అజ్ఞానంవల్లనే జరుగుతున్నది జ్ఞానం దీన్ని చెదరగొడుతుంది ఇదంతా విముఖతకు దారితీస్తుందేమోనని ఆలోచించిన భావవాదులు కొన్నిసార్లు విముక్తికి సంబంధించిన తమ దృక్పథాన్ని సుదీర్ఘ స్వప్నంనుండి, పీడకలనుండి మేలుకోవడంతో పోల్చారు వారు చెప్పే ప్రకారమే ఈ పోలికను మక్కీకి మక్కీగా తీసుకోరాదు మెలకువ అనుభవాన్ని స్వాప్నిక అనుభవం ప్రాతిపదికన అర్థం చేసుకోమని వారు చెబుతున్నారు అందువల్ల వారి దృష్టిలో మేల్కోవడమన్నదానికి తాత్కాలిక ప్రాధాన్యత మాత్రమే స్వేచ్ఛకు సంబంధించిన భావవాద దృక్పథంలోని అత్యంత ప్రతికూల అంశాన్ని సాధారణ పరిభాషలో వర్ణించడం సాధ్యంకాదు

దాన్ని కేవలం నిగూఢ పద్ధతిలోనే వర్ణించాల్సివుంటుంది

విముక్తి పట్ల అలాంటి దృక్పథాన్ని అంగీకరిస్తే వాస్తవ ప్రపంచాన్ని మార్చాలనే సూత్రీకరణలన్నీ అప్రధానమౌతాయి అలాగే శ్రమ చేసేవారు, చేయనివారుగా వున్న సమాజాన్ని మార్చాలనే ఆలోచనలు కూడా అర్థం లేనివవుతాయి శ్రామికవర్గం తీరికవర్గంగా సమాజ విభజన కొనసాగుతుంది ఇదంతా చివరకు నిరర్ధకమైన అధిభౌతికవాదంగా పరిణమిస్తుంది భావవాదులకు సంబంధించినంతవరకు ఇది సంవృత సత్యం లేక వ్యావహారిక సత్యం అన్న పరిమితమైన అర్థమే వుండవచ్చు ఈ పరిమితమైన వైఖరితో మన భావవాద తాత్వికులు పవిత్రమైన విషయాలే చెప్పారు అద్వైత వేదాంతానికి సంబంధించిన కొందరు ప్రముఖ బోధకులు కదిలించివేసే కవిత్వం రాశారు మహాయాన భావవాదులు అందరినీ మించిపోయారు వారు ప్రేమనుగురించి, అంతఃకరణాన్ని గురించి మైత్రి, కరుణ అంటూ భారతీయ తత్వశాస్త్రంలో మరెవ్వరూ రాయనంత హృద్యంగా రాశారు ప్రపంచంలోని అతి సూక్ష్మజీవులు మొదలుకొని సజీవ పదార్థాలన్నింటి విముక్తికోసం తాము పనిచేస్తామని ప్రతిజ్ఞబూనారు వారి దృష్టిలో ఈ ప్రతిజ్ఞ అత్యున్నత ప్రజ్ఞ సాధించడానికి సన్నాహం మాత్రమే ఒకసారి ఈ జ్ఞానానికి చేరుకున్నట్లయితే మొత్తం ప్రపంచం దానిలోని మొత్తం జీవం కనిపించేది మాత్రమే తప్ప నిజమైందికాదని తెలిసిపోతుందని వారంటారు జీవులను విముక్తి చేయడమన్న వాగ్దానం చివరకు ఆ భావననే తుడిచిపెట్టడంగా ముగుస్తుంది నిజమైన ప్రపంచంలోని వారి నిజమైన కష్టాలను కూడా చూడనిరాకరించడం జరుగుతుంది మతిలేని మూర్ఖులకు మాత్రమే ఈ ప్రపంచం ఉన్నది దానిలోని దైనందిన జీవితాన్ని వారు నిజమని భ్రమిస్తారు వాస్తవ జీవితానికి సంబంధించిన కోణాన్ని పూర్తిగా నాస్తీకరించకపోతే నిజమైన స్వేచ్ఛను సాధించడమనే ప్రశ్న ఉదయించదు మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడం అనే ఆలోచన ఆవిధంగా ఒక భ్రాంతిలోనే జరుగుతుంది ఈ భ్రాంతినుండి బయటపడితే బాగుచేయాల్సిన ప్రపంచమే వుండదు

ఈవిధంగా భావవాది భౌతిక ప్రపంచ వ్యవహారాలలో జోక్యం చేసుకోవడానికి బదులు దానిపట్ల మానసిక దృక్పథాన్ని మార్చుకోవాలంటాడు అయితే కారణంపట్లగానీ, కారకం పట్లగానీ నూతన దృక్పథమేమీ అతను ఇవ్వడు ఎందుకంటే కారణమన్నది ఎక్కడా ఎప్పుడూ లేనేలేదు స్వేచ్ఛ అంటే ఒక విధమైన పూర్తి అంతరావలోకనం అక్కడ వ్యక్తి తన వ్యక్తిత్వంలోకి మాత్రమే చూసుకుంటాడు ఖచ్చితంగా చెప్పాలంటే వ్యక్తికి కూడా విముక్తి లేదు వ్యక్తే విముక్తి

బ్రహ్మం తెలిసినవాడు బ్రాహ్మణుడని వేదాంతమార్గం చెబుతుంది అది శుద్ధ సాక్ష్యంగా ఉండిపోవడంతప్ప మరేమీ చూడజాలదని కూడా చెప్తుంది ఎందుకంటే ఆ దశలో సాక్షితప్ప చూడటానికి అక్కడ సాక్ష్యమేమీలేదు గ్రహింపుతప్ప గ్రహించడానికి ఏమీ

లేని సంపూర్ణమైన-గ్రహింపు ఆనందదాయకమైందిగా చెప్పబడిరేది అద్వైత వేదాంతాన్ని ఆరాధించే ఒక ఆధునిక రచయిత దీన్నే ఇలా చెప్పాడు

*"ఈ సంతోషాన్ని నిజం చేసుకోవడమంటే సాధించిన దాన్ని సాధించడం గ్రహించిన సారాంశాన్ని మరుగు పరచే తెరలను తొలగించడం"*

అయితే ఈ రూపకాలంకారాన్ని కూడా కొంతవరకు మాత్రమే గట్టిగా తీసుకోవలసి వుంటుంది ఇక్కడ తెరచాటు ఏమీ లేదు అది కేవలం మన చిత్త భ్రమ వల్ల కలిగింది మాత్రమే దాన్ని తొలగించడం గురించి మాట్లాడడమంటే వర్ణనాతీతమైన అధిభౌతిక భ్రమలను గురించి లౌకిక భాషలో చెప్పడమే కాని అది లౌకిక విషయాలనన్నింటినీ త్రోసిపుచ్చాలని చెబుతుంటుంది అద్వైత వేదాంతులు విముక్తి సంబంధించిన తమ దృక్పధాన్ని వివరించేందుకు మరికొన్ని లౌకికపద్ధతులను కూడా అనుసరించారు అదే గుర్తింపును గుర్తించడం, తిరస్కరించబడినదాన్ని తిరస్కరించడం -

ఉదాహరణకు ఆత్రుతలో ఒక వ్యక్తి తన మెడలోని హారంపోయిందని భ్రమపడతాడు నిజానికి అది పోలేదు ఆ విషయం తెలియగానే అతని భావనలెలా వుంటాయి మరోసారి గుర్తించడం మాత్రమే జరుగుతుంది గుర్తించబడిన దాన్ని గుర్తించడం జరుగుతుంది నిజంగా ఎప్పుడూ తన అధీనంలోనే వున్న దాని అధీనంగురించి ఆలోచించడం జరుగుతుంది ఒక పూలదండను చూసి పాము అని భ్రమపడిన మనిషిని తీసుకుందాం అతను ఆ భ్రమనుండి బయటపడిన తర్వాత ఎలాంటిభావనకు గురౌతాడు? అప్పటికే తిరస్కరించబడినదాన్ని మరోసారి తిరస్కరించడమే అతనికి కలిగే భావన అక్కడ లేనిదాన్ని అభావం చేయడం జరుగుతుంది అలాగే మోక్ష దృక్పధం కూడా అఖండమైన దాన్ని గుర్తించడంపై అది ఆధారపడి వుంటుంది అఖండమైనది మొత్తం సకల చరాచర ప్రపంచంలో స్వతః సిద్ధంగా ఏర్పడుతుంది అఖండమైనదాన్నిగుర్తించాలనే కాంక్ష కేవలం దాన్ని గుర్తించలేదనే తాత్కాలిక భ్రమవల్లనే కలుగుతుంది ప్రపంచం కేవలం భ్రమాకల్పితమైన పదార్థం తనను తనే రద్దుచేసుకుంటుంది మోక్షంలో దాన్ని రద్దుచేసుకోవడం అంటే అప్పటికే రద్దయినదాన్ని రద్దుచేయడమే అప్పటికే తిరస్కరించబడినదాన్ని తిరస్కరించడమే[1]

స్వేచ్ఛకు సంబంధించిన సమస్యను ఈ విధంగా గందరగోళమైన అధిభౌతిక క్లిష్టతతో వాదించడమే శుద్ధమైన ఆనందంగా పరిగణించబడింది ఇది విరుద్ధమైన ఫలితానికి దారితీస్తుంది శూన్య పారవశ్యంగా పరిణమిస్తుంది మహాయాన బౌద్ధులు ఈ ఆదర్శాన్ని అలాగే పిలిచారు వారికి సంబంధించినంతవరకు స్వేచ్ఛ లేక నిర్వాణం అన్నది కేవలం శూన్యతకు మరో పదం మాత్రమే అది కూడా వర్ణించడానికి సాధ్యంకాని తథాత లేక అఖండత్వంతో మమేకమయ్యేదే కనుక దీనంతటి సారాంశమేమిటి? ప్రపంచం అన్నది కేవలం భ్రమ విముక్తి అంటే ఈ భ్రమను పూర్తిగా వదిలించుకోవడమే విముక్తి గురించిన నిజమైన అవగాహనగా భావవాదులందరూ చెప్పే అధిభౌతికవాదనల సారాంశం ఇది దాన్ని ముందుకు తెచ్చేందుకు, ప్రచారం చేసేందుకు వారనుసరించిన పద్ధతులు భయపెట్టేవిగా కొన్నిసార్లు ఉద్రేకపరిచేవిగా కూడా వుండవచ్చు కాని వారుచెప్పే దాని నిజమైన సారాంశం మాత్రం భయానకమైన అంధకారమే ప్రపంచానికి సంబంధించి చేయవలసింది ఏమీ

1 ఎస్ కె మైత్రా- ది ఎథిక్స్ ఆఫ్ హిందూస్

లేదు నిజమైన సమాజంలో తీరిగ్గా కూర్చున్న అల్పసంఖ్యాకులను మేపేందుకోసం చెమటోడ్చే నిజమైన స్త్రీపురుషులకు సంబంధించినంతవరకు ఈ సిద్ధాంతం యధాతధ స్థితిని కొనసాగించేందుకు సమర్ధనగానే వుంటుంది ఆవిధంగా వర్ణాశ్రమ సమాజంలోని దాసత్వాన్ని, బానిస చాకిరీని కొనసాగించమని చెబుతుంది వర్ణాశ్రమానికి రాజకీయ పరిరక్షకులైన భారతీయ స్మృతికారులు స్వేచ్ఛకు సంబంధించిన ఈ దృక్పధం వల్ల కలిగే సాంఘిక ప్రయోజనాన్ని తేలిగ్గా గ్రహించగలిగారు అందుకే దానికి ఎంతో ఊతమిచ్చారు ఆవిధంగా ప్రజా బాహుళ్యం, నిరంకుశత్వాన్ని, నికృష్టజీవితాన్ని ఎలాంటి ప్రతిఘటన లేకుండా సహించేలా చేయవచ్చునని భావించారు వారు అధిభౌతికవాదులు కాకపోయినప్పటికీ ముఖ్యంగా ఉపనిషత్తులు, వేదాంతాలలోని రూపంలో స్వేచ్ఛకు సంబంధించిన భావవాద దృక్పధాన్నే తామూ ప్రకటించారు మనువు దీన్నే ఇలా చెప్పాడు *"పవిత్రమైన కార్యకలాపాలలో అత్యున్నత మానవ సంతోషాన్ని సాధించడంకన్నా గొప్పదేది? ఆత్మకు సంబంధించిన జ్ఞానం అన్నింటికన్నా గొప్పదని చెప్పాలి ఎందుకంటే అధ్యయనంలోని శాఖలన్నింటిలో అది మొదటిది అది అమరత్వానికి హామీనిస్తుంది ఆత్మకోసమే పనిచేసేవాడికి ప్రతిదానిలో ఆత్మే కనిపిస్తుంది ఆత్మలో ప్రతిదీ కనిపిస్తుంది అలాంటివారే అత్యున్నత శక్తివంతులౌతారు "*

## న్యాయ వైశేషికుల దృక్పధం

విముక్తి పట్ల వైశేషికుల ప్రామాణిక దృక్పధం ఎలా వుండేది? శ్రీధరుడి సుప్రసిద్ధ సూత్రీకరణలప్రకారం స్వాతంత్ర్యమంటే ఆత్మకు గల 9 నిర్దిష్ట గుణాలను వదులుకోవడం - **నవనమాత్మ విశేషగుణనం అత్యంతోచ్ఛిత మోక్షం** - అని చెప్పారు ఈ తొమ్మిది విశేషగుణాలేమంటే చైతన్యం (జ్ఞానం) సంతోషం, కష్టం, కోరిక, విముఖత, ప్రేరణ, రుజువర్తన, వక్రత్వం, గత చర్యల ఫలితం (సంస్కార) వీటన్నింటినీ నాశనం చేయడంద్వారా ఆత్మ విమోచన సాధ్యం అయితే ప్రశ్న ఏమంటే ఈ విశేష లక్షణాలన్నీ నిర్మూలించబడినతర్వాత ఆత్మకు సంబంధించి మిగిలేదేమిటి? మరోమాటలో చెప్పాలంటే విమోచన చెందిన ఆత్మ పరిస్థితి ఏమిటి? దీనికి ఒకటే సమాధానం ఆత్మ అన్నది ఒక నిర్గుణ పదార్ధం అవుతుంది దానికి చైతన్యంగానీ, ఎలాంటి భౌతిక ధర్మాలుగానీ వుండవు ఆవిధంగా అది మట్టిముద్ద లేక రాయివంటి భౌతిక వస్తుజాలంనుండి విడదీయరానిదిగా తయారవుతుంది సాంప్రదాయక తత్వశాస్త్రంలో వైశేషిక దృక్పధంపై కానవచ్చే ప్రధాన విమర్శ ఇది ఇందుకు వ్యతిరేకంగా వైశేషికులు తమ వాదనలు సమర్ధించుకున్నారు ఈ విమోచన దశ కూడా ఏదో ఒక విధమైన అతీత స్థితితో సమానమవుతుందని వారు చెప్పారు

నయ్యాయికులు దీనితో పూర్తిగా ఏకీభవించారు  విముక్తి అంటే పాదార్థిక ప్రపంచ బంధనాలనుండి, అనుభవాలనుండి ఆత్మ విముక్తి పొందడమేనని అంగీకరించారు వారు చెప్పే ప్రకారం విముక్తి పొందిన ఆత్మ చైతన్యం, కాంక్ష, ప్రేరణ, సుఖదుఃఖాలవంటి భౌతిక ధర్మాలను పూర్తిగా కోల్పోతుంది  కాని ఈ విముక్త ఆత్మ ఏదోఒక విధమైన అతీత ఆనందం పొందుతుందన్న వైశేషికుల వాదనతో మాత్రం న్యాయికులు విభేదించారు

పునర్జన్మకు సంబంధించిన భయం తాత్విక జ్ఞానం లేక సత్యానికి సంబంధించిన జ్ఞానం (తత్వజ్ఞానం)ద్వారా అధిగమించబడింది  న్యాయ దృక్పథం ప్రకారం తాత్విక జ్ఞానం మనను విమోచనవైపుగా ఎలా నడుపుతుందో ఇలా వర్ణించబడింది

నిజమైన జ్ఞానం కుహనా జ్ఞానాన్ని నిర్మూలిస్తుంది  కుహనా జ్ఞానం దోషానికి కారణమౌతుంది  కనుక దాన్ని తొలగించడంవల్ల దోషాలు తొలగిపోతాయి  దోషం అన్నది ప్రేరణ(ప్రవృత్తి)కు కారణంగనుక దాన్ని నిర్మూలించడంతో ప్రేరణ నిర్మూలన జరుగుతుంది ప్రేరణ అన్నది పుట్టుక(జన్మ)కు కారణంగనుక దాన్ని నిర్మూలించడంవల్ల పుట్టుక లేకుండా పోతుంది  అప్పుడు పునర్జన్మకు అవకాశం వుండదు కష్టాలకు కారణం పుట్టుకే కనుక అది లేకుండా పోవడంతో కష్టాలు కూడా వుండవు  ఆవిధంగా కష్టాలనుండి సంపూర్ణ విముక్తిగా విమోచన లభిస్తుంది  కనుక నిజమైన జ్ఞానమన్నది విముక్తికి అంతిమ కారణంగా చెప్పబడింది  కాని ప్రశ్న ఏమంటే ఆ నిజమైన జ్ఞానం దేన్ని గురించి? మనకు తెలుస్తున్నంతవరకు న్యాయికుల దృష్టిలో దీనికి సమాధానం - ఆత్మను వస్తువులనూ, దానికి ఏమాత్రం సంబంధం లేని లక్షణాలను కలగాపులగం చేయకుండా నిశుద్ధమైన ఆత్మనుగురించి, తనను గురించి పెంచుకునే నిజమైన జ్ఞానం

ఈ దృక్పథంపట్ల మామూలుగా వుండే విమర్శ ఏమంటే ఇది చెప్పే విముక్తి బొత్తిగా అనాకర్షణీయమైనది  విముక్తి సాధించడంతో వ్యక్తి తన స్వతః సిద్ధమైన తొలి స్థితికి, సంతోషంగాని, ఎలాంటి చైతన్యంగాని లేనిస్థితికి తిరిగి వెళ్ళిపోవాలి  అదే ఆత్మ నిజమైన దశ అని, శుద్ధత్వమని న్యాయికులు మనలను నమ్మమంటారు  "మొత్తం చైతన్యాన్ని, జీవాన్ని తుడిచిపెట్టేట్లయితే తెలివైన మనిషి ఎవరూ ఎప్పుడూ సంపూర్ణ విముక్తిని కోరుకోరు తద్వారా అతను ఒక రాతితో *(శిలాశకలకల్ప)* సమానమైపోతాడు  రాతిని, అతనిని వేరు చేయలేని *(పాషాణ నిర్విశేష)* స్థితి ఏర్పడుతుంది  అది జడత్వం అవుతుంది" అని విమర్శలు వచ్చాయి  కాని నయ్యాయికులు ఈ విమర్శలను ధైర్యంగా ఎదుర్కోదలచారు బాధలనుండి అంతిమ విముక్తి సాధించడమే విముక్తి సారాంశం కనుక అన్నిరకాలైన సంతోషాలను పరిత్యజించడం తప్పనిసరి అన్నారు  ఎందుకంటే సంతోషమన్నది బాధనుండి విడదీయరానిది

విముక్తి గురించిన న్యాయిక దృక్పథంపై వున్న సాంప్రదాయక వివాదాలివి బాధలనుండి సంపూర్ణ విముక్తి అన్న తమ వాదన సంతోషానికి అతీతమైన దశగా గుర్తించాలని న్యాయికులు చెప్పారు సంతోషం, ఆనందం లేక ఆహ్లాదం లేని అలాంటి దశ ఎప్పటికీ ఆకర్షణీయం కాజాలదని న్యాయికుల విమర్శకులైనవారు చెప్పారు న్యాయికులకు, వారి ప్రత్యర్థులకు మధ్య వివాదం మామూలుగా విముక్తిలో సంతోషం వుంటుందా? వుండదా అనేది ఈ ప్రత్యేకాంశంపైనే కేంద్రీకరించబడింది కనుక న్యాయ సిద్ధాంతాన్ని వ్యాఖ్యానించినవారు ఒక ముఖ్యమైన విషయాన్ని విస్మరించారు ఆ సిద్ధాంతం మూల సూత్రాలకు, విముక్తి గురించిన ఈ దృక్పథానికి మధ్య అంతర్గతంగానే వ్యత్యాసమున్నదని పసిగట్టలేకపోయారు

విముక్తి గురించిన న్యాయ దృక్పథం అంతర్గతంగా ఏకసూత్రత కలిగివున్నదేనా? ఆ తాత్విక చింతన ప్రాథమికసూత్రాలకు అది అనుగుణమైనదేనా? లేక మరెక్కడినుండో ఏదోవిధంగా తెచ్చి ఏకత్వాన్ని, స్థిరత్వాన్ని గురించి పెద్దగా ఆలోచించకుండా దాన్ని న్యాయసిద్ధాంతంలో జొప్పించడం జరిగిందా? ఆత్మను లేక తనను గురించిన నిజమైన జ్ఞానమే విముక్తికి అంతిమ కారణమని న్యాయ దృక్పథంలో చెప్పబడిన సంగతి చూశాము నిజమైన జ్ఞానం జ్ఞానానికి ఒక రూపం కనుక జ్ఞానం రూపొందడానికి అత్యవసరమైన అంశాలలో ఏదో ఒకటి వుంటేనే కలుగుతుంది మరోవిధంగా చెప్పాలంటే ఆత్మ, శరీరాల సమ్మేళనాల గొలుసువల్ల, మనస్సు, ఇంద్రియాల బాహ్యప్రపంచ కారకాలవల్లనే కలుగుతుంది న్యాయికుల దృష్టిలో బంధమన్నది విముక్తికి అత్యవసరమైన షరతు రెండవది విముక్తికి అంతిమ కారణంగా చెప్పబడే - ఆత్మకు లేదా తనకు సంబంధించిన నిజమైన జ్ఞానం అసాధ్యమైంది ఈరెండు అంశాలుకూడా న్యాయ దృక్పథంలోని పొరపాటు వైఖరులను వెల్లడిచేస్తాయి తనకు సంబంధంలేని విముక్తి దృక్పథాన్ని తెచ్చిపెట్టుకోవడమన్న విచిత్రమైన ధోరణివల్ల కలిగిన ఫలితాలివి

ఒక విధంగా చెప్పాలంటే బంధం లేకపోతే విముక్తి లేదు ఎందుకంటే విముక్తి అంటేనే బంధాలనుండి విముక్తి చీకటి వుంటేనే కాంతి అన్నదాన్ని అర్థం చేసుకున్నట్లే అయితే న్యాయికులు చెప్పినదాని సారాంశం ఇదికాదు స్వాతంత్ర్యం లభించాలంటే అతి ప్రధానమైన మౌలిక అవసరం బంధనం అని వారు నొక్కి చెప్పారు విముక్తి నిజమైన జ్ఞానంవల్ల కలుగుతుంది ఆత్మ శరీరాల విచిత్రమైన కలయికవల్ల అంటే మనస్సు, ఇంద్రియాలు వగైరాల కలయికవల్లే నిజమైన జ్ఞానం కలుగుతుంది కాని ఆత్మ, శరీరాల కలయిక వగైరాలు బంధనంతో సమానం ఎందుకంటే న్యాయిక దృక్పథం ప్రకారం బంధమంటే జన్మ, పునర్జన్మల చక్రం తప్ప మరేమీకాదు ఆత్మ ఒక శరీరంనుండి మరొక శరీరంలోకి వలస పోతుంటుంది ఆవిధంగా బంధనానికి సంబంధించిన న్యాయిక దృక్పథం విముక్తిని అర్థం చేసుకోవడానికి తప్పనిసరి అవసరం అవుతుంది అది స్వాతంత్ర్యానికి

అంతిమ కారణమౌతుంది అత్యవసరమైన, అతిముఖ్యమైన అంశమౌతుంది ఇది ఒక స్పష్టమైన తిరుగులేని వైరుధ్యం బంధంవల్ల కలిగే విముక్తి చీకటివల్ల కలిగే ప్రకాశం వంటిదే

మూడవది - న్యాయిక దృక్పథం ప్రకారం ఆత్మ నిజమైన స్వభావానికి సంబంధించిన జ్ఞానాన్ని ఎప్పటికయినా సాధించడం నిజంగా వీలవుతుందా? వాత్సాయనుడిదృష్టిలో అదే విమోచనకు నిజమైన కారణం దాన్ని సాధించవచ్చునా అంటే సమాధానం లేదు అనే చెప్పాల్సివుంటుంది ఇందుకు గల కారణాలు మనం ఇప్పటికే చర్చించాము అన్నిరకాల విజ్ఞానాలకు మౌలికమైన షరతు ఏమంటే మనస్సు, ఇంద్రియాలతోకూడిన శరీరంతో ఆత్మ సమ్మేళనం, వాటిద్వారా ప్రాపంచిక వస్తుజాలంతో సంబంధం అందువల్ల ఆత్మను తానుగా తెలుసుకొనే అవకాశం లేదు అలాగే శరీరంతో సంబంధంలేకుండా శుద్ధ ఆత్మను తెలుసుకోవడం అసాధ్యం ఆత్మ శుద్ధత్వాన్ని గురించి జ్ఞానం న్యాయిక దృక్పథం ప్రకారం అసాధ్యమైనప్పుడు అదే దృక్పథంలో నిజమైన జ్ఞానం విమోచనకు దారితీస్తుందని వాదించడం ఎలా కుదురుతుంది?

వాస్తవానికి విముక్తి పొందిన దశలో కూడా ఆత్మ ఉనికిని గురించి మాట్లాడటం న్యాయక దృక్పథంనుండి ప్రశ్నార్థమైంది ఏదైనా ఒకదాని ఉనికిని గురించిన సానుకూల ఆధారం లేక ప్రత్యక్ష సాక్ష్యం అంటే అది ఏ రూపంలో వున్నా సరే దాని గురించిన జాగృతి లేక జ్ఞానం లేక చైతన్యం కలిగివుండటమే ఏమైనా ఆత్మ విమోచనం తరువాత దానికెలాంటి చైతన్య రూపం వుండదని చెప్పబడింది అది పూర్తిగా అచేతన పదార్థమౌతుంది భారతీయ పరిభాషలో దాన్నే జడం అన్నారు పూర్తిగా అచేతనమైన పదార్థం తన గురించి తాను తెలుసుకోవడమన్న ప్రసక్తి వుండదు అందువల్ల ఆత్మ విమోచనం పొందినప్పుడు అది తన ఉనికిని తనే తెలుసుకోజాలదు

న్యాయిక దృక్పథంలో ఇతర లోపాలు కూడా ఉన్నాయి విమోచన పొందిన ఆత్మ ఉనికి చెప్పేందుకు నిజంగా ఆధారాలేమీ లేవని వారే అంగీకరించారు ఆత్మ వుందనేది కేవలం ఉపాఖ్యానాలవల్లనే నిరూపించబడుతున్నది కాంక్ష, వైముఖ్యం, ప్రేరణ, సంతోషం, దుఃఖంవంటి గుణాలనుబట్టి ఈ నిర్ధారణ చేయబడుతున్నది జ్ఞానానికి కొంత ప్రాతిపదిక కావాలి అందువల్లనే మనం ఈ గుణాలన్నింటికీ మూలం ఆత్మ ఉనికి అని సూత్రీకరిస్తున్నాము న్యాయ సూత్రాలలో దీన్నే ఇలా పేర్కొన్నారు "ఆత్మ ఉనికికి సంకేతమేమంటే కాంక్ష, వైముఖ్యం, ప్రేరణ, సంతోషం, కష్టం, జ్ఞానం" ఇదే తత్వం ప్రకారం ఆత్మ అన్నది విమోచన దశలో ఈ లక్షణాలేమీ కలిగివుండదు కోర్కెను వైముఖ్యాన్ని, ప్రేరణను, సంతోషాన్ని, కష్టాన్ని, జ్ఞానాన్ని పూర్తిగా విడనాడకపోతే ఆత్మకు విముక్తి అంటూ వుండదు అటువంటప్పుడు విమోచన తర్వాత కూడా ఆత్మ వుంటుందని ఎలా భావించాలి? ఆత్మ ఉనికికిసంబంధించి అవసరమైన లక్షణాలేమీ లేకుండా దాని ఉనికిని నిర్ధారించడం

సాధ్యంకాని విషయం అందువల్ల నయ్యాయికుల దృక్పథంలో మిగిలే ఒకే ఒక మార్గం ఉపాఖ్యానమే క్లుప్తంగా చెప్పాలంటే విమోచన తర్వాత ఆత్మ వుండడం అన్నది అనుచితమైన ఊహ

ఈ విమర్శకు సాంప్రదాయకంగా లభించే సమాధానం తెలిసిందే ఆత్మ శాశ్వతమైనదని ఇప్పటికే స్వతంత్ర ఆధారాలద్వారా రుజువైందని నయ్యాయికులు చెప్తారు కనుక విమోచన తర్వాత కూడా అది ఉండకుండాపోదు అందువల్ల విమోచన తర్వాత దాని ఉనికి నిరూపించే సంకేతాలేమీ కనిపించవు విమోచన తర్వాతకూడా దానికి శాశ్వతత్వం వుంటుంది

దీన్నిక్రోడీకరించి చెప్పాలంటే స్వాతంత్ర్యానికి సంబంధించిన న్యాయతత్వంలోని దృక్పథం దాన్ని సుసంపన్నం చేసే బదులు దానికి అనేక అంతర్గత సమస్యలు తెచ్చిపెడుతుంది అందువల్ల విముక్తి సంబంధించిన దృక్పథం నిజంగా ఆ తత్వంలోని ప్రాధమిక సూత్రాలతో ఏవిధంగానూ సంబంధం లేనిది కాని ఎలాగో దానిలో చొరబడింది న్యాయసూత్రాలలోని రెండు ప్రత్యేక లక్షణాలను మనం గమనించినప్పుడు ఈ అంచనా మరింత బలపడుతుంది మొదటి విషయం - అది విమోచన లేక నిశ్రేయష సాధనకు దారితీసే తాత్విక జ్ఞానాన్ని అందించగలనన్న వాగ్దానంతో మొదలవుతుంది భారతీయ తాత్విక రచనల్లో అనుసరించిన సాంప్రదాయం ఏమంటే ఆ రచనకు ఒక ఉపసంహారం వుండాలి ఉపోద్ఘాతంలో వాగ్దానం చేసిన అంశాన్ని అక్కడ తిరిగి చర్చించాలి కాని విచిత్రమేమంటే న్యాయ సూత్రం మాత్రం ఉపసంహారంలో నిశ్రేయష గురించి ఎలాంటి ప్రస్తావన చేయలేదు అది కేవలం తార్కిక వాదోపవాదాలకు సంబంధించిన సాంకేతిక చర్చకే పరిమితమైంది ప్రారంభానికి, ముగింపుకు మధ్యగల ఈ తేడానుబట్టి చూసినప్పుడు ఈ రచన నిజంగా విమోచనకు సంబంధించిన సమస్యలను తీవ్రంగా పట్టించుకోలేదని అర్థమౌతుంది న్యాయ సూత్రాలను గురించిన సాధారణ అవగాహనకు పూర్తి భిన్నంగా ఉన్నప్పటికీ ఇది కాదనలేని వాస్తవం రెండవ విషయం - న్యాయ సూత్రాలలో ఒక మొత్తం భాగం విమోచనకు సంబంధించిన సవివరమైన చర్చకు కేటాయించబడింది అదే అపవర్గ పరీక్షా ప్రకరణం విమోచనపట్ల విమర్శనాత్మక పరీక్ష అని దీని అర్థం ఇలాంటి అధ్యాయంలో విమోచనకు సంబంధించిన కనీసం ఒక ఆధారం వుంటుందని ఎవరైనా ఆశిస్తారు అయితే మొత్తం అధ్యాయంలో ఎక్కడా విమోచన నిజమైందని చెప్పే ధోరణి కనిపించదు ప్రధానంగా మీమాంస తత్వంలోని విషయాలను గురించి శుష్క ప్రశ్నలను లేవనెత్తడంతోనే సరిపోయింది అందువల్లనే మలిదశలోని న్యాయికులు విమోచనకు సంబంధించి కొన్ని సానుకూల వాదనలను తీసుకురావలసి వచ్చింది కాని విచిత్రమైన రీతిలో వారు ముందుకు తెచ్చిన ప్రధాన ఆధారం న్యాయ తత్వమౌలిక సూత్రాలతో ఏవిధంగానూ సంబంధంలేకుండావుంది అలాంటి ఆధారాలు ఎక్కువ సందర్భాలలో ఉపనిషత్తులనుండి ఉటంకించబడ్డాయి వేదాలలో భాగాలైన ఉపనిషత్తులకు పవిత్ర ప్రామాణ్యం వుందని చెప్పబడింది

ఇదంతా మనకు చాలా ఆసక్తి కలిగిస్తుంది ఎందుకంటే న్యాయ తత్వంలో విమోచనకు సంబంధించిన అవగాహనా దృక్పథం ఎక్కడినుండి తీసుకోబడిందో తెలుస్తుంది ఆత్మ గురించిన నిజమైన జ్ఞానం భౌతిక ప్రపంచ శృంఖలాలనుండి విముక్తి పొందడంద్వారానే సాధ్యమన్న అవగాహన ఉపనిషత్తులలోని భావవాద ఊహాగానాలనుండి ఉద్భవించింది ఆ తర్వాత అద్వైత వేదాంతంలో మహాయాన బౌద్ధంలో మరింత విశదీకరించబడింది స్వాతంత్ర్యానికి సంబంధించిన ఈ దృక్పథంలో రెండు ప్రాథమిక అవగాహనలున్నాయి మొదటిది చైతన్యం ఒక్కటే అంతిమ వాస్తవం రెండవది-సాధారణంగా తెలిసిన భౌతిక ప్రపంచం అంతిమంగా వాస్తవంకాదు ఈరెండు వైఖరులు చేపట్టినట్లయితే బంధనాల స్వభావానికి సంబంధించి ఒక నిర్దిష్ట అవగాహనకు దారితీస్తాయి అదేమంటే చైతన్యం పదార్థంలో కల్పించుకోవడం అజ్ఞానంవల్లనే జరుగుతుంది ఆవిధంగా అజ్ఞానాన్ని వదిలించుకోవడంద్వారా జ్ఞానం చైతన్యంయొక్క ఏకైక వాస్తవికతను గుర్తిస్తుంది అదే విముక్తి భావవాద దృక్పథంతో ఏమాత్రం విభేదించకపోగా దానిలో చక్కగా ఇమిడి పోయేదిగా ఈ వాదన వున్నది

## స్వాతంత్ర్యం- సాంఖ్య దృక్పథం

భావవాదాన్ని వ్యతిరేకించిన మరో ముఖ్యమైన తాత్విక చింతన సాంఖ్యం దాని మూల స్వరూపాన్ని పునర్నిర్మించడంలోగల సమస్యలు మనమిప్పటికే చర్చించాము ఆ మూల సూత్రాలలో విముక్తిని గురించి ఏమని పేర్కొనబడిందో ఊహించుకునేందుకు ప్రయత్నించడం వ్యర్థం దాన్ని సవరించి వేదాంత చట్రంలోకి మలచేందుకు ప్రయత్నించి రూపొందించిన పాఠాలలో ఏమని పేర్కొనబడిందో మాత్రమే మనం చూడగలం ఏమైనప్పటికీ ఈ రచనలలో కనిపించేమేరకు చూస్తే అది మూలంలోని వక్కాణింపుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది అందువల్లనే మలిదశ సాంఖ్యాన్ని విమర్శించిన భావవాదులు అది వైరుధ్యాల పుట్ట అని తేలిగ్గా కొట్టివేయగలిగారు సాంఖ్యకారిక స్వాతంత్ర్యమంటే అన్నిరకాలైన బాధలనుండి విముక్తి అన్న ప్రకటనతో ప్రారంభమౌతుంది అన్ని అనుభవాలను పూర్తిగా తుడిచిపెట్టడంద్వారా ఇది లభిస్తుందని, ఆత్మ అన్నది స్వతంత్రమైన స్వయం ప్రతిపత్తిగల వాస్తవంగా రూపొందుతుందని చెప్పబడింది ఆవిధంగా స్వాతంత్ర్యానికి సంబంధించిన ఈ దృక్పథం న్యాయ సూత్రాలను పోలివున్నది అయితే న్యాయ దృక్పథంలో ఒక చైతన్యపదార్థంగా ఈ స్వయం ప్రతిపత్తికి తనను గురించిన అవగాహనలో చైతన్యంకూడా మిగలదు కాని సాంఖ్యంలో ఈ స్వీయతకే చైతన్యం వుంటుంది అంతేగాని అది ఒక పదార్థం కాదు ఆధ్యాత్మిక చైతన్యం లేని పదార్థం అసలే కాదు [1] కనుక మలిదశ సాంఖ్యంలో విమోచనకు సంబంధించిన దృక్పథం మాత్రమేగాక విముక్తి పొందిన ఆత్మ సిద్ధాంతం కూడా వేదాంతానికి

1 ఎస్ కె మైత్రా

బాగా దగ్గరగా తీసుకువచ్చింది ఆత్మ లేక స్వీయతను పురుష అని పిలిచారు అన్నిరకాలైన దైనందిన అనుభవాలకు అది దూరంగా వుంటుంది తన స్వభావసిద్ధంగానే అఖండ స్వాతంత్ర్యం కలిగివుంటుంది బుద్ధి పరివర్తనే అన్ని అనుభవాలకు మూలమౌతుంది అది ప్రాథమిక పదార్థం లేక ప్రధాన వల్ల ఉత్పత్తి అవుతుంది అయితే అజ్ఞానంపల్ల స్వీయత ఏదో ఒక విధంగా బుద్ధి చంచలత్వంలో ఇరుక్కుపోతుంది ఆవిధంగా బంధనాలకు లోబడుతుంది బాధలు తెచ్చిపెడుతుంది దానినుండి బయటపడే ఒకే ఒక మార్గం నిజమైన జ్ఞానం అంటే ఆత్మ ప్రధాన లేక పదార్థం వల్ల కలిగే అన్నింటినుండి నిజంగాను, సంపూర్ణంగాను విడివడాలి

ప్రస్తుత సాంఖ్య దృక్పథం వేదాంతం నుండి విభేదించే అంశం బాహ్య ప్రపంచ ప్రతిపత్తికి సంబంధించిందే మలిదశ సాంఖ్యానికి ప్రతినిధులైనవారు కూడా దాని మూలంలోని ప్రధానాంశాన్ని తొలగించలేకపోయారు ప్రధాన లేక ప్రకృతి అనబడే ప్రాథమిక పదార్థంనుండి పరిణామక్రమంలో ప్రపంచం ఆవిర్భవించిందన్న వాస్తవాన్ని చెరిపివేయలేకపోయారు అంతేగాక ఈ మలిదశలోకూడా దృశ్యప్రపంచ పరిణామం ప్రాథమిక పదార్థంనుండి జరిగిందన్న సూత్రం నిజమైన పరివర్తనగా పరిగణించబడింది భారతీయ పరిభాషలో పరిణామం అంటే అదే అద్వైత వేదాంతంలోని వివృతకు ఇది భిన్నమైంది ఒక భ్రమాపూరితమైన పరివర్తన లేక పరివర్తన గురించిన భ్రమ అని ఆ పదానికి అర్థం పరివర్తన గురించిన ఈ భ్రమకు అజ్ఞానమే కారణమని భావించబడింది పాదార్థిక ప్రపంచంయొక్క ఈ భ్రమాపూరితమైన దశ తొలగిపోవాలంటే, అత్యున్నత తాత్వికజ్ఞానం లభించాలంటే పాదార్థిక ప్రపంచం గురించి భ్రమలు కలిగించే అజ్ఞానాన్ని పారద్రోలాలి చైతన్యం ఏకైక వాస్తవమని, అదే స్వాతంత్ర్యమని గుర్తించాలి అయితే తాత్విక జ్ఞానబలంతో శుద్ధ చైతన్యం స్వాతంత్ర్యం సాధిస్తుందనే ఈ దృక్పథం మలిదశ సాంఖ్యులకు చాలా తప్పుగా కనిపించింది శాశ్వతమైన ప్రాథమిక పదార్థం నిజంగా పరివర్తన చెందుతుందని వారి భావన

మూల సాంఖ్యంలో పురుషకు గల స్థానమేమిటన్నది నిజంగా సందేహాస్పదమైన విషయం సాంఖ్యానికి సంబంధించిన తదుపరి పాఠాలలో పురుషకుగల స్థానం చాలా అతిశయోక్తిగా చెప్పబడింది అది అద్వైత వేదాంతంలో ఆత్మకు ఇచ్చిన స్థానం దరిదాపులకు వచ్చింది భౌతిక ప్రపంచం ప్రతిపత్తిని కూడా భ్రమగానే పరిగణించి వుంటే అప్పుడు దీనివల్ల ఈ తత్వచింతనకు పెద్ద ఇబ్బందికలిగివుండేదికాదు కాని అలా జరగలేదు మలిదశలోని సాంఖ్యం వేదాంతంతో ఎన్ని విధాల రాజీపడినప్పటికీ మూలంలోని భౌతిక ప్రాతిపదికను త్రోసిపుచ్చడానికి సిద్ధపడలేదు కనుకనే ఒక ప్రశ్న మిగిలిపోయింది ప్రాథమిక పదార్థం నిజంగా పరివర్తన చెందడంద్వారా ఏర్పడిన భౌతిక ప్రపంచం ఎప్పుడూ విడివడివుండే శుద్ధ చైతన్యంతో లేక పురుషతో ఎలా సంబంధం కలిగివుంటుంది? దీనికి మలిదశలోని

సాంఖ్యులు ఎలాంటి సమాధానమూ ఇవ్వలేకపోయారు పరస్పరం పొంతనలేని వాదనలలో మునిగిపోయారు ప్రాథమిక పదార్థంనుండి ప్రపంచ పరిణామం జరిగిన మొత్తం క్రమం పురుష సంతోషంకోసమేనని వివరణ ఇచ్చారు పురుష ప్రకృతిని అనుభవిస్తూనే అదేసమయంలో దానినుండి పూర్తిగా విడివడి వుండటం సాధ్యంకాదనే వాస్తవం పూర్తిగా విస్మరించబడింది ప్రకృతినుండి ప్రపంచ పరిణామ క్రమం పురుష విమోచనకోసమేనని విచిత్రమైన రీతిలో పేర్కొన్నారు ప్రపంచమన్నది మౌలికంగా వాస్తవమైతే అది పురుష బంధనాలను పెంచడానికే దారితీస్తుందన్న అతి ప్రాథమికమైన అంశాన్నికూడా పట్టించుకోలేదు ప్రకృతి పరిణామక్రమం పురుషఆనందంకోసమేనని సాంఖ్యకారిక ప్రకటించింది ఇందుకోసం ఉదాహరణలు కూడా ఇచ్చింది

మలిదశ సాంఖ్యంలో విమోచనకు ఇచ్చిన వివరణలోగల ఈ విడ్డూరాన్ని శంకరుడు మరింతగా ఎత్తిచూపాడు విమోచన లేక స్వాతంత్ర్యం అంటే కష్టాలనుండి సంపూర్ణమైన అఖండమైన నిర్మూలన అని అర్థం కాని అన్ని కష్టాలు ప్రధాన వల్లనే కలుగుతున్నాయి కనుక ప్రధాన అన్నదే నిజమైనది, శాశ్వతమైనది అయితే ఏరకమైన తాత్వికజ్ఞానమైనా సరే నిజమైన కష్టాలను తుదముట్టించలేదు అద్వైత వేదాంత దృక్పథంలో పాదార్థిక ప్రపంచం, ఆవిధంగా దానివల్ల కలిగే కష్టాలు కూడా అజ్ఞాన జనితాలే దానిప్రకారం తత్వజ్ఞానం అజ్ఞానాన్ని అంటే కష్టాలకు మూల కారణాన్ని తొలగించడంద్వారా కష్టాలను పూర్తిగా నిర్మూలించగలుగుతుంది ఏమైనా అద్వైత వేదాంతంలో సమగ్రంగా కనిపించిన విషయం సాంఖ్యానికి వచ్చేసరికి అసమగ్రమైనదంటే అందుకు కారణం అది ప్రపంచం మౌలికంగా సత్యమని, అలాగే దానివల్ల కలిగే కష్టాలు నిజమని భావించడమే

ఆత్మ ద్వారా శుద్ధ చైతన్యం అనే జ్ఞానంవల్ల విమోచన సాధించడానికి అనువైన స్వయం సమగ్ర దృక్పథం అద్వైత వేదాంతంలోనే కనపడుతుందని శంకరుడు పేర్కొన్నారు దాని ప్రకారం మొత్తం ప్రపంచం, అలాగే దానితోగల బంధనం రెండూ పైకి వాస్తవంగా కనిపిస్తున్నా అంతిమంగా అవాస్తవమైనవి దీనంతటి సారాంశం ఒక్కటే అద్వైత వేదాంతంలో ముక్తికిగల దృక్పథం అతి తీవ్రమైన భావవాద ఫలితమే ఆ తాత్విక చింతనకుగల ఇతర లక్షణాలతో అది పూర్తిగా పొసుగుతుంది అయితే అదే దృక్పథాన్ని తద్విరుద్ధమైన భౌతికవాద ధోరణిగల సాంఖ్యంవంటిదానిలో జొప్పించినప్పుడేఅంతా గంద్రగోళంగా తయారవుతుంది తార్కికంగా చెప్పాలంటే సాంఖ్యతత్వానికి రెండు ప్రత్యామ్నాయాలున్నాయి మొదటిది చరాచర ప్రపంచం ప్రాథమిక పదార్థంనుండి ఉత్పన్నమైనదనే తన తాత్విక చింతనకు ముక్తికి సంబంధించి అనుగుణంగా ఒక దృక్పథాన్ని పెంపొందించుకోవడం రెండవది - ఈ మౌలికాంశాలను పూర్తిగా వదిలిపెట్టి శుద్ధ చైతన్యమే ఏకైక వాస్తవమని, పాదార్థిక ప్రపంచం కేవలం కనిపించేది మాత్రమేనని భావవాద వైఖరి చేపట్టడం రెండవ ప్రత్యామ్నాయం అనుసరించినప్పుడు మాత్రమే ఆత్మ విమోచనమే నిజమైన జ్ఞానమని వాదించడం

సాధ్యమౌతుంది కాని దాని పర్యవసానమేమిటి? ముక్తికి సంబంధించిన వేదాంత దృక్పథం వేదాంతానికి అనుగుణమైనదేగాని మూల సాంఖ్యం అవశేషాలకు సరిపడేదికాదు ముక్తిపట్ల వేదాంత దృక్పధాన్ని ఉత్సాహంగా ముందుకు తేవడంతోపాటు ప్రాధమిక పదార్థం లేక ప్రధానపై వక్కాణింపు కూడా సాంఖ్యకారికలో మనకు కనిపిస్తుంది ఆవిధంగా అది వైరుధ్యాల పుట్ట అయింది

న్యాయవైశేషికాలకు కూడా ఇదే వర్తిస్తుంది భావవాద తిరస్కృతి వాటిలో ప్రధానాంశం ఆ ప్రాతిపదికన ప్రకృతిను, దాని నిర్మాణ సూత్రాలను లోలోతుగా పరిశీలించింది ముఖ్యంగా వాత్సాయనుడితో మొదలుపెట్టి ఈ తాత్విక చింతన ఒక విచిత్రమైన మలుపు తీసుకున్నది ముక్తికి సంబంధించిన వేదాంత దృక్పధంతో రాజీ పడే ప్రయత్నం జరిగింది అది ప్రకృతి అవాస్తవమని చెప్పడానికి దారితీసింది దాని ఫలితం ఈ గందరగోళం

కనుకనే ఈ ధోరణి పునరావృతమైంది భావవాదానికి వ్యతిరేకులైన తాత్వికులు ముక్తికి సంబంధించి మాత్రం దాని భావనలపై ఆధారపడ్డారు పూర్వ మీమాంసలో కూడా ఇదే కనిపిస్తుంది ముక్తి విషయంలో పరాయి భావనలు చొరబడటం దాని చరిత్ర చూస్తే స్పష్టమౌతుంది

## ముక్తి - మీమాంస

న్యాయ వైశేషికాలు, సాంఖ్యం మూలపాఠాల్లో ఏమైనా చెప్పివుండవచ్చు కాని తొలి మీమాంసలో మాత్రం ముక్తికి సంబంధించి ఎలాంటి దృక్పధం ఉన్నట్లు కనిపించదు లేక ఆత్మ విమోచన ప్రస్తావనం కూడా లేదు మీమాంసకుల ప్రప్రధాన సైద్ధాంతిక అవసరాలకు దానితో నిమిత్తం లేకపోయింది కాని మలిదశ మీమాంసకులు మాత్రం మోక్షంపట్ల ఆసక్తి పెంచుకున్నారు తత్ఫలితంగా వారు మోక్షానికి సంబంధించి వేదాంత దృక్పథాన్ని స్వీకరించక తప్పనిస్థితి ఏర్పడింది అది తమ మౌలికసూత్రాలకు ఎంత విరుద్ధంగా వున్నా సరే దాన్నే స్వీకరించారు ముక్తి అనే ఆదర్శంపట్ల జైమినీ చాలా స్పష్టంగా ఉదాశీనత ప్రకటించారు తన రచనలో ఎక్కడా ఆయన దానివిషయమే ప్రస్తావించలేదు ప్రసిద్ధుడైన ఒక సాంప్రదాయక పండితుడు ఈ విషయాన్ని ఇలా వివరించాడు పూర్వ మీమాంస సూత్రాల కర్త అయిన జైమినీ విమోచన సమస్యనే చర్చించలేదు [1]

ఈ సూత్రాలపై భాష్యం రాసిన శబరుడు దాన్ని చర్చించడానికి తగిన పరిధిగాని, అవసరం గాని లేవని వ్యాఖ్యానించారు ఆధునిక పండితులు కొందరికి ఇది ఆశ్చర్యకరమైన మినహాయింపుగా కనిపించవచ్చు కాని దానిలో ఆ చర్చ వుంటుందని ఆశించడమే పొరబాటు మీమాంసలో మోక్షంపట్ల ఉదాశీనత ఊహించదగినదే అది పూర్తిగా వేద

1 యోగేంద్రనాథ - తారక సాంఖ్యవేదాంతతీర్థ, భారతీయ దర్శన శాస్త్ర సముదాయ (బెంగాలీ)

క్రతువులపైన లేక యజ్ఞాలపైన ఆధారపడింది తత్ఫలితంగా ఆ తత్వ చింతనను యజ్ఞ విద్య అని కూడా అంటారు మానవాదర్శాలకు సంబంధించిన వ్యవహారాలలో అది కేవలం ఒక్క విషయాన్నే సమర్థించింది ఈక్రతువులను పాటించండి మీరు చేయదగిన పని అదొక్కటే అని చెప్పింది క్రతువులకు అవసరమైన హేతుబద్ధత సమకూర్చడమే మీమాంసకుల పని అయింది చాలా తెలివైన పద్ధతిలో వారాపని చేశారు ఈ క్రతువులు చేస్తే సుఖ సంతోషాలు కలుగుతాయన్నారు. మానసిక ప్రబోధకుడైన జైమినీ కూడా సంతోషమే జీవితలక్ష్యమని ప్రకటించాడు

లభ్యమౌతున్న మీమాంస తత్వశాస్త్రం తొలిపాఠాలలో ఆత్మ ప్రసక్తి లేదని శంకరుడు చెబుతున్నాడు జైమిని దాన్నిఎంతమాత్రం ప్రస్తావించలేదు తర్వాతి మీమాంస సారస్వతంలో కానవచ్చే ఆత్మ చర్చ వేదాంతంనుండి ఎరువు తెచ్చుకున్నదే బ్రహ్మసూత్రాలలోని రెండు సూత్రాలు ప్రత్యేకించి శరీరంపై దానికన్నా మిన్నగా ఆత్మవుంటుంధని రుజువు చేయడానికి ఉద్దేశించినవే దీనిపై వ్యాఖ్యానిస్తూ శంకరుడు ఇలా ప్రశ్నిస్తాడు ఈ రచన సాంప్రదాయకంగా మీమాంస సూత్రాలకు అనుబంధంగా పరిగణించబడింది ఆత్మకు సంబంధించిన ప్రశ్న చాలా ముఖ్యమైందిగనుక అది జైమినీ రచనలలో చోటు సంపాదించుకొంటుందని వూహించడం సహజం కాని మొత్తం మీమాంస సూత్రాలలో ఎక్కడా ఆత్మను చర్చించే ఒక్క సూత్రం కూడా లేదని శంకరుడు జవాబు చెప్తాడు దానిమీద వ్యాఖ్యానం రాసిన శబరుడు ఆత్మను గురించి చర్చించాడనడంలో సందేహంలేదు కాని అది వేదాంతంనుండి ఎరువు తెచ్చుకున్నదే అంతేగాక ఉపవర్షుడనే తొలి మీమాంసకుడు ఆత్మను గురించి చర్చించేందుకు వేదాంతాన్ని ప్రస్తావించాలని (దీన్నే శారీరక అంటారు) అని సూటిగానే చెప్పారు శంకరుడు మీమాంసలోని ఆత్మను గురించి ప్రస్తావించి ఇలా చెప్పాడు

*"నిజమే భాష్యకారుడు (శబరుడు) ఇలా ప్రకటించాడు కాని సూత్రాలలో ఆత్మకు స్థానం లేదు ఇక్కడ (బ్రహ్మసూత్రాలలో) వాటి రచయితే ప్రాథమిక అభ్యంతరాలను త్రోసిపుచ్చిన తర్వాత ఆత్మ ఉన్నట్లు నొక్కి చెప్పాడు అందువల్లనే బోధకుడైన శబరస్వామి ఈ అంశాన్ని చర్చకు చేపట్టాడు అదే కారణంతో ఉపవర్షుడు తన మొదటి తంత్రం (మీమాంస)లో ఆత్మ ఉనికికి సంబంధించిన చర్చకు అవకాశం రాగానే ఆ పని చేశారు దీన్ని మనం శారీరక (వేదాంత)లో చర్చిద్దాం అంటూ విషయాన్ని అక్కడితే వదిలివేశాడు*[1]

మూల మీమాంసలో ఆత్మపట్ల ఉదాశీనత ముక్తి అనే ఆదర్శంపట్ల ఉదాశీనతకు పూర్తిగా సరిపోతుంది ఎందుకంటే ముక్తి పొందినదే ఆత్మగా చెప్పబడుతుంది కనుక ఆత్మ దృక్పధాన్ని మీమాంస తర్వాతికాలంలో వేదాంతంనుండి ఎరువు తెచ్చుకున్నదనే శంకరుడి

---

1 బ్రహ్మసూత్ర భాష్యం

దృక్పధాన్నిమనం ఆమోదించినట్లయితే తత్ఫలితంగా మోక్ష దృక్పధాన్ని కూడా అలా తెచ్చుకున్నదని భావించాల్సి వస్తుంది దీనివల్ల మీమాంస సారస్వతంపట్ల మన దృక్పధాన్ని విచిత్రంగా మార్చుకోవలసి వస్తుంది సంతోషం కోసమే క్రతువులు చేయాలన్న పాత ఆదర్శం స్థానంలో ముక్తి అనే కొత్త ఆదర్శాన్ని ప్రతిష్టించాల్సివస్తుంది హిరియానుడు పాత ఆదర్శాన్ని ప్రస్తావిస్తూ ఇలా వ్యాఖ్యానిస్తాడు ప్రస్తుత రూపంలో ఆ సిద్ధాంతం పూర్తిగా త్రోసిపుచ్చబడింది దాని స్థానాన్ని మోక్షమనే ఆదర్శం ఆక్రమించింది ఈ పరివర్తనా క్రమం కొంతవరకు సంకోచంతో ప్రారంభమైందని మీమాంసకు ప్రముఖ ప్రతినిధులైన ప్రభాకరుడు, కుమారిలుడు చేసిన రచనలను బట్టి తెలుస్తుంది జైమినీ, శబరుడు మోక్షం అనే ఆదర్శంపట్ల పూర్తి మౌనం పాటించడానికి కారణమేమిటి? ఎందుకంటే వారికి కర్మ లేదా క్రతువు పట్ల మాత్రమే ఆసక్తి కాని మోక్షంపట్ల ఆసక్తిగలవారు కర్మను విడనాడాలి కనుక మోక్షమనే ఆదర్శం మూల మీమాంస పరిధికి వెలుపలే వుండిపోయింది కర్మకు కట్టుబడిన ఒక వ్యక్తి మోక్షం గురించి మాట్లాడటమంటే గందరగోళానికి లోనవడమే అని ప్రభాకరుడు చెప్తాడు ఈ కారణంవల్లనే శబరుడు ముక్తి ఆదర్శం గురించి చర్చ జరపలేదు

ప్రభాకరుడి వైఖరిలోనే వచ్చిన ఈ మార్పును జాగ్రత్తగా గమనించడం అవసరం క్రతువు లేదా కర్మ అనే పాత ఆదర్శాన్ని అతను తిరస్కరించలేదు అందుకుబదులు ముక్తి అనే ఆదర్శాన్ని చేపట్టాలని అతను సూటిగా వాదించలేదు మోక్ష ఆదర్శం అదివరకున్న కర్మ అనే దానితో పొసగదని అతను అంగీకరిస్తాడు అయినప్పటికీ జైమినీవలె అతను మోక్ష ఆదర్శాన్ని నిజమైన మీమాంస కోణంనుండి అవాంఛనీయమన్న అభిప్రాయంతో ప్రక్కకు నెట్టివేయలేదు పైగా ప్రామాణికమైన మీమాంస దృక్పధంనుండి పొసగకపోయినా అతను దాన్ని పూర్తిగా విలువైందిగా పరిగణించాడు మోక్షమనే ఆదర్శంపట్ల ప్రభాకరుడు కొంత ప్రశంస కూడా చూపించినట్లు ఆధారాలున్నాయి ఈ చర్చ సందర్భంగాతన విమోచన ఆదర్శాన్ని సమర్థించుకునేందుకై అతను గీతను ఉటంకించాడు క్రతువులనుండి లభించే సంతోషం గురించే నొక్కి చెప్పినందుకు అతను మీమాంసకులను గట్టిగా ఖండిస్తాడు

మోక్షంపట్ల ప్రభాకరుడిలో వచ్చిన ఈ మార్పు అతని తర్వాతివారిలో మరింతగా బలపడింది ప్రభాకరుడి రచనలపై వాఖ్యానించినవారిలో శాలికానాధుడు ముఖ్యుడు *ప్రకరణపంజక* అన్నది అతని గ్రంధం దానిలో అతను మోక్షాన్ని గురించి ఒక వివరణ లేక నిర్వచనం ఇచ్చాడు అది మీమాంసకు సంబంధించిన మౌలిక వైఖరులన్నింటినీ త్రోసిపుచ్చుతున్నది మోక్షం అంటే కర్మనుండి కర్మవల్ల కలిగే ధర్మాధర్మాలన్నింటినీ పరిత్యజించడమేనని శాలికానాధుడు పేర్కొన్నాడు అతను మోక్షం అనే ఆదర్శాన్ని తిరస్కరించలేదన్నది గమనించాల్సిన విషయం దాన్ని ఆమోదించాడు అలాంటప్పుడు మోక్షానికి సంబంధించి అతని ప్రశంసాత్మక వివరణ అర్థమేమిటి? మీమాంసకులు కర్మను గురించి మాత్రమే పట్టించుకున్నారనేది బాగా తెలిసిన విషయం కర్మవల్ల కలిగే ధర్మాధర్మాలను

హేతుబద్ధం చేయడంతప్ప దానికి మరో ప్రయోజనం లేదు అందువల్ల మోక్షం అన్నది దీనంతటినీ పూర్తిగా నిర్మూలించేదైతే అప్పుడు నిజమైన మీమాంసక దృక్పథంనుండి అలాంటి ఆదర్శంకోసం ప్రాకులాడటంకన్నా అవాంఛనీయమైన విషయం మరొకటి వుండదు జైమినీ, శబరుడు మోక్షంపట్ల ఉదాశీనత ప్రకటించడానికిగల కారణమేమిటో దీన్నిబట్టి తేలిగ్గానే అర్థమౌతుంది కాని అదే ఆదర్శంతో శాలికానాధుడు మౌలికసూత్రాలనే పణం పెట్టడం మటుకు అర్థంకాని విషయం శాలికానాధుడు వాటిని నిజంగా వదులుకున్నాడని కాదు మరోవిధంగా చూస్తే అతను మీమాంసకు సంబంధించిన ప్రభాకరుడి దృక్పథాన్ని గట్టిగానే సమర్థించాడు కాని ముక్తికి సంబంధించిన పరాయి భావనను ప్రభాకరుడు సంకోచంతో స్వీకరిస్తే శాలికానాధుడు ఆ పని చాలా గట్టిగా చేశాడు వేద ఛాందసాన్ని అనుసరించేవారి మోక్ష ఆదర్శం వేదాంతులు రూపొందించింది కనుక అతని కాలానికి అది చాలా శక్తివంతంగా తయారైంది వేదాంతంతో రాజీపడే ధోరణి ప్రభాకరుడి అనుయాయుల్లో క్రమంగా పెరిగింది చివరకు అది ముదిరి గౌడ బ్రహ్మానందుడు ప్రభాకరుడికి వేదాంతతత్వంపట్ల వ్యతిరేకత ఏమీ లేదని ప్రకటించేవరకు వెళ్ళింది [1]

ఇలా చెప్పడం చాలా విడ్డూరమైన విషయం ఎందుకంటే తాత్వికంగా చెప్పాలంటే ప్రభాకరుడు మీమాంస దృక్పథంలో తెచ్చిన మార్పు యావత్తు వేదాంతానికి ముఖ్యంగా అద్వైత వేదాంతానికి వ్యతిరేకమైంది ముక్తికి సంబంధించిన దృక్పధాన్ని అతని అనుయాయులు దానినుండే ఎరువు తెచ్చుకున్నారు ఇందుకు ఒక ఉదాహరణ ఇవ్వవచ్చు ప్రచండమైన భావవాదానికి ఒక రూపంగా అద్వైత వేదాంతం భ్రాంతికి సంబంధించిన సాక్ష్యంపై అత్యధికంగా ఆధారపడివున్నది తనకు బాగా అనుకూలమైన రీతిలో అది దానికి వివరణనిచ్చింది తాడును చూసి పామనుకోవడం, ప్రాపంచిక అనుభవాన్ని అజ్ఞానంతో మమేకం చేయడం జరిగింది ప్రపంచం నిజంగా వుందని, పూర్తిగా లేదని కూడా చెప్పలేమని చెప్పబడింది అనిర్వచనీయ అఖ్యాతి అనే పేరు గల ఈ సిద్ధాంతం అద్వైత వేదాంతానికి చాలా అవసరమైంది అందుకు భిన్నంగా ప్రభాకరుడి మీమాంస తాత్విక భావవాదంతో రాజీపడకుండా తిరస్కరించింది భ్రమాజనితమైన అనుభవాన్ని భ్రమగానే ఖండించింది ఈ దృక్పథంలో అఖ్యాతి అంటే భ్రమరాహిత్యం దాని ప్రకారం నిజంగా భ్రమాపూరితమైన అనుభవం అంటూ లేదు అలా చెప్పబడేది వాస్తవానికి అంతర్గతంగా ముడిపడిన రెండు నిజమైన అనుభవాలమధ్య తేడాను గుర్తించలేని ఫలితమే ఒకటి జ్ఞాపకశక్తి స్వభావానికి సంబంధించినదైతే మరొకటి ఇంద్రియ గ్రాహ్యతకు సంబంధించినది ఉదాహరణకు జ్ఞాపకంలోని పాము ఎదురుగావున్న తాడు ఒక్కటే రూపంగా కనిపిస్తాయి ఇతరుల భ్రమాజనితమైన అనుభవంపట్ల ఇలాంటి అవగాహన లేకపోతే మీమాంసపట్ల ప్రభాకరుడు ప్రదర్శించిన దృక్పధమే కుప్పకూలిపోతుంది ఏమైనా దీన్ని ఆమోదించడం అంటే అద్వైత

1 యోగేంద్రనాథ్

వేదాంతానికిగల అతి ముఖ్యమైన తాత్విక భూమికను తిరస్కరించడమే అయినప్పటికీ ప్రభాకరుడు, అతని అనుయాయులు వేదాంతతత్వాన్ని ఏవిధంగానూ వ్యతిరేకించలేదని మలిదశలోని రచయితలైన గౌడ బ్రహ్మానందుడివంటివారు చెప్తారు ముక్తికి సంబంధించిన వేదాంత దృక్పధం తెచ్చిపెట్టిన నూతన మేధా వాతావరణం అంత విద్ధూరమైనది మూల మీమాంస స్ఫూర్తికి పూర్తి భిన్నమైనదైనప్పటికీ దానిలోకి చొరబడగలిగింది

కుమారిలుడిని అనుసరించే మలిదశ మీమాంసకుల విషయం కూడా స్థూలంగా ఇంతే మోక్షంపట్ల వేదాంతిక లేదా ఇంచుమించు వేదాంతిక దృక్పధాన్ని పునరుద్ఘాటించే ధోరణి వారిలో మనకుకనిపిస్తుంది కాని మీమాంసతత్వ మూల సూత్రాలకే విరుద్ధమైన తాత్విక వైఖరుల ఫలితంగా మాత్రమే ఇలాంటి దృక్పధం సాధ్యం కనుక కుమారిలుడి శిష్యులు దాన్ని ఆమోదించడం కొన్ని సైద్ధాంతిక గందరగోళాలకు దారితీసింది

మోక్షం దృక్పధాన్ని సంకోచంతో ఆమోదించడం కుమారిలుడి రచనల్లోనే కనిపిస్తుంది తన శ్లోకవృత్తికలో ఆయన మోక్షాన్నికోరేవారు ఖచ్చితమైన ఫలితాలకు (స్వర్గం లేక సంతోషం వగైరాలు)దారితీసే విధి నిషేధాలను త్రోసిపుచ్చాలని చెప్తాడు ఇలాంటి ప్రకటన మీమాంసకుల దృష్టినుండి చాలా విచిత్రమైనది ఎందుకంటే విధినిషేధాలతో కూడిన క్రతువు మీమాంసకు ప్రాణాధారమైనటువంటిది అందువల్ల వ్యాఖ్యాత పార్థసారధి మిశ్రా ఈ ప్రకటన నిజంగా కుమారిలుడు చేసినదేనా అని సందేహం వెలిబుచ్చడానికి కారణం లేకపోలేదు అంతేగాక కుమారిలుడు తన తదుపరి రచన అయిన తంత్రవార్తికలో వెలిబుచ్చిన అభిప్రాయాలకు ఈ ప్రకటనకు పొసగడంలేదని హిరియానుడు ఎత్తిచూపాడు. ఏమైనా మోక్షం గురించిన వేదాంతిక దృక్పధం ఆత్మ లేక స్వీయత గురించిన దాని దృక్పధంనుండి విడదీయరానిదని గమనించడం అవసరం కుమారిలుడు ఆత్మ గురించి వెలిబుచ్చిన ఒక అభిప్రాయం మీమాంస పాత దృక్పధంతో చూస్తే లేక ప్రామాణిక సూత్రాల ప్రకారం చూస్తే విచిత్రంగా కనిపిస్తుంది అంతేగాక వేదాంతంపట్ల ఒక దురభిప్రాయం కూడా వెలిబుచ్చుతుంది శ్లోకవార్తికలో ఆయన ఆత్మ గురించిన చర్చను ఇలా ముగించాడు శబరుడు మీమాంస సూత్రాలపై చర్చలో ఆత్మ గురించిన జ్ఞానం వేదాంతాన్ని అధ్యయనం చేయడంద్వారానే బలపడుతుందని చెప్పిన అది సందేహ నివృత్తి చేయడానికి సరిపోయేదికాదు [1] ఆత్మ విషయమై జైమినీ ప్రదర్శించిన పూర్తి నిరాసక్తత కుమారిలుడు ప్రదర్శించిన ఈ వైఖరి వేదాంత దృక్పధం పట్ల ఖచ్చితమైన మొగ్గను సూచిస్తున్నాయి ఆత్మకు సంబంధించిన ఈ దృక్పధాన్ని ఒకసారి ఆమోదించినట్లయితే మోక్షసాధన మార్గాన్ని కూడా ఆమోదించడం జరుగుతుంది

దీనంతటివల్ల మీమాంసకుగల సైద్ధాంతిక పునాదుల సమగ్రత కుప్పకూలింది ఆత్మను గురించిన వేదాంత దృక్పధాన్ని కుమారిలుడే సిఫార్సు చేశాడని గౌడ బ్రహ్మానందుడు

ఉత్సాహంగా ప్రకటించాడు  పాదార్థిక ప్రపంచం కేవలం దృశ్యం మాత్రమేనని కూడా అంగీకరించక తప్పనప్పుడు ఆత్మపట్ల అలాంటి దృక్పథం చేపట్టడం ఎలా సాధ్యం? కుమారిలుడి శిష్యులలో ముఖ్యుడైన సుచరిత మిశ్రుడు ఈ ప్రశ్నను కనీసంగా కూడా లేవనెత్తలేదు  మీమాంస తత్వం పరిధిలోపలే అతను ఆత్మను గురించిన వేదాంత దృక్పథాన్ని అలాగే అద్వైత వేదాంతంలో విమోచనకు సూచించిన మార్గాన్ని వివరించేందుకు ప్రయత్నించాడు  కుమారిలుడిపై వ్యాఖ్యానం రాసిన మరో ప్రముఖుడు పార్థసారధిమిశ్రా విమోచనపట్ల శంకరుడి దృక్పథానికి, కుమారిలుడి పేరుతో చెలామణి అవుతున్నదానికి మధ్యగల సున్నితమైన తేడాను ఎత్తిచూపేందుకు ప్రయత్నించాడు

కుమారిలుడి మోక్షం *ప్రపంచ సంబంధ విలయం* అంటే అనుభవంలో కనిపించే ప్రపంచంతో వ్యక్తియొక్క సంబంధం రద్దుకావడం అని పార్థసారధి మిశ్రా వివరిస్తాడు ఆవిధంగా అది శంకరుడి మోక్షానికి భిన్నమైనది ప్రపంచంతో సంబంధాన్ని తెంచుకోవడమేగాక అసలు ప్రపంచం ఉనికినే రద్దుచేయడం శంకరుడి సిద్ధాంతం  అంటే ప్రపంచ సంబంధ విలయంకాదు, ప్రపంచ విలయం మన కలలోని పదార్థంవలే అనుభవ ప్రపంచం మిథ్య అని శంకరుడి సూత్రీకరణ  అఖండత్వం ప్రేరణతో భ్రాంతిసూత్రం రద్దయిపోతుంది నిర్మాణంలోవున్న ప్రపంచం అదృశ్యమౌతుంది  కాని కుమారిలుడు చెప్పే ప్రకారం ప్రపంచం రద్దయిపోదు  వ్యక్తిని ప్రపంచానికి కట్టివుంచి సుఖదుఃఖ అనుభవాలు కలిగించే బంధనాలు మాత్రమే అదృశ్యమౌతాయి [1]

కాని వ్యక్తిని ప్రపంచంతో కట్టివుంచే బంధనాలు మాత్రమే రద్దయిపోవడమంటే అర్థమేమిటి? కుమారిలుడిపై తదుపరి వ్యాఖ్యాతలు ఇలా జవాబు చెప్పారు

*ప్రపంచంతో మన బంధానికి కారణాలు 1 అనుభవాలకు నిలయమైన శరీరం 2 అనుభవాలకు సాధనాలైన ఇంద్రియాలు 3 అనుభవంలోకి వచ్చే వస్తువులు (శబ్దాలు, వగైరా) వ్యక్తికిగల ఈ త్రిముఖమైన సంబంధం సుఖదుఃఖానుభూతులకు కారణమౌతుంది వ్యక్తి, ముక్తి అంటే ప్రపంచంతోగల ఈ త్రిముఖ సంబంధం పూర్తిగా తెగిపోవడమే ముక్తి అంటే ఈ సంబంధం తెగిపోయి తద్వారా కలిగే సుఖదుఃఖాలు వగైరాలు లేకుండా పోవడమే* [2]

మీమాంసకుల మూల వైఖరినుండి ఈ ధోరణి ఎంత దూరంగా వచ్చిందో అర్థం చేసుకోవడం పెద్ద కష్టంకాదు  వాస్తవానికి  ఆది మీమాంస చాలా సరళమైన సూత్రం క్రతువు చేయడం ఒక్కటే ముఖ్యమని చెబుతుంది  అవి మాత్రమే భూమిమీద సంతోషాన్ని కలిగిస్తాయని బోధిస్తుంది  అన్ని సుఖదుఃఖానుభవాలనుండి విముక్తి పొందే ఆత్మ స్థితికి సంబంధించిన ఎలాంటి ఊహాగానాలను ప్రోత్సహించకపోగా జైమినీ, శబరుడు

1 యోగేంద్రనాథ

2 మైత్రి

సంతోషానుభవం అన్న దృక్పథాన్ని గట్టిగా సమర్థించారు క్రతువుల నిర్వహణే అత్యున్నత పురుషార్థమని బోధించారు ప్రధానంగా వేద క్రతువులు ప్రపంచంలో నిజమైన సంతోషాలని చెప్పే మీమాంసకు వ్యతిరేకంగా ఉన్నందువల్ల తాత్విక భౌతికవాదాన్ని తాను వ్యతిరేకిస్తానని కుమారిలుడు కూడా సూటిగా చెప్పాడు అయినప్పటికీ ఆత్మకు సంబంధించిన వేదాంత దృక్పథానికి కొద్దిపాటి అవకాశం ఇచ్చినందువల్లనే అతని శిష్యుల దృష్టిలో సమగ్రత దారుణంగా దెబ్బతినిపోయింది విమోచనకు సంబంధించి దాదాపు వేదాంత దృక్పథాన్ని తెచ్చిపెట్టేందుకు వారు పూనుకున్నారు ఆత్మ ప్రపంచంనుండి విడివడటం దానితోగల అన్ని సంబంధాలను తెంచుకోవడంద్వారానే విముక్తి సాధ్యమని చెప్పారు

ఏమైనప్పటికీ కుమారిలుడి శిష్యులలో తర్వాత వచ్చినవారు మరో సమస్యను ఎదుర్కొన్నారు ఆత్మ విమోచనమనే ఆ దశను ఎలా అర్థం చేసుకోవాలి? అది అన్ని అనుభవాలు పూర్తిగా లేకుండా పోయే దశ సంతోషం లేక ఆహ్లాదం కలిగించే అనుభవాలు కూడానా? లేక మరో రూపంలోనైనా సరే అది ఆహ్లాదంతో, సంతోషంతో కూడివుంటుందా? పార్థసారధి మిశ్రా ఈ చివరి వాదనను ఆమోదించదలచాడు అతను చెప్పిన విమోచన దృక్పథం మలి న్యాయకులను గుర్తు చేస్తుంది కాని కుమారిలుడి శిష్యులలో అత్యధికులు వేదాంతంతో ఏకీభవించే దృక్పథాన్నే ఎక్కువగా స్వీకరించారు మోక్ష స్థితిలో ధర్మమన్నది పూర్తిగా అంతరిస్తుంది కొత్తగా ధర్మాన్ని సంపాదించడమనే ప్రశ్న వుండదు అలాగే మత్తైక ధర్మంగా పనికివచ్చే సంతోషమూ వుండదు అలాంటి సంతోషానికి కాలంలో ఒక ప్రారంభం ఉండాలి కనుక అది కాలంతోపాటే ముగిసిపోవాలి కూడా కాని కాలంతో సంబంధంలేని మరో రకమైన సంతోషం వుంటుంది అది ఆత్మకు సంబంధించిన సహజ సంతోషం స్వాభావిక ఆత్మానందం అనుభవ జీవితంలో అది మరుగుపడిపోతుంది *(అభిభూతం)* అతీంద్రీయ దశలో అది బయటపడుతుంది విమోచన దశలో వ్యక్తి ఈ అతీతానందాన్ని అనుభవిస్తాడు అది స్వతసిద్ధంగా ప్రాకృతికమైంది కనుక వేదాంతానికి, దానికిమధ్యగల తేడా అదృశ్యమౌతుంది తత్ఫలితంగా ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడుతుంది మన ప్రాచీన సాంప్రదాయక పండితులలో అతి ప్రముఖులైనవారు వేదాంతానికి గల అత్యధిక ప్రాధాన్యతను సమర్థించుకునేందుకై ఇలా వాదిస్తారు బ్రహ్మం అనే అంతిమ సత్యం ఉనికిని గురించిన చైతన్యంతో కూడిన సంతోషమని *(సచ్చిదానందం)* కుమారిలుడు ప్రభాకరుడు ఇద్దరి శిష్యులూ చెప్పారు వ్యక్తి ఆత్మ నిజంగా దానితో మమేకమైనప్పటికీ అనుభవంలోకి వచ్చే విస్తారమైన ప్రపంచం ప్రారంభరహితమైన అజ్ఞాన (అవిద్య) ఫలితం '' ఇదే నిజమైతే కుమారిలుడి ప్రధాన తాత్విక రచనలన్నింటినీ త్రోసిపుచ్చాల్సివుంటుంది ముఖ్యంగా భావవాదానికి, దాని అనుబంధ వైఖరులకు వ్యతిరేకంగా ఆయన చేసిన అద్భుతమైన

వాదోపవాదాలను విడనాడాల్సివుంటుంది మీమాంసకు సంబంధించిన తన బోధనల్లో ఇలాంటి సంక్షోభం ఏర్పడ్డానికి కుమారిలుడే కారణం దానిలో ఆత్మకు సంబంధించిన వేదాంత దృక్పథానికి లేక ఇంచుమించు అలాంటి దానికి కొద్దిపాటి స్థానం కల్పించడంవల్లనే ఈ పరిస్థితి వచ్చింది జైమినీ చెప్పిన మూల వైఖరికే అతను కట్టుబడి వుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు ఆత్మకు సంబంధించిన అలాంటి దృక్పథం జైమినీకి కూడా తెలుసు కాని తన మీమాంస సూత్రాలలో దాన్ని కనీసంగానైనా ప్రస్తావించలేదు అది మీమాంస మౌలికసూత్రాలతో పొసిగేది కాదని అతను గ్రహించడమే ఇందుకు కారణం కావచ్చు

## ముక్తి - లోకాయతులు

న్యాయ వైశేషికం, సాంఖ్యం, మీమాంస అన్నింటి చరిత్రలోనూ ఇదే కథ మళ్ళీ మళ్ళీ రావడం చూశాము ఈ తత్వచింతనలు భావవాద దృక్పథంతో మౌలిక వ్యతిరేకత కలిగివున్నాయి కనుక ముక్తికి సంబంధించిన పూర్తి ప్రతికూల దృక్పథంతో అవి ఏకీభవించలేకపోయాయి అదికూడా ప్రచండ భావవాదంనుండి ప్రత్యక్షంగా ఆవిర్భవించినది కావడమే ఇందుకు కారణం విచిత్రమైన విషయమేమంటే ఈ తాత్విక చింతనలు మలిదశలో అదే భావవాద దృక్పథానికి లొంగుబాటు ప్రదర్శించాయి మనకు ఎక్కువగా లభిస్తున్నదికూడా మలిదశకు సంబంధించిన సారస్వతమే న్యాయ వైశేషిక, సాంఖ్య, మీమాంసల సైద్ధాంతిక పునాదులకు తీవ్ర ప్రమాదం తెచ్చిపెట్టే రీతిలో నిర్లక్ష్యంగా ఈ పని జరిగింది ముక్తి భావన కోణంనుండి చూస్తే న్యాయ వైశేషికం వైరుధ్యాల పుట్టగా కనిపిస్తుంది సాంఖ్యంకూడా అసంబద్ధతలను తప్పించుకోలేక వేదాంతంలోకి జారిపోయింది మలి మీమాంసకులు జైమిని చెప్పిన మూల వైఖరినుండి ఎంతగా దూరమయ్యారంటే వారి మనస్సులు వేదాంతంతోనే ఉన్నాయని అద్వైత వేదాంతులు ప్రకటించుకోగలిగారు

దీనంతటినిబట్టి భారతీయ తత్వశాస్త్రంలో ముక్తి భావనకు సంబంధించిన ప్రశ్న ముందుకొస్తుంది పైన చెప్పిన ధోరణి ఎందుకు పునరావృతమవుతూ వచ్చింది? భావవాదానికి మౌలికంగా వ్యతిరేకమైన తాత్విక చింతనలు క్రమక్రమంగా దాని ముక్తిభావనకు ఎందుకు లోబడిపోయాయి? చరిత్ర పరిశోధన ప్రస్తుత దశలో ఈ ప్రశ్నకు సంపూర్ణమైన సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించడం అపరిపక్వం అవుతుంది కాని ఈ నిగూఢతను ఛేదించేందుకు అత్యంత ఆసక్తికరమైన ఒక ఆధారం ఇవ్వవచ్చు లోకాయతుల రచనలలో దాన్ని చూడగలుగుతాము

ముక్తికి సంబంధించిన చర్చలో లోకాయతుల అభిప్రాయాలకు సంబంధించిన కొన్ని మాటలతో ప్రారంభిద్దాం ఆత్మ, దాని విమోచన అన్న భావవాద దృక్పథాన్ని పూర్తిగా

---

1 యాగేంద్రనాథ

తిరస్కరించినవారు లోకాయతులు మాత్రమే సహజసిద్ధమైన తమ సూటిదనంతోవారు విమోచనకు సంబంధించిన మాటలన్నీ స్వర్గం, ఆత్మ పరలోకయానం వగైరాలన్నీ కల్పన అని కొట్టిపారవేశారు స్వర్గమంటూ ఏదీ లేదు విమోచనమన్నది లేదు ఆత్మ మరో లోకానికి వెళ్ళడం లేదు నస్వర్గో, నపవర్గో, వనైవత్వం పారలౌకిక ' అని చెప్పారు భారతీయ ఛాంధసులకు నచ్చకపోయినప్పటికీ, పూర్తి ప్రతికూల రూపంలో చెప్పినప్పటికీ భారతదేశంలో ఈ విస్పష్ట ప్రకటనకు ఎంతైనా ప్రాధాన్యత వుంది ముక్తికి సంబంధించిన వివేకవంతమైన ఆలోచన ఏదైనా సరే చేయాలంటే దాని గురించిన అర్ధరహితమైన వాదనలన్నింటినీ త్రోసిపుచ్చడం మొదటి షరతు ముక్తి గురించిన భ్రమాపూరిత దృక్పధం అంటే మోక్షం భారతీయ తత్వశాస్త్ర క్షేత్రమంతటిపైనా చీకటి తెరలు కప్పిందని లోకాయతులు భావించారు వారు దాన్ని నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చారు దానితోపాటే ఆత్మ భావనను, దాని విమోచనను కూడా త్రోసిపుచ్చారు ఈ విషయంలో వారు చూపిన ప్రత్యేక ఆసక్తిని విస్మరించరాదు ఎందుకంటే భారతీయ తాత్వికుల్లో మలిదశకు చెందినవారుకూడా భావవాదంపట్ల వ్యతిరేకత వున్నప్పటికీ, విమోచనకు సంబంధించిన దాని దృక్పధంవైపు నడిచారు ఆత్మ గురించిన భావనలకుతమ సిద్ధాంతాలలో చోటు కల్పించడంవల్లనే వారిలా రాజీపడాల్సివచ్చింది ఆత్మ లేక చైతన్యం పదార్థానికి, పాదార్థిక ప్రపంచానికి భిన్నమైనదని ఒకసారి ఆమోదించినట్లయితే తిరిగి స్వాభావిక ప్రకృతికి వెళ్ళడమే దానికి ముక్తి అని ఊహించడం చాలా సహజం మరో మాటలో చెప్పాలంటే పదార్థ బంధనాలనుండి విడివడాల్సిందే లోకాయత దృక్పధం ప్రకారం ఇదంతా అర్థరహితం అసంబద్ధం ఇతరులందరూ ఆత్మగా పరిగణించేది విషయం మానవ శరీరంగా ఏర్పడే పదార్థంలో ఒక ప్రత్యేక కలయికవల్ల ఏర్పడేది తప్ప మరొకటికాదు తదనుగుణంగానే ఆత్మ లేక స్వీయత అంటేశరీరమే సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రంలో ఈ వైఖరికి వైతిరేకంగా ప్రచార పరంపర కనిపిస్తుంది ఇది అసంబద్ధం మాత్రమేగాక ఈ భావన చాలా మూర్ఖమైందని దానికి గట్టి జవాబివ్వడం కూడా అనవసరమని ప్రజలకు ప్రబోధించాలి ఏమైనా మనమిప్పటికే వాదించినట్లుగా భారతీయ తత్వశాస్త్రంలో ఆధునిక శాస్త్రీయ విజ్ఞాన పరీక్షకు తట్టుకుని నిలబడ్డది ఏమైనా వుందంటే అది లోకాయతులు చెప్పిన ఈ వాదనే ఆత్మ అన్నది పదార్థంనుండే వస్తుందన్న ఈ వాదనే

ఆత్మభావనను తిరస్కరిస్తూ లోకాయతులు జీవితంనుండి తప్పుకోవడంగాక అనుభవించడం నేర్చుకోవాలన్నారు ఇతరుల జీవన దృక్పధం శాశ్వతత్వానికి బాధాకరమైన ఉపోద్ఘాతంవంటిది కాగా భారతీయ తాత్వికుల్లో లోకాయతులు మాత్రమే మానవులుగా మన స్వల్ప జీవితాలను గడపడంపై కేంద్రీకరించారు వారికి సంబంధించినంతవరకు మానవుని వునికికి సంబంధించి అలాంటి దుర్భరమైన చిత్రం ఊహించుకోవాల్సిన అవసరం

లేదు కష్టాలు తప్పించుకోవాలంటే జీవితాన్నే మొత్తంగా తుడిచిపెట్టాలని వారు భావించలేదు నిజమైన ఆధ్యాత్మిక స్వాతంత్ర్యం అంటే బాధలనుండి విముక్తి మాత్రమేనని మలిదశలోని న్యాయవైశేషికులు చెప్పారు అది కూడా కష్టాలతో అవిభాజ్యంగా ముడివడిన సంతోషాన్ని వదలుకోవడమే కాని లోకాయతులు మాత్రం ఇలా అంటారు

ఇతర గ్రహణశక్తిగల వస్తువులతో సంబంధంద్వారానే మనిషికి సంతోషం లభిస్తుంది
బాధతో కలిసివుంటుంది గనుక దాన్ని వదులుకోవాలని మూర్ఖులు చెప్తారు
నాణ్యమైన బియ్యం వడ్లలో దాగివుంటాయి

తాలూ తప్పతో కలిసివుంది గనుక దాన్ని వదలివేసుకుంటాననే మనిషి నిజంగా తన మేలు కోరుకోగలడా?

మరోవిధంగా చెప్పాలంటే జీవితానికి సంబంధించిన సంతోషాలు కొన్ని బాధలతో కలిసివున్నంతమాత్రన వాటిని వదులుకోవాలని చెప్పడం మూర్ఖత్వం తవుడు వుంది కనుక మీరు ధాన్యాన్ని వదులుకోరు ఎముకలు ఉన్నాయి గనుక చేపలు తినడం మానరు

భారతీయ ఛాందసులు దీనంతటినీ అత్యంత అసాధ్యమైన విషయంగా తిట్టిపోశారు జీవితానికి సంబంధించిన పవిత్రమైన, ఉన్నతమైన విలువలను గురించి ఎంతమాత్రం తెలియని బుద్ధి జాడ్యంగా విమర్శించారు పవిత్రమైన జీవితం విలువలంటే ఏమిటి? ఆత్మ విమోచనంకన్నా ముఖ్యమైంది మరేమీ లేదంటూ జీవితాన్ని మొత్తంగా కొట్టిపారవేయడమా? లోకాయతుల దృష్టిలో ఇది కేవలం భ్రాంతి మాత్రమే అనేకమంది తాత్వికులు ఆత్మ వంచన చేసుకోవడానికే అది పనికి వచ్చింది ఆత్మ అన్నదే లేదు కనుక మోక్షం, విమోచనం అన్నది కూడా లేదు ఇదే నిజమైన వాస్తవం అలాగే స్మృతికారులు ప్రజలకు ప్రబోధించినట్లుగా ఉన్నత జీవితం, విలువలు అంటే పరాన్నభుక్కు పురోహిత వర్గాలను కూచోబెట్టి మేపడంకాదు శ్రాద్ధకర్మలు, ఇతర క్రతువులను అడ్డంపెట్టుకుని వారు తెగ బలుస్తున్నారు రోజువారీ జీవితానుభవాలతో పోల్చి చూసినట్లయితే ఆ క్రతువుల బూటకత్వం తేలతెల్లమౌతుంది అయినప్పటికీ అవి విలువైనవని ప్రజలను నమ్మమంటున్నారు నిజంగా జీవితపు ఉన్నతమైన, పవిత్రమైన విలువలను గురించిన స్పృహలేని శూన్యతను అసభ్యతను చూడాలంటే ప్రజలకు బోధించిన ఈ భావజాలంలోనే చూడాల్సివుంటుంది అదికేవలం వాగాడంబరం చాటున సాగించిన వంచన మాత్రమే అందువల్ల వాటిని తిరస్కరించడం అంటే జీవితాన్ని పూర్తిగా ఆమోదించడమే అని లోకాయతులు చెప్పారు విముక్తికి సంబంధించిన ప్రతికూల దృక్పథానికి శ్రుతిమించిన ప్రాధాన్యమిచ్చిన భారతదేశ సాధారణ పరిస్థితుల్లో ఈ వాదన ప్రత్యేకించి ప్రశంసనీయమైనది జీవితాన్నుండి పలాయనం పాడటం అన్ని అనుభవాలను నిరాకరించడమే గొప్పతనంగా చిత్రించబడింది కాని ఏవిధంగా చూసినప్పటికీ లోకాయతులు చేసిన వాదన ప్రారంభంమాత్రమే దానిలోని మంచి లక్షణాలు ఆ తర్వాత సాంప్రదాయక తత్వశాస్త్రంలో

మళ్ళీ పరిపుష్టం కానేలేదు ఇప్పటికి అందుతున్నంత వరకు చూస్తే లోకాయతుల ఊహాగానాలు జీవితాన్ని ఆమోదించాలని, అనుభవించాలని వారు చేసిన బోధలు ప్రజలను పూర్తిగా ఉత్తేజపరచలేకపోయినట్లు అర్థమౌతుంది తమ ఆలోచనలు, చేతలలో విశ్వాసం పెంచుకునేందుకు ప్రకృతిపై మరింత అదుపు సాధించేందుకు సామాజిక వ్యవహారాలలో సమర్థవంతంగా జోక్యం కల్పించుకునేందుకు అవసరమైన విశ్వాసం అది ప్రజలకు ఇవ్వలేకపోయింది ప్రపంచాన్ని మార్చేందుకు నిజమైన మానవుల నిజమైన విముక్తి కోసం కృషిచేసేందుకు వారిని కదిలించలేకపోయింది ప్రకృతిపై మానవుడి అదుపు విస్తరించాలని లోకాయతులు ఎప్పుడైనా ఊహించారా అన్న విషయం మనకు తెలియదు ప్రజలను పురోహితవర్గం దోచుకోవడంపట్ల తీవ్రమైన నిరసన తెలిపినా వారు అందుకు ప్రత్యామ్నాయమైన సామాజిక సూత్రాలు ఏవీ రూపొందించినట్లు కనిపించదు క్లుప్తంగా చెప్పాలంటే విముక్తికి సంబంధించి లోకాయతులు మనకు ఎలాంటి సమగ్రమైన సానుకూలమైన దృక్పథాన్ని అందించలేదు ప్రతికూల దృక్పథాలను తిరస్కరించడంలో మాత్రం వారు చాలా ధైర్యంగానూ, ప్రాధాన్యత కలిగిన విధంగానూ వ్యవహరించినప్పటికీ ఇది వాస్తవం

## వ్యక్తి- చైతన్యం

లోకాయత దృక్పథానికి ఈ పరిమితులున్నప్పటికీ వారి పేరుతో లభ్యమౌతున్న ప్రముఖ సూక్తాలను చూసినట్లయితే మనకు ఒక సూచన కనిపిస్తుంది దాన్ని సమగ్రంగా పెంపొందించినట్లయితే భావవాదుల ముక్తిభావన అంతటి ఆకర్షణశక్తి ఎలా సంతరించుకోగలిగిందో ముఖ్యంగా మలిదశలో ఇదెలా జరిగిందో మనకు అర్థమౌతుంది తాత్వికులు ప్రచారం చేసే సాంఘిక, నైతిక విలువలు దేనితో సంబంధంలేని తాత్విక పరిశీలనల ఫలితాలు మాత్రమే కానక్కరలేదని చెప్పిన భారతీయ తాత్వికులు లోకాయతులు మాత్రమే వారు కొన్ని వర్గాల ప్రజల ఆర్థిక ప్రయోజనాలను, ఇతర సదుపాయాలను కాపాడడంతో సంబంధం కలిగివున్నారు కొన్నిసార్లు వారే అందుకు సాధనాలుగా కూడా ఉన్నారు ఈరోజుల్లో మనం పాలకవర్గాల సైద్ధాంతిక ఆయుధాల గురించి సిద్ధాంతాల వెనకగల వర్గ ప్రయోజనాల గురించి మాట్లాడుతున్నాం లోకాయతులు కూడా ఈ పరిభాషలో మాట్లాడగలిగినట్లయితే వారిని మనం మన భాషలో విప్లవకారులని పిలిచివుండేవారం కాని వారు ఆ అర్థంలో విప్లవకారులు కాదు, సాహసవంతులు మాత్రమే భారతీయ తత్వశాస్త్రంలో వారిది అత్యంత వీరోచితమైన పాత్ర కొన్ని దృక్పథాలు, వైఖరులు పరాన్నభుక్కువర్గాల ఆర్థిక ప్రయోజనాలకు చక్కగా సరిపోతాయని గుర్తించిన మన తాత్వికులు వారు దీన్నే వారు జీవితాధార నిమిత్త అని అంటే మనుగడకోసం ఉద్దేశించబడిందని చెప్పారు వారి పరిభాషలోసాంఘిక పరాన్నభుక్కులు బుద్ధి, పౌరుషం

రెండూ లేనివారే వారికి తెలివి, శక్తి ఉండవు వేద క్రతువుల గురించిన మాటలు, పవిత్ర పారాలు వగైరాలన్నీ ఈ బాపతువారికి అవసరమైన హంగుదర్పాల సరంజామా మాత్రమే. లోకాయతుల ప్రసిద్ధ రచనల ప్రకారం ఇవన్నీ సాంఘిక పరాన్నభుక్కులు బ్రతుకుదెరువుకోసం ఏర్పాటుచేసుకున్నవే

ఇదంతా ఒక క్రూరమైన పరిహాసంగా పరిగణించబడింది అదలావుండటంలో సందేహంలేదు అదేసమయంలో దానికి మరింత ప్రాధాన్యత ఉన్నదని గుర్తించకపోవడమూ పొరపాటవుతుంది సిద్ధాంతాన్ని జీవన విధానంతో ముడిపెట్టేందుకు ఎంత ప్రాథమికంగానైనా సరే జరిగిన ఒక ప్రయత్నమిది చైతన్యం తీరు వ్యక్తి ఉనికితో సంబంధం లేకుండా వుండదు

ఈ సంబంధంతో ప్రమేయంగల ఒక్క అంశాన్ని మాత్రమే లోకాయతులు గుర్తించినట్లు కనిపించడం వాస్తవమే అది కూడా తమకు తెలిసిన మార్గంలోనే చేశారు సామాజిక పరాన్నభుక్కులను పోషించడం కోసమే కొన్నిరకాల సిద్ధాంతాలు సృష్టించబడ్డాయన్నారు జీవన విధానాన్ని ఆలోచనా విధానంతో అనుసంధానం చేసేందుకు ఇది ఒక మార్గం ఇలాంటి సంబంధం వుందని ఊహించడంలో పొరపాటు లేదు సిద్ధాంతమన్నది తరచూ అవకాశాలు గల స్వల్ప సంఖ్యాకుల మనుగడకు సాధనంగానే వుంటుంది ప్రజలను దోచుకోవడానికది తరచూ ఒక సాధనమౌతుంటుంది

తప్పుకాకపోయినప్పటికీ ఆలోచనకు, ఉనికికి మధ్యగల సంబంధాన్ని గురించి ఇంతవరకు మాత్రమే ఆలోచిస్తే అది సమగ్రం కాదు ఈ సంబంధంలో మరో పార్శ్వం కూడా వుంది దాన్ని మన లోకాయతులు గుర్తించలేదు జీవన విధానం జీవన చైతన్యంపై చూపించే ప్రభావాన్ని వారు పట్టించుకోలేదు మనం చర్చించే సమస్యలో ఇది చాలా ప్రాధాన్యత గల అంశం సామాజికంగా పరాన్నభుక్కులుగా బ్రతకాల్సివచ్చినందుకు తాత్వికులకు ఒక తీవ్ర ప్రమాదం ఏర్పడిందని దీన్నిబట్టి మనం తెలుసుకోవచ్చు వారి చైతన్యం స్వార్ధపర శక్తులకు లాభం కలిగించే ఆలోచనలతో, విలువలతో నిండిపోయింది ఇలా చూడడం మౌలికంగా ఈ తాత్వికులు సమర్థించదలచుకున్న మౌలిక సిద్ధాంత సూత్రాలకు వ్యతిరేకమైనప్పటికీ జరిగింది మాత్రం అదే మరోవిధంగా చెప్పాలంటే తాత్వికులు ఇతరుల బహుమానాల్ను, దానధర్మాలు, వగైరాలపై ఆధారపడి బ్రతకాల్సిన పరిస్థితి ఇందుకు కారణం వారు అలాంటి అవకాశాలు కల్పించే సమాజం వుండడం అవసరమని చెప్పే విలువలను ప్రతిఘటించలేకపోయారు ఈ విలువల వెనుకవున్న మౌలిక భావనలతో సూటిగా విభేదించే సైద్ధాంతిక వైఖరులను చేపట్టిన తత్వవేత్తలకు ఇది సంక్షోభ పరిస్థితి తెచ్చిపెట్టింది

ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని మనం ఇప్పటివరకు వివరంగా చర్చించిన ఒక ఆశ్చర్యకరమైన అంశానికి తిరిగి వెళ్ళవచ్చు బాగా తదుపరి దశకు చెందిన తాత్వికులు భావవాదానికి మౌలికంగా వ్యతిరేకమైన ప్రాపంచిక దృక్పధాన్ని వారసత్వంగా తీసుకున్నప్పటికీ విముక్తి సమస్యలో మాత్రం ప్రత్యక్షంగా భావవాద దృక్పధానికి లొంగిపోవడం కనిపిస్తుంది. ఇందుకు కారణం ఏమై వుంటుంది?

భావవాదంవలెగాక ఈ తాత్విక చింతనలు ప్రాధమికంగా విముక్తిపట్ల సరైన నిర్వచనంతోకూడిన దృక్పధం రూపొందించుకొని వుండకపోవచ్చు అయితే అంతమాత్రాన మలిదశలోని తాత్వికులందరూ స్వాతంత్ర్యంపట్ల భావవాద దృక్పధాన్నే స్వీకరించాలని ఏమీ లేదు పైన చెప్పిన లోపాన్ని మలిదశలో మరో తాత్విక సిద్ధాంత ప్రతినిధులెవరైనా సరిదిద్దగలగడం అసాధారణమేమీకాదు ఆ తాత్విక చింతనకు మౌలికంగా విరుద్ధమైన దృక్పధాన్ని తెచ్చి దానిలో జొప్పించడమే అసాధారణమైన విషయం ఈ పని చేసినవారు అత్యంత పరిణితి చెందిన తాత్వికులు కావడం మరింత విస్మయం కలిగిస్తుంది వీరు తమ మౌలిక సూత్రాలను, వాటికి అనుబంధమైన అంశాలను కాపాడుకోవాలని చాలా గట్టిగా కోరుకునే వారు

కేవలం సైద్ధాంతిక కోణంనుండి ఈ అంశాన్ని వివరించడానికి ఎలాంటి ఆధారమూ వున్నట్లు తోచదు దీనికిగల ఆధారాలను సైద్ధాంతికేతరమైన అంశాలలో మనం అన్వేషించాల్సివుంటుంది తాత్వికులపై స్మృతికారుల ఒత్తిడి అలాంటి ఒక కారణం స్వార్థపరుల ప్రయోజనాలకు దోహదపడే భావాలను, వైఖరులను తాత్వికులు ఆమోదించాలని వారు ఒత్తిడి పెట్టారు అయితే అంతటితోనే కథ పూర్తికాలేదు ఆత్మ, దాని విముక్తి అన్న భావన ఒకరకమైన ఊహాజనిత విశ్వాసంగా స్థిరపడటం కోసం తదుపరి తత్వవేత్తలు తమను తాము మోసం చేసుకున్నట్లు కనిపిస్తుంది వారి భౌతిక వునికితీరు అంటే సమాజంలో వారున్నస్థితివల్ల స్మృతికారుల ఒత్తిడికి ప్రతిఘటన లేకుండా లొంగిపోవడం జరిగిందా? లేక తమ సాంఘిక వునికికి అనుగుణంగా ఉండేందుకై స్వాతంత్ర్యానికి సంబంధించి తమ దృక్పధానికి విరుద్ధమైన భావనను స్వీకరించారా?

ఈ సమస్యను పరిశీలించే సందర్భంలో మనకిక్కడ ఒక సూచన కనిపిస్తుంది అది తాత్కాలికమైనదే కావచ్చు చర్చ సౌలభ్యంకోసం మనం ప్రధానంగా న్యాయ వైశేషికుల ఉదాహరణను తీసుకుందాం

ఈనాడు వారి దృక్పధానికి గల మూలాన్ని గురించి సానుకూలంగా చెప్పగలిగింది చాలా స్వల్పం అలాగే ఈ తాత్విక చింతనను స్థాపించినవారి జీవన విధానాన్ని గురించి, జీవనోపాధి ఆధారాలను గురించి కూడా పెద్దగా తెలియదు అయితే మన ప్రధానమైన ప్రశ్న మలిదశకు చెందిన న్యాయ వైశేషికులను గురించే వారు తమను తాము ఎలా పోషించుకున్నారు? సమాజంలో వారి స్థానం ఏమిటి? దానివల్ల వారిపై సైద్ధాంతికంగా

ఏమైనా ఒత్తిళ్ళు వచ్చాయా? ఇప్పటికి జరిగిన పరిశోధనల ప్రకారం ఈ ప్రశ్నలకు సంపూర్ణ సమాధానాలు ఆశించడం చాలా అవాస్తవికమౌతుంది ఏ కొద్దిమందినో మినహాయిస్తే మన తాత్వికుల వ్యక్తిగత జీవితాన్ని గురించి ఏమీ తెలియదు వారిలో కొందరిని గురించిన చెదురుమదురు సమాచారం కూడా తర్వాత కథలు, పురాణాల మరుగున పడిపోయింది అయితే అంతమాత్రాన వారి భౌతిక జీవనవిధానాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలను పూర్తిగా వదలిపెట్టాలని కాదు వారిని గురించి ఒక స్థూలమైన వాస్తవం మాత్రం కనిపిస్తుంది దాని ప్రాధాన్యతను విస్మరించకూడదు బౌద్ధులను, జైనులను ప్రక్కనపెడితే ఆ తర్వాతి భారతీయ తాత్వికులందరూ బ్రాహ్మణులే మలిదశ న్యాయ వైశేషికులను తీసుకుంటే బ్రాహ్మణులు కానివారెవరూ కనిపించరు

దీన్నిబట్టి తెలిసేదేమంటే సమాజంలో వారి స్థానాన్నిబట్టి ఈ తాత్వికులకు కొన్ని ఆర్థిక, సాంఘిక సదుపాయాలు లభించివుంటాయి అంతేగాక అలాంటి అత్యంత ప్రతిభావంతమైన శాస్త్రీయ దృక్పథంగల ఆలోచనలను వారసత్వంగా పుచ్చుకున్నప్పటికీ దీనివల్ల వారు ఒక తీవ్రమైన లోపానికి గురైనట్లు భావించాల్సివస్తుంది వారు నిస్సహాయంగా బహుశా తెలియకుండాకూడా సమాజంలోని ప్రతికూల సిద్ధాంతాల ప్రభావంలో పడిపోయి వుంటారు తమకు ఈ సదుపాయాలు కలిగిస్తున్న సమాజం భద్రంగా వుండటానికి అవసరమైన ఆ సిద్ధాంతాల తాకిడికి కొట్టుకుపోయి వుంటారు వారి ప్రతికూల సిద్ధాంతాలలో కొట్టవచ్చినట్లు కానవచ్చే ఒక లక్షణం ఆత్మ, దాని విమోచనకు సంబంధించిన సిద్ధాంతమే పాదార్థిక ప్రపంచంనుండి ఉపసంహరించుకోవాలని అది చెప్తుంది అందువల్ల నిజమైన సమాజంలోని అసమానతలను కూడా పట్టించుకోవద్దంటుంది మోక్షం అన్నది తాత్వికుల అంతిమ లక్ష్యంకనుక దేశంలో అతి కీలకమైన ప్రజా ప్రచార సాధనాలుగావున్న ఇతిహాసాలు, పురాణాలు ప్రజలను జోకొట్టేందుకు నిరంతరాయంగా పనిచేశాయి సమకాలీన వ్యవహారాలలో జోక్యానికి సంబంధించిన సూత్రీకరణలు విలువ కోల్పోయాయి పాలనా వ్యవస్థలో భాగమైన బ్రాహ్మణ పరాన్నభుక్కులు తమకు ఇన్ని అవకాశాలు కల్పిస్తున్న సమాజ భద్రతకు ఉపయోగపడే ముక్తి భావనను ఎలా ప్రతిఘటిస్తారు?

ఈ కోణంనుండి చూసినప్పుడు మలి దశ న్యాయవైశేషికులకు, వారి భావవాద ప్రత్యర్థులకుమధ్య పెద్ద తేడా కనిపించదు ఉత్పత్తి శ్రమనుండి దూరంగా ఉన్నారుకనుక వారు పరాన్నభుక్కు తత్వాన్ని కలిగించే ముక్తి భావనకు లొంగిపోవడమేగాక దానిలో దిగబడిపోయారు భావవాదులతో వారు విభేదించేదెక్కడంటే వారు ప్రపంచంపట్ల పూర్తి భిన్నమైన దృక్పథం ఉండాలంటారు బ్రాహ్మణ పరాన్నభుక్కులైనప్పటికీ వారు తార్కికులుగా, అణువాదులుగా వుండడానికి దారితీసిన కారణాలేమిటో మనకు తెలియదు మనకు తెలిసినంతవరకు చెప్పాలంటే వారి మేధా జిజ్ఞాసకు అనుగుణమైన ప్రాపంచిక దృక్పథం వారి ముక్తి భావనతో ఏకీభవించలేదు జీవనోపాధికోసం దానధర్మాలపై ఆధారపడవలసి వచ్చిన దురదృష్టకర పరిస్థితులు వారిని తెలియకుండానే అటువైపు నెట్టినట్లు కనిపిస్తుంది

# వాత్స్యాయనుడు

న్యాయ చరిత్రను చూస్తే మోక్షంపట్ల ఉత్సాహం వాత్స్యాయనుడిలో చాలా ప్రముఖంగా కనిపిస్తుంది అతను గుప్తులకాలానికి చెందినవాడై వుండవచ్చు ఆకాలంలో భారతీయ శాస్త్రవిజ్ఞానం కొన్ని విజయాలను సాధించింది గుప్తులిచ్చిన తోడ్పాటు ఇందుకు కొంతైనా కారణమై వుంటుంది కాని వారి ప్రాపకాన్ని అపార్థం చేసుకోకూడదు వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు తమ శాస్త్రవిజ్ఞానాన్ని కాపాడుకునేందుకై పచ్చి మూఢనమ్మకాలకు తలవంచిన సంగతి చూశాము గుప్తుల మొత్తం శాస్త్రవిజ్ఞాన విధానం చూసేఇలా ఎందుకు జరిగిందో అర్థం కాదు వాస్తవానికి గుప్తులు శాస్త్రవిజ్ఞానానికి పరిమితంగా తోడ్పడడంతోపాటు బ్రాహ్మణులకు సైద్ధాంతిక ప్రచార బాధ్యతలు ప్రత్యేకంగా అప్పగించినట్లు కనిపిస్తుంది స్మృతికారులు ఊహించిన వర్గ పొందికను ప్రచారం చేసే బాధ్యత బ్రాహ్మణులపై పెట్టారు దీనికి సంబంధించి శర్మ ఇలా విశ్లేషించారు" ఎవ్యవసాయం విస్తరిస్తున్న యుగంలో వెనకబడిన ప్రాంతాలలో బ్రాహ్మణులకు భూదానాలు చేయడం ఇందుకు సాక్ష్యం ఇవి పూజారులపట్ల భక్తితో ఇచ్చినవని అపార్థం చేసుకోరాదు

ఈ భూదానాలకు బదులుగా దాతలు వారి పూర్వీకుల ఆధ్యాత్మిక సంక్షేమం కోసం పూజారులు మతపరమైన సేవలు చేసేవారు దానాలవల్ల ప్రయోజనం పొందే పూజారుల లౌకిక బాధ్యతలను దాదాపు ఎక్కడా పేర్కొనలేదు వాకాటక రాజైన రెండవ ప్రవరసేనుడి తామ్ర శాసనం మాత్రమే అలాంటి ఒక అరుదైన ఉదాహరణ ఒక గ్రామాన్ని బహుమతిగా పొందిన వేయి మంది బ్రాహ్మణులపై కొన్ని బాధ్యతలను ఉంచుతున్నట్లు అది పేర్కొంటుంది వారు రాజరికానికి వ్యతిరేకంగా కుట్ర పన్నరాదని, దొంగతనం, వ్యభిచారం, బ్రాహ్మణ హత్య, రాజులకు విషం పెట్టడం వంటి పనులు చేయరాదని పేర్కొన్నది వారు యుద్ధాలకు దిగరాదని, ఇతర గ్రామాలపట్ల తప్పుగా ప్రవర్తించరాదని చెప్తున్నది ఇవీన్న చేయగూడని పనుల జాబితా మాత్రమే అంటే అప్పుడు ఉనికిలోవున్న సాంఘిక, రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేయరాదన్న షరతుపై పురోహితులు దాన ధర్మాలు అనుభవించినట్లు అర్థం చేసుకోవాల్సి వుంటుంది ఇతర శాసనాల్లో వారు మతపరమైన లబ్ధిదారులుగా పరిగణించబడ్డారు అయితే బ్రాహ్మణులు తమ దాతలనుండి పొందిన దానికి మించి ప్రతిఫలం చెల్లించి వుంటారని భావించవచ్చు తమ అధీనంలోని ప్రాంతాలలో వారు శాంతిభద్రతలను కాపాడేవారు వర్ణాశ్రమ ధర్మాలను పాటించడం, రాజుకు విధేయులై వుండడం పవిత్ర కర్తవ్యమని ప్రజలకు నూరిపోసేవారు గుప్తుల కాలనుండి రాజును దైవాంశ సంభూతుడుగా భావించడం ప్రారంభమైంది అందువల్ల దానాలిచ్చినవారి ఉద్దేశాలు ఏమైనప్పటికీ అవి కేవలం మతప్రయోజనాలకోసమే జరిగాయని

భావించడం మాత్రం తప్పు పూజారులు దాతల, వారి పూర్వీకుల ఆధ్యాత్మిక సౌభాగ్యం కోసం ప్రార్థనలు చేసినమాట వాస్తవమే ఇంగ్లాండులో బిషప్పులు చేసినట్లుగా వీరు రాజులకు సైనికులనెప్పుడూ సరఫరా చేయలేదు నిజానికి ప్రజలే అప్పుడున్న వ్యవస్థకు పూర్తి అణిగిమణిగి వుండేలా నచ్చచెప్పగలిగిన తర్వాత సైనిక సేవల అవసరం ఏముంటుంది?

వాత్స్యాయనుడు వ్యక్తిగతంగా ఇలాంటి ప్రయోజనం పొందాడా? అలాంటి ప్రయోజనాలు పొందిన ఏదో ఒక కుటుంబానికి లేక తెగకు చెందినవాడా? మనం ఈ ప్రశ్నకు జవాబు చెప్పాలంటే అందుకు సంబంధించిన చారిత్రిక సమాచారాన్ని, పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తేదీలు, స్థలాలు వగైరాలను నిర్ధారించుకోవలసి వుంటుంది " కాని ఈలోగా స్పష్టంగా కనిపించే ఒక విషయాన్ని నిర్ధారించుకోవచ్చు తేలిగ్గా చెప్పాలంటే అతను దానాలు, ధర్మాలు తప్ప మరే జీవనోపాధి లేని కులానికి చెందినవాడు స్మృతికారుల ఆదర్శాలు అంటే బ్రాహ్మణులు బహుమానాలపై ఆధారపడి జీవించాలని చేసిన బోధనలు సాంఘిక వాస్తవంగా, రాజ్యవిధానంగా విస్తృతస్థాయిలో అమలు జరిగిన కాలంలో జీవించాడు ఈ బహుమానాలకు ప్రతిగా బ్రాహ్మణులు స్వార్థపర శక్తుల సైద్ధాంతిక సమర్థకులుగా పనిచేయవలసి వున్నది అప్పుడున్న సాంఘిక వ్యవస్థకు అణగిమణగివుండాలని ప్రజలకు నూరిపోయడం జరిగింది చుట్టూవున్న పాదార్థిక ప్రపంచ వ్యవహారాలలో తలదూర్చడం కాదని, ఆత్మను భౌతిక ప్రపంచ శృంఖలాలనుండి విముక్తి చేయడమే జీవితపు అత్యున్నత ఆదర్శం అని బోధించబడింది అదే మోక్షం లేక విమోచనం వాత్స్యాయనుడు కూడా ఈ పని చేశాడు తర్కం, జ్ఞాన నిరూపణలకు సంబంధించిన హేతుబద్ధ వ్యవస్థను - "అన్వీక్షకీ విద్య సమర్థించడంలో అతను ఎంతో అద్భుతమైన సేవ చేసినమాట వాస్తవం పై మోక్ష భావన దానితో ఏమాత్రం పొసగనిమాట కూడా వాస్తవమే

ఆవిధంగా అతను న్యాయ సూత్రాలలో ఒక నూతన సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు అది ప్రచండమైన హేతువాదం, ఆత్మ, విమోచన సిద్ధాంతాల విచిత్ర సంగమంగా దాన్ని తయారు చేశాడు ఇదే **ఆధ్యాత్మ విద్య** అలాగే దాన్ని సమర్థించుకోవడానికి అతను వక్కాణించిన విషయాలు కూడా మరింత విడ్డూరంగా కనిపిస్తాయి అన్వీక్షకీ విద్య న్యాయ సూత్రాలకు విలక్షణమైన చర్చనీయాంశమని అతను చెప్తాడు లేకపోతే అది ఉపనిషత్తులవలె కేవలం ఆధ్యాత్మిక విద్య అయి వుండేది అయితే ఉపనిషత్తులలోని ఆధ్యాత్మ విద్యను నిజంగా వ్యాఖ్యానించినవారు మరోవిధంగా అర్థం చేసుకున్నారు దాన్ని కాపాడాలంటే తర్కానికిగల కపటపు గొప్పలను శాశ్వతంగా అణచివేయాలని భావించారు బ్రమ సూత్రాలలో బాదరాయణుడికి వ్యతిరేకంగా సాగిన తర్కం ఇందుకు నిదర్శనం శంకరుడు అన్ని ప్రమాణాలను విలువ లేనివిగా ప్రకటించడంతోనే ప్రారంభించడానికి కూడా కారణమిదే ఇదంతా కూడా చాలా స్థిరమైన విషయం ఎందుకంటే ఆధ్యాత్మ విద్యకు అత్యవసరమైన

విషయం పవిత్ర గ్రంధాలపట్ల విశ్వాసమే తర్కం పట్ల తిరుగులేని విశ్వాసం దానికి ముప్పు తెచ్చిపెడుతుంది ఇందుకు భిన్నంగా వాత్సాయనుడు న్యాయ సూత్రాలవిచక్షణ "అన్వీక్షికీ విద్య" అని చెప్తాడు అది ఆధ్యాత్మ విద్యతో దాదాపు సమానం కనుక ఆయన అసలు బొధలకు దానికి పొసగదు తన మేధా జిజ్ఞాసతో అత్యంత ప్రతిభావంతుడైన హేతువాదిగా నిలిచిన ఒక తాత్వికుడి వ్యక్తిగత విషాదాంతంగా దీన్నిమనం పరిగణించాలా? ఆ సమాజ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా అధ్యాత్మ విద్యను ప్రచారం చేస్తే తప్ప తన జీవనోపాధి గడవని స్థితి అందుకు కారణమైందా? అదే నిజమైతే అన్వీక్షకీ విద్యను సమర్ధించినందుకు అతను తన యుగంలో చైతన్యవంతుడైన శాస్త్రజ్ఞుడుగా వున్నాడు అయితే ఆధ్యాత్మిక విద్యను కూడా సమర్ధించాల్సి వచ్చేసరికి అతను తన సమాజానికి అచేతనంగా బలై పోయాడు ఏదిఏమైనా అతని తాత్విక చింతనలోని రెండవభాగంపట్ల మనకేమీ ప్రత్యేకాసక్తి లేదు ఎందుకంటే అది అతనే వ్యతిరేకించిన ప్రచండ భావవాదానికి భిన్నమైనది కాదు మనకు సంబంధించినంతవరకు అన్వీక్షకీ విద్యను అద్భుతంగా సమర్థించడమే అతని దృక్పథంలో సజీవమైన అంశం ఆధ్యాత్మ విద్యకు లొంగుబాటు నిర్జీవమైన అంశం

## ప్రశస్తపాదుడు

వాత్సాయనుడి తర్వాత శతాబ్దం గడిచాక ప్రశస్తపాదుడు వచ్చాడు వైశేషిక తత్వ చింతనను క్రమబద్ధంగా ప్రతిపాదించిన వ్యక్తి అతను ఇతని విషయంలో కూడా అదే విషాదం ఎదురైంది ఒక ప్రముఖ శాస్త్రజ్ఞుడు తన కుల హోదానుబట్టి స్వార్థపర శక్తుల సైద్ధాంతిక సమర్థకుడుగా మారిపోవాల్సివచ్చింది ఇతని విషయంలో అది మరింత జాలిగొలిపేవిధంగా జరిగింది వైశేషిక సూత్రకారుడు స్మృతికారుల కన్నుగప్పాలనుకున్నట్లయితే ఛాందసాల పవిత్రతపట్ల కొంత బూటకపు విధేయత ప్రదర్శించడం అవసరమైంది అదే వైశేషికానికి చెందిన భౌతికశాస్త్రఅణువాదాలను మరింత ముందుకు తీసుకుపోతూనే ప్రశస్తపాదుడు స్మృతికారులముందు సాగిలపడ్డాడు వారుచెప్పే విలువలన్నింటినీ పునరుద్ఘాటించాడు ఇందుకోసం అతను తన దారినుండి వైదొలగాల్సివచ్చింది ఎందుకంటే భౌతికశాస్త్రం, అణువాదం అతని ప్రధాన అంశాలు వాటికి అతను వైశేషిక తత్వంలోజొప్పించిన స్మృతికారుల విలువలకు ఏమాత్రం పొంతనలేదు వాత్సాయనుడికన్నా మొరటుగా, బండగా, స్వార్థపరశక్తులకు సేవ చేయడమే ఇదంతా ప్రశస్తపాదుడు మోక్షాదర్శాన్ని ఆకాశానికెత్తడమే కాదు వర్ణాశ్రమ వ్యవస్థ సాధారణ సూత్రాలను కూడా సమర్ధించాడు వాటికి పవిత్ర గ్రంధాలు, స్మృతుల ఆమోదం వుందికనుక వాటిని ఉల్లంఘించరాదని చెప్పాడు

స్మృతికారుల అడుగుజాడలను అతనెంతవరకు అనుసరించాడో మనమిప్పుడు చూద్దాం తన ఆదర్శ సమాజంలో శాంతిభద్రతలు కాపాడ్డంకోసం మనువు బాధ్యతలను రెండురకాలుగా వర్గీకరించాడు సాధారణమైనవి, నిర్దిష్టమైనవి అందులో సాధారణమైన వాటిని మనమిప్పుడు చూద్దాం వాటి విషయంలో అతనెలా అపార్థం చేసుకున్నాడో తెలుసుకుందాం కాని అతని స్మృతుల ప్రకారం చూస్తే నిర్దిష్ట బాధ్యతలపైనే అంటే తాము పుట్టిన కులాల సభ్యులుగా వ్యక్తులకుగల తప్పనిసరి బాధ్యతలపైనే మనువు ఎక్కువగా వక్కాణించినట్లు స్పష్టమౌతుంది మను స్మృతిలో ప్రధానమైన ఇతివృత్తమిదే ప్రశస్తపాదుడు స్మృతికారుడు కాకపోయినప్పటికీ అదే బాధ్యతల జాబితాను సూచించడం కోసం జాగ్రత్తపడ్డాడు అతను కూడా బాధ్యతలను సామాన్య, విశేష బాధ్యతలని రెండుగా విభజించాడు అతను పేర్కొన్న ప్రత్యేక బాధ్యతలు అంటే కులాలవారీ బాధ్యతలు ఇలా ఉన్నాయి

**బ్రాహ్మణ క్షత్రియ వైశ్యానా యజ్ఞ అధ్యయన దానాని**
బ్రాహ్మణస్య విశిష్టాని ప్రతి గృహ ద్యాపనా
యజనాని స్వర్ణ విహితాః చసంస్కారాంః

క్షత్రియస్య సమ్యక్ ప్రజా పాలనం అసాధ్య
నిగ్రహంః యుద్దేషు అనివర్తనం స్వకీయః చ సంస్కార.

వైశ్యస్య క్రయ విక్రాయకృషి పశుపాల
నాని స్వకీయాః చసంస్కారాః
శూద్రస్య పూర్వ వర్ణ పారతంత్ర్యం
అమంత్రక క్రియ

ఆవిధంగా ప్రశస్తపాదుడు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఈ ముగ్గురికీ సంబంధించిన ఉమ్మడి బాధ్యతలను మొదట పేర్కొన్నాడు అవి క్రతువులు యజ్ఞాలు (అంటే బ్రాహ్మణులు తమకోసం చేసుకునేవి, క్షత్రియులు, వైశ్యుల పెట్టుబడులతో చేసేవి ) అధ్యయనం, దానం ఆ తర్వాత ప్రశస్తపాదుడు నాలుగు కులాలకు ప్రత్యేకంగా నిర్దేశించబడిన బాధ్యతలను పేర్కొన్నాడు బ్రాహ్మణులకు మాత్రమే అప్పగించబడిన బాధ్యతలు - కానుకలు స్వీకరించడం, బోధన, క్రతువుల నిర్వహణ, స్మృతికారులు పేర్కొన్న పద్ధతుల్లో సాధారణ జీవితం గడపడం (స్వవర్ణ విహిత సంస్కారం) క్షత్రియులకు మాత్రమే అప్పగించబడిన బాధ్యతలేమంటే - ప్రజా పరిపాలన, అపవిత్రుల శిక్షణ, యుద్ధంనుండి పారిపోకుండా నిలవడం, స్మృతికారులు నిర్దేశించిన పద్ధతిలో జీవించడం (స్వకీయ సంస్కారం) వైశ్యులకు మాత్రమే అప్పగించిన బాధ్యతలేమంటే - క్రయవిక్రయాలు,

వ్యవసాయం, పశువుల పెంపకం, స్మృతికారులు నిర్దేశించిన సాధారణ జీవన విధానం *(స్వకీయ సంస్కారం)* శూద్రులకు తప్పనిసరైన బాధ్యత పైన పేర్కొన్న మూడు కులాలకు *(పూర్వవర్ణ పరతంత్రయం)* అణగిమణిగి వుండడమే పవిత్ర మంత్రోచ్చారణతో నిమిత్తం లేని క్రతువులను నిర్వహించడం *(అమంత్రిక క్రియ)* వైశేషికుల భౌతికశాస్త్రం, అణువాదాలను తొలిసారి క్రమబద్ధంగా విశ్లేషించిన వ్యక్తి రచనల్లో ఇలాంటి విషయాలున్నాయని నమ్మడం కష్టం అయితే అది వాస్తవం దాని కర్త ఊహాకల్పనలో అది భాగం కావడం మరింత ఆశ్చర్యకరం బహుశా ఆ తాత్త్వికుడు బ్రాహ్మణుడై వుండవచ్చు అందువల్ల తన కులానికి వర్ణాశ్రమ వ్యవస్థ ఇచ్చే దానధర్మాలపై ఆధారపడి వుంటాడు అందువల్ల ఏమి చేయాలన్న ప్రశ్న ఎదురైనప్పుడు అతనికి ఎలాంటి నూతన దృష్టి కలిగివుండదు అతను జీవిస్తున్న ప్రపంచంలో ఉత్పత్తి విధానంలో నూతన పరిశోధనలు, నైపుణ్యాలు ఏమీ రాలేదు సమాజాన్ని మౌలికంగా మార్చివేసే చారిత్రిక కర్తవ్యం నిర్వహించగల నూతన వర్గం ఆవిర్భవించినట్లు అతనికి తెలియదు ఆ స్తబ్ద ప్రపంచంలో వర్ణాశ్రమధర్మ సామాజిక నైతిక విలువలు తాత్త్వికుడి చైతన్యాన్ని ఆక్రమించి శాశ్వతత్వ భ్రమ కలిగించాయి తన భౌతికశాస్త్రం అణువాదం అలాంటి విలువలకు ఏవిధంగానైనా పొసుగుతాయా అన్న ఆలోచన కూడా లేకుండా తాత్త్వికుడు వాటి అఖండ అనుల్లంఘనీయతకు తలవంచాడు ఆవిధంగా అతని వ్యక్తిత్వంలో ద్వంద్వత్వం చోటుచేసుకున్నది అతని ఉనికిలో ఒక భాగం శాస్త్రానికి అనుగుణంగా వుంది మరో భాగం స్మృతికారులకు ఘోరంగా లొంగిపోయింది భారతదేశంలోనూ ఇతర చోట్లా ఈనాడు పనిచేసే శాస్త్రజ్ఞుల్లో కూడా మనకు ఈ ద్వంద్వ ప్రవృత్తి కనిపిస్తుంది కాని ఈనాటి సమాజం నూతన అవకాశాలను కలిగిస్తున్నది అందువల్లనే దీనిలో ఆ ధోరణులకు విరుగుడు కూడా వున్నది కాని ప్రశస్తపాదుడి నాటి సమాజంలో ఆ అవకాశం లేదు తన భౌతికశాస్త్రభారాలు ఏమైనప్పటికీ అతను స్మృతికారుల ఒత్తిళ్ళకు దారుణంగా తలవంచాడు అయితే ప్రశస్తపాదుడు పేర్కొన్న బాధ్యతల జాబితా గురించి మనమిప్పటివరకు చర్చించిన విషయానికి మోక్షం లేక ఆత్మవిమోచనం అనే మన అసలైన చర్చనీయాంశానికి ఎటువంటి సంబంధమూ లేదు అయితే ఆ జాబితాను మనమిప్పటికీ పూర్తిగా పరిశీలించలేదు

ఇప్పటికి గమనించిన నిర్దిష్ట బాధ్యతలు లేక విశేష ధర్మాలుకాక ప్రశస్తపాదుడు సామాన్య ధర్మాల జాబితా మరొకటి ఇచ్చాడు ఈ బాధ్యతలను ఆవిధంగా రెండు స్థూలమైన వర్గాలుగా విభజించడంలో అతను మనువు అడుగుజాడలను అనుసరించాడు అందువల్ల మనం మనువు దగ్గిరకే నేరుగా వెళితే వీటిని మరింత బాగా అర్థం చేసుకోవచ్చు బాధ్యతలను సాధారణమైనవి ప్రత్యేకమైనవని రెండు రకాలుగా విభజించడంలో మనువు ఉద్దేశం ఏమిటి? ఈ ప్రశ్నకు దురదృష్టవశాత్తూ కొన్నిసార్లు పొరపాటు సమాధానం లభిస్తుంటుంది ఉదాహరణకు మైత్రా ఇలా చెప్పాడు

ఈ సమస్యను ఒక క్రమ పద్ధతిలో పెట్టేందుకు జరిగిన మొదటి ప్రయత్నమే మనువు చేసిన బాధ్యతల వర్గీకరణ సాపేక్ష బాధ్యతలు (వర్ణాశ్రమ ధర్మాలు) అంటే జీవితంలో ఒకరి స్థితివల్ల ఏర్పడే బాధ్యతలకు ఉమ్మడి బాధ్యతలు (సాధారణ ధర్మాలు)అంటే విశ్వజనీనమైన పరిధి విలువ కలిగిన బాధ్యతలకు మధ్య ఆయన తేడా చూపించాడు సాపేక్ష బాధ్యతలన్నవి జీవితంలో ఒకరి స్థితివల్ల సంక్రమించే నిర్ణీత బాధ్యతలు అంటే ఒకరి వర్ణాన్ని లేక కులాన్నిబట్టి జీవితంలోని ఆ దశలో అనుసరించే ఆశ్రమాన్ని బట్టి అవి సంక్రమిస్తాయి సార్వత్రిక బాధ్యతలన్నవి వయస్సుతో, కులంతో తెగతో సంబంధం లేకుండా మనిషి మనిషిగా నిర్వహించాల్సినవి ఒక ప్రత్యేక కులానికి లేక సామాజిక వర్గానికి లేక జీవితంలోని ఒకానొక దశను బట్టి చేయాల్సినవి కావు

ఇలాంటి అవగాహనతో రచయిత హిందూ నైతిక సూత్రాల ఆధిక్యతను నిరూపించేందుకు ప్రయత్నించాడు ముఖ్యంగా చలనం లేని సూత్రాలకన్నా అవి మెరుగైనవని పోల్చేందుకు ప్రయత్నించాడు

ఈవిధంగా చూసినప్పుడు ప్లాటో వర్గీకరణకన్నా హిందూ వర్గీకరణ సంపూర్ణమైనది, సమగ్రమైనది వివిధ సామాజిక వర్గాలనుబట్టి మాత్రమే ఈ విభజన జరిగింది కాని ప్లాటో తరహాలో మనకు సాధారణ ధర్మాలు లేక ఉమ్మడి బాధ్యతలు మాత్రమేగాక జీవిత దశనుబట్టి ఆయా ఆశ్రమం లేక నైతిక హోదా నిర్వహించాల్సిన బాధ్యతను కూడా హిందూ వర్గీకరణ పేర్కొంటున్నది

ఈవిధంగా చూసినప్పుడు హిందువుల సాధారణ ధర్మాలు అన్నవి కులపరమైన అహంభావం, అసహనం పెరగకుండా రక్షణ కల్పిస్తాయి సార్వజనీన బాధ్యతల నియమావళిద్వారా శూద్రులపట్ల మరింత మానవతాయుతంగా ప్రవర్తించేందుకు మార్గం వేయబడింది ప్లాటో తరహాలో పౌర ప్రతిపత్తి లేని దిమ్మరులు లేక సంచారుల పట్ల చూపబడిన గౌరవం కంటే ఇది చాలా మెరుగైనది

స్మృతికారులు వారిపట్ల వ్యవహరించిన తీరును మనమిప్పటికే చూసిన తరువాత శూద్రులపట్ల మానవతాయుతమైన ప్రవర్తన అన్న పదం కొంత అసాధారణమైనదిగా కనిపిస్తుంది హిందూ నైతిక సూత్రాలను గురించిన పై పొగడ్తలో ఒక విషయం పూర్తిగా విస్మరించబడింది మనిషిని మనిషిగా చూసే తత్వం దానిలో లేదు తీవ్రమైన వర్గ దృష్టిగల మనువు వంటి స్మృతికారుల వైఖరి ప్లాటో కంటే మెరుగైంది కాదు ప్లాటో దృష్టిలో బానిసలు ఎంతో మనువు దృష్టిలో శూద్రులు కూడా అంతే అందువల్ల సార్వజనీన పరిధి విలువ గల బాధ్యతలను గురించిన మాట మనువు దృష్టినుండి చూసినప్పుడు వట్టి బూటకం మాత్రమే

అయితే అతను సాధారణ ధర్మాలు లేక సార్వత్రిక బాధ్యతలను గురించి మాట్లాడిన మాట నిజం కాదా? అలా మాట్లాడాడనడంలో సందేహంలేదు అయితే ఇందులోని ఉద్దేశ్యాన్ని మాత్రం పొరపాటుగా అర్థం చేసుకోకూడదు ఇటువంటి జాబితాను

ఇచ్చేముందే అతను ఒక విషయాన్ని స్పష్టం చేశాడు ఈ బాధ్యతలు కేవలం ద్విజులకు మాత్రమే ఉమ్మడిగా చెందుతాయన్నాడు అంటే ఉన్నత కులస్తులైన బ్రాహ్మణులు, వైశ్యులు, క్షత్రియులకన్నమాట రెండుసార్లు జన్మించిన మానవులు (అంటే ద్విజులు) జీవితంలోని ఏ దశలోనైనా సరే (ఇవే నాలుగు ఆశ్రమాలు బ్రహ్మచర్యం, గర్హాస్థం వానప్రస్థం, సన్యాసం) ఈ పదిరకాల బాధ్యతలను జాగ్రత్తగా అమలుజరపాలి అందువల్ల మనువు దృష్టిలో ఈ బాధ్యతలు శూద్రులకు కూడా ఉమ్మడిగా వర్తించడమన్న ప్రశ్న లేదు కాని మనువు ఇలా శూద్రులను మాత్రమే ఎందుకు మినహాయించవలసివచ్చింది? సాధారణ ధర్మాలుగా అతను చెప్పినవాటిలో కొన్నింటిని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు ప్రాథమికమైన జవాబు లభిస్తుంది ఆ జాబితాలో మేధస్సు *(ధీ)* అభ్యాసం *(విద్య)*, శుభ్రత *(శుచి)* వగైరాలు ఉన్నాయి స్మృతికారుల దృష్టిలో మలిన జన్ములైన శూద్రులకు ఇవి పూర్తిగా నిషిద్ధాలు వారు అజ్ఞానంలో, అంధకారంలో బ్రతకవలసినవారే కాని మనువు, అతని తరువాత ప్రశస్తపాదుడు కూడా ఇలా ఉన్నతవర్గాలకు మాత్రమే పరిమితమైన సాధారణ బాధ్యతల ప్రత్యేక జాబితా ఎందుకు ఇచ్చారన్నది లోతుగా పరిశీలించాల్సిన విషయం

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యుల బాధ్యతలను మనువు వివరంగా పేర్కొన్నాడు వాటిని ప్రశస్థపాదుడు పూర్తిగా ఆమోదించి ప్రశంసాపూర్వకంగా క్రోడీకరించాడు బహుమతులను అందుకొని పూజారులుగా, బోధకులుగా పనిచేయడమే బ్రాహ్మణుల ప్రధానబాధ్యత క్షత్రియుల ప్రధాన బాధ్యత శాంతిభద్రతలను కాపాడటం, యుద్ధాలలో పోరాడటం వైశ్యులు వ్యవసాయ వాణిజ్యాలు చూసుకోవాలి ఈ ఉన్నతవర్గాలను మినహాయిస్తే శూద్రులు మనువు, ప్రశస్తపాదుడు చెప్పిన ప్రకారం సమాజానికి అవసరమైన శారీరక శ్రమ చేసిపెట్టాలి

స్మృతికారులు వేర్వేరు కులాలవారికి అప్పగించిన నిర్దిష్టబాధ్యతలు ఇలా ఉన్నాయి వారు ఊహించిన ఆదర్శ సమాజాన్ని నిర్వహించడమే బహుశా వీటికి ఒకే ఒక ప్రయోజనం కాని ఉపనిషత్తులు అత్యున్నత మానవాదర్శంగా ప్రకటించే ఆత్మ విమోచన సంగతేమిటి? వేర్వేరు కులాలకు నిర్దేశించబడిన నిర్ణీత బాధ్యతలు అందుకు పనికి వచ్చేవికావు మొదటి విషయం - బహుమతులు స్వీకరించడంద్వారా బ్రాహ్మణుల ఆత్మలు విమోచనం పొందుతాయని చెప్పేందుకు స్మృతికారులు కూడా సాహసించలేకపోయారు అలాగే క్షత్రియులు యుద్ధాలలో గెలవడంద్వారా శాంతిభద్రతలు రక్షించడంద్వారా వారి ఆత్మ విముక్తి పొందుతుందని ప్రకటించలేకపోయారు [1] రెండవ విషయం - నిర్ణీత బాధ్యతలను నిర్వహించడమే విమోచనకు దోహదకరమని ఆమోదించినట్లయితే శూద్రులు కూడా దాన్ని

1 క్షత్రియులు నిర్ణీత బాధ్యతలు నిర్వర్తించడం వల్లకలిగే ఫలితాలను భగవద్గీతలో చాలా సూటిగా చెప్పారు "నీవు ఈ యుద్ధంలో నేల కొరిగితే స్వర్గప్రాప్తి కలుగుతుంది గెలిస్తే భూమిపై సుఖపడతావు" అంటూ కృష్ణ భగవానుడు అర్జునునికి ఉపదేసిస్తాడు

సాధించే అవకాశం కలిగినట్లవుతుంది అలాంటి అవకాశం వుండుట స్మృతికారులకు ఎప్పుడూ ఇష్టం లేదు వారి దృష్టిలో కాయకష్టం చేసే శ్రామికులు ఎప్పుడూ దాసత్వంలో, అర్థ బానిసత్వంలో మగ్గిపోవలసిందే ఎందుకంటే సృష్టికర్త వారిని ఇతరులకు అంటే అగ్రవర్ణాలకు సేవ చేయడంకోసమే సృష్టించాడు

అందుకే వేర్వేరు కులాలకు వేర్వేరు బాధ్యతలు నిర్దేశించిన మనువు కొన్ని సాధారణ బాధ్యతలు కూడా పేర్కొనడం అవసరమని భావించాడు అవి విమోచన సాధించడానికి దోహదపడతాయని చెప్పబడింది విమోచనకు అర్హులైనవారే వాటిని నిర్వహించాల్సివుంటుంది ద్విజులకు మాత్రమే ఆ అర్హత ఉన్నదని స్మృతికారుల అభిప్రాయం ద్విజులకు సాధారణ బాధ్యతల జాబితా ప్రత్యేకించి పేర్కొనడంలో మనువు అసలైన ఉద్దేశ్యం వారు ముక్తికోసం ఏవిధంగా కృషిచేయాలో చెప్పడమే మనువుపై వ్యాఖ్యానం రాసిన వారిలో అతి ప్రముఖులు ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పారు ఇప్పటికే పేర్కొన్నట్లుగా ఈ జాబితాలో విద్య, మేధస్సు కూడా చేర్చబడ్డాయి మేధాతిథి, కుల్లూకభట్టు చెప్పే ప్రకారం వాటిని ప్రత్యేకమైన అర్థంలో తీసుకోవాల్సివుంటుంది మేధస్సు లేక బుద్ధి అంటే ప్రతికూల దృక్పథాలవల్ల కలిగిన సందేహాలు వగైరాలను నివృత్తి చేసే నిజమైన జ్ఞానం తెలుసుకోవడమే సమ్యక్‌జ్ఞానం, *ప్రతిపక్ష సంశయాది నిరాకరణం* అయితే సందేహాలు సృష్టించే ప్రతికూల భావాలేవీ? స్మృతికారుల దృష్టిలో ఇందుకొక్కటే సమాధానం ఆత్మ పట్ల పవిత్ర గ్రంథాలలో చెప్పబడిన దానికి భిన్నమైనదంతా ప్రతికూల దృక్పథమే మేధాతిథి విద్యను గురించి ఇచ్చిన వివరణ దీనిని ధృవపరుస్తున్నది విద్య అంటే ఆత్మజ్ఞానం అని అతను చాలా స్పష్టంగా చెప్పాడు

కుల్లూకభట్టు ప్రధానాంశాలను పునరుదాటించి ఇలా చెప్తాడు శాస్త్రాది తత్వజ్ఞానం *ధీ, ఆత్మజ్ఞానం విద్య* మేధస్సు అంటే పవిత్రగ్రంధాలు వగైరాలకు అనుగుణమైన అంతిమ సత్యాన్ని గురించిన జ్ఞానం నేర్చుకోవడం అంటే ఆత్మను గురించిన జ్ఞానం ఆవిధంగా మేధస్సుకు, విద్యకు మధ్య ఎలాంటి తేడా లేదు ఎందుకంటే పవిత్ర గ్రంధాలలో వెల్లడయ్యే అంతిమసత్యం ఆత్మను గురించిన జ్ఞానం తప్ప మరొకటి కాదు ఈ సత్యమే, ఈ జ్ఞానమే విమోచనకు దోహదకరమైంది

ఆవిధంగా వ్యాఖ్యాతలు స్మృతికారుల ఉద్దేశ్యంపట్ల ఏవిధంగానూ అనంగీకారం తెలపలేదని మనువు చెప్పిన దాన్ని బట్టే స్పష్టమౌతుంది సాధారణ బాధ్యతల జాబితా ఇచ్చిన తర్వాత వెనువెంటనే అతనిలా ప్రకటిస్తాడు "దశముఖ సూత్రాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసే బ్రాహ్మణులు ఉన్నత స్థితిలోకి ప్రవేశిస్తారు (పరమంగతి=మోక్షం)

రెండుసార్లు జన్మించిన మనిషి (ద్విజుడు) మనసుపై అదుపాజ్ఞలతో దశ సూత్రాలను పాటించి తన రుణాలను చెల్లిస్తే వేదాంతాన్ని నేర్చుకున్న తర్వాత సూత్రాల ప్రకారం

వ్యవహరించి విరాగి అవుతాడు ఆవిధంగా అన్నికర్మలను విడనాడిన వ్యక్తి కేవలం తన స్వకీయతపైనే ఆధారపడి కోర్కెలను వదులుకొని సన్యాసం ద్వారా తన పాపాలను పరిహారం చేసుకొని అత్యున్నత దశను చేరుకుంటాడు *(అదే విమోచనపరమం గతి)*

కుల్లూకభట్టు ఇలా వివరిస్తాడు *ఈ పది బాధ్యతలను అధ్యయనం చేసే వివేకవంతులు వాటిని చదివిన తర్వాత ఆత్మజ్ఞానంతో సహా వాటికి గట్టిగా కట్టుబడతారు ఎందుకంటే అంతిమసత్యాన్నిగురించిన వారి జ్ఞానంతో అత్యున్నత స్థితికి అంటే మోక్షానికి చేరుకుంటారు*

ఈవిధంగా మనువు వేర్వేరు కులాల సభ్యులకు నిర్ణీత బాధ్యతలకు తోడు సాధారణ బాధ్యతల జాబితా సిఫార్సు చేయడంలో ఒక ప్రత్యేకత వుంది స్మృతికారుడు వుద్దేశించిన ఆదర్శ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ అన్న ఉమ్మడి లక్ష్యం నిర్ణీత బాధ్యతలన్నింటికీ వున్నది మోక్షం కలిగించడమనే ప్రత్యేక ప్రయోజనం సార్వత్రిక బాధ్యతలకు వుంది ఈ సార్వత్రిక బాధ్యతలు కులీనవర్గాలకు లేదా ద్విజులకు మాత్రమే పరిమితం చెమటోడ్చే అత్యధిక ప్రజలకు లేక శూద్రులకు అవి నిషేధం వారు విమోచనానికి అర్హులు కారు స్మృతికారుని దృష్టిలో వారి విముక్తి అన్న ప్రశ్న ఉదయించదు ఎందుకంటే వారు పైవర్గాల సేవకోసమే సృష్టించబడ్డారు

క్లుప్తంగా ఈ ప్రశ్నకు మనువు ఇచ్చిన జవాబు ఇది మరలాంటప్పుడు ఏం చేయాలి?

మనువునుండి వచ్చింది కనుక దీనిలో ఆశ్చర్యకరమైంది ఏమీ లేదు ఎందుకంటే మనం సాంప్రదాయక సమాజంలో స్వార్థపరశక్తులను సమర్థించే వ్యక్తులనుండి అంతకంటే మెరుగైనదేమీ ఆశించలేము అయితే ప్రత్యేకించి విషాదకరమైన విషయమేమంటే ప్రశస్తపాదుడుకూడా నీతిగురించి అదే దృక్పథాన్ని తీసుకున్నాడు దాన్ని తన నమూనాగా చేసుకుని ఆ ముఖ్యాంశాలన్నింటినీ పునరుద్ఘాటించాడు చైతన్యవంతమైన మేధోవివేచనతో భౌతికశాస్త్రం, అణుశాస్త్రానికి సంబంధించిన వైశేషిక దృక్పథాన్ని తొలిసారిగా విశదీకరించిన వ్యక్తి అతను తన కాలం కొలబద్దతో చూస్తే అతను ప్రకృతిపట్ల దాని సూత్రాలపట్ల తీసుకున్న అవగాహన చాలా ప్రముఖమైంది అయితే అతను జీవించిన సమాజం ముఖ్యంగా అతను పరాన్నభుక్కులైన బ్రాహ్మణ కులానికి చెందడంవల్ల అతని వ్యక్తిగత ఎంపికకు ఖచ్చితమైన పరిమితులేర్పడ్డాయి ఆచరణ సమస్య వచ్చినప్పుడు ఇది మరింత ప్రభావం చూపింది ప్రకృతిపట్ల మెరుగైన అవగాహన ఉన్నప్పటికీ ప్రశస్థపాదుడు కొత్తగా ఏమీ చెప్పలేకపోయాడు అతని సమాజం, దానిలో అతని స్థానంకారణంగా ప్రకృతిపట్ల గల ఈ మెరుగైన అవగాహనను మరింత మెరుగుపర్చుకుని ముక్తిపట్ల కూడా నూతన దృష్టి

పెంపొందించుకోవచ్చునని గ్రహించలేకపోయాడు తగిన భౌతిక పరిస్థితులు ఏర్పడినప్పుడే తత్వవేత్తల్లో అలాంటి జాగృతి ఉదయిస్తుంది ప్రశస్థపాదుడికి అలాంటి పరిస్థితులు లభ్యంకాలేదు స్తంభీభూత సాంప్రదాయక సమాజంలో ఈ విలక్షణ బ్రాహ్మణుడు స్మృతికారుడి ముందు తలవంచాలి అతను ముక్తికి సంబంధించి ప్రతికూల దృక్పథాన్నే స్వీకరించాడు బ్రాహ్మణ పరాన్నభుక్కులను పోషించే సమాజ భద్రతకోసం స్మృతికారుడు నిర్దేశించిన ప్రతిదాన్నీ ఆమోదించాలని ప్రశస్థపాదుడు వాదిస్తాడు

## సారాంశం

వాత్సాయనుడు ప్రశస్థపాదుని తర్వాత న్యాయవైశేషికతత్వ చరిత్రలో పరిస్థితి ఏమీ మెరుగుపడలేదు ముక్తిపట్ల భావవాద దృక్పథం ఇంకా ఇంకా బలపడింది తర్కాన్ని, అణువాదాన్ని సమర్థించేవారి చైతన్యంలో అది లోతుగా పాతుకుపోయింది స్మృతికారుల ఆదేశాలు వారికి పవిత్ర ప్రమాణాలుగా తయారయ్యాయి వీటన్నింటతో మలిదశ న్యాయవైశేషికుల బూటకత్వం ఎంతగా బలపడిందంటే వారు తమ ద్వంద్వ ప్రయోజనాన్ని అంటే శాస్త్రం, శాస్త్రవ్యతిరేకం అనే రెండు అంశాలను ఇముడ్చుకోవాలన్న స్పృహను కోల్పోయారు ఈరెండింటిని ఊహాజనితంగా కలిపివుంచవచ్చునని ఆత్మవంచన చేసుకున్నారు దాన్ని నిరూపించేందుకోసం తమ పాండిత్యాన్నంతా ఉపయోగించారు

మలిదశ న్యాయవైశేషికుల వలెనే భావవాద వ్యతిరేకులైన ఇంకా అనేక మందికికూడా ఈ పరిస్థితి ఎదురైంది భారతీయ తత్వశాస్త్రంలో భావవాద ప్రభావాన్ని తొలగించేందుకు వారెంత కృషిచేసినప్పటికీ విముక్తి భావన విషయంలో మాత్రం వారు దానిలోనే ఉండిపోయారు గట్టి భౌతికవాదులు లేక లోకాయతులు మాత్రమే ఇందుకు మినహాయింపులు వారు మోక్షం అన్న మాటే బూటకమని కొట్టిపారేశారు ముక్తిపట్ల ప్రతికూల దృక్పథాన్ని వారు త్రోసిపుచ్చినప్పటికీ తమదైన ఒక సానుకూల దృక్పథాన్ని పెంపొందించడంలో మాత్రం చాలా వెనకే వుండిపోయారని ఇప్పటికే చూశాం సాంప్రదాయక భారతీయ తత్వశాస్త్రం నిజంగా విఫలమైన విషయం విముక్తి సమస్యకు పరిష్కారమే అయితే ఈ వైఫల్యానికి కారణం తెలుసుకోవచ్చు ఆ విధంగా ఈనాటి భారతీయులు తమ తాత్విక సాంప్రదాయాల్లోగల ఈ తీవ్రమైన పరిమితి అధిగమించవచ్చు మధ్యయుగాల భారతదేశంలోని మహాలోచనాపరులు తమ కాలాన్ని అది రూపొందించే సామాజిక సంబంధాలను దాటి ఆనాటి యూరప్‌లోని వారి సహచరులకన్నా ముందుకు పోగలరని ఊహించలేము అలాంటప్పుడు ఈ సమస్యకు పరిష్కారం ఇంకా పరిపక్వంకాని ఆర్థిక రాజకీయ పరిస్థితులలో దాగివుండగా వారెంత సమర్థులైనప్పటికీ కేవలం ఆ తాత్వికుల బుర్రలలోనుండి - ఎలా ఉద్భవిస్తుంది?

ప్రపంచ తాత్విక చరిత్రలో ముక్తిపట్ల సానుకూల దృక్పథం ఇద్దరు ప్రవక్తలలోనూ, ఇద్దరు ఆధునిక శాస్త్ర ప్రచారకులలోనూ కనిపిస్తుంది వారే బేకన్, డెస్కార్టస్‌లు ఈ నూతన దృక్పథం వారిలో ప్రేరేపించబడటానికి కారణం ఏమిటి? సమాజ పరివర్తనలో శాస్త్రం చేపట్టిన నూతన పాత్ర అందుకు కారణం సమాజం అప్పటికి వర్తకులు, నావికులు, ఉత్పత్తిదారులు, రాజకీయవేత్తల నాయకత్వంలో వుంది క్లుప్తంగా చెప్పాలంటే తొలి ప్రగతిశీల బూర్జువావర్గం క్రింద వుంది

"అంతేగాక మధ్యతరగతి పెరుగుదలతో పాటు విజ్ఞాన శాస్త్రం, ఖగోళ శాస్త్రం, యంత్ర విజ్ఞానం, బౌతిక శాస్త్రం, శరీర శాస్త్రం, వాస్తు శాస్త్రం గొప్పగా పునరుద్ధరణ చెందాయి పారిశ్రామిక ఉత్పత్తి విస్తరణతో భూర్జువా వర్గానికి ప్రకృతిలోని వస్తువుల, ప్రకృతి శక్తుల శక్తి చలనరూపాల బౌతిక ధరలను గురించి తెలుసుకొనవలసిన అవసరం ఏర్పడింది అప్పటి వరకు విజ్ఞాన శాస్త్రం చేర్చి చేతి పనిముట్లుగా వుండేది విశ్వాసం గిచిన గీత దాటేందుకు అనుమతి వుండేది కాదు అందుకే శాస్త్రంలో హేతువుకు చోటు లేకుండా పోయింది ఇంకా ఇప్పుడు శాస్త్రం చర్చిపై తిరుగుబాటు చేసింది అది లేకుండా బూర్జువాలకు పని జరుగదు గనుక వారు కూడా తిరుగుబాటులో చేరారు"

శాస్త్రవిజ్ఞానవేత్తలను ఉత్తేజపరచిన ఈ నూతన విముక్తి భావనను అర్థం చేసుకోవాలంటే బూర్జువా విప్లవానికి అవసరమైన పోరాట దళంగావున్న శ్రామికజనబాహుళ్యంపాత్రను కూడా గమనించాలి అయితే మిగిలిన సమాజమంతటికీ ప్రతినిధులుగా చెప్పుకుంటున్న ఫ్యూడల్ కులీనుల పట్ల గల వ్యతిరేకత తేమిటి పక్కనే దోచుకునేవారికి, దోచుకోబడేవారికి సంపన్నులైన సోమరులకు, నిరుపేదలైన కార్మికులకు మధ్య మామూలుగా వుండే వైరుధ్యం అలాగే వుండేది ఈ పరిస్థితులే బూర్జువా ప్రతినిధులను ఏదో ఒక ప్రత్యేకవర్గ ప్రతినిధులుగాగాక మొత్తం బాధిత మానవాళికంతటికీ ప్రతినిధులుగా ముందుకొచ్చేందుకు అవకాశం కల్పించాయి మొదటినుండి కూడా బూర్జువావర్గం తన విరుద్ధాంశంతో ముడిపడే వున్నది వేతన కార్మికులు లేనిదే పెట్టుబడిదారుడు వుండడు అలాగే మధ్యయుగాల గిల్డు వ్యాపారులు ఆధునిక బూర్జువా వర్గంగా పెంపొందగా, గిల్డులలోని శ్రామికులు, బయట పనిచేసే రోజుకూలీలు శ్రామికవర్గంగా తయారయ్యారు ఈ మొత్తం ప్రజలను కలుసుకొని బూర్జువా వర్గం కులీనవర్గంపై పోరాడింది ఆ దశలోని వివిధ శ్రామికవర్గాలకు తాను ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పుకున్నది అయినప్పటికీ ప్రతి గొప్ప బూర్జువా ఉద్యమంలోనూ ఆధునిక శ్రామికవర్గ స్వతంత్ర వెల్లువలు కూడా స్వల్పంగానో, అధికంగానో కానవచ్చాయి

మధ్యయుగ ప్రపంచాన్ని మార్చడంలో పీడిత ప్రజలు నిర్వహించిన పాత్రను గురించిన ఈ విశ్లేషణద్వారా మనం శాస్త్ర ప్రవక్తలు విముక్తి పట్ల నూతన దృక్పథాన్ని పెంపొందించుకోవడానికి దోహదం చేసిన అంశమేమిటో గ్రహించవచ్చు ప్రకృతి పట్ల

కలిగిన నూతన అవగాహన అంటే ప్రకృతిపై ఆధిపత్యం అని వారు అర్థం చేసుకున్నారు నూతన విజ్ఞానమంటే నూతన శక్తి అయితే ఉపనిషత్తు ఆలోచనాపరులు ఊహించినట్లుగా విజ్ఞానంలో ఎలాంటి మహత్యం లేదు విజ్ఞానం అన్నది శక్తిగా మారేందుకు చురుగ్గా కృషిచేయాలి ఈ మార్పు సాధించగలిగిన ఒకే ఒక వర్గం కార్మికవర్గమే

ఈ నూతన దృక్పథం క్లుప్తంగా చెప్పాలంటే విజ్ఞానం పట్ల నూతన అవగాహన దీన్ని జె డి బర్నాల్ ఇలా వివరిస్తాడు

*"మనిషి ప్రపంచంతో యధాతధంగా రాజీ పడేందుకు సాధనంగా వుండే స్థితి మారింది ప్రపంచం ఎప్పుడూ అలాగేవుంటుందని, ప్రళయం వస్తుందని అనుకునే బదులు ప్రకృతి శాశ్వత సూత్రాలను గురించిన జ్ఞానంతో దాన్ని అదుపు చేయవచ్చుననే ఆలోచనను మార్చివేసింది ఈ నూతన దృక్పథం పాదార్థిక సంపద ఫలితమే ---------*

*బహుశా శ్రమించే చేతులు వెనక్కు నెట్టివేయబడినతర్వాత నాగరికత అభివృద్ధికి సంబంధించిన అంశాలన్నీ మెదడుకు మాత్రమే వదలివేయబడి తర్వాత విముక్తికి సంబంధించిన నూతన దృక్పధంలో సరైన స్థానం సంపాదించుకున్నాయి బేకన్ ఈ దృక్పధాన్ని ఇలా వివరిస్తాడు ----*

*"మానవాళికి అందిన ప్రయోజనాలలో ఈ కొత్త కళలు, నిర్మాణాలు, సరుకుల పరిశోధనకన్నా గొప్పదేమీ లేదు మానవజీవితాన్ని మెరుగుపరుస్తాయి పురాతనకాలంలోని ఆదిమమానవులలో పరిశోధనలు, సృజన చేసేవారిని ఎంతోగౌరవించి దేవతల సరసన కూర్చో పెట్టేవారు నగరాల స్థాపనలు, శాసనకర్తలు, ప్రజా పీడిత నియంతలపై తిరుగుబాటుదార్లు, ఆ వర్గాల యోధులు తెచ్చిన మంచి మార్పులు చాలా స్వల్పమైన పరిమితుల్లోనే, కొద్దికాలమే అమల్లో వుండేవి కాని ఒక పరిశీలనకు కృషి, అంత ఆర్భాటం లేకపోయినా దీర్ఘకాలంపాటు ప్రతిచోటా ప్రభావం చూపేది*

*ఆనాటినుండి ఏదో ఒక పరిశోధన ఎంత ప్రయోజనకరమైనదైనప్పటికీ అలాంటిది ప్రకృతి అవగాహనకు సంబంధించి కొత్త విలువలు ప్రసరింపచేయగలిగితే అవి పరిహద్దులు, ప్రాంతాలు, ప్రస్తుత జ్ఞానపు పరిధులు దాటి విస్తరిస్తుంది మరింతగా దాన్ని విస్తరింపచేసి ఇప్పటివరకు గుప్తంగా, రహస్యంగా వున్నదాన్ని వెలుగులోకి తెస్తుంది అలాంటి కృషి చేయగలిగిన వ్యక్తి (నాదృష్టిలో) మొత్తం మానవ జాతికి మేలు చేసినవాడవుతాడు విశ్వంలో మానవ సామ్రాజ్యాన్ని విస్తరింపచేస్తాడు విముక్తి పొందుతాడు అవసరాలపై ఆధిపత్యం సాధించి లొంగదీసుకుంటాడు "*

తన స్వీయ పరిశోధనలగురించి డెస్కార్టిస్ఇలా అంటాడు

"జీవితానికి చాలా మేలు చేసే విజ్ఞానాన్ని అవి అందజేశాయి విద్యాలయాల్లో బోధించే ఊహాజనితమైన ఈ తాత్వికచింతనకన్నా నిప్పు, నీరు, గాలి, తారా మండలం వగైరాలకుగల శక్తి, చలనం తెలియజెప్పే వాస్తవిక తత్వశాస్త్రం కనుగొనడానికి స్పర్శలు,

మనచుట్టూ వుండే ఇతర పదార్థాల గురించి తెలుసుకోవచ్చు మన చేతి పనివారిగురించి తెలుసుకున్నట్లే ఆ విషయంలో మనం తెలుసుకోగలుగుతాము మన అవసరాలకు వాటిని వినియోగించుకుంటూ ప్రకృతికి అధినేతలం, భోక్తలం కావచ్చు

మనిషి ప్రపంచంపై "మానవసామ్రాజ్య ప్రకటన కర్త అవుతాడు విముక్తి సాధించే మొనగాడుగా, విజేతగా, పరిసరాలను లొంగదీసుకునేవాడుగా తయారవుతాడు మనిషి ప్రకృతికి అధినేతగా, భోక్తగా తయారవుతాడు" 17వ శతాబ్దం ద్వితీయభాగంలో ఇలాంటి మాటలు చెప్పడం ఎంత సాహసం? అయినా ఈ మాటలు ఎంత దూరదృష్టితో చెప్పినవో ఇప్పటికే రుజువైపోయింది అధినేతలుగా, భోక్తలుగా మానవులు ఈనాడు భౌతిక ప్రకృతిని అదుపుచేస్తున్నారు దీన్ని మరింత విస్తరించుకునే అభివృద్ధి వేగం పెరుగుతున్నది దాన్ని ఇప్పుడు అంచనా కట్టడంకూడా కష్టమే మన దృష్టిపథంలోనే ఒక నూతన యుగం ఆవిష్కృతమౌతున్నది ఈయుగంలో భౌతిక ప్రకృతిపై అనంతమైన ఆధిపత్యం నిరంతరం విస్తరించే అవగాహన లభించనున్నాయి క్లుప్తంగా చెప్పాలంటే విముక్తి సానుకూల అర్థం సంతరించుకోనున్నది

అయితే ఇదంతా బొమ్మకు ఒకవైపు మాత్రమే అలాంటి యుగం మనముందు ఆవిష్కృతం అవుతున్నప్పటికీ మనిషి ఇప్పటికీ వర్గాలుగా విభజించబడిన ప్రపంచంలోనే జీవిస్తున్నాడు. దారిద్ర్యం, అజ్ఞానం, క్రౌర్యం ఇదివరకటికన్నా ఎక్కువగా కానవస్తున్నాయి మొత్తం మానవాళి తుడిచిపెట్టబడే ప్రమాదంకూడా వున్నది ఆధునిక తత్వశాస్త్ర పితామహులు ఎంతో సాహసంతో ఊహించి చెప్పినట్లు భౌతిక ప్రకృతిపై లభ్యమైన ఆధిపత్యం వల్లనే ఇదికూడా జరుగుతున్నది అలాంటప్పుడు ఈ నూతన దృక్పథంలోనే ఏమైనా పొరపాటు ఉన్నదా?

ఇటీవలి చరిత్ర ఈ ప్రశ్నకు అంతకంతకూ స్పష్టంగా సమాధానం ఇస్తున్నది అలాగే చరిత్రపట్ల సరైన అవగాహనగల తాత్వికులు, శాస్త్రజ్ఞులు దీనికి స్పష్టంగా జవాబు చెప్తున్నారు

పెట్టుబడిదారీయుగం ప్రారంభమౌతున్న దశలో తత్వవేత్తలకు విముక్తిపట్ల ఈ నూతన దృక్పథం ఏర్పడింది ఆధునిక విజ్ఞానశాస్త్రాన్ని ఉనికిలోకి తెచ్చిన యుగమది ఆకాలానికి చెందిన ప్రగతిశీల బూర్జువాలకు ఉత్పత్తి విధానంలో మహత్తరమైన విప్లవం తెచ్చేందుకు అది అవసరమైంది ఒక ప్రత్యేక తరగతికిగాక మొత్తం బాధిత మానవాళికి ప్రతినిధులుగా వారు ముందుకొచ్చారు బ్రహ్మాండమైన సామాజిక మార్పుకోసం పోరాడే దళంగా వుండదగింది ఆ కాలంలోని పీడితప్రజలు మాత్రమే గనుక బూర్జువాలు ఇలా అందరితరపునా పోరాడేవారుగా కనిపించేందుకు ప్రయత్నించారు ఆవిధంగా ఆధునిక శాస్త్రంతోపాటు ఆధునిక కార్మికవర్గం కూడా ఉనికిలోకి వచ్చింది చారిత్రకంగా పెట్టుబడిదారీ యుగాన్ని తెరమరుగు చేయడంతోపాటు దాన్ని కూలద్రోయడం ఆ రెండింటికీ కూడా కర్తవ్యమైంది

పెట్టుబడిదారీ విధానం మొదట విజ్ఞానశాస్త్రానికి అవకాశం కల్పిస్తే ఆ తర్వాత విజ్ఞానశాస్త్రం పెట్టుబడిదారీ విధానాన్ని అనవసరమైనదిగా చేసింది [1] మన కాలంలోని ఒక గొప్ప శాస్త్రజ్ఞుడు రూపొందించిన అద్భుతమైన సూత్రీకరణ వివరాలలోకి వెళ్ళేందుకు మనకిప్పుడు అవకాశంలేదు కాని ఒక విషయాన్ని గుర్తించడం అవసరం ఇదివరకెన్నడూ లేనంతీ ఎతీవ్ర దారిద్ర్యం, అజ్ఞానం, క్రౌర్యాలతో విభజితమైన సమాజం ప్రపంచం" ఈనాడు మనముందున్నది శాస్త్ర విజ్ఞానం పెట్టుబడిదారీ విధానాన్ని అనవసరమైనదిగా ప్రకటించడానికి ఇది చాలు ఇప్పటివరకు ఎరగనంత సమృద్ధిని సాధించే అవకాశాలు పెరుగుతున్నప్పుడు పెట్టుబడిదారీ విధానం అత్యాధునిక దశకు చేరాక ఉత్పాదక శక్తుల పెరుగుదలకు ఆటంకం అవుతుంది తయారైన ఉత్పత్తిలో కూడా అంతకంతకూ అధికభాగం ప్రజల నిజమైన అవసరాలను తీర్చే బదులు నిరర్థకమైన దండగమారి కార్యక్రమాలవైపు మరల్చేందుకు ప్రయత్నిస్తుంది, విధ్వంస కార్యక్రమాలకు మరలుస్తుంది ------

క్లుప్తంగా చెప్పాలంటే అది ఇంటా, బయటా నిరుద్యోగులు పనిలేని యంత్రాలు దుర్భర పరిస్థితులతో సహజీవనం చేసే దశను సృష్టిస్తుంది సంపదలతోపాటే దారిద్ర్యం పెరుగుతుంది అస్థిరమైన, హానికరమైన రీతుల్లో అపారమైన ఆర్థిక వనరులు వృథా చేయబడతాయి దేశంలోనూ, వెలుపలా వేలాదిమంది నోర్లు నొక్కివేయబడతాయి విదేశాలలోని కోటానుకోట్ల మందిని మారణహోమం చేయడానికి పథకాలు అమలుజరుగుతాయి ఇంతకన్నా ఎక్కువ చెప్పాల్సిన అవసరంలేదు ఏమైనప్పటికీ పెట్టుబడిదారీ విధానమన్నది అత్యంత అసంబద్ధమైన వ్యవస్థగా మారిపోయింది అది ప్రకృతిపై మానవుడు సాధించిన ఆధిపత్యాన్ని అత్యంత దారుణంగా దుర్వినియోగపరచేదిగా తయారైంది పెట్టుబడిదారీవిధానంవల్లనే శ్రామిక జనబాహుళ్యం సంఘటిత కార్మికవర్గంగా రూపొందింది ఆ వర్గమే శాస్త్రవిజ్ఞానాన్ని సోషలిస్టు వ్యవస్థ అనే హేతుబద్ధ ప్రాతిపదికపై పునరావాసం కల్పించేందుకు పూనుకుంటుంది కార్మికవర్గం పెరుగుదలతోపాటే ఒక నూతన తత్వశాస్త్రం కూడా పెంపొందుతుంది అదే మార్క్సిజం ప్రకృతిశాస్త్రాలకు, సామాజిక శాస్త్రాలను ఎలా సంధానపరచాలో మార్క్సిజం బోధిస్తుంది భౌతిక ప్రకృతిపై అదుపును సామాజిక వాస్తవ పరిస్థితిపై అదుపుతో అనుసంధానం చేస్తుంది ఆవిధంగా మాత్రమే విముక్తికి సంబంధించిన ఒక నూతన దృక్పథం ఉద్భవిస్తుంది బేకన్, డెస్కార్టిస్ తదితరులలో అంకురించిన నూతన స్వాతంత్ర్య దృక్పథం సంపూర్ణ ప్రాధాన్యత సంతరించుకుంది ఈ నూతన తాత్విక చింతన వెలుగులో కార్మికవర్గం ప్రపంచంలోని అత్యధికభాగంలో ఇప్పటికే పెట్టుబడిదారీ విధాన శృంఖలాలను బద్దలు కొట్టింది ప్రకృతిపై మనిషి ఆధిపత్యం నిజమైన మనిషి నిజమైన సౌభాగ్యానికి స్త్రీ, పురుషులు, పిల్లల

1 బర్నాల్

సంక్షేమానికి ఎలా దోహదపడుతుందో నిరూపించింది కేవలం 50ఏళ్ళ స్వల్ప వ్యవధిలో ఇదంతా జరిగింది ప్రపంచయుద్ధంలో అంతులేని విధ్వంసం సంభవించినప్పటికీ పెట్టుబడిదారీ ప్రపంచంనుండి అర్ధంలేని ఆయుధ పోటీ వ్యయం రుద్దబడినప్పటికీ యుద్ధ ప్రమాదం పొంచివున్నప్పటికీ ఇదంతా సాధించబడింది

అయితే సోషలిజం సాధించిన విశిష్టత పెట్టుబడిదారీ దేశాల్లోనూ, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూగల శ్రామిక ప్రజానీకానికి తెలియకుండా చేసేందుకోసం అతి విస్తారమైన ప్రచార యంత్రాంగం వినియోగించబడుతోంది వారి అభిప్రాయాలను ప్రభావితం చేసే పన్నాగాలన్నీ నిస్సిగ్గుగా ప్రయోగించబడుతున్నాయి విద్యను, చరిత్ర గమనాన్ని వెనక్కు మళ్ళించేందుకు లేదా వక్రీకరించేందుకు శాస్త్ర విజ్ఞాన పద్ధతులను ముఖ్యంగా ప్రసార సాధనాలను దుర్వినియోగపరచడం జరుగుతున్నది అన్నిరకాలైన గందరగోళాలను సృష్టించేందుకు శ్రామిక ప్రజానీకాన్ని విముక్తికి సంబంధించిన నూతన దృక్పథాన్నుండి, దాన్ని అమలు జరిపే ఆచరణాత్మక కార్యక్రమాన్నుండి దారి మళ్ళించేందుకు కొత్తకొత్త తత్వశాస్త్రాలు ముందుకు కొనిరాబడుతున్నాయి ఇవన్నీ ఉన్నప్పటికీ శాస్త్ర విజ్ఞానంవల్ల కలిగిన నూతన సాంకేతిక అవకాశాలు ప్రైవేటు ప్రయోజనాలకు, దోపిడీకి సంబంధించిన ఛిద్ర సాంఘిక చట్రంలో ఇమిడివుండేందుకు నిరాకరిస్తున్నాయి అందువల్లనే ఈ సాంకేతిక అవకాశాలను కూడా దెబ్బతీసే కుట్రలు జరుగుతున్నాయి శాస్త్రవిజ్ఞానాన్ని దానికే వ్యతిరేకంగా ఉపయోగించుకోవడం జరుగుతున్నది అయితే తక్షణ దశలోని ప్రమాదాలను మనిషి తట్టుకోగలగడం సాధ్యమా?

ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వవలసింది అధిభౌతిక మేధస్సుకాదు ప్రపంచంలోని కోటానుకోట్లమంది శ్రామికులు జవాబునివ్వాలి ప్రకృతిపై మానవుడికిగల ఆధిపత్యాన్ని దారుణంగా దుర్వినియోగపరచే వంచనను వారు అనుమతించబోతున్నారా? ఆ మోసం మీదనే ఆధారపడి ప్రస్తుత సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది అది అసంబద్ధమైనదిగా నిర్హేతుకమైనదిగా తయారైంది ఈ వ్యవస్థను సమాజ పరిణామంలో కేవలం ఒక తాత్కాలిక ఘట్టంగానే వారు పరిగణిస్తున్నారా? స్వాతంత్ర్యానికి సంబంధించిన నూతన దృక్పథాన్ని దోపిడీకి గురయ్యే శ్రామిక ప్రజల ఆచరణ ద్వారా నిజం చేసేందుకు పూనుకుంటారా?

చరిత్ర ఈరోజు మన ముందుకు తెచ్చిన అతి కీలకమైన ఈ ప్రశ్న మన స్మృతికారులు శూద్రులుగా ఎవరినైతే పేర్కొన్నారో ఆ అసంఖ్యాక శ్రామిక స్త్రీ పురుషుల దగ్గరకు మనలను తీసుకువెళుతుంది ఈ శూద్రులు ముక్తికి అర్హులుకారని మన తాత్వికులు నొక్కి చెప్పారు చరిత్ర దాన్ని పరిహసించింది మనిషి నిజంగా విముక్తి సాధించాలంటే ఈ జనబాహుళ్యం లేక శూద్రులు మాత్రమే అందుకు నిర్ణయాత్మక

నిర్మాతలౌతారు ఇది ప్రపంచంనుండి ఊహాజనితమైన పలాయనంగా లభించే ముక్తికాదు ప్రపంచాన్ని మార్చడంద్వారా లభ్యమయ్యే నిజమైన విముక్తి దృక్పథం

ఇది తిరిగి మనలను ఈ రచన ఇతివృత్తం దగ్గరకు తీసుకువెళుతుంది సాంప్రదాయక భారతీయ ఆలోచనా స్రవంతిలో సజీవమైనదాన్ని వారసత్వంగా, ధైర్యంగా స్వీకరించి సృజనాత్మకంగా అభివృద్ధి చేయాలంటే అది ఈ దేశంలోని పీడిత ప్రజలకు మాత్రమే సాధ్యమౌతుంది అదేవిధంగా వారు దానిలోని నిర్జీవభాగాన్ని తుడిచిపెడతారు దేశాన్ని మార్చే చారిత్రక కర్తవ్యంలో ఇది నిజంగా భాగమే ఇందుకోసం సత్యంపట్ల నిర్భయ జిజ్ఞాస అవసరమౌతుంది అది శ్రామికవర్గ ఉద్యమానికి వెలుపల వుండడం జరగని పని శ్రామికేతర ఉద్యమాలలో ఇతరేతర అంశాల పట్ల ప్రాకులాట వుంటుంది కనుక రాజీపడే ధోరణి కూడా వుంటుంది ఇందుకు భిన్నంగా మన మహోపాధ్యాయులు మానవసంబంధాలతోసహా ప్రకృతిని అర్థం చేసుకోవడానికి, అదుపు సాధించడానికి చూపించిన మార్గం శ్రామిక ప్రజలకు అమూల్యమైనది వారి ప్రయోజనాలు, ఆకాంక్షలు దానితో ఏకీభవిస్తాయి ఈ దృష్టితోనే ఎంగెల్స్ జర్మన్ కార్మికవర్గం జర్మన్ సాంప్రదాయక తత్వశాస్త్ర వారసురాలు" అని ప్రకటించాడు

72631
5-503 644

# ఉత్తమ నవలలు - కథలు

| | | |
|---|---|---|
| ★ తెలుగుగడ్డ | - గొల్లపూడి నారాయణరావు | 40-00 |
| ★ ఉక్కుపాదం | -జాక్ లండన్ | 20-00 |
| ★ దిటవు గుండెలు | -ద్మిత్రియ్‌మెద్విదేవ్ | 24-00 |
| ★ దాహం | - చిన్నప్పభారతి | 16-00 |
| ★ ఎదురీత | - యూరీజుకోవ్ | 5-00 |
| ★ సంఘం | - చిన్నప్పభారతి | 5-00 |
| ★ విప్లవ తెలంగాణా పోరాట గాథలు | | 12-00 |
| ★ ఆమె సారథి (తమిళకథానికలు) | | 6-00 |
| ★ నగరం | - గోర్కి | 10-00 |
| ★ ఆశయపథం | - తెలకపల్లి రవి | 15-00 |

ప్రతులకు :

ప్రజాశక్తి బుక్‌హౌస్

కారల్‌మార్క్స్ రోడ్డు,
విజయవాడ-520 002
ఫోన్: [illegible]

బాలాజీనగర్
సుందరయ్యభవన్
ఖమ్మం 507 001

1-8-52/2
శ్రీరామా కాంప్లెక్స్
చిక్కడపల్లి
హైదరాబాద్-20
ఫోన్: 760 8107

5, ఎ.జి.కె.కాంప్లెక్స్
గాంధీరోడ్డు,
తిరుపతి-517 501

6-2-250,
విజయటాకీస్‌రోడ్డు, చౌరస్తా,
హన్మకొండ-506 011